Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

D 6737

చల్లా పిచ్చయ్యశాస్త్రి
సాహిత్య ప్రకాశము



నాగార్జున విశ్వవిద్యాలయం నుండి పిహెచ్. డి.
పట్టం పొందిన సిద్ధాంత గ్రంథం

'అవధాన కళాసరస్వతి' భాషాప్రవీణ
డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్ ఎం. ఏ., పిహెచ్, డి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

amaj Foundation Chen

nain. Gurukul Kangri C

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Forwarded free of cost, and with the compliments of the Department of Education, Govt. of India, New Delhi"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చల్లా పిచ్చయ్యశాస్త్రి

సాహిత్య ప్రకాశము

DONATION



पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

నాగార్జునవిశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి.
పట్టం పొందిన సిద్ధాంత గ్రంథము

'అవధాన కళాసరస్వతి' భాషాప్రవీణ

డా॥ పాలపర్తి శ్యామలానందప్రసాద్ ఎం.ఏ., పి.హెచ్.డి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తొలి ఏకాదశి, 1989

వేయి ప్రతులు

హక్కులు రచయితవి

తెలుగు విశ్వవిద్యాలయం
ఆర్థిక సాహాయ్యంతో ముద్రితం

ప్రతులకు :
శ్రీమతి పాలపర్తి భానుమతి
ఇ. నెం. 76-8/1-27(1)
మాధవనగర్
భవానీపురం
విజయవాడ-12

వెల : 55 రూపాయలు

బాలాజీ ప్రింటింగ్ ప్రెస్
గొల్లపాలెంగట్టు
విజయవాడ-9

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృతి సమర్పణము

బ్రహ్మశ్రీ విద్వాన్ శ్రీ బి. వి. యస్. యస్. మణి మహోదయులకు

డైరెక్టర్, స్వధర్మస్వారాజ్య సంఘం

మద్రాసు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మణిదర్పణము

శ్రీమనోహర! శ్రీచక్ర శ్రీవిహార!
మణిమహోదయ! సుమసుధామధురహృదయ!
వేద శాస్త్రార్షవిజ్ఞానవిబుధ పోష!
సంతతారోగ్య సౌభాగ్యసంపదస్తు!

తరిగిలేనట్టి కలిమి యెందేనిగలదు
కీర్తిభయములకిచ్చు నీగియునుగలదు
ఆర్షధర్మాభిరక్షణం బభిలషించి
ఇష్టపూర్తిగ నిచ్చు నీ యీగి అరుదు

ఎఱుగని కృపగని మణికే
'నరత్నమన్విష్యతి' యనినావు కవీంద్రా!
సురుచిర విజ్ఞానసుధా
కర'మణి'కై వెదకికొనుట కర్జమకాదో?

చల్లా పిచ్చయశాస్త్రియొ
కల్లయు కపటమ్ములేని కవిఋషి మరితత్
సల్లలితకృతి విమర్శకు
వల్లభుడును నట్టివాడె ప్రార్థించెనహో!

మణివి నీవును కృతియు దర్పణము సుమ్ము
వెరసి భారతీయార్ష పవిత్ర ధర్మ
జీవనాంతర రూపమ్ము చేతజూపు
స్వచ్ఛమణిదర్పణంబిది సాధుమూర్తి!

— శ్యామలానందప్రసాద్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నా మాట

నమస్సులు

—దయతో నన్ను కని, పెంచుతున్న తల్లిదండ్రులకు.

—ఆదరంతో అ ఆలు దిద్దిస్తున్న గురువర్గానికి.

—బాధ్యతతో ఆయురారోగ్య భాగ్యాలనిచ్చి సాకుతున్న పరమేశ్వరునకు-

కృతజ్ఞతలు ;

—సుత నిర్విశేషమైన వాత్సల్యంతో ప్రోత్సహించిన పర్యవేక్షక గురువులు ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తంగారికి.

— పరీక్షకులు ఆచార్య శలాక రఘునాథశర్మ, ఆచార్య గంధం అప్పారావు, ఆచార్య P. S. సుబ్రహ్మణ్యం మహోదయులకు-

— ఆర్థిక సహాయం అందించిన తెలుగు విశ్వవిద్యాలయం వారికి.

—గ్రంథ ముద్రణకు అవసరమైన మిగిలిన మొత్తాన్ని పెద్దమనసుతో ఇచ్చి వెన్నుతట్టిన వదాన్యులు విద్వాన్ బి. వి. యస్. మణిగారికి

—నా అభివృద్ధికి సహకరిస్తున్న మా సయ్యద్ అప్పలసామి కళాశాల పాలకవర్గానికి

— పరిశోధనకు ఇంటర్వ్యూల నిచ్చిన శ్రీయుతులు తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి, జమ్ములమడక మాధవరామశర్మ, ముళ్లపూడి నారాయణశాస్త్రి, తుమ్మల సీతారామమూర్తి, ప్రభృతి మహానుభావులకు-

—ముద్రితా ముద్రిత గ్రంథాలను సేకరించటానికి, మరెన్నో విషయాలు తెలియటానికి నిండు మనస్సుతో సహకరించిన శ్రీ పాతూరి రాధాకృష్ణ మూర్తిగారికి, చల్లా జనార్దనశర్మగారికి-

—నా డిక్టేటర్‌షిప్‌కి ఎదురు తిరిగి కలంపట్టి సహకరించిన నా శ్రీమతికి (పేరు చెప్పకూడదు)

—టైపు మిషన్ని వొడిచి వొడిచి చెంపలు వాయించి టైపు ప్రతులను సుకుమారంగా తయారుచేసిన శ్రీమతి కుసుమకుమారిగారికి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

—పదిహేను రోజుల్లో (అయిదో ఫారం నుంచి) అచ్చువేసిన బాలాజీ ప్రింటింగ్ ప్రెస్ అధినేత మిత్రులు జొన్నలగడ్డ వెంకటేశ్వరరావుగారికీ, వారి సిబ్బందికీ-

— మరింకెందరో మహానుభావులకు-

మరోచిన్నమాట

ఈ చల్లా పిచ్చయ్యశాస్త్రిగారి బహుముఖీన సాహితీ సమారాధన సమీక్షను చూచిన వారికి వారి ముద్రితా ముద్రిత గ్రంథాలను పరిశీలించాలని అనిపించవచ్చు. కానీ అవి ఏవీ ఇప్పుడు అందుబాటులో లేవు. వదాన్యులు సహకరిస్తే, మా చిన్న మేనమామ శ్రీ చల్లా బ్రహ్మానందంగారు అంగీకరిస్తే మళ్ళీ వెలుగుచూసే అవకాశం ఉంది.

ఇది దౌహిత్రుడు తాతగారికిడు సాహిత్యాంక నీరాజనం
బెదకర్పూరముగా తదీయపద సౌహిత్యాచ్ఛ సౌందర్య సం
పదకున్ వెల్గులు తీర్చి సర్వజన సంభావ్యత్వమున్ గూర్చి ఈ
గెద శైలాభ పిత్ర్యాణభారమణుశక్తిన్ బాల చిక్రోడమై

—పాలపర్తి శ్యామలానందప్రసాద్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విషయసూచిక

1.	జీవితోల్లాసము	1-22
2.	అనువాదోల్లాసము	33-85
	శ్రీమదాంధ్ర గీతగోవిందము	35
	హంసలదీవి ప్రభావము	49
	శ్రీదేవి	61
	శ్రీలక్ష్మీనారాయణ శరణాగతి స్తవము	68
	చాణక్య నీతి దర్పణము	72
	శ్రీకృష్ణ ప్రబోధము	77
	ఔచిత్య విచార చర్చ	83
3.	స్వతంత్రకావ్యోల్లాసము	86-194
	శ్రీ హేరంబస్తుతి	87
	రామదాసు చరిత్రము	89
	శ్రీ జయదేవ చరిత్రము	114
	త్యాగరాజు	118
	శుకరంభా సంవాదము	127
	మాయావిలాసము	139
	ఉద్యానము	144
	హనుమచ్చరిత్ర	156
	కోదండరామస్వామి నిత్యపూజా సేవావిధి	162
	గురుచరిత్ర	165
	ప్రబోధము	171
	సులక్షణోపాఖ్యానము	176
	శ్రీ మదమరావతీ క్షేత్రమాహాత్మ్యము	177
	చాటూక్తి రత్నాకరము	182
	శ్రీరామకృష్ణ పరమహంసగీతా	192
4,	గద్యోల్లాసము	195-210
	భాషాభ్యుదయము	196
	వారణాసి రామసుబ్బయ్యశాస్త్రి జీవితచరిత్ర	201
	ప్రపంచము	207
	స్వీయచరిత్ర	209

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

5.	శతకరచనోల్లాసము	211-239
	హేరంబ శతకము	213
	సీతానగర హనుమచ్ఛతకము	223
	దుర్గామల్లేశ్వర శతకము	228
	శ్రీ బాలకోటీశ్వర శతకము	233
6.	హరికథా వాఙ్మయోల్లాసము	240-268
	కుచేలోపాఖ్యానము	243
	కన్నప్ప కథ	249
	శ్రీ శంకరాచార్య జననము	253
	బ్రహ్మానంద తీర్థ చరిత్ర	256
	బోధేంద్ర సరస్వతీ స్వామి చరిత్ర	264
	సావిత్రీ చరిత్రము	265
	మహాభారతము	267
7.	వాగ్గేయోల్లాసము	269
8.	నాటకోల్లాసము	278-285
	త్యాగరాజ చరిత్ర నాటకము	280
	జయప్రద నాటకము	283
	చంద్రకాంతీయ నాటకము	284
9.	లక్షణోల్లాసము	286
	ప్రౌఢకవి ప్రయోగ దర్పణము	287
10.	విమర్శోల్లాసము	289-295
	శ్రీ గీతగోవింద రహస్యము	290
	అభిజ్ఞానశాకుంతల పాత్రప్రయోజనము	294
11.	వ్యక్తిత్వోల్లాసము	296-313
	వ్యక్తిత్వము	297
	సాహితీవ్యక్తిత్వము	300
	సామాజిక వ్యక్తిత్వము	309
	ధార్మిక వ్యక్తిత్వము	310
	ఆధ్యాత్మిక వ్యక్తిత్వము	312
	ఫలశ్రుతి	314
	ఆధారగ్రంథ పట్టిక	315

—: o :—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Supplied free of cost and with the compliments of the Department of Education, Govt. of India, New Delhi"

ప్రథమము

జీవితోల్లాసము

'ప్రాతః స్మరామి దధి ఘోష వినీత నిద్రం
నిద్రావసాన రమణీయ ముఖారవిందం
హృద్యానవద్యవపుషం నయనాభిరామ
మున్నిద్ర పద్మనయనం నవనీత చోరం'

మున్నగు శ్లోకగీతములు ప్రాతర్వాయు పోతములతో నాటలాడుచున్నవి. భక్తి తరంగము లభంగములై దిక్తటములకు ప్రాకుచున్నవి. ప్రభాతోచిత భూపాలాదిరాగములు ప్రస్తృతములై జీవులను మేలుకొలుపుచు ఎదదలోతులను తాకుచున్నవి.1 శ్రుతిచేయబడిన తంబుఱతీగెలపై సన్నని వ్రేళులు సుతిమెత్తగా కదలుచున్నవి. విశాలఫాలమున తిర్యక్ పుండ్రములవలె మూడు ముడుతలు. వాని మధ్య వహ్నినేత్రచ్ఛటలవలె బ్రహ్మతేజశ్ఛటులత నుదురెల్ల వ్యాపించుచున్నది. పెద్దచెవి తమ్మెలు శిరశ్చాలనము ననుసరించి కాలదిగా కదలుచున్నవి. భక్తితన్మయమైన ఆ యాకృతిలో జయదేవుడు కనిపించును. త్యాగయ్య యగుపించును. రామదాసు ద్యోతమానుడగును. ఆ మూర్తి సాహిత్య సంగీత సరస సరస్వతీ పుంరూపము. ఆ మహనీయుడే బ్రహ్మశ్రీ చల్లా పిచ్చయ శాస్త్రి వరేణ్యులు. ఏబదికి పైగా గద్య పద్య గేయగ్రంథములను విరచించి, ఆంధ్రగీర్వాణ భారతుల నర్చించి, ఆకుచాటు కోకిలవలె నిర్మమత్వమున నిర్మలమైన నిండు జీవితమును గడపిన శ్రీ శాస్త్రిగారి జీవితోల్లాస వైశిష్ట్యము ఆంధ్ర సాహిత్యాభిమానులకు అవశ్యజ్ఞేయము. మహాత్ములను మానవులు మఱచినను కాలము మఱువజాలదు.

---

1. వేకువ నిద్రమేల్కొని వివేకయుతంబగు భక్తితోడ చి
త్రైక మెసంగ శ్రీహరి హరీయనుచున్ శ్రుతిరాగతాళముల్
ప్రాకటమొప్ప నిల్పి మధురంబుగ గానము జేయు నేర్పు సు
శ్లోకు భజింతు నాత్మపరిశుద్ధిగ పిచ్చయశాస్త్రి మద్గురున్

శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి, చల్లా పిచ్చయశాస్త్రి షష్టిపూర్తి సంచిక, పుట 17

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జననము :

శ్రీ శాస్త్రిగారు విజయనామ సంవత్సర [క్రీ॥ శ॥ 1893] ఆషాఢ శుద్ధ ఏకాదశి [తొలిఏకాదశి] పర్వదినమున[1] గుంటూరు జిల్లా తెనాలి తాలూకా ఇంటూరు గ్రామమున కౌండిన్యస గోత్రమైన వెలనాటి వైదిక కుటుంబమున జన్మించిరి.

కన్నతల్లి వెంకమాంబ. తండ్రి పున్నయ్యగారు. వారివృత్తి పౌరోహిత్యము. సంపన్న కుటుంబము. పున్నయ్యగారు మహాభక్తుడు సంగీతప్రియుడు. ఒక క్షురకుడు అద్భుతముగా నాదస్వరము వాయింపగా పొంగిపోయిన పున్నయ్యగారు స్వయముగా నాతనికి అభ్యంగన స్నానము చేయించి, భోజనము పెట్టి, పంచెలచాపు నిచ్చి సత్కరించిరి.[2] శాస్త్రికి నాలుగైదేండ్లు వచ్చునప్పటికి తల్లి గౌరీలోక మేగినది. పున్నయ్యగారు ద్వితీయ వివాహము చేసికొనిరి. వెంకమ్మగారికి కలిగిన సంతానములో శాస్త్రియొక్కడే మగపిల్లవాడు. పై వారిరువురు ఆడుపిల్లలు.

శాస్త్రిగారికి పూర్వము పుట్టిన మగబిడ్డ పాలుచాలక మరణించుటచే వీడైనను పిచ్చిపిచ్చిగా బ్రదుకునని 'పిచ్చయ్య' యని పేరుపెట్టిరి. ఆ నామ మాహాత్మ్యమేమియో కాని ఈ బాలుడు కూడ పాలుచాలక కృశించు సమయమున పెద్ద అక్క పాతూరి సుబ్బమ్మగారు ప్రసవించి తన బిడ్డతో పాటు తమ్మునికి కూడ పాలిచ్చి బ్రతికించినది. ఆంధ్ర సాహిత్యమునకు ఆమె చేసిన మేలు ఎంతటిదని చెప్పవచ్చును ?

బాల్యము - విద్యాభ్యాసము :

శాస్త్రికి ఐదవయేట అక్షరాభ్యాసము చేసి వీధి బడిలో ప్రవేశపెట్టిరి. కాని అతడు 'మకురుతనముతో' సరిగా బడికి పోక తోడి యీడు బాలకులతో వేళకు ఇంటికి కూడ రాకుండ ఆటలాడు చుండెడివాడు.

పౌరోహిత్యములో వచ్చి ఇత్తడి 'గ్లాసు' లను అటకమీద భద్రపఱుపగా నొకబాలుని ప్రోద్బలముతో శాస్త్రి వానిని క్రమముగా సంగ్రహించి దుకాణమున నిలుకిండ్లు తినుచుండెడివాడు. షావుకారు గ్లాసులను భద్రముగా పున్నయ్యగారింటికి చేర్చెడివాడు. ఇది తెలిసిన కొడుకును మందలింపగా నాతడు తప్పునొప్పుకొనెను.[3]

---

1. శాస్త్రిగారి అసంపూర్ణ అముద్రిత స్వీయచరిత్ర, పుట: 1.
2. ముఖాముఖి: శ్రీపాతూరి రాధాకృష్ణమూర్తి [10-10-83]
3. స్వీయచరిత్ర

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏకైక పుత్రుడగుట చేతను, తల్లిలేని వాడగుటచేతను పున్నయ్యగారు శాస్త్రి ఎంత అల్లరి చేసినను చప్పిడి దెబ్బలు మాత్రమే కొట్టి తరువాత నొడలు నిమిరి దగ్గర పడుకొనబెట్టు కొనెడివారు.

కవితా ప్రాదుర్భావము :

శాస్త్రి మొదటి తరగతిలో నుండగా జన్మాంతర సంస్కార విశేషముచే—

'ఆంజనేయా నిన్ను నమ్మితి నాదరించుము వేగమే
లంకాపురిదాహకా నా శంక మాన్పివేయుమా'

అను పల్లవితో నొక పది చరణముల గేయము అప్రయత్నముగా వెలువడెను. 'దాకప్పటికి సీత రామునకేమగునో తెలియకున్నను రామాయణ కథాంశము షట్కాండము లోనిది. సర్వము వచ్చినదని నా మూడవ తోబుట్టువు పాతూరి మంగమాంబ అత్యాశ్చర్యము వెలిబుచ్చినది' అని శాస్త్రిగారే వ్రాసిరి. నాటినుండి కొన్ని గేయము లలవోకగా దొరలినవి. తరువాత

'ఇంటూరు' కలిమిసంద్రము
పంటలు నధికంబు గల్గు 'ప్యాపర్తి'లము
క్కంటిని పూజించెడు చే
జంటలు గల 'వోడపాడు' చలమయనామా[1]

అను కందపద్యమొకటి వెలువడినది. పున్నయ్యగారికి కొడుకు కవిత్వము చెప్పుట ఇష్టము లేదు. దానిలో విషమాక్షర ప్రయోగములుండి ఒక్కగానొక్క కొడుకు ఏమగునోయని ఆయన భయపడుచుండెను శాస్త్రిగారికేమో. కవిత్వమప్రయత్న సిద్ధమగుచున్నది. ముక్కును మణికట్టుతో తుడుచుకొనుచు గోళీకాయ లాడుకొనుచునే కవిత్వము చెప్పుచుండెను.[2]

శాస్త్రిగారు రెండవ తరగతి చదువుతున్న సమయములో ఆచంట సాంఖ్యాయన శర్మగారిచే నడపబడుచున్న కల్పలత యనుపత్రికలో 'బంగరు లింగకాయ గల భామిని వైష్ణవభామినే కదా' అను సమస్య ప్రకటింపబడెను. శాస్త్రిగారు దానిని చూచి తక్కిన మూడు పాదములు పూరించి పంపిరి. ఆ పూరణము పత్రికలో

1. ఇంటూరు చుట్టుప్రక్కల గ్రామములు.
2. ముఖాముఖి శాస్త్రిగారి భార్య వరలక్ష్మమ్మగారు [1976].

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రకటితమయ్యెను. ఇది తెలిసి పున్నయ్యగారు ఆందోళనపడి కొడుకునడుగగా 'ఆ పేరుతో ఎందరైన ఉండవచ్చునుగదా' అనిరి. పున్నయ్యగారు 'మరి ఇంటూరు అని ఉన్నదే ?' అని అడిగిరి. శాస్త్రిగారు మాట్లాడలేదు. తరువాత ఆ పూరణమునకు బహుమతిగా అయిదు రూపాయిలు వచ్చినవి.[1]

కొంతకాలము ఇంటిలోనే ఒక ఉపాధ్యాయు నేర్పరచి చదివింపగా మిక్కిలి ఆలస్యముగా పదిసంవత్సరముల ప్రాయమున పఠన లేఖనక్రమము అలవడెను. పిదప పున్నయ్యగారే అర్థముతోనున్న శ్రీకాండనామలిఙ్గాను శాసనమును ప్రారంభించి చెప్పిరి.

పన్నెండవ సంవత్సరమున శాస్త్రిగారి కుపనయన మయ్యెను. ఇంటివద్దనే రఘువంశ చతుర్థ సర్గలో కొన్ని శ్లోకములు పాఠము జరిగెను.

పదునాల్గవ సంవత్సరమున శాస్త్రిగారికి వివాహమయ్యెను. భార్యపేరు వరలక్ష్మమ్మ. అత్తవారి గ్రామము గుంటూరు జిల్లా ప్రత్తిపాడు. మామగారు రాజనాల వేంకట సుబ్బయ్య శాస్త్రిగారు. సాహిత్య, జ్యోతిషాదుల యందు పండితులు. శాస్త్రిగారికి వారియొద్ద రఘువంశ ప్రథమసర్గ పూర్తియయ్యెను. పిన్ననాటనే తల్లిని కోల్పోయి గారాబముగా పెంపబడుటచే శాస్త్రిగారు మామగారి శిక్షణమున కాగలేక వెంటనే వచ్చి తీసుకొనిపొమ్మని తండ్రికి జాబు వ్రాసిరి. వారువచ్చి కుమారుని వెంటబెట్టుకొని ఇంటూరు బయలుదేరిరి. మార్గమధ్యమున వల్లూరు గ్రామమున ప్రతాపరామయ్య గారను గృహస్థు ఆతిథ్యమునకాపెను. వారి అల్లుడు రాళ్ళబండి వేంకట సుబ్బయ్య శాస్త్రిగారు ఆ సమయమున అచ్చటనే యుండిరి. ఆయన ఉభయభాషా సాహిత్య కవిత్వములయందును, ఆశుకవిత్వము, అష్టావధాన శతావధానముల యందును అరితేరినవారు.[2] వారియొద్ద శాస్త్రిగారు రఘువంశము రెండవసర్గలోని మొదటి శ్లోకము పాఠము చెప్పుకొనిరి.

తండ్రికొడుకు లానాటి సాయంకాలమునకు పొన్నూరు చేరిరి. పొన్నూరులో పాతూరి కోటయ్య శాస్త్రిగారు, వారి అన్న కుమారులు కాశీ పండితులు రామస్వామి శాస్త్రిగారు విద్యార్థులకు కావ్య నాటకాలంకార పాఠము ప్రసాదించు చుండుట తెలిసిన పున్నయ్యగారు కుమారునకు కావ్యపాఠము గఱపుటకై రామస్వామి శాస్త్రి

1. ముఖాముఖి – పాతూరి రాధాకృష్ణమూర్తి
2. పిదే తరువాత శాస్త్రిగారికి జంటకవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గారిని ప్రార్థించిరి. ఆయన అంగీకరింపలేదు. మఱియొక పర్యాయము తీసుకొని రమ్మనిరి. ఆ తరువాత పున్నయ్యగారు కావ్య పాఠమునకై పిల్లవానిని రెండు మూడు చోట్లకు త్రిప్పిరిగాని ప్రయోజనము శూన్యము. కొన్ని మాసములకు రామస్వామి శాస్త్రిగారి అంగీకారముతో వారి యొద్దకే వచ్చిరి. రఘువంశమున ద్వితీయ తృతీయ సర్గలు, కుమార సంభవమున ప్రథమ పంచమ సర్గలు పూర్తి యయ్యెను. వీధి బడిలో బయలుదేరిన సహజ కవిత దినదిన వర్ధమాన యగుచున్నది. సంస్కృత కావ్యములతోపాటు మనుచరిత్ర మొదలగు ఆంధ్రమహా కావ్యములను కూడ శాస్త్రి చదవసాగెను.

సుమారు 1911 ప్రాంతమున అనగా పదునేడువత్సరముల నూత్నయౌవన మున గురువర్యులు రామస్వామి శాస్త్రిగారు వార్షిక నియమమున జరుపు గణపతి నవరాత్రములలో శాస్త్రిగారి కవిత 'హేరంబస్తుతి, హేరంబ శతకము అనుపేర తొలిగా గ్రంథరూపము నొందెను. దాని వెంటనే రచింపబడిన 'కుచేలోపాఖ్యానము' హరికథ 1912లో ముద్రితము. దాని తరువాత రచించిన మాయావిలాస కావ్యము 1918లో ముద్రితము. పీఠికలో 'బాల్యమగుటచే నెట్లుండునో యని అయి దారు వత్సరములుపేక్షించితిని' అని వ్రాసియుండుటచే మాయావిలాస రచన సుమారుగా 1913 ప్రాంతమున జరిగియుండును. దానిలో గురుస్తుతి సందర్భమున రామస్వామి శాస్త్రిగారితోపాటు బ్రహ్మశ్రీ తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారు కూడ స్తుతింపబడుటచేబట్టి 1913 తరువాత శాస్త్రిగారు వెంకటప్పయ్య శాస్త్రిగారి యొద్దకు చేరియుందురు. ప్రముఖ కవి తుమ్మల సీతారామమూర్తి గారు 'మాకన్న పూర్వమే పిచ్చయ్య శాస్త్రిగారు వేంకటప్పయ్య శాస్త్రిగారి యొద్ద చదివిరి. నేను సుమారు 1918 ప్రాంతమున వారియొద్ద చదివితిని.[1] అని చెప్పిరి. 'మా నాయనగారి యొద్ద పిచ్చయ్య శాస్త్రి నాటకా లంకారములు చదివెను.' అని బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు చెప్పిరి.[2]

ఏతావతా సుమారు నాలుగు సంవత్సరములపాటు శాస్త్రిగారి యొద్ద నాటకా లంకారములు పఠించిరి వారి శైష్యోపాధ్యాయిక స్మరణీయము.

శైష్యోపాధ్యాయిక :

శాస్త్రిగారు వేంకటప్పయ్య శాస్త్రిగారి యొద్ద కావ్యపాఠము నపేక్షించుచు

---

1. ముఖాముఖి : 7–9–1983. 2. ముఖాముఖి. 10–9–1983.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నూటయెనిమిది పాదముల చంపకమాలికను వ్రాసిపంపి[1] ప్రవేశము లభించినది. శాస్త్రిగారు ఇరువది దాటిన కోడెవయస్సున నుంటిరి. కవిత్వము పాకమున పడినది. ఇట్టి శిష్యుని చూచి గురువు గారెంతయో పొంగిపోయిరి. ఆయన సంస్కృతాంధ్రము లందు ప్రౌఢకవి. రామాయణమును 'రామకథామృతము' పేరిట వెలయించినారు. ఏకశ్లోక పాఠముచేతనే శిష్యులను జ్ఞానవంతులను చేయగలిగిన దేశికోత్తములు. అట్టి గురువుల ప్రశంసకు శాస్త్రిగారి కవిత పాత్రమయ్యేను. శాస్త్రివచ్చిననాడే అధ్యయనము. కొల్లూరు గ్రామములో నొకరు 'పీ రెవరి యొద్ద చదువుకొనిరి'ని గురువు గారిని ప్రశ్నింపగా "ఇదిగో ఇటువంటి తెలివిగల శిష్యుని యొద్ద"నని వారు చమత్కరించి శాస్త్రిగారిని చూపిరట.[2]

వేంకటప్పయ్య శాస్త్రిగారికి కోపము మెండు. ఒకసారి శాస్త్రిగారు విను చుండగా తన భార్యనేదో దురుసుమాట యనిరి. శాస్త్రిగారు కొంత సేపు మౌనము వహించి "గురువుగారూ! తమరు అమ్మగారి నికముందేమియు పరుషములాడకండ"ని గట్టిగా పలికిరి. కోప మెఱుగని పిచ్చయ్యశాస్త్రికి కోపము వచ్చుటను చూచి గురువు గారాశ్చర్య పడిరి. "బాలాదపి సుభాషితం" అను ఆర్యోక్తి నెఱిగినవారు గనుక శిష్యాదేశమున శిరసావహించియే యుందురు.

గురువుగారు శాస్త్రిగారిని పెద్ద కొడుకుగా భావించెడివారు. పొరుగూళ్ళకు పోయి స్వగ్రామమైన చందవోలునకు తిరిగి వచ్చునపుడు ఇంటూరలో ఆగి పిచ్చయ్య శాస్త్రిని చూడక వచ్చెడివారు కారు.

వేంకటప్పయ్య శాస్త్రిగారికి పిచ్చయ్యశాస్త్రి కవిత్వమన్నచో మహాప్రీతి. తాము వ్రాసిన ప్రతిపద్యము శిష్యునకు వినిపించెడివారు. వారి రామాయణ గంగ యంతయు శాస్త్రివరేణ్య శ్రవోనిస్సృతేమే. అంతకాక కవిత్వాభ్యాసము చేయుచున్న కుమారుడు రాఘవనారాయణ శాస్త్రిని "పిచ్చయ్య శాస్త్రి మెచ్చుకొనేటట్లు వ్రాయి. వ్రాసినవన్నీ అతనికి వినిపించు" అని ఆదేశించిరి. "అతణ్ణి మెప్పించటానికి నాకు చాలా కాలం పట్టింది." అని రాఘవనారాయణ శాస్త్రిగారనిరి.

---

1. చాటూక్తి రత్నాకరము. (పుట. 166)
2. ముఖాముఖి. శ్రీపొత్తూరి రాధాకృష్ణమూర్తి.
3. ముఖాముఖి: బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాఘవనారాయణ శాస్త్రిగారు ఇరువది యేడు పద్యముల వసంత వర్ణన చేసి శాస్త్రిగారికి వినిపింపగా "నా చేత మంచి అనిపించు కోవటానికి పట్టుదల పట్టి వ్రాసి నట్లుంది" యనిరి. ఆ తరువాత కల్యాణ కైవర్త ప్రబంధమును వ్రాసి యొకనాటి రాత్రి చందవోలు నుండి ఇంటూరు పోయి వినిపింపగా మాటాడలేదు. "బాగుండక పోతే బాగుండ లేదనేవాణ్ణి" అనిరి. కొడుకటు వెళ్ళగానే ఏదోవూరువెళ్ళి రైలుదిగి వచ్చుచున్న గురుపుగారు తలుపు తట్టిరి. పిచ్చయ్యశాస్త్రి జరిగిన సంగతి చెప్పి రాఘవనారాయణ శాస్త్రిగారి కవిత్వమును మెచ్చుకొని ధారణపట్టిన కొన్ని పద్యముల నప్పగించిరి. వెంకటప్పయ్యశాస్త్రి గారచట నిలువక వేగముగ నింటికి పోయి "పిచ్చయ్యశాస్త్రి మెచ్చుకొనేటట్లు కవిత్వం వ్రాసి నాకు విన్పించకపోతే ఎట్లా!" అని అర్ధరాత్రమున కుమారుని నోటినుండి కావ్యమునంతటిని విని భోజనాదికములు ముగించిరి.[1] పిచ్చయ్యశాస్త్రిగారి కవితపై, విమర్శనాదృష్టిపై గురుపుగారికి గల ప్రత్యయము పై సన్నివేశమున సువ్యక్తము.

గురుపుగారు పిచ్చయ్యశాస్త్రి గారితో కలసి కవిత్వము చెప్పెడివారు. అంత కన్న శిష్యునకు మెప్పులేముండును వేంకటప్పయ్య శాస్త్రిగారు "రామకథా[2] మృతమును" ఉత్తరకాండలో కొంతభాగము వఱకు రచించి అవసానదశలో కుమారుని పిలిచి తక్కిన ఆఱు వేల పద్యములను వ్రాయవలసినదిగా ఆదేశించిరి వారు. "పిచ్చయ్య శాస్త్రిచేత వ్రాయిస్తాను" అనగా "నీవు వ్రాస్తే నేను వ్రాసినట్లవుతుంది. వ్రాసినవన్నీ అతడికి చూపించి నీవేవ్రాయి" అనిరి. మా నాన్నగారు పిచ్చయ్యశాస్త్రి ఏకాత్మలు "అని రాఘవనారాయణ శాస్త్రిగారి వక్కాణ.[2]

"రామాకథా[2]మృతము" సీతాకల్యాణ ఘట్టములోనొక పద్యమునకు విశేషార్థ రహస్యమును గ్రహించుటకై విశ్వనాథవారు పిచ్చయ్యశాస్త్రిగారి వద్దకు వచ్చిరన్న ఆ కావ్యముపై శాస్త్రిగారికి గల అధికారము విదితమగును.

వేంకటప్పయ్య శాస్త్రిగారు సాహిత్యముతో పాటు సంగీతము నందును వ్యుత్పన్నులు. శాస్త్రిగారి సంగీత జ్ఞానమును గుర్తించి తమ తంబుఱ నిచ్చిన మహనీయులు. అట్లా వాద్యమునకు చారితార్థ్యము కల్గించిన యుచితజ్ఞులు.

పై సన్నివేశములన్నియు గురుశిష్యుల అనుబంధమునకు అద్దము పట్టును. శాస్త్రిగారి ప్రతిభకు శాణోపలములునగును.

---

1. ముఖాముఖి 2. ముఖాముఖి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రెండు సంఘటనలు :

శాస్త్రిగారు పొన్నూరులో రామస్వామి శాస్త్రిగారి యొద్ద విద్యాభ్యాసము గావించుచున్నప్పుడు జరిగిన రెండు ముఖ్య సంఘటనలు.

మొదటిది : శాస్త్రిగారికి ఏకశ్లోకగురువులై రఘువంశ ద్వితీయసర్గ ప్రథమ శ్లోకమును పాఠము చెప్పిన శ్రీ రాళ్ళబండి వేంకటసుబ్బయ్య శాస్త్రిగారినుండి యొక నాడు జాబు వచ్చినది. చూడగా దానిలో బిందుపూర్వకటకార ప్రాసతో నొకయుత్పల మాలికయున్నది. శాస్త్రిగారిని జంటకవిగా నుండమని కోరుట దాని సారాంశము.[1] శాస్త్రిగారు తమ అంగీకారమును కకార ప్రాసతో ముప్పదిరెండు పాదముల ఉత్పల మాలికలో వ్రాసి పంపిరి.[2]

అవి కవులకు జంటకట్టుట మోజుగా గల రోజులు. తనకంటె పెద్దవారు తనను జంటకవిగా కోరుట శాస్త్రిగారి ప్రతిభకు గౌరవాధాయకము. మనజంటకవులు కలసి గ్రంథములును వ్రాయలేదు కాని అవధానములు చేసిరి.

రెండవది : సంగీతమున అతిలోక ప్రతిభావంతులగు వారణాసి రామ సుబ్బయ్యగారితో స్నేహము రామసుబ్బయ్యగారు 1882 లో జన్మించి 1911 లో ఇరువది తొమ్మిదవయేట మరణించిరి.[3] శాస్త్రిగారికన్న వారు పదునొకండు సంవ త్సరములు పెద్దవారు "శ్రీ రామసుబ్బయ్య శాస్త్రిగారితో నాకు బాల్యమునందు విద్యార్థిదశయందే స్నేహము ప్రారంభమయి నానాటికి గాఢమయి వృద్ధిచెందినది." అని శాస్త్రిగారు వ్రాసిరి.[4] 1906వసంవత్సరమునకు పూర్వమే వీరిద్దరికిస్నేహమేర్పడి నట్లు, "1906లో రామసుబ్బయ్యగారికి వ్రాసిన యుత్తరము" అను శీర్షికతో శాస్త్రి గారు వ్రాసిన పద్యములే నిరూపకములు.[5] అప్పటికి శాస్త్రిగారి వయసు పదమూడువత్సరములు. ఆ పద్యములు తిలకింపుడు.

ఎప్పుడు వచ్చెదో మఱియు నెప్పుడు మద్గృహసీమ నప్పులన్
గుప్పలు వోసెదో మఱియు గోరి రచించిన పద్యరత్నముల్
మెప్పుల గుప్పలే యనుచు మెచ్చెదో యెప్పుడు నీదుపాటచే
చిప్పిల చేసెదో హృదయసీమ న కృత్రిమ మిత్రరత్నమా!

---

1. స్వీయచరిత్ర 2. చాటూక్తిరత్నాకరము, (పుట. 171.)
3. శాస్త్రిగారి వారణాసి రామసుబ్బయ్య జీవితచరిత్ర
4. వారణాసి రామసుబ్బయ్య జీవితచరిత్ర 'తొలినుడి' (పుట. 6.)
5. పై గ్రంథమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒండు విశేషమే సమృతలూరికి పోయి మదీయ పద్యముల్
పండితకోటి కిచ్చితిని పైనవధాని యుగంబు మాఱు గా
బొండులిఖించె మిత్ర! మఱియున్ మనకిద్దఱ కాప్తుడైన యా
బందరుపల్లి శాస్త్రియును పంపెను జాబు భవచ్ఛుభార్థియై

పదమూడు సంవత్సరముల ప్రాయమున వారి కవితా శైలి యిట్టిది. పై పద్యముల వలన 1908 నాటికే వారిది గాఢస్నేహమని స్పష్టము. 'వేసవి కాలమందు వారి స్వగృహమందు మిట్టమధ్యాహ్న సమయమునందు ఱిఱుచాపపై పఱపు పఱపించి మా యిరువురు మధ్య క్రొత్తమట్టికూజా నిలిపించి 'ఝంఝూటి' రాగముతో కలాపూర్ణోదయములోని పద్యములు కమ్మగా బాడుట స్మరించుకొనిన నప్పటికప్పుడు ప్రత్యక్షమగుచుండును. సర్వదేశీయ గాయక శిరోమణులచే బొగిడ్తలు బిరుదము లందిన శ్రీ గంధర్వావతారము తోడి పొత్తుకొలది కాలమే యయినను నాకనేక జన్మాంతర సుకృత విశేషముచే సంభవించినది'[1] అని శాస్త్రిగారు వ్రాసికొనిరి. రామసుబ్బయ్యగారి స్నేహము శాస్త్రిగారి సంగీత ప్రతిభను వికసింప జేసి వారిని శారదాదేవి యుభయపార్శ్వముల స్తన్యమారగ్రోలిన ధన్యునిగా చేసినది. సంగీత శాస్త్రాభినివేశ మేర్పడుటకు కూడా తోడ్పడినది. వారి "ఝంఝూటి" యే వీరికిష్టరాగమైనది.[2] తరువాత శాస్త్రిగారు హరికథలు, కీర్తనలు వ్రాయుటకు, ప్రతిష్ఠాకరమైన గీతగోవింద గేయానువాదమునకు నేపథ్యమైనది.

అంతటి మహనీయుడు 1911లో పిన్న వయస్సున మరణించునప్పటికి శాస్త్రిగారి వయస్సు పదునెనిమిదేండ్లు. ఆ సమయమున వారు వ్రాసిన పద్యములు "ఆంధ్రపత్రికలో" నచ్చయినవి.[3] అందలి ఆర్తి నాడెందఱనో కదల్చినది. అనాటి శాస్త్రిగారి పద్యములు నేటికి ఎనుబదేండ్లు దాటిన ప్రాయములోను శ్రీ తుమ్మల సీతారామమూర్తి గారికి ధారణమందున్నవనగా వాని ధారాపద్ధివైశిష్ట్యము వేరుగా పేర్కొన పనిలేదు.[4]

---

1. వారణాసి రామసుబ్బయ్య జీవితచరిత్ర, (పుట. 6.)
2. "ఝంఝూటి" శాస్త్రిగారికి ఇష్టరాగమని శ్రీపాలపర్తి వెంకటసుబ్బారావు [శాస్త్రిగారి చిన్నల్లుడు] చెప్పిరి.
3. వారణాసి రామసుబ్బయ్య జీవితచరిత్ర, (పుట. 74.)
4. ముఖాముఖి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గుంటూరి సీమ :

అద్వైతసాంధ్ర కవిజగద్గురువులై ఆంధ్రదేశమున కవితా వీర విహారము చేసి దేశము కైతము గ్రుచ్చియెత్తిన తిరుపతి వేంకట కవుల అవధానమరంద మృదూక్తిధారలో తడియని వారు, వారిని గురువులుగా పూజింపనివారు యువకవి లోకమున ఎవ్వరును లేరనవచ్చును. అట్టి ఏకలవ్య శిష్యులలో గురువులు మెచ్చినవారు కొందఱు. ఆ కొందఱిలో శాస్త్రిగారగ్రగణ్యులు.

శాస్త్రిగారు ప్రాచీన పద్ధతిలో గురువుల యొద్ద చదివిరి. గారాబుపట్టి యగుటచే నదియును స్వగ్రామమునకు దగ్గఱలోనే జరిగెను. లేకున్నచో బందరులోనున్న వేంకట శాస్త్రిగారియొద్ద ప్రత్యక్షశిష్యత్వము లభించెడిది. దూరమునసున్నను తిరుపతి వేంకటకవుల ప్రతిభావిశేషములను వినిన శాస్త్రిగారికి వారియందు గాఢభక్తి కుదిరినది. పది పంద్రెండేండ్లకే ప్రౌఢకవిత్వమబ్బిన శాస్త్రిగారు వారితో నుత్తర ప్రత్యుత్తరములు సాగించిరి. 1906లో శ్రీ వారణాసి రామసుబ్బయ్యగారికి వ్రాసిన లేఖలో 'అవధానియుగంబు మాఱు జాబొండులిఖించె' అను వాక్యములోని అవధాని యుగము తిరుపతి వేంకటకవులని తోచును. శాస్త్రిగారు వారికి వ్రాసిన పద్యలేఖలు పెక్కు చాటూక్తిరత్నాకరమున ముద్రితములు.

పూర్వరంగమిట్లుండగా 1911 ప్రాంతమున గుంటూరు మండలమున బ్రహ్మాండమైన కవితావివాదమొకటి చెలరేగి కవిపండితలోక మొకటి రెండేండ్లు అట్టుడికినట్లుడికిపోయెను. తిరుపతి వేంకటకవులకును కొప్పరపు కవులకును నడుమ జరిగిన ఈ వివాదములో నెందఱో మహామహులు ఉభయపక్షముల చేరి తమతమ తోడ్పాటునొసగిరి. అప్పటికి శాస్త్రిగారికి పదునెన్మిదేండ్లు. వారు తిరుపతి వేంకట కవుల పక్షము వహించిరి. నిసర్గమృదు స్వభావమునకు ధర్మావేశమును మేళవించి 'తిరుపతి వేంకటేశ్వర స్తవము' అనుపేర 1912వ సంవత్సరము సెప్టెంబరు 'అభినవ సరస్వతి' పత్రికలో పదిపద్యములు మహా గంభీరముగ రచించిరి.[1] 'గుంటూరిసీమ'లో ఆ పద్యములను పేర్కొనుచు తిరుపతి వేంకటవులు వ్రాసిన —

'చల్లాపిచ్చయశాస్త్రి నీతిగడి పెన్ జాజ్జ్వల్యమానప్రభా
కల్లోలాకులమైన పద్యతతితో గాఢాగ్రహోదగ్రుడై'

అను పద్యము వలన శాస్త్రిగారి కవిత్వము వారినెంత ఆకట్టుకున్నదో తెలియుచున్నది. "గాఢాగ్రహోదగ్రుడు" అను విశేషణము శాస్త్రిగారికి జీవితము

1. గుంటూరి సీమ. ద్వితీయ భాగము, పుట : 5

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మొత్తము మీద ఈ యొక్కచోట మాత్రమే లభించెను. "జాజ్వల్యమానప్రభాకల్లో లాకులత్వము" కవిత్వమున స్థిరమయ్యెను.

వేడినెత్తుటిపొంగులో అట్టి పద్యములను రచించినను పరనింద, గురునింద శాస్త్రిగారికి సరిపడని విషయములు. వారౌచితీస్వరూపులు. కావుననేతాను చిన్ననాటి నుండి రచించిన పద్యములన్నింటిని "చాటూక్తి రత్నాకరము"గా కూర్చుచు తన కెంతయో కీర్తిపరిష్ఠలు తెచ్చినవైనను వివాదప్రోత్థితములైన అపది పద్యములను దానిలో చేర్పరైరి బ్రహ్మశ్రీ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు శాస్త్రిగారి షష్టిపూర్తి సంచికలో –

గుంటూరిసీమ యందు తనకుం దొడిగెం దగ సందె నాస్తిమి
న్నంటు పొగడ్తకుం గుతి మహాకవి వేంకటశాస్త్రి అన్యులే
వెంట సమాదరింపరు? కపీ! భవదీయకవిత్వసంపదన్
మంటను మింట నిమ్మోయి సుమాళము మించుత త్వద్యశోలతల్

అను పద్యమున "మిన్నంటుపొగడ్త"గా గుంటూరి సీమ పద్యమును పేర్కొనరి. శాస్త్రిగారు మాత్రము అట్టి పద్యమొకటున్నట్లు గాని తిరుపతికవులు తనను మెచ్చినట్లుగాని ఎచ్చటను ప్రకటింపక పోవుట వారి ఆత్మస్తుతి వైముఖ్యమునకు నిదర్శనము

గార్హ పత్యము :

వేంకటప్పయ శాస్త్రిగారి యొద్ద చదివిన తరువాత శాస్త్రిగారు మరెచ్చటను విద్యాభ్యాసము చేయలేదు. ఇంటూరిలోనేయుండి పారంపర్యముగా వచ్చుచున్న పౌరోహిత్యమునను; వ్యవసాయమునను తండ్రిగారికి చేదోడుగా నుండి సంసార యాత్ర నారంభించిరి. స్వభావము పరమశాంతము. స్వాంతము సంతత కవిత్వచింతనా క్రాంతము. లౌకికవిషయములందు, కుటుంబవ్యవహారములయందు ఆయన అమాయికుడు.

కుమారునకు పెత్తనమీయదలచిన పున్నయ్యగారు సంవత్సరమునకు సరిపోవు ధాన్యమును పై ఖర్చులకు సరిపడు రూపాయిలను అప్పగించి నిర్వహింపుమనగా శాస్త్రిగారు ఏడెనిమిది నెలలకు మాత్రమే సరిపెట్టగలిగిరి, ఒకరిని శాసించుట నొప్పించుట వారికి చేతగాని విషయములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇంటూరిలో నొక కమ్మవారి అమ్మాయికి శాస్త్రిగారు చదువుచెప్పిరి. ఆమె అత్తవారింటికి పోవునపుడు శాస్త్రిగారికి కబురు వచ్చెను. వీరుపోయి వాకిటిలో కుర్చీలో కుర్చుండిరి. ఆపిల్లతల్లి దోసెడు వెండిరూపాయిలు పిల్లదోసిటలోపోసి శాస్త్రిగారికిచ్చి నమస్కరింపు మనెను. ఆమె గుమ్మము వద్దనే ఆగిపోయెను. దోసిటిలో రూపాయ లన్లేయున్నవి. ఇంతకాలము చదువు చెప్పిన గురువుగారికి కొంచెపు దక్షిణనిచ్చుట కామెకు మనసొప్పలేదు. చివరికెట్లో వచ్చి ఆ రూపాయలను గురువుగారి ఉత్తరీయపు చెంగునపోసి నమస్కరించెను. శాస్త్రిగారు వానిని స్పృశింపగా వెచ్చగా తగిలినవి. అదియే వారి తొలిసంపాదనము. ఆనందముతో శాస్త్రిగారు వానిని తండ్రిచేతిలో పోసిరి. సంపాదన విషయమున వారికెన్నడును లోటులేదు. పౌరోహిత్యమే "ఏనుగుపాడి"గా నుండెడిది. పెక్కుచందాల బండుభూమి తఱుగని పాడి. ఇల్లు వచ్చిపోవని బంధువు లతో మిత్రులతో పెళ్లిల్లువలె సందడిగా నుందగా శాస్త్రిగారు మాత్రము కవితా తపస్సులో నచంచలులై యుండెడివారు. సర్వము కవితామయముగా జాగ్రదవస్థలోనే కాక స్వప్న, సుషుప్తులలో కూడ పద్యములసంఖ్యాకముగా నవిచ్ఛిన్నముగా ధారణ చేయుట వారికి నిత్యకృత్యము. వారు నిద్రనుండి లేచిన వెంటనే రాత్రి ధారణ చేసిన పద్యములను వ్రాసికొనెడివారని శ్రీ రాధాకృష్ణమూర్తిగారు చెప్పిరి. శాస్త్రిగారిని గూర్చి తుమ్మలవారు చెప్పిన –

> మెప్పువలచి పసిడికుప్ప వలచి కైత
> కొగ్గ నొల్లడీ మహోదయుండు
> తన తపమ్ము కైత తన ముక్తి కైతగా
> సాగిపోవు కర్మయోగి యితడు [1]

అను పద్యము ప్రత్యక్షర సత్యము.

శాస్త్రిగారు విద్యార్థిదశలో రచించిన మాయావిలాసకావ్యము 1918లో అచ్చొత్తించిరి. రామదాసు చరిత్రమును రచించి శ్రీ భువనగిరి కోదండపాణిగారి ద్రవ్యసహాయమున 1926లో ముద్రింపించిరి. వారి రచనలలోనీ ప్రబంధము తలమానికము. అపూర్వమగు శ్లేషవక్రోక్తి కావ్యముగా శుకరంభాసంవాద మను లఘుకావ్యము 1926 ప్రాంతమున రచించిరి. ఇది 1956లో ముద్రితము. విజయవాడ సమీపము

---

1. షష్టిపూర్తి సంచిక పుట : 8

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోని సీతానగరములో వేంచేసియున్న ఆంజనేయ స్వామిపై "సీతానగరాంతరస్థ శ్రీ హనుమంతా" అను మకుటముతో నేకప్రాసముగా హనుమచ్ఛతకమును 1828లో రచించిరి. ఇదియును 1956లో ముద్రితము

బ్రహ్మానంద తీర్థము :

బ్రహ్మానందతీర్థులను మహాయోగి యొకరు మహారాష్ట్ర ప్రాంతమునుండి వచ్చి బాపట్లలోనుండి 1924లో కాశిలో సిద్ధిపొందిరి. వారు సంస్కృతాది భాషలలో పండితులగుటయేకాక యోగమార్గమున సమున్నత దశనందినవారై తమ మహిమాన్విత చరిత్రతోననేకులను భక్తులుగా మార్చి ఆ ప్రాంతమున గొప్ప సంచలనము సృష్టించిరి.

శాస్త్రిగారు వారి ప్రభావమును కొనియాడుచు సంస్కృతాంధ్రములలో కొన్ని పద్యములను వ్రాసి దర్శనమున కేగిరి దర్శనము లభించినది. బ్రహ్మానందులను పరివేష్టించి తర్క వ్యాకరణాది శాస్త్ర పండితులనేకులు పవిష్టులై యుండిరి. శాస్త్రిగారు పరిచయాదికములైన తరువాత తాను వ్రాసిన వానినిగూర్చి చెప్పగా వానిలో సంస్కృత శ్లోకములను వినిపింపుమని బ్రహ్మానందులు ఆదేశించిరి. శాస్త్రిగారు విన్పించిరి. బ్రహ్మానందులకు బ్రహ్మానందమైనది. 'శాస్త్రీ! మధురమైన కవిత్వము వ్రాయుటకు శాస్త్ర పాండిత్యమావశ్యకముకాదు. నీవు ఏ శాస్త్రములును చదువనక్కరలేదు. నీ కవిత్వమున దోషములుండవు. ఇది నా అనుశాసనము' అనిరి.[1]

శాస్త్రిగారివెంట ఎప్పుడును పెన్సిలొకటి, కలమొకటి యుండును. పెన్సిలుతో చిత్తువ్రాసి కలముతో సాఫు వ్రాయుట సాధారణముగా చేసెడుపని. ఒకసారి రాధాకృష్ణమూర్తిగారు శాస్త్రిగారిని పెన్సిలడుగగా 'ఇప్పుడు నావద్ద రెండులేవురా! ఒకటి పెన్సిలు వాడటం రెండు చిత్తువ్రాయటం బ్రహ్మానందతీర్థులవారు ఆదేశించిన నాటినుండి అనుకున్నది కొట్టివేయకుండా సాఫువ్రాయటమే'.[2] అని సమాధాన మిచ్చిరి. బ్రహ్మానందుల ఆశీరనుశాసనముపై వారి కంతటి భక్తి కుదిరినది. సహజాధ్యాత్మిక చింతనులైన శాస్త్రిగారికి బ్రహ్మానంద తీర్థుల దివ్యతేజస్సు మార్గదర్శకమైనది. ఆ తరువాత శాస్త్రిగారు 'బ్రహ్మానంద తీర్థ చరిత్ర'ను హరికథగా [1925] రచించిరి. అంతేకాక వారిపై తనకుగల గాఢభక్తికి నిదర్శనముగా రెండవ కుమారునికి 'బ్రహ్మానందమ'ని నామకరణము చేసిరి.

---

1. శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి, ముఖాముఖి.
2. ముఖాముఖి: శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆదిభట్టీయము :

ఒకసారి శాస్త్రిగారు తమ రామదాసుచరిత్రమును అచ్చు వేయించిన శ్రీ భువనగిరి కోదండపాణిగారి మేనల్లుని వివాహమునకు రాజమండ్రి వెళ్ళిరి. మహా మహులైనకవిపండితగాయకు లెందరో విచ్చేసిరి. సంస్కృతాంధ్రాంగ్లాది భాషా కవితాధురీణులును, హరికథాపితామహులును, సహృదయ శేఖరులునగు శ్రీమదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు గారును వచ్చిరి. పెండ్లివారి యూరేగింపు సాగగా దాసుగారు గడ్డము క్రింద చేతికఱ్ఱ నానించుకొని తిలకించుచుండిరి. శాస్త్రిగారు భక్తి సంభ్రమములతో నమస్కరించి రామదాసు చరిత్రము ప్రతిని సమర్పించిరి.

దాసుగారు అప్రయత్నముగా పుస్తకమును తెఱచి ఆ పుటలోని పద్యము నొకదానిని చదువుమని పుస్తకమును శాస్త్రిగారికే ఇచ్చిరి. శాస్త్రిగారొక పద్యము చదివిరి. దాసుగారు గంభీరవదనులైరి. శాస్త్రిగారు ప్రశ్నార్థకదృష్టులతో దాసుగారి మొగము చూడసాగిరి. దాసుగారెంత సరసులో అంత గడుసరి. శాస్త్రిగారిని ఏమి ఎగతాళి పట్టింతురో చూడవలెనని ప్రక్కనున్నవారు సోత్సాహులై గమనించు చుండిరి.

అపుడు దాసుగారు తమ దక్షిణ హస్తమును శాస్త్రిగారికి చూపిరి. వారికి అవగతము కాలేదు. 'ఇంతటి కవికి ఆ మాత్రము తెలియదా? సరిగా చూడు' అని దాసుగారనగా పరిశీలించి చూచిన శాస్త్రిగారికి వారిచేయి రోమాంచితమగుట కన్పట్టెను.

'ఇంతకన్న ప్రశంసలేమి కావలయును? నోటితో చెప్పజాలను. ఈ గ్రీష్మ వర్ణనము నెంతక్రొత్తగా వింతగా చేసితివి' అని దాసుగారు ఆశీర్వదించిరి. ఆపద్యమిది -

అడుగులో నడుగులు తొడుగు మత్తేభేంద్ర
యాన లోలి దురంగయానలైరి
ఘంటా పథాంతర గతులకు బైవల్య
మదతలే ముత్యాల గొడుగులయ్యె

1. ముఖాముఖి: శ్రీ చల్లా జనార్ధన శర్మ [శాస్త్రిగారి పెద్దకుమారులు]
8. 8. 1984.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దెల్వితేటల తమ్మి తీవె యొక్కటి దక్క
సామాన్యలతలెల్ల జంకివాడె
వట్టివేళ్ళను జుట్టుకట్టుకొన్నను వేడి
తలయెత్తి జగముల నలపుకొనియె
జాత్యృతులు సాగె నొక్కంట ... ...
[ఆ. 1. ప. 156.]

నెఅజాణ! వీణ!

గుంటూరు మండలమున రేపల్లె సమీపమున 'ఉల్లిపాలెమ'ను సంస్థాన ముండెడిది. కాండ్లూరి నరసింహాచార్యులు గారను వైణికులొకరచట ఆస్థాన విద్వాంసులుగా నుండెడివారు. ఒకసారి తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారు పిచ్చయ శాస్త్రిగారితో కలసి ఆచార్యులవారి వీణకచేరి వినుట తటస్థించినది. ఇరువురును సంగీతమునందు సమభినివేశము కలవారగుటచే ఆ కచేరి వారికి తన్మయత్వము కలిగించెను. ఆ ఆనందమును అనుభవించుచునే పిచ్చయ్యశాస్త్రిగారొక పద్యమును ధారణచేసి సభాంతమున దానిని చదివిరి. ఆ పద్యము చివరిపాదమున 'నెఅజాణ! వీణ!' అని వచ్చును.

కొంతకాలమునకు వేంకటప్పయ్య శాస్త్రిగారు తెనాలిలో నొకసభలో కవితా గానము చేసిన పిదప నొక వేణు విద్వాంసుని కచ్చేరి జరిగెను. అతనిని అభినందించుచు కవిమ్మన్యుడొకడు పద్యము చదివెను. దానిచివర 'నెఅజాణ! వేణు!' అని వచ్చెను. అచటనే ఉన్న గురువుగారికి అనుమానము తోచెను. పద్యమును మరల చదువమనిరి. అతడు చదివెను. వెంటనేవారు వేదికపైకెక్కి 'ఈ పద్యము నీది కాదు. మా పిచ్చయ శాస్త్రిది. చివరిపాదమును నీవు మార్చితివి. లింగభేదము వచ్చినది. సొగసు పోయినది. ఒకవీణ కచేరిలో అతడీ పద్యమును చెప్పెను. సభ్యులకీ విషయము నిప్పుడే రుజువు చేసెదను'. అనుచు అచటి కార్యకర్తలనొకరిని పిలిచి తెనాలి కాలువ 'లాకు'ల నుండి ఇంటూరి 'లాకు'ల యొద్దకు 'ఫోను' చేసి పిచ్చయ శాస్త్రిని పిలిచి వీణపద్యము నడిగి వ్రాసికొని రమ్మని పంపిరి. పిచ్చయశాస్త్రిగారి ధారణ ఎంత గొప్పదోకాని హఠాత్తుగా పిలువబడినను 'ఫోను'లో ఆ పద్యమును తు.చ. తప్పకుండ నిట్లు చెప్పిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కులుకులాడివా యేమొకులికింతు కులుకుచు
పలుమెట్ల లోన క్రపంపు బలుకు
ఎండకన్నెఱుగని యిగురుబోణివా యేమొ
మెలగింతు సప్తభూమికల నడక
నాయికవో యేమొ ననిచెద వెదదలో
రసభావ సరసమార్గంపు బోక
మానినివో యేమొ షలయింతు తుంబీ ఫ
లంబుగుబ్బను మధురంపు వలువ
భావినివో యేమొ భావింప వలను పడని
క్రొత్త లెసయింతు వింతపై కొసరువెట్టి
నిన్ను వర్ణింపనేనెంత నియతి తోడ
జగతి గరగించు నో నెఱజాణ! వీణ[1]'

సభకు సత్యము వెల్లడియయ్యెను. గురువుగారు శాంతించిరి. వారికి శిష్యుని కవిత్వముపై గల అభిమానము నిరుపమానము. ఆ కవి యెవ్వడో శాస్త్రిగారికి సుపరిచితుడే. తరువాత అతనిని వారేమియు ననలేదు.[2]

అవధాన సరస్వతి :

పూని శతావధానములు పోడిమి మీరగ మున్ను రాజ సం
స్థానము లందు సల్పి బుధసత్తము లుల్లసిలంగ భూరి స
న్మానములంది సద్యశము నల్దిశలన్నెలకొల్పినట్టి ప్ర
జ్ఞానిధి నిన్నుభజించెద మనంబున పిచ్చయ్యశాస్త్రి మద్గురున్.[3]

పద్యగద్య గేయ కావ్యములను నిరాఘాటముగా స్మరణ మాత్రమున రచించిన శక్తిమంతులు శాస్త్రిగారు. వారియాశువు బాణవేగము. ధారణము అసాధారణము. చమత్కృతి రసాకృతి. అట్టి యాశు ధారణ చమత్కార ధోరణులుగల శాస్త్రిగారు అవధాన విద్యలో నద్భుత ప్రతిభ చూపుటలో నాశ్చర్యమేమున్నది ? దానికితోడు

1. చాటూక్తిరత్నాకరము, (పుట. 11.)
2. ముఖాముఖి. శ్రీ చల్లాజనార్ధన శర్మ.
3. పాతూరి రాధాకృష్ణమూర్తి. షష్టిపూర్తి సంచిక. (పుట. 16.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారి జంటకవియైన రాళ్ళబండి వేంకటసుబ్బయ్య శాస్త్రిగారు సంస్కృతాంధ్ర కవిత్వములయందు, ఆశువునందును అతిలోక ప్రతిభావంతులు. వారు చిన్నతనము నందే 1914లో ముప్పదియేండ్ల ప్రాయమున మరణించుటచే జంటకైత రెండు మూడేండ్లు మించి సాగలేదు. జంటకవులుగా నుండుటకు దీపాలపిచ్చయ్య శాస్త్రి గారికి, శాస్త్రిగారికి నడుమ ఉత్తరప్రత్యుత్తరములు జరిగినట్లు బ్రహ్మశ్రీ చావలి వామనమూర్తి శాస్త్రిగారు చెప్పిరి[1] ఏలకో ఆ ప్రయత్నము సఫలముకాలేదు.

లభించిన ఆధారముల ననుసరించి శాస్త్రిగారును సుబ్బయ్య శాస్త్రిగారును కలసి సుమారు 1913లో ప్రత్తిపాడులో శతావధానము చేసిరి. అప్పటికి శాస్త్రిగారి వయస్సు ఇరువదియేండ్లు. ఆ తరువాత వారిద్దరును కలసి చేసిన అవధానముల సమాచారము అలబ్ధము.

శాస్త్రిగారు ఒంటరిగా చేసిన అవధానముల సమాచారము కూడ అసమగ్రమే. చాటూక్తిరత్నాకరములో "నా యవధానాశువులు" "సమస్యలు" మొదలగు శీర్షిక లున్నవిగాని తేదీలు, ఊళ్ళ సమాచారము లేదు. "నేను రెండష్టావధానముల నెఱుగుదు నని" "శ్రీ రాధాకృష్ణమూర్తిగారు" చెప్పిరి. వానిలోనొకటి కొల్లూరులో మరియొక అవధానము ఉల్లిపాలెము సంస్థానములో జరిగెను. కొల్లూరులోనే మఱియొక శతావ ధానము జరిగినట్లు శాస్త్రిగారి పెద్దకుమారులు చెప్పిరి.

చాటూక్తిరత్నాకరమున అవధానపద్యములెన్నియో కలవు. వానిలో పిపీలికాది బ్రహ్మపర్యంతము రసవంతముగా వర్ణితము. ఆయా ఊళ్ళ పేర్లు ఉట్టంకింప బడకపోవుటే లోపముగాని అవధానసాహిత్యము చాల వరకు భద్రపఱుపడెను.

ఆనాడు తెలుగునేలలోని గిరితరువులు సైతము అవధానములు సలుపగలిగి యుండగా గిరాంతనువులైన శాస్త్రివరేణ్యులవంటి సద్విప్రులకా విద్య అలవోకయైన విప్రవినోదమగుటలో వింతయేమున్నది ?

ఒజ్జరికము :

ఇంటూరులో నొక యున్నత పాఠశాలయున్నది. ఇంట నున్న మేరువువంటి శాస్త్రిగారిని దానిలో ప్రధానోపాధ్యాయ పదవిని నిర్వహింపవలసిందిగా గ్రామస్థులు కోరిరి. సుమారు 1928 ప్రాంతము నుండి శాస్త్రిగారు అచట ప్రధానాంధ్రో

1. ముఖాముఖి. 10-12-1985.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

పాధ్యాయులై ప్రవచనామృతమును విద్యార్థులకు పంచిపెట్టింది. వారి పాఠబోధ, స్మితపూర్వాభిభాషణ శాంతత్వములను గూర్చి యొకవిద్యార్థి ఇట్లు పేర్కొనెను.

“పూర్వపు ఇంటూరు హిందూ ఉన్నత పాఠశాలలో కొంత కాలము పని, చేశారు. క్లాసులోయున్న నలుబదియైదు నిమిషములున్ను అదొక యూహాప్రయాణము వలెనో, మరొక సంగీత కాలక్షేపముగానో యుండెడిది. తెనాలి రామలింగని గూర్చి చెప్పమొదలిడితే, శ్రీకృష్ణదేవరాయలు, వారి ఆస్థానము ,అష్టదిగ్గజములు, రామలింగని చిలిపి కవిత్వము అన్నియు ప్రత్యక్షములుగా వ్యక్తమగుచుండేవి. కాని ఒక సంగతి తెనాలి రామలింగని హాస్యముకంటె అతనిలోనున్న అద్భుతములు గాంభీర్యమైన సాహిత్యమీమాంస ఎక్కువ దృగోచరమగునట్లు చేసేవారు. తద్వారా విశిష్టమైన సంస్కృతినే విద్యార్థులకు అందింపజేసేవారు”

“వారిది మార్దవమైన చల్లని పలుకు. ఆకర్షణీయమైన స్వరము. వారు చర్చించే ప్రతివాక్కు వారి అగాధమైన హృదయము నుండి వస్తుంది.[1] —

సాహిత్యమునకు సంగీతమునకు జతకలిపి ఆంధ్ర సారస్వతమును కవులను విద్యార్థుల యెదుట నిలుపగలిగిన ఆ చల్లని పలుకు ఎందరినో విద్యార్థులను సాహిత్య విద్యార్థులుగ మార్చినవి ప్రముఖ పాత్రికేయులు కీ॥ శే॥ పండితారాధ్యుల నాగేశ్వర రావు వంటి ప్రముఖులుశాస్త్రి మహోదయ ప్రభావ ప్రభామూర్తులే.

కోపము వచ్చుటయే అరుదైన శాస్త్రిగారు విద్యార్థులను కేకలువేయుటకు రెండేరెండు పదములనుపయోగించెడివారు. అవి ‘అడ్డగాడిద’ ‘కారుదున్న’.[2] అంతకుమించి మరెట్టి దండనము వారి నుండి లభించెడిది కాదు. బెత్తము అలంకార ప్రాయము. వీపువఱకు విసురుగా వచ్చిన బెత్తము నిమురుటయే యెఱుగును గాని జమురుట నెఱుగదు[3]

పాఠశాల యొజ్జయేకమేకాక సాంప్రదాయికముగానింటి యొద్ద తిని చదువు కొనెడి విద్యార్థులు మరికొందఱుండెడివారు. వారి శిష్యులలో నగ్రగణ్యులైన పాతూరి

---

1. శ్రీ కస్తూరి సీతారామారావు. షష్టిపూర్తి సంచిక. (పుట. 38.)
2. ముఖాముఖి : శాస్త్రిగారి శ్రీమతి. 1976.
3. ముఖాముఖి : శ్రీ ఉపద్రష్ట వేంకట కృష్ణయ్య [నాటివిద్యార్థి-నేటి పండితులు]

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాధాకృష్ణమూర్తి గారు

నా తొలిప్రాయమందు కరుణారసమొప్ప గుమారురీతి సం
ప్రీతిని విద్దెలన్గఱపి పేర్మిముడి సాకిన తక్రవంశ సం
జాతుల రామకృష్ణ[1] కవిపూజిత పిచ్చయ్య శాస్త్రి సద్గురు
భ్రాతల గొల్తు నాత్మ యలరారగ శ్రీనగజామనోహరా![2]

అను పద్యమున కుమారునివలె సాకినట్లు పేర్కొనుట గమనార్హము. రాధాకృష్ణమూర్తిగారి సహజ కవన శక్తిని గమనించిన శాస్త్రిగారు "రాధాకృష్ణా ! నువ్వు వ్యాకరణం చదువవద్దు. శయ్యపోతుంది. భాగవతం చదువు. ప్రబంధాలు చదువు." అనెడివారు. వ్యాకరణ ధారమైన కవిత గరి యెట్టిదో నిసర్గకవితా మూర్తులు శాస్త్రి గారెరుగుదురు కావుననే కవిత్వాభిలాషులగు విద్యార్థులకు వారు బోధించిన మార్గమిది. వ్యాకరణము అసలు అక్కరలేదని వారి అభిప్రాయము కాదు. వ్యాకరణ జ్ఞానముతో కవిత్వారంభము మంచిదికాదు. వ్యాకరణమునసుసరించి ప్రతికటువులైన శబ్దములును సాధువులు కావచ్చును. వ్యాకరణ సిద్ధములై జనులకెక్కని కృతక రూపములు కొన్ని యుండును. ఇట్టివన్నియు తలకెక్కించుకొని కవిత్వము నారంభించినచోనది తల దిక్కైతయగు. మరందధారాపాతము వంటి పోతనాదుల కైతలు చదివినచో అట్టి ధారాశుద్ధి యేర్పడును. అప్పుడు వ్యాకరణమును పఠింపవచ్చును. అంతేకాక తెలుగునకు వ్యాకరణముకన్న ప్రయోగమే ప్రమాణము. తెలుగునకున్న వ్యాకరణ దీపము చిన్నదియనికదా ! పెద్దలమాట.

ఇంటూరు పాఠశాలలో పనిచేయుచున్నప్పుడు 1930లో శాస్త్రిగారు విద్యార్థుల యుపయోగము కొఱకై "భాషాభ్యుదయము" అను గద్య గ్రంథమును రచించిరి. భాషాప్రవేశముతోపాటు శీలనిర్మాణము కూడ జరుగునట్లు దీని ప్రణాళిక తీర్పబడెను.

1933 లో "ఉద్యానము" అను పద్యకావ్యమును వెలువరించిరి. ఇదియును విద్యార్థులకు వాఙ్మయ చరిత్రను చమత్కారముగా నందించుకావ్యము.

గోష్ఠీవనము :

"గోష్ఠీవనము" గుంటూరు మండలమునగల పొన్నూరు పట్టణమునకు పౌరాణికనామము. అచటి భావనారాయణస్వామి దేవస్థానమున కనుబంధముగా నొక సంస్కృత కళాశాలను ఆనువంశిక ధర్మకర్తలు రాజా వాసిరెడ్డి హరిహర ప్రసాదు గారు స్థాపించిరి.

---

1. శ్రీ చల్లా రామకృష్ణశాస్త్రి శాస్త్రిగారికి అన్నగారి వరుస. స్మారకమున నిధి.
2. శ్రీ శివాసుభూతి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అ జమీందారులదెంత సునిశిత పరిశీలనాదృష్టియో కాని శాస్త్రిగారి డిగ్రీలు లేని పాండిత్యములోని లోతునెఱిగి తమ కళాశాలలో నాంధ్రోపన్యాసకులుగా పని చేయుటకై రాజ్ఞీమణి వేంకట లక్ష్మీనరసమాంబగారు [హరిహరప్రసాదుగారి తల్లి] ఆహ్వానించిరి. శాస్త్రిగారు గోష్ఠీపనివాసులై 1944 నుండి 1951 వఱకు శ్రీ భావనారాయణస్వామి సంస్కృత కళాశాలలో పనిచేసిరి. జమీందారులకు గురు స్థానీయులైరి.

'రాజా వాసిరెడ్డి హరిహరప్రసాదు బహద్దరు దొరవారికి గురుతుల్యులుగా, మాదృశులకు పూజనీయులుగా నైష్ఠిక బ్రహ్మోపాసకులుగా జీవితయాత్ర సాగించిన బ్రహ్మశ్రీ చల్లా పిచ్చయశాస్త్రిగారు సుకవిలోకవంద్యులు. వారు ఏ పీఠములో శిష్య గణానికి బోధచేసిరో ఆ పీఠములో మేమును ఉపాధ్యాయులుగా నుండుట సుకృతవిశేషముగా భావించుచున్నాను. సత్యదయాధర్మోపేతమైన వారి రచన సాహిత్యోపాసకులకు, శాంతికాముకులకు సర్వదా సర్వథా సముపాసనీయము.' అని శ్రీ కొండవీటి వేంకట కవిగారి అక్షర నీరాజనము.1

అధ్యాపనముతో పాటు నిరంతర గ్రంథరచనము, కవిపండిత గాయక గోష్ఠులతో నా కాలము సాగినది. జయదేవుని గీతగోవింద కావ్యానువాదము, గీత గోవింద రహస్య ప్రకాశము మున్నగు రచనలప్పటివే. పొన్నూరులో నెందఱో హితులు, స్నేహితులు, పండితులు, కవులు, గాయకులు శాస్త్రిగారిని పరివేష్టించి యుండెడివారు. విశ్వనాథ తుమ్మల, కాటూరి మున్నగు కవులు తరచు పొన్నూరులో సమావేశ మగుచుండెడివారు. శాస్త్రిగారు గాయకులు కూడ నగుటచే శ్రీ తాడిగడప శేషయ్య వంటి గాయక ప్రముఖులరుదెంచు చుండెడివారు. విజయవాడ, గుంటూరు మొదలగు పట్టణములలో పరిసర గ్రామములలో పురాణ ప్రవచనములు, ధార్మికోప న్యాసములు మొదలగు కార్యక్రమములతో శాస్త్రిగారు క్షణము తీరక లేనివారైరి.

సంగీతజ్ఞానము :

ప్రతిభావంతుడగు కవిచక్రవర్తికి కవిత్వముతోపాటు సంగీత జ్ఞానము దానికి తోడు నిశ్చలమగు మహాభక్తియు నున్నచో నచ్చట త్రివేణీసంగమ పావిత్ర్యము సాకారమగును.

---

1. ముఖాముఖి : 20-5-1984.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారి జీవితపుబాట భక్తి సంగీత సాహిత్యముల ముప్పేట. కవిత్వము వారికెట్లు ఆజన్మసిద్ధమో సంగీతమును అట్లే. వారి నోటినుండి మొమ్మొదట వెలువడిన గేయమే సంగీత సాహిత్యములను మేళవించి సరస్వతి అందించిన ప్రసాదమై మనాక్కావ్యార్థ సూచన చేయుచున్నది.

6937

శాస్త్రిగారి షష్టిపూర్తి సందర్భమున శ్రీ [illegible] పిచ్చయ్య శాస్త్రిగారు వ్రాసిన-

కవివరుడు గాయకుండౌట గాయకమణి
కవివరుండౌట యరిది లోకమున నెందు
శారదాదేవి యుభయపార్శ్వముల స్థిర
మార గ్రోలిన ధన్యుడ వయ్య నీవు

पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

అను పద్యము ప్రత్యక్ష సత్యము. శాస్త్రిగారికి బాల్యమున గంధర్వావతారులైన శ్రీ వారణాసి రామసుబ్బయ్యగారి స్నేహము సంగీత సాగరపు లోతులలో నీత నేర్పినది. ప్రతిభోపలబ్ధమైన శ్రుతపాండిత్యము విశ్రుత పాండిత్యమై వ్యుత్పత్తి మంతమయ్యెను. ఈ అధికారముతోనే వారు గీతగోవిందమును ఆంధ్రీకరించిరి. అనేక హరికథలను, కీర్తనలను రచించుటయేకాక స్వయముగా గానము చేసిరి 'వారు పద్యము చదివెడి యొడుపు మిక్కిలి సొగసుగా నుండిది.' అని రాధాకృష్ణమూర్తిగారు చెప్పిరి. "సంగీతానికి అనుకూలమైన కంఠం. గీత గోవిందం స్వయంగా పాడేవారు. అందుకే మా నాన్నగారు తమ తంబుర ఆయన కిచ్చారు" అని రాఘవనారాయణ శాస్త్రిగారనిరి. "వారికి సంగీతం అంటే పిచ్చి" అని తుమ్మలవారు చమత్కరించిరి.[1] "ఆ కాలంలో కవిత్వం. సంగీతం సమరసంగా సంపాదించిన వాళ్ళు తక్కువ. చాలామంది కవులు సంగీత శత్రువులు. సంగీతంలో పాండిత్యమేకాక బాగా పాడగలిగి ఉండటం పిచ్చయశాస్త్రిగారి ప్రత్యేకత. ఆయన ప్రతి పద్యం సంగీతంతో భావించేవారు" అని శ్రీ జమ్ములమడక మాధవరామశర్మగారి అభ్యుక్తి.[2]

"వారికి సంగీతమన్ననూ, సంగీతజ్ఞులన్ననూ మిక్కిలి ప్రేమ. శ్రీవారు బెజవాడలో మా గృహమునకు పలుమారు వేంచేసి అమృతోపమానమైన వారి రచనలను నాకు వినిపించి బ్రహ్మానందము నొనరించిన సన్నివేశములు నేమరువలేనివి".

1. ముఖాముఖి : 7-8-1983 2. ముఖాముఖి : 10-9-1983

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని అపర గంధర్వావతారులు. వాగ్గేయకారులు శ్రీ మంగళంపల్లి బాలమురళీ కృష్ణ మధురస్మృతి.[1]

శాస్త్రిగారు కవులలో కవి. గాయకులలో గాయకుడు. ఆనాటి ప్రఖ్యాత సంగీత విద్వాంసులెందరో వారికి ఆప్తమిత్రులు. వారణాసి రామసుబ్బయ్యగారిచే ప్రశంసితులైన శ్రీ తాడిగడప శేషయ్య శ్రీ పాలుపల్లి రామకృష్ణయ్య పంతులు, శ్రీ హరి నాగభూషణం, శ్రీ మహావాది వేంకటప్పయ్య శాస్త్రి మొదలగు గాయన శిరోమణులకు శాస్త్రిగారిల్లు స్వగృహము.[2]

శంకరుడు నాదతనువు. పార్వతీ పరమేశ్వరులు వాగర్థములవలె సంపృక్తులు. అట్టి ఆదిదంపతులను వాగర్థపూజనముతో పాటు నాదోపాసనముతో కూడ ఆరాధింప గలుగుట సకృల్లభ్యమగు సదృష్టము.

అభినవ జయదేవులు :

1951 ప్రాంతమున శాస్త్రిగారు పదవీ విరమణ చేసిరి. అప్పటికి వారు జయదేవుని గీత గోవిందమును పద్యగేయాత్మముగా నాంధ్రమున కనువదించుట పూర్తియయ్యెను. గీత గోవిందమును పద్యరూపమున పెక్కురు అనువదించిరి గాని గేయములను గేయములుగా అనువదించినవారు ఇరువురే. యథాతథముగా ననువదించిన వారు శాస్త్రిగారే.

శాస్త్రిగారు తమ అనువాదమును సుప్రసిద్ధంగు కవి గాయకులనేకులకు పాడి విన్పించిరి. పలుపట్టణములకు, మదరాసు నగరమునకు పోయి గోష్ఠులు సల్పిరి.

ఆ సందర్భమున వారు గీతగోవిందమునకు మరియొక అనువాదకులును, ఉయ్యూరు జమీందారులునగు శ్రీ రాజా వేంకటాద్రి అప్పారావుగారిని కలసి తమ అనువాదమును వినిపింపగా "జయదేవుడే తన గీతగోవిందమును తెనుగులో రచియింపగోరి మీ రూపమున జన్మించెను" అని వారు ప్రశంసించిరి.[3] చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు "ఆంధ్రజయదేవు"లని కీర్తించిరి.[4] రసజ్ఞులు "అభినవ జయదేవు"లని కొనియాడిరి.

---

1. షష్టిపూర్తి సంచిక, పుట. 34.
2. ముఖాముఖి : శ్రీ చల్లా బ్రహ్మానందం [శాస్త్రిగారి రెండవ కుమారుడు]
3. ముఖాముఖి : శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి.
4. శాస్త్రిగారి గీతగోవిందము, పీఠిక,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అట్టి గ్రంథమును తమ కళాశాలా పండితులు రచించుట తెలిసి సంతసించిన రాజ్ఞీమణి వాసిరెడ్డి వేంకటలక్ష్మీ నరసాంబగారు దానిని ముద్రింపించి శాస్త్రిగారిని సత్కరింపనెంచిరి. శాస్త్రిగారు ఆంధ్ర గీతగోవిందమున కనుబంధముగా వాసిరెడ్డి వారి వంశచరిత్రను హృద్యముగా రచించిరి. ముద్రణము పూర్తియైన తరువాత రాణిగారు వారిని గుంటూరునకు పిలిచి శాలువ, నూత్న వస్త్రములు, ఫలపుష్పాదులతో సమ్మానించి గ్రంథప్రతులను వారి కర్పించి చిన్నకారులో పొన్నూరునకు పంపిరి. [1] శాస్త్రిగారి రచనలలో నొక గొప్ప గ్రంథమును ముద్రింపించిన ఘనత వాసిరెడ్డి ప్రభువులకు చిరస్థాయిగా దక్కినది. "హంసలదీవి ప్రభావమును"ను కూడ వారే అచ్చొత్తించిరి.

రాచపుండు :

శాస్త్రిగారికి చిన్నతనము నుండియు సంతర్ముఖత్వమే తప్ప ఏ విషయమును ఇతరులకు చెప్పు స్వభావము కాదు. లౌకిక వ్యవహారములయందు సాధారణముగా మౌనమే వారి సమాధానము. తాడేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారు వారిని "దక్షిణామూర్తి అవతారము" అనిరి. ఆ అవతారము యొక్క "మౌనవ్యాఖ్య" శాస్త్రిగారి ప్రథమ లక్షణము.

ఒకసారి శాస్త్రిగారి అప్పచెల్లెండ్రు వారినేదో కుటుంబ వ్యవహారమున పరుషములాడిరి. దానికి శాస్త్రిగారి సమాధానము మౌనమేయైనది. వారి శ్రీమతికి ఒడలు మండిపోయినది. "బెల్లము కొట్టిన రాయివలె చూచుచు నూరకుందురేమి?" యన్నది.2 ఎవరేమన్నను, అనుకొన్నను వారిది మాత్రము ఒకటే తత్త్వము. లాభమైనను, నష్టమైనను, కష్టమైనను సుఖమైనను మౌనముగా ననుభవించుటే వారి సిద్ధాంతము.

పొన్నూరులో శాస్త్రిగారి హితులలో డాక్టరు నాదెళ్ళ కుటుంబరావుగారు ముఖ్యులు. ఒకనాడు. ఉత్తరీయమున కట్టినమూట బుజమున వ్రేలాడుచుండగా తల వంచుకొని నడచుచున్న శాస్త్రిగారిని డాక్టరుగారు చూచిరి. ఆ నడకలోని తడబాటును, నీరసమును చూచి అస్వస్థులుగా నున్నట్లు గమనించిరి. సమీపించి శాస్త్రి

1. ముఖాముఖి : శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి.
2. ముఖాముఖి : శ్రీమతి చల్లా వరలక్ష్మమ్మ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గారిని స్పృశింపగా నొడలు కాలిపోవుచున్నది. కన్నులు ఎఱ్ఱగా నున్నవి. "ఇదే మిటి శాస్త్రిగారూ ఇంత జ్వరంతో బయటకు వచ్చారు ? ఎప్పణ్ణించీ జ్వరం ? మాతో చెప్పవచ్చుకదా!" అనగా "అత్యవసరంగా కూరకవలసి వచ్చింది తెచ్చే వారు లేరు. జ్వరం అదే పోతుంది లెండి" అని శాస్త్రిగారి సమాధానము. "అదేం మాట! అసలీ జ్వరం ఎందుకొచ్చింది ?" అని డాక్టరుగారు విషయశోధనము చేయగా శాస్త్రిగారి వీపుమీద పెద్ద కురుపు వేసినట్లు తేలినది. వెంటనే కుటుంబరావు గారు వారివెంట నడచి తగుసాధనములతో "ఆపరేషను"కు సిద్ధముకాగా శాస్త్రిగారు మత్తుమందు స్వీకరింపలేదు. వీపు నప్పగించి కూర్చుండిరి. సుమారు గంటసేపు కిమ్మనకుండ కించిత్తు బాధపడకుండ ఆ ప్రాంతమునుండి ప్రాణము నుపసంహరించి కవితాతపోము ద్రములోనుండి డాక్టరుగారినే ఆశ్చర్యములో ముంచిన ఈ సన్నివేశము మరువరానిది. [1]

ఒకసారి బంధువుల పెండ్లియూరేగింపు వెంట పోవుచుండగా తేలు కుట్టినది. అందరును ఆందోళన చెందిరి. శాస్త్రిగారు మాత్రము ఆ యూరేగింపు ఇంటికి చేరుసంతవరకు వెంటనుండి శిరస్స్నానము చేసి పెండ్లివారికి వడ్డన ప్రారంభించిరి. "శరీరమునకు మనస్సునకు లంకె తొలగించినచో ఏ బాధలు అంటవు" అని వారి అభిభాషణము.[2] అనుకొనినప్పుడెల్ల అట్లు చేయగలుగుటకు ఎంత తపశ్శక్తి కావలయును. "గతజన్మార్జిత దోషలేశమున యోగభ్రష్టుడైపుట్టి" అని వారిని గూర్చి రాధాకృష్ణమూర్తిగారు చెప్పిన పద్యము సత్యసుందరము. అందుచేతనే కవు లెంతమంది యున్నను ఇట్టి నడవడిగలవారు అరుదని సమకాలిక పండితులేకాక సామాన్యజనులు కూడ వారిని కీర్తించిరి.

గ్రంథ సంచారము :

పదవీ విరమణము చేసిన తరువాత శాస్త్రిగారు తమ ముద్రిత గ్రంథములను గైకొని బహు గ్రామములు పర్యటించుచు చందాదారులను చేర్పించిరి. పాతికరూపాయి

1. ముఖాముఖి : శ్రీ పాతూరి వేంకటప్పయ్యశాస్త్రి [శాస్త్రిగారి పెద్దబ్బాయి] 5-4-1985.
2. ముఖాముఖి : శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లిచ్చి సభ్యత్వము స్వీకరించినచో అప్పటికి ముద్రితములగు గ్రంథములనిచ్చి మున్ముందు అచ్చుపడు గ్రంథములను కూడనిచ్చుట నియమము. ఈ గ్రంథ సంచారమున సాధారణముగా శాస్త్రిగారి వెంట రాధాకృష్ణమూర్తిగా రుండెడివారు.

పుస్తకముల మూట మూపున వ్రేలాడుచుండగా ఎంత దూరమయినను వంత లేక నడచుట వారి అభ్యాసము. సమయమున బస్సు వచ్చినచో వచ్చినట్లు లేనిచో పాదయాత్రయే. చాటూక్తిరత్నాకరమున "నా నడవడి" అను శీర్షిక క్రింద "కాఫీ త్రాగుట లేదోకప్డునడతున్ కాల్నాచి శీఘ్రమ్ముగా" అని చెప్పుకొనిరి. "ఒరేయ్! నువ్వు నడవలేవేమో కారెక్కుదామా?" అని రాధాకృష్ణమూర్తి గారితో ననగా "మామయ్యా! పెద్దవారు మీరే నడవగా లేనిది నేను నడవలేదా? మీరేదైనా విషయం చెప్పటం మొదలుపెడితే శ్రమ తెలియదు. ముందు మీ భుజానవున్న మూట ఇలా ఇవ్వండి" అని మూర్తిగారనగా "ఆమూట ఎవరికీ ఇచ్చేదికాదు" అని ఏవియో విషయము లారంభించెడివారు.

"మనస్సును మరొక విషయం మీద పెడితే ఎంతదూరమయినా నడవచ్చు" అని వారి మాట. ఒకసారి వారు కృష్ణా మండలములోని దివితాలూకా "వేకనూరు" గ్రామమునకు పోవలసి వచ్చినది. పులిగడ్డదగ్గర కృష్ణనుదాటి కట్టపైన నడక నారంభించిరి. మనస్సును భావలోకములకు పంపిరి. అది ఏమియో పద్యములను ధారణ చేయుచున్నది. కాళ్ళు నడచుచున్నవి. మనశ్శరీరము లైక్యమైనచోట పరిసరములను పరిశీలింపగా వారు చేరవలసిన గ్రామమునుదాటి రెండుమైళ్లు అవతలనున్న నాగాయలంకలో నుండిరి.[1] ఇంతటి పరవశత్వమున కవితా పరదేవత నారాధించెడు కవి యోగులెందఱుందురు?

"రాధాకృష్ణా! ఈ మధ్య మద్రాసు వెళ్ళినప్పుడు "ట్రాంబండి" ఎక్కాను. అది కరెంటుతో నడుస్తుంది. దానికీ మనకూ ఎంతో పోలికవుంది. సత్యం, ధర్మం రెండు పట్టాలు. దేహం బండి. తీగె హృత్పుండరీకంలో వుంది. పైనున్న తీగె పరమేశ్వరుడు. ఈ తీగెను ఆ తీగెకు తగిలిస్తే ఎన్నిమైళ్ళయినా శ్రమ లేకుండా వెళ్ళవచ్చు. అది తెలుసుకోవాలి." అని యంత్రములయందు సైతము తాము కనుగొన్న మంత్రములను శాస్త్రిగారు చెప్పెడివారు.

1. ముఖాముఖి : శ్రీ పాలపర్తి వెంకట సుబ్బారావు, 8-4-1984

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కోతల రోజులలో వెన్నెలరాత్రి యందు శాస్త్రిగారు శిష్యసమేతులై బాట వెంట నడచుచుండిరి. ముందు మూర్తిగారు వెనుక శాస్త్రిగారు. ప్రాంతమంతయు నిశ్శబ్దము. ఎముకలు కొరికెడు చలి. గురువుగారేదో చెప్పుచుండిరి. కొంత సేపటికి గురువుగారి మాటలు ఆగిపోయెను. శిష్యుడు వెనుదిరిగి చూచెను. వెనుక చాల దూర మున నొక మామిడిచెట్టు నొద్ద వారు నిలచిరి. పొలములలో పరిగనేరుకొనెడివారు కళ్ళములలో బిచ్చమడిగికొనెడివారు కొందఱు బిచ్చగాండ్రు ఆ చెట్టుక్రింద నిద్రించు చుండిరి. శాస్త్రిగారు వారివంక చూచుచుండిరి. సమీపించిన శిష్యునితో "రాధాకృష్ణా! ఇక్కడ నీకేమయినా విశేషం కనపడుతున్నదా?

విశేషమేముంది. ఎవరో బిచ్చగాళ్ళు నిద్రపోతున్నారు.

ఇంతేనా నువ్వు తెలుసుకొన్నది.

ఏదైనా ఉంటే చెప్పండి.

విను. వాళ్లూ మనుష్యులే. మనమూ మనుష్యులమే వీళ్ళేమో వణికించే చలిలో ఇట్లా చెట్టుకిందపడి నిద్రపోతున్నారు. ఏం తిన్నారో తెలియదు. మనం ఇంటికి వెళ్ళేసరికి వేడినీళ్ళూ, వేడివేడి భోజనం, మెత్తని ప్రక్క సిద్ధంగా ఉంటాయి. లక్షాధికారులూ, కోటీశ్వరులూ ఇంకా ఎక్కువ భోగాలు అనుభవిస్తారు. వారితో పోల్చుకొని అసంతృప్తి పడక వీరినిచూచి తృప్తిపడాలి. ఎప్పుడూ క్రిందికిచూడాలి. వాళ్లు ఎంత సుఖంగా నిద్రపోతున్నారోచూడు. అదీ విశేషం" అని శాస్త్రిగారు సమన్వయించిరి.

లోచూపుకలిగియు ఇట్లు వెలిచూపు నలుదిక్కులకు సారించి సృష్టివైవిధ్య మును నిశితముగా శోధించిన శాస్త్రిగారి దృష్టిసౌందర్యము అంతర్బహిస్సులందు వ్యాపించి విశ్వతోముఖమై విరాజిల్లినది.

ఈ విధముగా శాస్త్రిగారు గమికర్మీకృతనైకనీవృతులై కవిపండిత రసజ్ఞుల ననేకులను కలసికొని కావ్యగోష్ఠులతో, చర్చలతో శారదార్చన కళాశీలురై ప్రకా శించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షష్టిపూర్తి :

కలియుగమున మానవులకు నిర్దిష్టపూర్ణాయుర్దాయము నూటయిరువది యేండ్లు. అరువది యేండ్లు నిండగనే మానవుడు శాంతి పౌష్టిక క్రియలచే వైదికముగా కాలపురుషు నర్చింపవలెను. వత్సరాయన మాసర్తుపక్షవారతిథికరణయోగ నక్షత్రదిగధిపతుల నెల్లరను శాంతింప చేయవలెను. లేనిచో కాలపురుషు డాగ్రహించునని వేదానుయాయుల విశ్వాసము. ఇదియే షష్టిపూర్తి మహోత్సవాంతర్యము.

అంతేకాక లౌకికముగా వ్యక్తి జీవితములోని ముఖ్య సన్నివేశములకు పరిధియగు అరువదేండ్ల సింహావలోకనము అపరవయోగామి యగువానికి అవశ్యకర్తవ్యము ఆ వ్యక్తి మహాపురుషుడయినచో ఆయన కావించిన మహాకార్యములను, సాధించిన ఘనవిజయములను స్మరించుకొని కృతజ్ఞతా పూర్వకముగా సమ్మానింపవలసిన బాధ్యత సమాజముపై నున్నది.

అల్లరిపిల్లవాడుగా నల్లిబిల్లి కైతలల్లిన శాస్త్రిగారు అభినవజయదేవులై సుకవి సమ్రాట్టులై, కవిసార్వభౌములై, శతావధానులై, బహుగ్రంథములు రచించి, పలుమంది శిష్యులను తనంతవారినిచేసి, లోకమునందు, సాహితీలోకమునందు చల్లనివారుగా పేరొంది, సమానులలో నుత్తమశ్లోకులై, పెద్దల ఆశీస్సులకు పాత్రులై, పిన్నలకు ఆదర్శమూర్తులై ప్రశాంతసుందరమగు వదనమున బ్రహ్మవర్చసము పొంగులువారుచుండగా నశిష్టిహాయనులయిరి.

శాస్త్రిగారు శిష్యులు, అభిమానులు, కవిగాయక పత్రికాండులునొక సంఘముగా నేర్పడి శాస్త్రిగారికి వైదికముగా, లౌకికముగా షష్టిపూర్తి మహోత్సవమును పొన్నూరు పట్టణమున ఘనముగా జరుపవలెనని నిశ్చయించిరి.

పుష్పగిరి ప్రభృతి పీఠాధిపతులు, తల్లావఝ్ఝుల, శ్రీపాద విశ్వనాథ, వేటూరి, తుమ్మల ప్రభృతి కవీంద్రులు, మహావాదీత్యాది గాయకవరేణ్యులు, ముక్త్యాల, చింతపల్లి, కాండ్రేగుల, ఉండ్రాజవరం, జమీందారులు, వేంకటరామ, ఓరియంట్ పబ్లిషర్స్ మొదలగు ప్రచురణకర్తలు, ఇంకెందరో న్యాయవాదులు, సంపన్నులురాష్ట్రిము నలుమూలల నుండి ఉత్సవసంఘమున సభ్యులయిరి. కార్యనిర్వాహక వర్గమేర్పడెను.[1]

---

1. షష్టిపూర్తి సంఘమువారి కరపత్రము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"శ్రీ పిచ్చయ శాస్త్రిగారు జగమెరిగిన కవిశేఖరులు, శాంతిదాంతి శీలాగ్ర గణ్యులు, మహాపండితకవులు..., శ్రీ శాస్త్రిగారు చేసిన భాషాసేవ అపారము. శ్రీ శాస్త్రిగారికి ఉన్నత పాఠశాలలయందేమి, సంస్కృత పాఠశాలయందేమి గల శిష్యకోటి యనంతము. గురుకులాశ్రమ ధర్మముగా శ్రీ శాస్త్రిగారి వద్ద విద్యాభ్యాస మొనర్చి ఉన్నతపదవుల నలంకరించిన వారెందరో కలరు.

ఇట్టి యద్భుత ప్రతిభా సంపన్నులయ్యు శ్రీశాస్త్రిగారు "నివురుగప్పిననిప్పు" వోలె బమ్మెర పోతనామాత్యుని రీతి ప్రస్తుత ప్రాపంచిక వ్యవహారముతో నిమిత్తము లేకుండా కేవలము భాషాసేవయే తమ జీవిత పరమార్థముగా రచనావ్యాసంగములోనే తమ పూర్తికాలమును వినియోగించుచున్నారు.

శాంతమూర్తులును, సారస్వతోపాసకులయిన శ్రీ శాస్త్రిగారిని సత్కరించుట, ఆంధ్రసరస్వతిని సత్కరించుటయేగాక మనలను మనము సత్కరించుకొనుటయగును. అంతియేగాక ఆంధ్ర సారస్వతాభ్యుదయకరమయిన శ్రీ శాస్త్రిగారి యముద్రిత గ్రంథప్రచురణ ఆంధ్ర సారస్వత కళాభిమానులపై నాధారపడియున్నది."

అని సన్మాన సంఘమువారు ప్రకటించిరి. 1956 ఆగష్టు 17, 18, 19 తేదీలలో సమ్మానోత్సవములు జరుపుటకు నిశ్చయింపబడెను. పెద్దలందరకును ఆహ్వానము లేగెను; సన్నాహములు పూర్తియయ్యెను.

కవిం కవీనామ్ :

ఉత్సవములు నాలుగైదు దినములున్నదనగా నారంభమయిన వర్షములు ఉత్సవము మరునాటికి వచ్చునప్పటికి కూడ తగ్గక రాష్ట్రమంతయు కుంభవృష్టిగా కురియ సాగెను. "సభలెలా జరుగుతవా అని అందరూ భ్రమాన్పడిపోయారు. ప్రస్తుతానికి ఉత్సవాలు ఆపుచేసి మరోనెలలో జరుపుదామా? అని ఆహూతులందరకూ టెలిగ్రాము లిద్దామనే నిర్ణయం వరకూ వచ్చారు. ఆహ్వాన సంఘంవారు".

శాస్త్రిగారు రెండవ ప్రవరుడుగా పేరుగాంచినవారు. విఘ్నహంతయయిన హేరంబుని, కార్యసాధకుడయిన హనుమంతుని ప్రమాణబుద్ధితో కొలుచువారు. అట్టి వారికి కూడ విఘ్నములు తప్పలేదు. భక్తులను పరీక్షించి వారి శక్తులను లోకమునకు వెల్లడిచేయుటయే భగవంతుని లీల. కాంచనము అగ్నితప్తమయినప్పుడేకదా కాంతి హెచ్చును.

నిత్యము తానర్చించు హవ్యవాహునిప్రార్థించి ప్రవరుడిల్లు చేరెను. అది యెన్నడో భూతాసద్యతన పరోక్షమున జరిగినది. ఎడతెగక కురియుచున్న వానలను గూర్చి శాస్త్రిగారటులే గణనాధునకు విన్నవించుచు నాపవుగా నొక పద్యము నిట్లు చెప్పిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేను ప్రమాణబుద్ధినయి నిన్ను సతంబు భజించుచుంటి నా
పైనొక ప్రేమకల్గి కవి పండితగాయకు లేగుదెంతురా
గాన జగాన పేర్పడిన గానమయా ! గణనాథ ! లేనిచో
వానసుబంపి సూర్యభగవానుని జూపుము మూడు వారముల్[1]

తనకు వచ్చిన కష్టమును తొలగింపుమని ప్రార్థించుట లోకసహజము. 'ఇయ్యెడన్ వాననుబాపి సూర్యభగవానుని చూపుము' అనవచ్చును. ఋషిహృదయ మెప్పుడును విశ్వజనీనముగనే స్పందించును కావున లేనిచోటునకు వానసుపంపుమని శాస్త్రిగారు ప్రార్థించిరి. వర్షమాగిపోయెను. ఉత్సవములు ప్రారంభమయ్యెను.

ఉత్సవకీర్తన :

1956 వ సంవత్సరము ఆగస్టు 17వ తేదీన ప్రారంభమైన ఉత్సవములకు శ్రీ తల్లావఝుల శివశంకరస్వామి అధ్యక్షుడు. శ్రీయుతులు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, విశ్వనాథ, తుమ్మల, తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి, దోమా వెంకటస్వామి గుప్తా, ధర్మాల సుబ్బరాయశాస్త్రి మొదలగు కవిపండిత ప్రకాండులు శాస్త్రిగారి సారస్వత సేవను వారి రచనలను ప్రశంసించుచు ప్రసంగించిరి.

అభినవ జయదేవులైన శాస్త్రిగారి సన్మానసభలో సంగీత సాహిత్యములకు సమాన ప్రతిపత్తిగా శ్రీయుతులు మహావాది, ములుకుట్ల సదాశివశాస్త్రి, వింజమూరి శ్రీనివాసాచారి, జనాబ్ షేక్ ఆదమ్ సాహెబ్, షేక్ చినమౌలా సాహెబ్ మున్నగు సంగీత విద్వాంసుల కచేరీలు సర్వానంద సంధాయకములయ్యెను.

ఈ సందర్భమున శాస్త్రిగారి గురువర్గము, సహాధ్యాయులు, స్నేహితులు, శిష్యులునైన కవిపండిత గాయకులు అక్షరబద్ధము చేసిన అభిప్రాయ ప్రశంసలు శాస్త్రిగారి వ్యక్తిత్వమును వ్యక్తీకరించును.

---

1. షష్టిపూర్తి సంచిక, (పుట. 5.)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీవిశ్వనాథ -

చల్లా పిచ్చయ్యశాస్త్రి స
ముల్లాసిత శారదా నవోజ్జ్వల మృదుపత్
పల్లవ మంజీర రవో
త్ఫుల్లవచో విభవు బ్రోవుమిర ! హేరంబా !

శ్రీతుమ్మల వారి 'పోరచి' నుండి -

బాపని మనస్సు వెన్నయై పలుకు కత్తి
కన్నయై యుండునని వ్రాసె నన్నభట్టు
మనసుమాటయు వెన్నగా మనుట నేర్చి

సన్నయను దిద్దె నీ వెలనాటి మేటి
మెప్పువలచి పసిడికుప్ప వలచికైత
కొగ్గనొల్లడీ మహోదయుండు
తనతపమ్ముకైత తనముక్తికైతగా
సాగిపోవు కర్మయోగి యితడు

శ్రీ గాయత్రీ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతీ స్వామివారు-

"మహదిదం ప్రమోదస్థానం... ... ... యావదాంధ్ర ధరాతల ప్రఖ్యాత విద్వత్కవిశేఖరాణాం పండితవర్యాణాం "ఆంధ్రజయదేవ" "కవిశేఖర" ఇత్యాది బిరుద విరాజమానానాం శతావధానచాతురీ ధురీణానాం బహువిధ గ్రంథ ప్రణేతృణాం శాంతిదాంత్యాది సల్లక్షణోపేతానాం దేశ ప్రఖ్యాత శిష్యకోటీనాం శ్రీ చల్లా పిచ్చయ్య శాస్త్రి మహాశయానాం షష్ట్యబ్దిపూర్త్యుత్సవ !... అతీవ ప్రశంసనీయం విరాజతే శ్రీశాస్త్రివర్యాణాం బహుముఖ పాండిత్యం కవితా వైశారద్యం చ. లోకే ప్రాయశః పాండిత్యం వా కవితావైశారద్యం వా ఏకైకమపి గర్వస్య కారణం భవతి కిముత ! ఉభయోరేకస్మిన్ మేళనే ? తథాపి శ్రీ శాస్త్రివర్యేషు ఉభయోరపి మేళనం కేవలం వినయాది సల్లక్షణానాం హేమ్న : పరమామోద ఇవ ఆహ్లాద జనకమేవ. నతు గర్వాదీనాం కారణాం ఇతి అతీవ ప్రమోదావహం. తదీయ వదనసరోజ ప్రభైవ సర్వజన హృదయాహ్లాదినీ ఇతి నాత్యుక్తిః.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లెందఱో కవి పండితులు శాస్త్రిగారి గుణగణములను బహుధా భావించి ఛందస్సుందరులను గావించిరి. వారి శిష్యులగు శ్రీ భావనారాయణ స్వామి సంస్కృత కళాశాల విద్యార్థులు ఇట్లనిరి-

పట్టములెన్నొ గట్టుకొని ప్రాభవమందుట యీజగాన క
న్పట్టునుగాని నీపగిది పట్టములేకయు నిట్టు సూరి స
మ్మాట్టులందుకొలువ్విన సమంచితగౌరముంజెలంగెగా
దిట్టివుగాన యాంధ్రజయదేవ ! భవత్పదమెన్న శక్యమే

ఆశ్రయింపులు, ఆడంబరములు ఎఱుగని శాస్త్రిగారికి లోకము చూపిన కృతజ్ఞత ఈ యొకేయొక షష్టిపూర్తి సమ్మానము. ఆసమయమున "వ్రతానాముత్తమం వ్రతం" అన్నట్లుకాక హృదయములు విప్పి సమకాలిక కవి పండితగాయక శిఖామణులెల్లరు శాస్త్రిగారి సారస్వత సేవను వేనోళ్ళ కొనియాడిన సన్నివేశము అపూర్వ మనోజ్ఞము.

ఈసమ్మానము శాస్త్రిగారి వినయసంపత్తిని ద్విగుణీకృత మొనర్చిన దనుటకు ఉత్సవాంతమున చెప్పిన పద్యమే నిదర్శనము.

గురువుల్ మిత్రులునైన పండితకవుల్ గోత్రాత లిందెందఱో
కరుణన్నాయెడ జూపజేరిరి జగత్కల్యాణ సంధాయకుల్
తరణుల్ శ్రీ కవిసార్వభౌములు సభాధ్యక్షత్వముం గాంచిరే
జరితార్థత్వము గాంచితిన్ కృషిఫలస్థంబయ్యె భాషాద్వయిన్

అస్తమయము :

శాస్త్రిగారికి షష్టిపూర్తి సమ్మానము అరువదిమూడవయేట జరిగెను. తరువాత వారెక్కువ కాలము జీవింపలేదు. ఆత్మకు, శరీరమునకు సంబంధమును త్రెంచి, అంతర్ముఖులై కళాతపస్సు సాగించిన ఋషి జీవనులైనను, ఎడతెగని లౌకికజీవనపు పోరాటమున కాలము వారిపై విజయముసాధించి బలహీనులను గావించుటచే శరీరము వ్యాధిగ్రస్తమయ్యెను. నీరు వ్యాధి సోకెను. అదియును పాదముల నుండి ప్రారంభ మయ్యెను. అట్లగుచో వ్యాధి తగ్గదని చెప్పుదురు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శరీరమెట్టి యవస్థయందున్నను సరస్వతీ సమారాధనమునకు అంతరాయము లేదు. వారి కదియే ఔషధము. విశ్రాంతి గైకొమ్మని అప్తులెంతచెప్పినను నిరంతర రచనా వ్యాసంగమునకు నిలుపులేదు. అసంపూర్ణరచన లనేకము ఈ కాలమున నారంభించినవే.

శాస్త్రిగారు మరునాడు అస్తమింతురనగా మంచము మీదినుండి లేవలేని స్థితిలో పరుండియే వ్రాసికొనుచుండిరి. వారి పెద్దయల్లుడు "మామగారూ! వ్యాధి యింత తీవ్రమై కదలలేనప్పుడు కూడ వ్రాయుట యేల? తగ్గిన తరువాత చూచుకొన వచ్చును విశ్రాంతి తీసికొనరాదా?" యని యడుగగా "శాస్త్రి ఇక రేపటినుండి అంతయు విశ్రాంతియే. నీవు వ్రాయమన్నను వ్రాయను నేడు నీవు మానమన్నను మానను" అనిరి.[1]

అన్నట్లుగానే ఆ మఱునాడు ఆఱవయేట కదలాడుట కారంభించిన లేఖిని అరువది యారవ యేట ఆగిపోయెను. విళంబి నామ సంవత్సర పుష్య శుద్ధ ఏకాదశినాడు (20-1-1959) ముక్కోటి దేవతలకు ప్రియమైనవేళ శాస్త్రిగారు శివైక్యము నందిరి. వారి జననము తొలిఏకాదశి పర్వదినము. అస్తమయము ముక్కోటి ఏకాదశి పుణ్యదినము. ఎంత ఉత్తమ జన్మము!

శాస్త్రిగారి జీవితప్రస్థానము మచ్చలేనిదైనను మరణసమయము వఱకు ఆగని లేఖినిలోని మషీరసము వారి కరాంగుళులకు మచ్చగూర్చెను. అ మచ్చయే కవి పండితగాయక రసజ్ఞలోకమునకు చీకటియయ్యెను. ఆ మచ్చయే హాటకగర్భురాణికి కాటుకకంటి నీరయ్యెను.

సౌజన్యాకర! భౌతికప్రకృతి యేచందంబునన్ నిల్వద
య్యా! జీర్ణంబగు నిట్టిదానికయి దుఃఖావేశమేలా? దృఢం
బై జీవాంశకలాప్రపూరితము నై అవ్యాహతంబై మహా
తేజోగోళమునందు నీదురుచి తృప్తింజేయదే దర్శిష్టకున్ [2]

---

1. ముఖాముఖి : శ్రీ పాతూరి వెంకటప్పయ్యశాస్త్రి.
2. శ్రీ వారణాసి రామసుబ్బయ్యను గూర్చి శాస్త్రిగారు చెప్పిన పద్యము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్వితీయము
అనువాదోల్లాసము

అనువాదము కత్తిమీది సాము. ఎవరికివారు స్వతంత్రముగా పలుకుట సులభతరము. ఒక కవి ఒక భాషలోవ్రాసి మెప్పించిన గ్రంథము మఱియొక కవి మఱియొక భాషలోనికి అనువదించి కృతకృత్యుడగుట కష్టసాధ్యము. ఆ భాషా సంప్రదాయములు సంస్కృతి, సామెతలు మున్నగునవి ఈ భాషకు; ఇచటి ప్రజలకు ఇంపుకూర్చునా? ఇచ్చటికి తగినట్లు మార్చినచో మూలమున కన్యాయము జరిగినదందురు. మూలమునకు దగ్గరగా పోయినచో ఇందులో డు, ము, వు; లు తప్ప ఇంకేమి క్రొత్త యున్నదని వెక్కిరింతురు. ఇది ఏమంత గొప్పయని యాక్షేపింతురు.

ఈ సరసోక్తి కావ్యమొక డిమ్ముల సంస్కృత భాష నచ్చుగా
జేసిన నట్లు వీడు మరి చేయుట యేటిది యంచుచెప్పగా
జేసి యనాదరంబురక చేయకుడీ విలుకాడు తూటుగా
నేసిన నందెపాఱమరి యేసిన వానిదె సూటి గావునన్.

అని 'సింహాసనద్వాత్రింశిక'లో 'కొఱవి గోపరాజు' పడిన ఆవేదన సర్వానువాదక సామాన్యము. విమర్శలకతని సమాధానము బాణనిశితము.

మూలము ముందుగా ప్రజా హృదయములందు ప్రవేశించి ప్రాభవమును పొందుటచే అనువాదము నెడల కొంత యనాదరదృష్టి సహజముగా నేర్పడును. 'అనువాదకుడు ద్రోహబుద్ధితో మిత్రుని వంచించెడు విశ్వాసఘాతకుడు' అను ఇటలీవారి కటూక్తి ఇట్టి దృష్టి నుండి సృష్టింపబడినదే. ఆకాశగంగను అవనికి తెచ్చిన భగీరథుని వలె స్వదేశీయుల విజ్ఞాన వికాసమునకై పాటుపడెడు అనువాదకునకు ఇట్టి బిరుదము నిచ్చుట అజ్ఞానమనలేము కాని అతివాదమనవచ్చును. ప్రపంచభాషలలో రచింపబడిన ప్రసిద్ధ గ్రంథములను యథాతథముగా పఠించుట జిజ్ఞాసువులందరకు సాధ్యము కాదు. అట్టియెడ అనువాదము లాదరణీయములే కాని తిరస్కరణీయములు కావు. కావుననే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉభయభాషా స్వరూపంబు నుద్దియెఱిగి
శ్రోతకునవాభిరుచి కల్గ చొప్పెఱింగి
అనువదించిన శ్రీ నన్నయాది కవుల
సర్వతంత్ర స్వతంత్రుల సంస్తుతింతు

అని శాస్త్రిగారు నన్నయాదులను స్తుతించిరి.

శ్రీమదాంధ్ర గీతగోవింద కావ్యము
హంసలదీవి ప్రభావము
శ్రీ దేవి
చాణక్యనీతి దర్పణము
శ్రీ లక్ష్మీనారాయణ శరణాగతి స్తవము
శ్రీకృష్ణప్రబోధము
ఔచిత్య విచార చర్చ
వాయుపురాణము

అను ఎనిమిది అనువాదములలో వాయుపురాణము అలభ్యము. మిగిలిన ఏడింటిని ఈ యుల్లాసమున ననుశీలింతును.

—*—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీమదాంధ్ర గీతగోవింద కావ్యము

గీత గోవింద ప్రశస్తి :

గీత గోవిందమందలి గీతి సాహితీ మోహనత్వమును కీర్తించుటకు సంగీత సాహిత్య నాట్య శాస్త్ర మాత్ర వైదుష్యము చాలదు. అది యొక అలౌకిక సృష్టి. ఆనందామృత వృష్టి. శాస్త్రాతీత చైతన్యము, అనిర్వచనీయ మాధుర్యము, అతిలోక సౌందర్యము వేయి రేకులుగా విరిసిన వికచారవిందమే గీత గోవిందము. భక్తి దానిలోని మకరందము. భాగవతులు భ్రమరద్భ్రమర బృందము. ఇదియొక యుద్ధవీరుడు బాహుబలముకొలది విసరిన శస్త్రము వలె ప్రతిభా వ్యుత్పత్తి సముపేతుడైన సత్కవి సంతరించిన సాధారణ మహా కావ్యముకాదు. తీవ్ర దీక్షా తపః పచేళిమాకారుడైన మహావీరునకు ప్రత్యక్షమైన దివ్యాస్త్రము వలె దైవీ శక్తి ప్రచోదితుడైన మహాకవి ప్రసరించిన మంత్రపూతమైన మంద్రగానము. శ్రీ కృష్ణ భగవానుని వంశీనాదమీ కావ్యమునకు శ్రుతి. జీవాత్మల రతిహాస శోకాది వికారములు లయ. జయదేవునకు అందిన తత్త్వ రహస్య మహః ప్రసారము అక్షర రూపమున గీత గోవిందముగా వ్యక్తమయ్యెను. వేదోపనిషత్సారము ఇందు కాంతా సమ్మితముగా నుపబృంహింపబడినది. కావుననే దేశ కాలాద్యనవచ్ఛిన్నమైన దివ్యకీర్తి లభించినది. గాయత్రీ మంత్రాక్షర సంఖ్యాకములైన ఇరువది నాలుగు అష్టపదులును, తొంబదిరెండు శ్లోకములును గలిగి పరిమాణ ప్రమాణమున నొక లఘుకావ్యమాత్రమగు రచనతో జయదేవుడు సంస్కృత సారస్వత మహాశైల శిఖరమున జయకేతనము నెగురవైచి అతి కాళిదాసమై విలక్షణమైన యశోలోకము నొకదానిని సృష్టించుకొనినాడు.

పరమాత్ముడు తనకే చెందవలెనని రాధాది జీవాత్మ లెట్లు తహతహ పడినవో అట్లే ప్రపంచ భాషలలోని కవులెల్లరు గీత గోవిందాకర్షితులై దానిని తమతమ భాషలలోనికి అనువదించుకొని ఆనందించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గీత గోవింద ప్రత్యేకత

అష్టపదులు :

గీత గోవింద ప్రశస్తికి అష్ట పదీ గీతములు ప్రాణ భూతములు. జయదేవుని అష్టపది జగద్ధిత జాహ్నవీ నది. గీత గోవిందములోని గేయములను అష్టపది అను పేరుతో జయదేవు డెచ్చటను పేర్కొనలేదు. ఎనిమిది పాదములు నియతములై యుండుటచే రసజ్ఞులు వాని కట్టి నామమును ప్రసిద్ధమొనర్చిరి. 'శృంగార రసమయమై రాగతాళ సిద్ధమైన రచనకు పదము అను సంకేత నామము వాడుట సంగీత రసికుల సంప్రదాయమైనది*.' అని శ్రీ రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మగారి నిర్వచనము.

ఘనత మీరంగ జయదేవ కవివరేణ్యు
దండమైనట్టి గీత గోవింద మందు
అంచితాష్ట పదులు పర్కె, నట్ల పదము
పరగు నెనిమిది పదములు పల్లవియును**

అని అన్నమాచార్యుడు పద లక్షణ నిర్ణయమునకు అష్టపదులను ఆదర్శములుగా స్వీకరించెను.

జయదేవుడు ధాతు మాతు సమన్వయ పూర్వకముగా సంగీత సాహిత్య నాట్య రహస్యములకు ఆటపట్టులును, మధురభక్తి తత్త్వమునకు ఆయువుపట్టులును, పరమాత్మని జేర్చెడు పైడి మెట్టులును అగు ఇరువది నాలుగు అష్టపదులను అనుకార్యముగా రచించి యుండుట యందే గీత గోవింద ప్రతిష్ఠ తొంబది పాళ్ళు వెలుగొందుచున్నది.

తత్త్వావిష్కరణము :

తాత్త్వికనైపథ్యము లేని గీత గోవిందము తావి లేని పూవు. తీపి పూత

---

* క్షేత్రయ పద సాహిత్యము (సాహిత్యోపన్యాసములు), ఆంధ్రప్రదేశ్ సా. అ. పుట. 12.

** అందే, పుట. 53,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూసిన యౌషధ గుళికవలెనది ముముక్షు గమకమైన రిరంసా కళిక. అట్లుకానిచో శృంగారము ముదురు పాకమున పడిన మామూలు కావ్యములలో చేరియుండెడిది. విశిష్టాద్వైత సిద్ధాంత సిద్ధమైన మధుర భక్తి మార్గమున భగవంతుని పురుషునిగా భక్తులను స్త్రీలుగా భావించి యొడలు పులకింపగా మాధవుని పాడిన తీపి పాటయే గీత గోవిందము. ప్రకృతి పురుషుల ప్రేమాకృతియే ఈ కృతి.

రాధలోని ఈర్ష్య, అహంకారము. స్వార్థము నశింపనంతవఱకు భగవంతుడామెకు చిక్కలేదు. అనుగ్రహింపలేదు. ఆ జీవలక్షణము లన్నియు శమించి మౌక్తిక స్వచ్ఛమైన మనోవృత్తియందు సర్వ సమర్పణ భావము స్థిరమైనంతనే పరమాత్ముడామెతో రమించినాడు. పద పల్లవ దాసుడైనాడు. 'త్వమేవ శరణంమమ' అని ఆర్తి చెందిన జీవునిపై భగవానుడు తన వెలుగును ప్రసరింప చేయుటయే గీత గోవిందములోని అంతస్సూత్రము.

దుర్గమారణ్య మధ్యమున తిర్యగ్రక్షణముగా వ్యక్తమైన గజేంద్రమోక్ష గాథయే సుందర యమునా తీరోపవనములలో సుమచిరముగా పునరావృతమైనది. ఆపన్న ప్రసన్నుని ఆర్తావనత్వమునకు ఉపాధి భేదము లేదు. ప్రపత్తి భక్తుని యొద్ద నున్నచో పరమానుభవ సంపత్తి నిస్సందేహముగా నాతడిచ్చును.

ఏవం విధ సర్వ రహస్య సమాహారమును "సంచి మొదలు"గా నిడికొని జయదేవ మహాకవి లలితకళా వ్యాపారమున అపారమైన యశోలాభమును గడించినాడు.

శృంగారము :

జయదేవుడు తన కృతిని శృంగార వివేక తత్త్వ రచనా కావ్యముగా పేర్కొనినాడు. శృంగారరసమున కిది యొక లక్ష్య గ్రంథము. ఆలంబనోద్దీపనాది విభావములు, అనుభావములు, అవస్థలు, నాయికా నాయక భేదములు, విప్రలంభ సంభోగ విభాగములును ఇందు విశేషముగ పోషింపబడినవి. తత్సర్వమును భగవంతునియందు పర్యవసించెను. గీత గోవిందమున శృంగారము అతి వేలముగా వర్ణింపబడినదను విమర్శ లేకపోలేదు. జయదేవుని పదముల నుండి ప్రేరణ పొందిన అన్నమయ్య, క్షేత్రయ్య మొదలగు తెలుగు పదకర్తల పదములలో శ్రుతి మించిన శృంగారము ఈ విధమైన మధుర భక్తిని విమర్శలకు గుఱి చేసినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"కృష్ణుని పరమాత్మగా, గోపికలను జీవాత్మలుగా అలంకారికముగా సమన్వయించి సమర్థించుకొనుచున్నాము, మనము ఇంద్రియానందమును దైవ తత్త్వముగా వ్యాఖ్యానించుచున్నామో, భూమిని స్వర్గమునకు గొనిపోవుచున్నామో. స్వర్గమును భూలోకపంకమునకు ఈడ్చుచున్నామో సందేహభాజనమగు విషయము.*" అని కట్టమంచి రామలింగారెడ్డిగారి విమర్శనము. అట్టి విమర్శలకు ఆఖండల శస్త్రతుల్యమువైన సమాధానములు కూడ లభించినవి.

'శృంగారము, భక్తి రెండు భావములున్నవి. జయదేవుని విషయములో నీ రెంటిలో నేది యధికముగా నున్నదన్న ప్రశ్నవచ్చును. స్థూల దృష్టికి శృంగారమన్పించును. ఒక సూక్ష్మమైన భక్తి భావము లేని వానికి జయదేవుని యందు భక్తి భావము స్ఫురించుట కష్టము. మరియు మనకు విద్యమానమగుచున్న జయదేవుని జీవిత కథా సందర్భములను బట్టి యాయన యొక్క భక్తి యతని కావ్యగత శృంగారమనిన పుష్పమునందలి సుకుమారమైన పరిమళ మన వచ్చును.** అని విశ్వనాథవారి వ్యాఖ్యానము.

'మానవ మనోవృత్తి తరంగిణిలో భక్తిరక్తులు రెండును రెండు పాయ లయ్యు జతగా ప్రవహించుచుండుట పెక్కుచోట్ల గానవచ్చుచుండును.***

అని దివాకర్ల వేంకటావధాని గారి సమన్వయము.

ఏవం విధ విశిష్ట లక్షణ లక్షితమైన జయదేవ కృతికి శాస్త్రిగారి అనువాద మునకు పూర్వము సుమారు పది అనువాదములు తెనుగున వెలసినవి. వానిలో రాజా వేంకటాద్రి అప్పారావుగారు మాత్రమే గేయములను గేయములుగా అనువ దించిరి. అన్ని అనువాదములుండగా మరల శాస్త్రిగారు దానిని అనువదించుటకు ఏల పూనుకొనిరి? వారి యనువాదము సర్వోత్తమమని కవిపండితులచే కొనియాడ బడుటకు కారణము లేవి? యనునది పరిశీలింపవలసి యున్నది.

'జయదేవుని కవితామాధుర్యము, శబ్దశక్తి, అలంకార వైచిత్ర్యము, వర్ణనా ప్రావీణ్యము, చమత్కార సౌందర్యము మొదలగు సద్గుణముల నన్నిటిని

---

* క్షేత్రయ పదసాహిత్యము, పుట. 51.

** రాధామాధవమ్ పీఠిక, గుంటూరు, రాజ్యశ్రీ కల్చరల్ బుక్ రైటర్స్, పబ్లిషర్స్, 1965,

*** క్షేత్రయ పదసాహిత్యము, పుట. 32,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారి అనువాదములో చూడగలము. ఆంధ్రమున దీనికి సాటి యగు ననువాదము లేదనుట కేవలము సాహసమనుట తగదు'

అని శ్రీ వైద్యుల కృష్ణారావుగారు తమ జయదేవుని గీత గోవిందము — అనువాదములు అను పరిశోధన నిబంధమున తీర్మానించిరి. (పుట.314)

అనువాద ప్రణాళిక :

లోకములో గీత గోవిందమునకు ఎంతటి ప్రశస్తి యున్నను చంద్రునిలో మచ్చవలె శృంగారమును గూర్చిన విమర్శ విన్పించుచునేయున్నది. అజ్ఞానులు దానిని రతికేళి కథా సమేతమైన రచన యనియే భావించుచున్నారు. జయదేవుడు తత్త్వమును అంతర్వాహినిగా నుంచినాడు. శృంగారము పైకి విస్పష్టముగా నగుపించుచున్నది. శాస్త్రిగారొనరించినది. అస్వతంత్రానువాదమే అయినను ఒక్కింత శృంగారమును గుప్తమొనర్చి, తత్త్వరూపము కించిద్బహిర్వ్యక్తము చేయ దలచినట్లు తోచుచున్నది. భక్తునిగా జయదేవ కృతిపట్ల వారిది తత్త్వప్రధాన దృష్టి. కవిగా రసదృష్టి. జయదేవుని ప్రణాళికకు భంగము రాని రీతిలో అతనిపై గల అపవాదమును తన భాషలో యథాశక్తి తొలగించుటకు కృషిచేసిరి. దానికై వారు ఆరంభశ్లోకములను, అష్టపదులలోని ఎనిమిదవ పాదములను. 'శృంగార వివేకతత్త్వ రచనా కావ్యేషులీలాయితం' [శ్లో : 90] అను జయదేవ వాక్యములోని అంతరార్థమును ఆధారముగా చేసికొనిరి. మరికొన్నిచోట్ల కొంత స్వంతంత్రించిరి. వానిని పరిశీలింతము.

ఆరంభ శ్లోకములు :

మంగళాచరణమైన 'మేఘైర్మేదుర మంబరం' అను శ్లోకమున చతుర్థ పాదమున 'రాధామాధవయోః జయంతి యమునా కూలే రహః కేళయః' అనుదానికి 'నెమ్మింగేళి చరించు రాధ హరియున్ నిండించుతన్ ప్రేమమున్' అని అనువాదము. 'రహః కేళి' 'కేళి'గా 'రాధా మాధవయోః' 'రాధహరియున్'గా అనువదింపబడి శృంగార భావము నొక్కింత చాటు చేయుచున్నవి.

వాగ్దేవతా చరిత చిత్రిత (శ్లో : 3) అను శ్లోకమున 'శ్రీ వాసుదేవ రతి కేళి కథా సమేతం' అను పాదమును శాస్త్రిగారు అనువదింపలేదు. ఈ ఒక్కచోట తప్ప మరెచ్చటను శాస్త్రిగారు మూలమును విడువలేదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యది హరిస్మరణే సరసం మనో (శ్లో : 4) అను శ్లోకమున 'విలాస కలాసు' అను సమాసమును శాస్త్రిగారు ద్వంద్వముగా గ్రహించి 'కలలను విలాసముల' అని చమత్కరించిరి. 'శ్రుణు' అను దానిని 'సుజన! వినుము' అని అనువదించి సౌజన్యమును శ్రవణాధికారముగా నిర్ణయించిరి.

అష్టమపద విశిష్టత :

అష్టపదులలో ఎనిమిదవ పాదమును జయదేవుడు స్వీయ ముద్రాదులకై వాడుకొనెను. ఆ పాదమునకు కావ్యకథతో సంబంధము లేదు. ఎనిమిదవ పాదము ననువదించు సందర్భములలో కొన్నిచోట్ల శాస్త్రిగారు స్వతంత్రించి తాత్త్వికభావములను ప్రవేశపెట్టిరి.

శ్రీ జయదేవ భణిత మిద మతిశయ మధురిపు నిధువనశీలం
సుఖముత్కంఠిత గోపవధూ కథితం వితనోతు సలీలం
(అష్ట : 6)

రచియించెను జయదేవుడు రాధారమణీ కథితమ్మున్
ప్రచురానందద లీలల శ్రీహరి రతిసుఖమును ప్రథితమ్మున్

నిధువన=రతి, సుఖమ్=ప్రచురానందము మొదలగు అనువాదములోని పదములు ఆధ్యాత్మికముగా అధిక గౌరవము కలవి. నిధువన శబ్దమునకు సంభోగమే అర్థము. రతి యనుదానికి అనురాగము పరస్పరాకాంక్ష, ఐక్యమగుట అను నర్థములు కలవు. సుఖ శబ్దము కేవల భౌతిక నిర్వృతి సందర్భమున నుపయోగింపబడుచుండును. దేని ననుభవించిన వెనుక దుఃఖము కలుగదో దానిని ఆనందమని అధ్యాత్మవిదులు వ్యవహరింతురు. 'రసమ్ హ్యేవాయం లబ్ధ్వా ఆనందీ భవతి' ఇత్యాది శ్రుతి వాక్యములందు దీనిని మనము గమనింపవచ్చును.

శ్రీ జయదేవ భణిత మిద మధికం యది మనసా నటనీయం
(అష్ట : 8)

కవి జయదేవుని పలుకమృతమ్మని జ్ఞానులు మీరెద దలపన్
'అమృతము' 'జ్ఞానులు' అమూలకమైన పెంపులు.

ఇట్లే 3, 7, 11, 15, 16, 20, 22, 23 అష్టపదుల అష్టమ పాదములు తత్త్వోన్ముఖముగా నున్నవి యథాతథముగా ననువదింపబడెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శృంగార వివేకము :

మూలమునందలి 'యద్గాంధర్వకలాసు' అను శ్లోకములోని 'యత్ శృంగార వివేక తత్త్వరచనా కావ్యేషు లీలాయితం' అను పాదము నుండి శాస్త్రి గారు ఒక రహస్యమును గ్రహించిరి. విద్యానాథునికి పూర్వము అలంకార శాస్త్ర విషయములను ఒక నాయకుని యందు ఆరోపించి చెప్పినవారు లేరని అతడు తన ప్రతాపరుద్రీయ పీఠికలో చెప్పియుండెను. అట్టి అలంకారిక రచనలలో ప్రతాప రుద్రీయమే ఆద్యము. విద్యానాథునికి కించిత్పూర్వుడైన జయదేవుడు శృంగార రసమును గైకొని దాని సామగ్రిని, ఉత్పత్తి వికాసములను భగవంతునియందు పర్యవసింపచేయుచు నొక కావ్యముగా రచించి దానిని శృంగార రస లక్ష్య గ్రంథముగా నిలుపనెంచెను. అట్లనుటకు మూలము నందనేక సాక్ష్యములు కలవు.

కావ్య ప్రారంభమునందే -

శృంగారస్సఖి ! మూర్తి మానివ మధౌ ముగ్ధో హరిః క్రీడతి' (11) అని సూచింపబడినది.

శాస్త్రిగారు జయదేవుని సూచనలను గ్రహించి పఠితలకు ఆ సంగత స్పష్ట మగునట్లు కొన్ని యెడల స్వతంత్రించి రసపరిభాషలను బహిరంగపరచిరి. అట్లు చేయుట వలన ఇది దూష్యమగు శృంగార కావ్యము కాదనియు శృంగార రస లక్ష్యగ్రంథమనియు తెల్లమయి జయదేవుని అంతర్యము ఆవిష్కృతమగును.

సా రోమాంచతి సీత్కరోతి (శ్లో : 29) అను శ్లోకమునకు అనువాద మైన 'పెలుచ గగ్గురుపాటు గలుగుట సీత్కృతుల్' అను సీసపద్యమున 'పది యవస్థలు క్రమముగా ప్రకటములుగ' - అనునది అమూలకము. ఇట దశావస్థలు పారిభాషికములుగా చూపబడెను. అట్లే 'ఆశ్లేషా దనుచుంబనా దనునఖోల్లే ఖాది' త్యాది శ్లోకమున (శ్లో : 39) రసములు గుప్తములు కాగా

బిగికౌగిలింతల దగు భయానకమున
నునుచుముద్దుల గరుణ స్ఫురణను

అను అనువాదమున ఆ ముడి విప్పబడినది. ఇట్టి కృషిలో శాస్త్రిగారికి సహృదయాది వ్యాఖ్యలు తోడ్పడినట్లు తత్పశీలనమున తెలియుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తత్త్వ వికాసము :

జయదేవుని తత్త్వస్ఫూర్తిని శాస్త్రిగారు కొన్ని తావుల విస్పష్టమూర్తిగా మలచి తమ లక్ష్యమును సాధించిరి.

కంసధ్వంసన ధూమకేతు రవతు త్వాం దేవకీనందనః (శ్లో : 41) అను మూలమునకు

దుష్ట కంస లయోద్వోధి తోకచుక్క
తుష్ట యోగిమనంబుల తోచువెలుగు
దేవకీ వసుదేవుల భావఫలము
స్వామి కలకాలమును మిమ్ము నోముగాత — ఈ

యనువాదమున ద్వితీయ చరణము అమూలకము.

రసజలధి నిమగ్నా ధ్యాన లగ్నా మృగాక్షీ (శ్లో : 43)
'ధ్యానయోగము హత్తి రసాబ్ధి మునిగె'
దదతు స్ఫీతాం ముదాం సంపదం (శ్లో : 89)

'అద్వయ సుఖాబ్ధి వీచినోలాడు గాత' మొదలగు తావులనీ తత్త్వ వికాసమును గమనింపగలము.

గీతానువాదము :

అష్టపదులను గేయరూపముగా ననువదించిన వారెందరో లేరు. లభించుచున్న అనువాదములు రెండింటిలో నొకటి పిచ్చయ్య శాస్త్రిగారిది. శాస్త్రిగారి అనువాదములో రాగతాళములు యథామూలముగా సూచింపబడగా రాజావారి అనువాదమున అట్టిది గోచరించుట లేదు.

రాజావారికి లభించిన మూలప్రతి ఎచటిదో గాని ప్రతి గేయమునందును తాళావృత్తి పదములు కల్పింపబడినవి. అనువాదము నందును అవి పాటింపబడినవి. దానివలన గానమునకు లభించినంత ఆనుకూల్యము అభినయమునకు లభింపకపోవచ్చును. అంతేకాక ఆ పదములు మూలమునకు అనువాదములు కాక స్వతంత్రములై యున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారు రాజావారి యనువాదమును కూడ పరిశీలించి యుండుటచే కాబోలు గానాభినయ నృత్యములకు అనుకూలముగ యథామూలముగ అనువదించి 'జయదేవుడే తన గీత గోవిందమును తెలుగున రచింపగోరి మీ రూపమున జన్మించెను. మీ యనువాదము మహోన్నతముగా నున్నది*' అని రాజావారి ప్రశంసల నందుకొనిరి.

ఇంతవరకును శాస్త్రిగారి గీత గోవింద అనువాద ప్రణాళికను, ఆరంభ సామర్థ్యమును, అంతర్యమును దర్శించుట జరిగినది. ఇది తదితరానువాదములతో వారి అనువాదము యొక్క ప్రత్యేకతను సూచించు పరిశీలనము.

అనువాద పరిశీలనము

నైషధానువాద ప్రణాళికయే కావ్యానువాద సామాన్య ప్రణాళికగా పేర్కొనబడుచున్నది. తదనుసారముగా శాస్త్రిగారి అనువాదమును పరిశీలింతము.

శబ్దాను సరణము :

మూలమునందలి పద సమాసాదులను రమ్యత్వ ప్రౌఢత్వాది ప్రయోజనముల నాశించి యథాతథముగా ననుసరించుట శబ్దానుసరణము.

మూలము	అనుసరణము
మధుర కోమల కాంతపదావళీం	మృదుమధుర కాంతపదముల
కేశవ ! ధృత మీన శరీర !	కేశవా ! ధృత మీన శరీర !
విలపతి రోదితి వాసకసజ్జా	వాసకసజ్జయై సిగ్గెడయగ
కిం విశ్రామ్యసి కృష్ణభోగిభవనే	అన్నా!నిల్వకు కృష్ణభోగిభవనంబామట్టి

ఏదియో ప్రత్యేక ప్రయోజన మున్నపుడు మాత్రమే శాస్త్రిగారు శబ్దమును అనుసరించిరి. మూలములోని దీర్ఘ సమాసములకు దుముపులు చేర్చు ప్రయత్నము చేయక జయదేవుడు సంస్కృత మాధుర్యముతో నింపిన సమాసములను అభినవ జయదేవులు తెనుగు తీయందన ముట్టిపడునట్లు దీటుగా ననువదించిరి.

---

* ముఖాముఖి - శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి, (శాస్త్రిగారి ప్రియశిష్యులు) సజ్జా వారి పాలెం, గుంటూరు జిల్లా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భావోపలక్షణము :

'మూలశ్లోకమును బీజప్రాయముగా గైకొని దానినొక పుష్పితవల్లి నోలె స్వకల్పనతో పెంచుటయే భావోపలక్షణము*' అని శ్రీ పింగళి లక్ష్మీకాంతము గారి నిర్వచనము.

మూలము :

హస్తప్రస్త విలాస వంశ మనృజు భ్రూవల్లి మద్వల్లవీ
బృందోత్సారి దృగంత వీక్షిత మతిస్వేదార్ద్ర గండస్థలమ్
మా ముద్వీక్ష్య విలజ్జితం స్మితసుధా ముగ్ధాననం కాననే
గోవిందం వ్రజసుందరీ గణవృతం పశ్యామి హృష్యామిచ॥

(శ్లో : 18)

అనువాదము :

రత్నాంగుళీయక రమణీయ కరపద్మ
మునసుండి మోహన మురళి జాటె
నిగనిగ జిగిడాలు నిలువనీడలు గూర్చు
చెక్కుటద్దమ్ముల జెమరు వొడమె
గనుబొమలొయ్యారమున ద్రిప్పి పొందు పొం
దని ప్రేతలకును సన్నల బొనర్చె
దంత కుట్మలముల దాచిన డాగక
చిఱునవ్వు వెన్నెలల్ చెంగలించె
సన్ను గనునంత బృందావనమ్ము పొంత
లజ్జ జెందుచు గోపవిలాస వతుల
నిలుచు గందోయి యెదుటను గలుగు హాయి
యెనయ జేరదు చెలి ! తలయెత్తు జింత

ఇట హస్త, గండస్థల, స్మిత అనుమూలపదములకు అనువాదమున జరిగిన పెంపు స్పష్టము.

---

* డా॥ కొర్లపాటి శ్రీరామమూర్తి, శ్రీనాథుడు, పుట. 578.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రస పోషణము :

మూలమునందలి అంగ్యంగ రసములను ప్రతిబింబ మాత్రముగా కాక స్వతంత్రి కల్పనాదులతో సజీవముగా సంతరించుటను రసపోషణ మనవచ్చును.

దోర్భ్యాం సంయమితః పయోధర భరేణాపీడితః పాణిజై
రావిద్ధో, దశనైః క్షతాధర పుటః, శ్రోణీతటేనాహతః
హస్తేనా నమితః కచే 2 ధరసుధా స్యందేన సమ్మోహితః
కాంతః కామపి తృప్తి మాపతదహో! కామస్య వామా గతిః॥

(శ్లో : 83)

ఈ శ్లోకమునందలి సంభోగశృంగారము ఎంత సజీవముగా అనువాదమున పోషింపబడినదో చూడుడు -

బిట్టు కౌగిట గ్రుచ్చిపట్టి పాలిండ్ల ప్రే
గునను బేరురము నెక్కానగ జేసి
నలువంక గోటివంకలు నెలకొల్పి వ
ల్నొక్కుల కెమ్మోవి జిక్కువఱచి
పిఱుదుల న్దరులచే నొఱపిడి ఘటియించి
నెఱులందు కరముంచి శిరము వఱచి
సారమై చక్కెర చవి గేరు కెమ్మోవి
క్రొందేనియను గైపు కొల్పి తనిపి
నాయకాగ్రేసరుని జగన్నాథు నాథు
గృష్ణునంతటి వాని నట్టిట్టు చేసె
పలుకుబడి కందరాని గొప్ప సుఖమొకటి
యేమనందగు గాముని వామకలన

అలంకార భూషణము :

మూలము నందలి యలంకారములను యథాతథముగా పోషించుచు వన్నె పెట్టుట, క్రొత్తవానిని కల్పించుట అలంకారభూషణ మన్పించుకొనును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మూలము : పద్మా పయోధర తటీ పరిరంభ లగ్న
కాశ్మీర ముద్రిత మురో మధు సూదనస్య
వ్యక్తానురాగ మివ ఖేల దనంగ ఖేద
స్వేదాంబుపూరమనుపూరయతు ప్రియం వః (శ్లో : 6)

అను నీ శ్లోకమున ఉత్ప్రేక్షాలంకారమున్నది.

కమల కౌగిట నొత్తిడిం గ్రిమ్మ చనుల
కుంకుమపు పూత ప్రికట రాగాంక మట్లు
కలయికం దోచు చెమరుబ్బు కమలనయను
కలకు బంగారుటుర మిడుం గాత సిరులు

ఈ యనువాదమున 'ఉరః అనునది 'కలకు బంగారు టురమై' 'అను పూరయతు ప్రియం వః' అనునది 'ఇడుంగాక సిరులు' అయి మూలమున లేని పరికరాలంకారము ఏర్పడినది.

ఔచిత్యాదరణము :

ఉచితం ప్రాహురాచార్యాః సదృశం కిల యస్యతత్
ఉచితస్య చ యో భావః తదౌచిత్యం ప్రచక్షతే - అని ఔచిత్య లక్షణము.

ఔచిత్యమే కావ్యమునకు ప్రాణము వంటిది. ఇది క్షేమేంద్రునిచే ఇరువది యారు విధములుగా వింగడింపబడినది. మూలమునందలి ఔచిత్యమును గ్రహించి ఆదరించుట ఔచిత్యాదరణము.

'నకురు నితంబిని ! గమన విలంబన' మను చోట (అష్ట: 11) 'హాయి గూర్చ సంకేతపదమ్మున కరుగు నితంబిని వేగ, చేయకు మాలస్యము 'అని చేసిన అనువాదమున 'నితంబిని' అను శబ్దము ప్రాముఖ్యము కలది. గమనవేగమునకు ఆటంకము కల్గించునవి గురునితంబములగుటచే ఆమెను 'నితంబిని'యని మూలకారుడు సంబోధించుటలోని ఔచిత్యము అనువాదమున పాటింపబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనౌచిత్య పరిహారణము :

మూలకర్తలు అనౌచిత్యములు చేయుదురని అనువాదకులు వానిని పరిహరింతురని సర్వదా భావించుట పక్షపాతమే యనదగును. దేశకాలములు, అభిరుచి భేదాదులు, అనువాదకుని ప్రజ్ఞాశక్తి, కారణములుగ మూలములోని కొన్ని తావులు అనుచితములుగా కన్పట్టి వానిని పరిహరింపవలసివచ్చును. అంతేకాని మూలకారునకంటె అనువాదకుడెన్నడును అధికజ్ఞాని యని చెప్పజాలము.

'వాగ్దేవతాచరిత' ఇత్యాది శ్లోకములోని 'శ్రీవాసుదేవ రతికేళి కథాసమేతం' అను పాదమును పిచ్చయశాస్త్రిగారు అనువదింపలేదు. కావ్యారంభములోనే కవి స్వయముగా రతికేళికథ యని ప్రతిజ్ఞ చేసినచో స్థూలబుద్ధులు అంతర్యమును గ్రహింప నేరరను ఆశయముతో అనుచితముగా నుండునని వారట్లు చేయుట వారి పరిజ్ఞానికకు అనుగుణము. అట్లే తొట్టతొలి 'మేఘైర్మేదుర' మను శ్లోకమున 'రాధామాధవయోః జయంతి యమునా కూలే రహః కేళయః' అనుపాదమును శాస్త్రిగారిట్లు వ్రాసిరి.

'నెమ్మిం గేళి చరించు రాధహరియున్ నిండించుతన్ ప్రేమమున్'

'రహః కేళి' శ్రోతలను పెడత్రోవ పట్టించునని 'కేళి'గా మార్చిరి. రాధామాధవులను సిద్ధసమాసము చేయక 'రాధహరియున్' అని కొంచెము ఎడముగా నుంచిరి. 'రహః కేళయః జయంతి' అనువస్తు నిర్దేశము అనువాదమున 'నిండించుతన్ ప్రేమమున్' అను ఆశీస్సుగా మారినది.

ఇట్లు మూలముననుసరించుచునే ఆయాచోట్ల తగు విధమునైన మార్పు చేర్పులతో సాగిన శాస్త్రిగారి గీతగోవిందానువాదము దిక్ప్రదర్శనముగా ననుశీలింపబడినది.

తెలుగుదనము :

శ్రీ శాస్త్రిగారి గీత గోవిందానువాదములోని మరియొక విశేషము తెలుగుదనుల కూర్పు.

పతతి పతత్రే విచలతి పత్రే శంకితభవదుపయానం
రచయతి శయనం స చకిత నయనం పశ్యతి తవ పంథానం

(అష్ట - 4 - పాద 3)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈక రాలినను నాకు కదలినను నీవటు దెంచితీవనుచున్
పోకలు వింతగ దలిరుల సెజ్జను బొనరుచు నీదెసగనుచున్

పై అనువాదమున మూలమునకు దీటైన మెత్తని తెలుగు పలుకులు వీనులకు విందుగూర్చును.

'మేఘైర్మేదుర మంబరం వనభువశ్శ్యామా స్తమాలద్రుమైః'

అను శ్లోకమునకు

'క్రిమ్మెన్ మబ్బులు మింట మెండుగ వనుల్ కానుంగుల్గనొప్పెనున్'

మొదటైన అనువాదమున ద్విత్వసంయుక్తాక్షరములగు అచ్చతెనుగు పదములనుపయోగించుట వలన మేఘముల సాంద్రత, సమస్య యొక్క తీవ్రత ధ్వనింప చేయబడినవని శ్రీ అంబటిపూడి వెంకటరత్నంగారు ద్వితీయ ముద్రణలో చేర్పబడిన అభిప్రాయములలో పేర్కొనిరి.

ఉపసంహారము :

జయదేవుని స్పృశించుట ఎంతటి కవికైనను సాహసకార్యమని చెప్పక తప్పదు. మూలములోని లాలిత్యమును సంపాదించుటకు జయదేవుడే రావలయును. సంస్కృత భాషయే కావలయును. ఆ శైలి పువ్వురేకు పైని హిమ బిందువు వంటిది. అది దర్శనీయమే కాని స్పర్శనీయముకాదు. కావున అట్టి కృతి యొక్క అనువాదములను పరిశీలించునపుడు దేశభాషల పరిధి నెఱిగి స్వతంత్ర దృష్టితో చూడవలయును. అట్లు చూచినచో శాస్త్రిగారి అనువాదము జయదేవుని సర్వవిధముల తెనుఁగులోనికి తెచ్చుట తెల్లమగును. జయదేవుని కృతి ఎఱ్ఱగా కాగిన కమ్మని పాల వంటిదైనచో శాస్త్రిగారి అనుకృతి గట్టిగా తోడుకొన్న తియ్యని పెరుగు వంటిదని చెప్పవచ్చును.

శ్రీ వైద్యుల కృష్ణారావుగారు తమ సిద్ధాంతవ్యాసమున ఇట్లనిరి-

మూలమునకు కొన్నిచోట్ల విధేయముగను కొన్ని తావుల వ్యాఖ్యాన ప్రాయముగను మరికొన్ని తావుల స్వతంత్ర భావకల్పనల తోడను. అనన్య సామాన్యముగా జాతీయములతో తెనుగుదనముట్టి పడునట్లు గీత గోవింద కావ్యము ననుసరించిన కవిసమ్రాట్టులు శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు అభినవ జయదేవులే.

* జయదేవుని గీత గోవిందము - అనువాదములు, (పుట. 337)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హంసలదీవి పరిభావము

స్కాందము సర్వతీర్థ మాహాత్మ్య వర్ణనములకు మూలకందము. శ్రోతృ ముని బృందము లానందమున నోలలాడునట్లు కథాసుధాసరిత్సాగరుడు సూతమహాముని ముముక్షువరేణ్య శరణ్య మైన నైమిశారణ్యమున వ్రాసిన వాక్చిత్రములలో తీర్థక్షేత్రములన్నియు కన్నుల యెదుట ప్రసన్నములగును. బహూపాఖ్యాన శాఖోపశాఖాశోభా సముదంచితాభ్యుదయమై -

'పమధికస్ఫూర్తి నే పురాణములు సాటి
గరిమకందంబునకు మహాస్కాందమునకు'

అని శ్రీనాథ మహాకవిచే కీర్తింపబడినదీ పురాణము.

లక్షగ్రంథయుతం స్కాందం పంచాశత్ఖండమండితం
షట్సంహితాభేదయుతం పురాణం పావనం శుభం

అని సూతముని వచనము.

ఇట్టి పురాణములోని తీర్థక్షేత్రమాహాత్మ్యములను శ్రీనాథ మార్గమున తదనంతరకవులును తెలుగున కనువదించిరి. శాస్త్రిగారు రచించిన 'హంసలదీవి ప్రభావము' అట్టి అనువాదములలో నొకటి. ఇది సనత్కుమార సంహిత యందలి సహ్యాద్రి ఖండాతర్గత కృష్ణా మాహాత్మ్యమునకు స్వతంత్రానువాదము.

'మహామహిమ సంపన్నయగు శ్రీకృష్ణానదియొక్కయు, ఆమె సాగరమున సంగమించు వటికును, ఉభయతీరములందుగల ఆయా పవిత్రక్షేత్రముల యొక్కయు. సంగమించిన హంసలదీవి యొక్కయు అద్భుతమహిమలు ఈ గ్రంథమున చక్కగ వర్ణింపబడినవి. అయా ఘట్టములందు రసపుష్టికొఱకు కవి స్వతంత్రించి, చదువరులకు ఆనందమును బెంచెనేకాని, మక్కికిమక్కిగా ననువదించి రసానంద మును గుర్తించలేదు. అని శ్రీ కాశీ కృష్ణాచార్యుల తీర్మానము.

మూలమునందీకథ ఇరువది మూడధ్యాయములుగా సుమారు తొమ్మిదివందల యేబది అనుష్టుప్ శ్లోకములలో చెప్పబడగా మొత్తము అనువాదము నూట నలువది యైదు గద్య పద్యములతో ఏకాశ్వాసముగా తీర్చబడినది. వానిలో సుమారు డెబ్బది గద్య పద్యములు అమూలకములే. నన్నయాదుల పురాణాంధ్రీకరణ పద్ధతిలో మూలము కేవలము కథకు మాత్రమే ఆధారమై అనువాదము పరమ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వతంత్రముగా సాగి దాదాపు ఏడనవంతునకు తగ్గినది. కథాప్రాముఖ్యము లేని ఘట్టములు పెద్ద పెద్ద వచనములలో సంగ్రహముగా ననూదితములు.

కృష్ణానది యొక్క ఉత్పత్తి ప్రచార విశేషములను స్పృశించుచు బోయి కృష్ణాసాగరసంగమస్థానమగు హంసలదీవి క్షేత్రము యొక్క మాహాత్మ్యమును విశేషముగా నగ్గించుట అనువాదకుల అభిమతమైనట్లు గ్రంథనామమే తెలియజేయు చున్నది. గ్రంథములోని ప్రణాళికయు నట్లేయున్నది.

మూలానువాదానుశీలనము :

పురాణ ఫక్కికలో తీర్థముల పట్టికగా అశేష ఫలములను విశేష మహిమలను పదేపదే ఉగ్గడించు అనుష్టుప్పుల కుప్పగానున్న మూలమునందలి మూలసూత్రమును సూత్రప్రాయముగా గ్రహించి అనువాదకులు కావ్యపద్ధతిలో సంక్షిప్తసుందరముగా తను అనువాదమును వెలయించిరి. ఇవ్విధము శ్రీనాథుడు తీర్చిన ఘంటాపథమే కావచ్చును కాని కొన్ని తావుల అతి సంక్షేపణము ఒక్కింత ఆక్షేపణీయమగును. అయినను మొత్తము తీర్థముల మహిమల నుగ్గడించు విస్తృతానువాద ప్రణాళిక కాకపోవుటచేత, అనువాదము స్వతంత్ర మార్గమున సాగియుండుటచేత తత్తత్తీర్థముల విశేషలక్షణములను మాత్రమే స్పృశింపవలెనని అనువాదకుడు నిశ్చయించుకొనియుండును. కేవల భక్తులకు మూలము అధికఫల దాయకము. సాహిత్యానురక్తులకు అనువాదము ఆనందదాయకము.

సంక్షేపణము :

గోపాద తీర్థమాహాత్మ్యము అను పేరుగల నవమాధ్యాయమున పదుమూడు శ్లోకములున్నవి. వానిలో నారదవచనములు పోగా కామధేనువు చెప్పి అయిదు శ్లోకములిట్లున్నవి -

> యోఽత్ర స్నాత్వా నదీమధ్యే గోపాదేశం స్పృశేన్నరః
> గోవధాన్ముచ్యతే ఘోరాదుపవాసాత్ త్రిభిర్దినైః
> లోకానాం మాతరో గావస్తాం ద్రోహం చరంతి యే
> న తేషాం నిష్కృతిః కాచిత్ వినా గోపాదసేవనాత్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తాదయంతి శపంత్యేతః క్లేశయంత్య తికర్మణా
నిరుద్ధ్యంతి భవేత్తేషా పత్రిస్నానం విశోధనం
యో2త్ర స్నాత్వార్చయేల్లింగం మాసమేకం జితేంద్రియః
ఇహైశ్వరం సమాయాతి ప్రేత్య గోలోకమశ్నుతే
స్వపితృభ్యస్తు యోదద్యాత్ తిలమిశ్రాన్ జలాంజలీన్
కామధేనుర్దుహే తాంస్తు తేషానాశాపరిపూరణీ

గోపాద తీర్థ ప్రతిష్ఠమొత్తము కామధేనువుపై ఆధారపడి యున్నట్లు పైమూలము వలన తెలియుచున్నది. కామధేను వచనముల అన్నింటిని యనువదించినచో గ్రంథము విస్తరమగును. కావున 'గోపాద తీర్థంబు కామధేను ప్రభావ నిదానంబు. నేఁటికిని నంతర్ముఖులకు సురగవి సాక్షాత్కరించును.' అను రెండు వాక్యములలో తీర్థప్రాముఖ్యము తెలియునట్లు అధ్యాయమంతయు ననూదితము.

విస్తరణము :

సప్తమాధ్యాయమున 'విప్రవ్యాధ వృత్తాంతము' పదునెనిమిది శ్లోకములలో చెప్పబడెను. అది తొమ్మిది గద్యపద్యములలో సవిస్తరముగా ననూదితము.

శ్రీశైల తీర్థ ప్రశంస సందర్భమున
'తతః శ్రీపర్వతం దేవీ గచ్ఛంతీ పర్వతస్థితం
దదర్శ దేవ బృందాఢ్యం సాక్షాచ్ఛంభోర్నికేతనం'

మున్నగు మూల శ్లోకములలో 'మల్లికార్జున' నామమే లేదు. భ్రమరాంబయును లేదు. ఈ ఘట్టమును ఆంధ్రాభిమానముతో శాస్త్రిగారిట్లు తీర్చిదిద్దిరి.

మల్లికార్జున మనోమకరంద రసమాని
భ్రమరాంబ ప్రణవమ్ము పాట పాడు
నలుగడ గుహలందు వెలుగొందుదురు లంబి
కాయోగమున మునుల్ కల్పమయిన
తైర్థిక దర్శన ధన్యవాదామోద
ముఖరితమ్ములు పన్యములు మృగములు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రమథులు చెంచులై బావ యక్క యటంచు
ప్రాయాల్మగలగూర్చి పక్కచంద్రు
అంతర హిరణ్మయంబు దేవార్చితంబు
వివిధ దేశీయజన సమావేశపదము
శిఖర దర్శనమాత్ర సంసిద్ధిదంబు
కాశి శ్రీశైలపన వేఱుగాదు జగతి

పద్యము చదివినంతనే భ్రమరాంబామల్లికార్జునులతో, మునులు తపమొన రించు గుహలతో, దర్శనమున కేతెంచు తైర్థికులతో, అరణ్యమున సంచరించు మృగములతో, చెంచులతో, శ్రీశైలము కన్నుల యెదుట సాక్షాత్కరించును.

శుక్ల తీర్థ ప్రభావమును తెల్పుకథ ఇరువది యొకటవ అధ్యాయమున కలదు. 'అన్నచెల్లెలి కథ'యను పేర కొంత మార్పుతో విస్తరింపబడినది.

ఒక గ్రామమున నొక దంపతులకు నొక కొడుకును నొక కూతురును కలిగిరి. ఆ దంపతులు చనిపోగా పిల్లలిరువురు వేఱు వేఱు చోట్ల బెరిగిరి. వారిద్దరు నన్న చెల్లెండ్రని తెలియని పెంపుడు దండ్రులు వారిద్దరికి వివాహము చేసిరి.

ఇంతవఱకు కథ సమానమే. మూలమున నొకయోగి వారింటికివచ్చి దివ్య దృష్టితో వారి జన్మవృత్తాంతము నెఱిగి ప్రాయశ్చిత్త ముపదేశించినట్లు కలదు.

అనువాదమున కలికి కలయికకై కాంతుడు చీకటిలో పోవుచుండ నతని కాలు ఒక గోవునకు దాని వత్సమునకు తగులును. అప్పుడు-

మనుజ భాషణములను గోమాత జూచి
వత్సమిట్లను నెవ్వడీ వయసువాడు
శిష్టజనములు పూలపూజించు నిన్ను
దన్నె నన్నును నాపుడు తల్లి పలికె
శిరమునూపుచు గన్నెఱ్ఱజేసి వీడు
భ్రాత బెండ్లాడె జెల్లి నీ పని యదెంత
లీల 'గుడిమ్రింగు వానికి లింగమెంత
వత్స! యనునంత వాడు రివాల్న దిరిగి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తప్పు తెలిసికొని ధర్మజ్ఞులను సంప్రదించెను. ప్రాయశ్చిత్తముగా నల్లని వలువలు కట్టుకొని ఇరువురును కృష్ణాతీర్థములలో మునుగుచు పోవుచుండగా శుక్లతీర్థమున వారి వస్త్రములు తెల్లనై పాపములు నశించెను.

మూలము నందలి యోగివృత్తాంతమును పరిహరించి గోవు చేత జన్మ రహస్యము చెప్పించుట ఇట్లు సమర్థింపబడెను.

............'మనుజ దృష్టి
గోచరించునె, మఱుగు గన్గోజరించు
ధర్మదేవత కామయే ధాత్రికొడయ'.

మూలమున వారి వివాహమైన తరువాత ఎప్పటికో యోగి వచ్చినట్లుండుటచే కథ మిక్కిలి జుగుప్సావహమగుచున్నది. అందుచే అనువాదకులు కలికి కలయికకై కాంతుడు పోవుచున్నప్పుడే సత్యము తెలిపినట్లు మార్చి అమాయికులగు అన్న చెల్లెండ్ర పాపమును తగ్గించిరి.

అమూలక కథలు :

'అక్క బావ కథ' శ్రీశైల తీర్థ ప్రశంసా సందర్భమున చెప్పబడిన అమూలక కథ. దీని పరిమాణము పదునెనిమిది గద్యపద్యములు. 'శ్రీశైలమందు భ్రమరాంబామల్లికార్జునుల భక్తవాత్సల్యంబనంతంబు. దానిం బ్రకటించు నొక చరిత్ర మద్భుత రసావహంబు. వినుండు.' అనెడు సంధానవచనముతో నీకథ మూలకథతో కలుపబడెను. నిజముగా కథ అద్భుత రసావహమే. కథానాయకుడగు రాముడు బాలభక్తుడు. సిరియాళాదుల స్థాయిలో భక్తిని ప్రదర్శించి అమాయకత్వముతో, భక్తిజ్ఞానములతో ఆకట్టుకొనును.

శ్రీగిరికి చాలదూరమున నొక అగ్రహారము కలదు. అందలి వారెల్లరును సంపన్నులు, విద్వాంసులు. ఒకనాడు కొందఱు కుఱ్ఱలు గుమిగూడి రాబోవు పండుగకు వారి వారి అక్క బావలను తెత్తుమని గొప్పగా చెప్పసాగిరి. వారిలో రాముడను బాలుడు 'నేనును దెత్తు'ననెను. మిగిలినవారు నవ్వి 'నీకు అక్కయే లేనప్పుడు బావనెట్లు తెత్తువని' వెక్కిరించిరి. వాడు ఏడ్చుచు పోయి తల్లితో చెప్పెను. ఆమె 'భ్రమరాంబ నీయక్క. మల్లికార్జునుడు నీ బావ' యని యూరడించెను. రాముడు తెల్ల వారుజామున లేచి తల్లికి తెల్పియకుండ శ్రీశైలమునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బయలుదేరెను. నిర్భయముగా అరణ్యములను దాటి సాయంకాలమువేళకు 'మల్లికార్జునబావా! భ్రమరాంబ అక్కయ్యా'యని తలుపు తట్టెను. అతనిని పరీక్షింప దలచి అక్కయు బావయు తలుపు తీయకుండిరి. అప్పుడు బుల్లిబావమఱది బావగారి నిట్లు దెప్పిపొడిచెను.

నీ వాకిట బుసపెట్టు మ
హావృషభమె కనికరించి యాదృతి జూపెన్
బావా! పిల్చిన బల్కవు
చేవచెవ్వదొ లేక నీకు చెవులే లేవో

నీకన్న నీవాకిటనుండు మహావృషభమే మర్యాదకలదని ఆక్షేపించెను. ఎంత మొత్తుకొన్నను అక్కబావలు ఓయని పల్కకపోవుటచే ప్రాణములు తీసికొనుటకొక రాతిని చేతబట్టెను. ఇంతలో తలుపు తెరచుకొనెను మొదట అక్క, తరువాత బావగారు రాముని పల్కరించి ఆహ్వానించిరి. మల్లికార్జునుడిట్లు ప్రశ్నించెను.

ఎంతవాడవు శ్రీశైల మెంతదూర
మాకలిన్ దప్పి నెటులోర్చి తటు మెకాల
బెబ్బులుల బొబ్బలను వేగవినుచు నోయి!
ఎల్లపిల్లల కరిది ఓ బుల్లిమఱది!

అప్పుడాతడు చెప్పిన సమాధానము 'వేదాంత విజ్ఞాన సునిశ్చితార్థమగు తత్త్వవచనము.

గ్రహణ ధారణ పటువుపై వహి రహించు
బాలకులయందు జేరినవాడ నెంత
వాడవంచును నీ యంత వాడడుగగ
జెల్లునే నిన్ను లోనిల్పి చేరినాడ
ద్వారపాలునివరె నవద్వారగృహము
దగ్గరన యుండి నీవులో దారి జూప
తన్మయత్వమ్ముతో మహోత్సాహమను వి
మానమున ధ్దూరమెట్లు నీ మునికి బావ!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏ పనియు లేక యటునిటు నెపుడు దిరుగు
వారినే యాకలి దప్పియు బాధపెట్టు
ఏకదీక్షను బూని తా నెగురు నింద్రి
యముల లోగొన నేమి చేయంగగలవు

అతడు భ్రమరాంబా మల్లికార్జునులను తన ఇంటికి తోడ్కొని వచ్చెను. తల్లియునతడును వారిని షోడశోపచార విధులతో పూజించిరి. అప్పటికప్పుడు జయఘంటా ముఖరిత దివ్య విమానద్వయంబేతెంచి తల్లికొడుకుల నొకటియు, భ్రమరాంబా మల్లికార్జునుల నొకటియు కైలాసమునకు చేర్చెను.

శ్రీశైలక్షేత్ర మాహాత్మ్యమునకు చెందిన ఈ కథను శాస్త్రిగారు కృష్ణానదితో ముడివైచి దీనిలో చేర్చిరి. కరుణభక్తి అద్భుత రసములకు ఆకరమయిన ఈ మధురకథ ఆగక సాగిపోయెడు తీర్థవర్ణనలనెడు పాయసము మధ్య పంటికి తగిలిన జీడిపప్పు వంటిది.

చిట్టచివరది హంసలదీవి వృత్తాంతమునందలి కాకహంసకథ. హంసలదీవి మహత్త్వమును ప్రశంసించుచు మూలమున 'స్నాత్వాణాం పాతకాద్గంగా జాతా వాయసరూపిణీ సంగమస్నానపూతావై యాతి హంస స్వరూపతః'

అను ఐతిహ్యమొకటి చెప్పబడెను, దానిననుసరించి శాస్త్రిగారొక కథను కల్పించిరి. ఇది ఇరువదియైదు గద్యపద్యములలో నున్నది.

కాశీపుర పరిసరముల నొక కుగ్రామమున్నది. ఆయూరిలోని కప్పురవిడెము గమగమలు దిక్సుందరులకు నెలమి ఘటించుచుండును. అంత రాసిక్యము కలిగినప్పటికని —

'అందు కలిగిన యంచలు నమలమతులు
సతులు బతులును విశ్వేశచరణ పద్మ
బంభరమ్ములు తన్నామ భజనపరులు
సాధు సేవాధురీణులు సంతతమ్ము
ఇట్లు కాలము గడచిపోవు చుండగా —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒక వెలదుక వెలకందని
సుకలానిధి సొబగుకత్తె చోద్యమ్ముగ వా
టిక గల నొక సొబగుని హ
స్తుకొని విషయసుఖములందు తొణకుచు నుండెన్

విశ్వేశ చరణ పద్మ బంభరములు సంచరించు ఆ గ్రామముననే అధర్మ కామము విజృంభించుటేమి ? పసిమైన మన్మథుడు చచ్చియు శివుని సాధింప నెంచినాడేమో ! వెలకందని సుకలానిధియైన యామె వెలయాలివలెనైనది. ఆమెకు పాపభీతి లేకపోలేదు. కాని కుతర్కములో దాని నతిగమించినది. వక్రభాష్యములతో ఇట్లు తన్ను తాను వంచించుకొన్నది.

గంగ నొకమారు తలచిన గలుషరాశి
నెంత పొడపైనను నడంగు నెంచి చూడ
విష్ణులోకమ్ము ప్రాప్తించు విదక ప్రత్య
హమ్ము దోగిన బాపములడఁగ కున్నె

కాన రాత్రుల జేయు నఘమ్ము లెల్ల
బ్రొద్దుపొడుపున గంగలో మునుగుమాత్ర
మాయమగునని గట్టినమ్మకము కలిగి
స్వేచ్ఛ జీకటి తప్పుమ చేయుచుండె

ఆమె నమ్మకము వమ్ముకాలేదు. ఆమె చేసెడు 'చీకటి తప్పున'కు దండన మాత్రము గంగయనుభవింపవలసి వచ్చెను.

ప్రత్యహమ్మును కులట తనయందు భక్తితో నేమఱకసలుపు మజ్జనోన్మజ్జనముల మలినాంగస్పర్శ వలన ఉజ్జ్వలత్వ మేది మాలిన్య మెదిగి యెదిగి

నల్లని కాకిరూపు నందిన గంగ ప్రత్యహము కృష్ణా సాగరసంగమము నందు మునిగి హంసియై సాయంసమయమునకు కాశికి చేరజొచ్చెను. కులటా పాప భారమును మోయుచుండుటచే గంగను మోసెడు గంగాధరునకు శిరోభార మధికమయ్యెను. తలనొప్పిని భరింపలేక ఇది ఎట్లు వచ్చెనాయని యోగదృష్టి నీక్షించి 'యోహో' యనుకొనుచు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తలపయి నెలకొన్న నెలరేక మోమున
రేఖాకృతి విభూతిరేఖ నెలయ
మురికియౌ గరగర మువ్వన్నె మెకముతోల్
గూడకట్టగు మదుంగుగను జేర
సోగయై వ్రేలాడు నాగాభరణమును
కటితటి మౌంజిగా గ్రమ్మకొనగ
పొడవుగా జేనున్న ముమ్మొన వాలును
పాలాశ దండంబు భంగి వెలయ

తనకు పరిపాటియైన బ్రహ్మచారి వేషమును ధరించి అతిథిగా పుంశ్చలీ గృహమున కేగెను. ఆమె 'నీ ముఖము జూడ బరమేశు మించుదోచెనయ్యా! మాయింట నాతిథ్యమందుడని' యడిగెను. శివుడు మందహాసమును మోమున మెఱుగుపఱచి నీ ఆతిథ్యము నాకు సమ్మతమే గాని కొన్ని ధర్మ సూక్ష్మములు నీకు చెప్పదలచితిని నిశ్చలముగా వినుమని—

కలికి ధర్మావిరుద్ధమౌ కామమే న
టంచు బలికెను గీతల నచ్యుతుండు
జోస్యమున జెప్పుచుంటిని చోటులేదు
దాచుకొన నీకు చీకటితప్పు ముప్పు

అనుచు జోస్యము చెప్పినట్లు అసలు సంగతిని చెప్పెను. తప్పు నొప్పుగా నొప్పును తప్పుగా మార్చుట ఎవరి తరము కాదు. కావున చేసిన తప్పు నొప్పుకొమ్మని మందలించెను.

కృష్ణ కద్దరి నిద్దరిని గల తీర్థములన్నిట మునుగుచు హంసలదీవికి బోయినచో నచట నిశ్శేషముగా నీ దోసము మాసిపోవుననెను. ఆ యతివ రోయు పనిని మానెదననగా ఆతిథ్యము నంది వెడలిపోయెను.

'గంగ నిత్యము హంసరూపము ధరించి హంసలదీవి ప్రతిష్ఠకు మూల కారణంబయ్యె. కృష్ణయు నెల్లనదులకు దుష్టజన నిమజ్జనాగత దోషములంబాచి నిర్మలంబొనర్చు మహాద్భుతశక్తి సర్వభువన విదితంబయ్యె'.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను ఉపసంహార వాక్యములతో నీ కథముగింపబడెను. జగత్ శ్రేయో దాయకమైన సందేశమునిచ్చుటకు పనికివచ్చు ఈ అమూలక కథను శాస్త్రిగారే మలచికొనిరి. ఏకపత్నీవ్రతమును, పాతివ్రత్యమును నిలబెట్టుకొనవలయుననియు, వేదశాస్త్రాదులకు వక్రభాష్యములు చెప్పుచు నింద్రియ సుఖములకు లోబడు దుర్లక్షణములను మానుకొనవలయుననియు నిందుపదిష్టము.

ఇట్లు మూలమునందు అస్థిపంజరముల వలెనున్న మధురకథా సందర్భములు అనువాదమున మాంసలములగు భద్రకుంజరములైనవి.

సందేశము :

ధర్మనిష్ఠతో కూడిన సత్సందేశమును కాంతాసమ్మితముగా నందించుటయే గదా కావ్య పరమార్థము. చిరార్థప్రదములగు రుచిరార్థ సూక్తులు, సిద్ధాంతములు మానవులకు ఈ కావ్యముఖమున సత్సందేశముల నందించుచున్నవి.

ధర్మార్జితంబు కానిది
శర్మంబెటులౌను దాన జేకురు బెట్టుల్
తార్మారులేని సౌఖ్యము
నిర్మలభావమ్ము సత్యనిష్ఠయు జగతిన్

లోకమున కలవు సంభవింపగా బలిచక్రవర్తి జనులను ఆదుకొనెను. యజ్ఞాదులనొనర్చి ధర్మార్జితముగా జనులు వర్షాదులను పొందకుండ వారికి రక్షణ ఇచ్చి ధర్మాచరణము నుండి తప్పించెనని ఇంద్రుడు బలిని కోపించుటకు కారణముగా నిది చెప్పబడెను. ఈ సూక్తి సార్వకాలికము సార్వజనీనము.

ధారుణి గ్రతువుల స్వాహా
కారమ్ముల దివియు వృష్టిగలుగుట భువియున్
సారాహారవిహారము
లారూఢిం జెలగుచుండు నన్యోన్యంబుల్

'యజ్ఞాద్భవతి పర్జన్యో పర్జన్యాదన్న సంభవః (భగవద్గీత. కర్మ 14)
అను వేద ప్రబోధము అనుసరణీయమని శాస్త్రిగారి సందేశము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏపనియు లేక నటునిటు నెపుడు దిరుగు
వారినే యాకలి డప్పియు బాధపెట్టు
ఏకదీక్షనుబూని తా నెగురు నింద్రి
యముల లోగొన నేమి చేయంగగలవు

కార్యశీలియు, దీక్షాశాలియునగు మానవుని క్షుత్పిపాస లేమియు చేయలేవు. ఇది శాస్త్రిగారికి అనుభవసిద్ధ విషయము. మనస్సును కవిత్వమున లగ్నము చేసి ఆకలిదప్పులను, దూరభారములను వారెట్లు గడచిరో జీవిత చరిత్రయందు చెప్ప బడినది.

స్వేచ్ఛయ స్వరాజ్యమనుకొను చిత్తములును
కేవలార్థమె రాజ్యమన్ భావములును
లేమి నానాట దలిదంద్రులే పరస్ప
రముగ సంబంధ బంధంబు రహి గుదిర్చి

స్వరాజ్య స్వరూపమును పది సంవత్సరములు దర్శించిన శాస్త్రి గారు వ్యంగ్యముగా స్వరాజ్యమనగా స్వేచ్ఛ కాదని ప్రబోధించిరి.

తానొక శతాబ్దమున తోచు మానవుండు
కాలచక్రకంబు రూపంబు కలుగజేయు
నీశ్వరుని ధర్మశాసన మెంచి మార్పు
గలుగ వలెనంట సాహసిక్యంబు గాదొ

అహంకారముతో సృష్టిని విమర్శించు వారికిది గట్టి చురక.

ఇంద్రియముల జయించిన యేకవీరు
నకు నొకని కౌనుగాక యందఱకు తగునె ?
తనకు తోచిన దెల్లయు ధర్మమనుట
మనుట గోరిన వారికీ మతము తగదు.

మహాత్ములవలె సామాన్యులు తమకు తోచినదే ధర్మమని భావింపరాదని హెచ్చరిక.

ఇట్టి సందేశాత్మకమగు ధార్మిక ప్రబోధములు, హెచ్చరికలు సూక్తులు ఈ నదీమాహాత్మ్య గ్రంథమునకు సార్వజనీనతను, సార్వకాలికతను సమ కూర్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాకరణము :

'నా జడల జారు గంగయు' అను ప్రయోగము ప్రౌఢవ్యాకరణ సిద్ధము. 'నా జడలవలన నుండి' అనునది 'ఉండి శబ్దము పరమగునపుడు వలనకు ద్వితీయా సప్తములు ప్రాయికంబునగు (కారక - 11) అను బాలవ్యాకరణ సూత్రముచే 'నాడవేల నుండి' కాగా 'వలన' కాదేశంబులగు ద్వితీయా సప్తముల మీది యుండికి లోపంబు బహుళంబుగానగు' (కారక-11) అను ప్రౌఢవ్యాకరణ సూత్రముచే 'ఉండి'కి లోపము వచ్చి 'నా జడలబారు' యగును. ఇది ప్రౌఢ ప్రయోగము.

'బావల నకలన్ నే దెత్తు' అనుచోట 'అక్కలన్' అనుటకు 'అకలన్' అని ప్రయుక్తము. 'అక్కటాదుల జడ్డకు లోపంబు విభాషనగు' (బాల. ప్రకీ. సూ. 8) అను సూత్రమున 'అక్క' పఠింపబడినది. శబ్దరత్నాకరమున 'అక' చూపబడినది. కాని ప్రయోగములు చూపలేదు. వ్యస్తముగా నిట్లు ప్రయోగించిన పూర్వకవులు బహుశః లేరేమో!

రూపకోత్ప్రేక్షల సమ్మేళనమగు ఈ క్రింది పద్యమున అర్థాలంకార సౌందర్య మాలోకనీయము.

ఉద్యత్పూర్ణ కృపారసంబు మదిలో నుప్పొంగి కృష్ణానదీ
హృద్యాకారము బూన గొండదిగి దుర్గేశ్రీ వే గన్నులన్
విద్యారూపము జూపుచున్నటులు భావింపంగ నయ్యెన్ సదా
విద్యుద్దీప సహస్రముల్ జయపురీ వీధీమహాస్తంభముల్

ఉపసంహారము :

సహ్యాద్రి ఖండరచనా రాజ్యాంగప్రణాళిక ననుసరించియు, హంసలదీవి ప్రభావము స్వీయ వ్యక్తిత్వ సత్తాకమై స్వాతంత్ర్యపతాక నెగురవైచినది. అనువాద భారతి నీరసమువై కథనకుతూహలము కల్పింపని ఘట్టములందు గ్రీష్మ సహ్యజా తనుత్వము నందినది. సరస కథాగథన సన్నివేశములందు వర్షాకృష్ణవేణి యైనది. అమూలక కథాపద్మ కర్ణావతంసభూషితయైనది. సూక్తిముక్తాదామ శోభితయైనది. కాశీఖండ భీమఖండాదులతో సరితూగుచున్న 'హంసలదీవి ప్రభావము' ఆంధ్ర సరస్వతికి అపూర్వాలంకారము. శాస్త్రివరేణ్య కవితా సుషిమ్నానుభావ ప్రభాభాస్వంతమగు స్వర్ణహంసము.

—౦—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ దేవి

ఇది శ్రీమత్ శంకరాచార్య కృతమైన శ్రీ దేవ్యపరాధ శ్రీదేవ్యానంద లహరీ స్తోత్రములకనువాదము. శాస్త్రిగారి మరణానంతరము ముద్రితము. పొన్నూరు పట్టణ ప్రముఖుడైన శ్రీ కొప్పాక వెంకయ్యగారికి అంకితము.

కలాన్యాస వైభవము కలిగిన భవ్య దివ్య భవనమునందు నిత్యనివాసిని, నిత్యవిలాసిని అయిన శ్రీదేవి పాదుకాభక్తులను పాలించుట రచయిత కనుభూతిలో నున్నది. దేవీస్తుతి ప్రాక్తను లనేక విధముల నిరూపించిరి. మంత్రజాపకుడు, పూజా పవిత్రపాణి చక్రార్చనాసక్తుడు, నిత్యము మంత్రానుసంధాన మొనరించు నపుడు పలుకు వచనములు వరివస్యానిరతులగువారికి చిత్తోల్లాసము సంపాదించును. అట్టి చిత్తోల్లాసమును అనుభూతిలోనందుకొని ఈ విధముగ నిరూపింప ఈ రచయిత యత్నించెను. ఒక్కొక్క పద్యము ఒక్కొక్క విధమైన అనుసంధాన పారమ్యమె ప్రధానము. ఇందా కవితాన్వేషణము, యుక్తక్రియకాదు. అయినను చేయితిరిగిన శాస్త్రిగారికి అది శక్యక్రియయే ఐనది.' అని దర్శనాచార్యులు మాధవరాపు శర్మగారి 'శ్రీదేవీ వరివస్య.'

శ్రీ దేవ్యపరాధ స్తోత్రము :

ఈ స్తోత్రము మూలమున ద్వాదశశ్లోక పరిమాణము. అనువాదము పదునొకండు పద్యములలో జరిగినది. 8 సీసపద్యములు, 3 గీతపద్యములలో శాస్త్రిగారి విక్షేప, సంక్షేప అనువాదరీతులు విస్పష్టముగా గోచరించుచున్నవి. కొన్ని సీస పద్యములలో ఎత్తుగడలు స్వతంత్రములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

న మంత్రం నో యంత్రం తదపి చ న జానే స్తుతిమహో!!
న చాహ్వానం ధ్యానం తదపిచ న జానే స్తుతి కథాః !!
న జానే ముద్రాస్తే తదపి చ న జానే విలపనం !!
పరం జానే మాత స్తదనుసరణం క్లేశ హరణమ్ !!

అను నీ శ్లోకమునకు భావోపలక్షణబంధురమైన అనువాదమిట్లు సాగినది.

మంత్రమ్ము నెఱుగను తంత్రమ్ము నెఱుగను
మఱియు నీ స్తోత్ర మే మాత్ర మెఱుగ
నిన్పిల్చు టెఱుగ ధ్యానించు టెఱుంగను
ప్రథితముల్ నీ దివ్య కథల నెఱుగ
చిత్తము నీయందు జేర్పగా జాలిన
ముద్రల గరుణా సముద్ర యెఱుగ
గణగణ మనిమండు కడుపులో మంట ఇ
ట్లని పొరి మొరపెట్టు కొనుట యెఱుగ

తల్లి వెనుకను బిడ్డ చందానగోపు
పజ్జ వాయని వత్సమ్ము వగిది నిన్ను
వదలకుండుట యొక డెఱుంగుదును తల్లి
భక్తజన కల్పవల్లి ! శ్రీ పాలవెల్లి !

శ్లోకములోని మూడు పాదములను నాలుగు సీసపాదములలోనికి తెచ్చి నాలుగవ పాదమును ఎత్తుగీతిలో విస్తరించుట జరిగినది. "న జానే" అను క్రియా పదమునకనువాదముగా నాలుగు పాదముల చివర తూకముగా "ఎఱుగ" నను క్రియా పదము ప్రయోగింపబడినది. "న జానే విలపనం" అను మూలమునకు విస్తరణగా "గణ గణ మని మండు కడుపులో మంట ఇట్లని పొరిమొర వెట్టు కొనుట ఎఱుగ" అని అనువదింపబడెను. "త్వదనుసరణ" మనునది సోపమాన ముగా "తల్లి వెనుకను బిడ్డ చందాన గోపు పజ్జవాయని వత్సమ్ము వగిది" యని పెంపుగన్నది. ఘటనమును అమ్మూలకమే.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విధే రజ్ఞానేన ద్రవిణ విరహేణాలసతయా
విధేయా శక్యత్వా త్తవ చరణయో ర్యా చ్యుతి రభూత్
తదేతత్ క్షంతవ్యం జనని సకలోద్ధారిణి శివే
కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి

ఈ శ్లోకమునకు చేయబడిన అనువాదము మిక్కలి ప్రశంసనీయమైనది. "విధేరజ్ఞానేన" "ద్రవిణ విరహేణ" "అలసతయా" "విధేయాశక్యత్వాత్" అను నాలుగు వాక్యములు వికసిత మందారములట్లు వ్యాఖ్యానప్రాయమునైన నాలుగు సీసపాదములైనవి.

"నిగమాగమములందు నియమించినట్టి వి
ధుల రూపములు మది తెలియ బడమి
విలువలౌ పరికరమ్ముల సేకరింప సా
ధనమైన ధనము సుంతయును లేమి
మంటి ముద్దను బోలి ఇంటబాల్మాలుచు
గడు మెలంకువయు జాగ్రత్తలేమి
ఆయాయి తఱులందు నాచరింపగ నైన
పను లెటింగియు జేయ వలను వడమి"

ఇట్లు శ్లోకసారైక పాదము సీసపద్యముకాగా మిగిలిన సార్థపాదద్వయము ఎత్తుగీతియందు ఇట్లిమిడిపోయినది.

అమ్మ నీ యెడ సలుపు మహాపరాధ
ములను సైరింపు మమ్మ ! సకలము జగము
తేర్చు శుభమూర్తి మల్లికా దివ్య కీర్తి !
కొడుకు దుడుకగు తల్లి యెన్నడును గాదు!

ఆచార్యులు మకుటప్రాయముగా మూడు శ్లోకములలో పేర్కొన్న "కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా న భవతి" అనుదానికి శాస్త్రిగారి తెలుగు దనము నిండిన అనువాదము "కొడుకు దుడుకగు తల్లి యెన్నడును గాదు !". ఈ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రస్తుతము మూలమున మూడు శ్లోకములకు మాత్రమే ఉండగా అనువాదమున నాలుగు పద్యములకు నిబంధింపబడినది. మూలమున చెప్పబడిన విధులు ఎట్టివో దైవసేవకు ద్రవిణమునకు గల సంబంధమెట్టిదో అలసత యొక్క స్వరూప మెట్టిదో అశక్యత్వమెట్లుండునో అనువాదమున విస్తరించి చూపబడినది.

"పృధివ్యాం పుత్రాస్తే జనని బహవః సన్తి సరళాః" అను శ్లోకమునకు-

కొడుకు లున్నారమ్మ పుడమి నీ కెందఱొ
దఱొ నాకన్న మెత్తనగు వారు !

మొదలగు అనువాదమంతయు అచ్చతెనుగులో సాగించి

అన్నిట నేనంచు ననుఁ ససురైతి ని
త్యానంద మే రీతి నబ్బునమ్మ !

అను నాలుగవ పాదమున నిత్యానందము అను సంస్కృత శబ్దమును ప్రయోగించి ప్రాకృత జీవనునకు పరమోన్నతమైన ఆనందము లభింపదని చమత్కారముగా సూచించిరి. అసలు ఈ పాద సమూలకము.

"మయా పంచాశీతే రధిక మపి నీతే తు వయసి"

అను పాదమును బట్టి చూడగా ఈ స్తోత్రము శంకర భగవత్పాద లిఖితమా అను శంక పొడమును. శ్రీశంకరులు ఎనుబది ఏండ్లు జీవింపలేదుకదా! అనువాదకులు ఆ చర్చ జోలికిపోక యథా మూలముగా

కాల చక్రాక్రాంతి గడచి పోయిన వమ్మ
యెనుబది యైదేండ్లు తనువు మార్చి !

మూలమున "పంచాశీతే రధిక మపి" అని యుండగా దానిని శాస్త్రిగారు "యెనుబది యైదేండ్లు" చేసిరి.

'కపాలీ భూతేశో భజతి జగదీశైక పదవీం
భవాని త్వత్పాణిగ్రహణ పరిపాటీ ఫలమిదం'

అను మూలమునకు —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

.................పెంగు వాడు
కాంచు టెట్టులు సర్వ జగత్ప్రభుత్వ
పదవి గరుణించి నీవు చేపట్టకున్న
గాన తోషిత ఖడ్గ శ్రీ కనక దుర్గ !

అని అనువాదము. మూలమున 'నీ పాణిగ్రహణ ఫలమువలన శివుడు జగదీశ్వరుడైనాడని చెప్పబడగా అనువాదమున కరుణించి నీవు చేపట్టకున్నచో సర్వ జగత్ప్రభుత్వము అతడెట్లు కాంచును? అని చమత్కరింపబడినది. 'పాణిగ్రహణమునకు 'చేపట్టుట' అను పదమును ప్రయోగించుటలోనే అనువాద సౌందర్య మధికమైనది.

ఆపత్సు మగ్నః స్మరణం త్వదీయం
కరోమి దుర్గే కరుణార్ణవే శివే
నైత చ్ఛఠత్వం మమ భావయేథాః
క్షుధా తృషార్తా జననీం స్మరంతి.

గోరముల యందు నేను గగ్గోలు పడుచు
నెనరుగని వాట నిన్నె ధ్యానించు చుందు
గడుసు దనమిది యగునను గడన వలవ
దాకలిని దప్పికను బుత్రు లమ్మ నెంత్రు

ఈ విధముగా శ్రీమత్ శంకరాచార్య కృత 'శ్రీ దేవ్యపరాధస్తోత్రము'నకు శాస్త్రిగారు చేసిన అనువాదము సరళమై, సుందరమై, భక్తి రసబంధురమై ఒప్పారు చున్నది.

శ్రీదేవ్యానందలహరి :

ఈ స్తోత్రము కూడ శంకరాచార్య విరచితమైనట్లు 'బృహత్ స్తోత్ర రత్నాకరాదుల'వలన తెలియుచున్నది. మూల స్తోత్రపరిమాణ మిరువది శ్లోకములు. వీనిలో **13** శ్లోకములు మాత్రమే అనువదింపబడినవి. అనువాదమంతయు సీస పద్యములలోనే సాగినది. వెనుకటి స్తోత్రమునకు వలెనే ఇచ్చట కూడ అనువాదము మూలమునకు వ్యాఖ్యానప్రాయముగానే జరిగినది. దానికి క్రింది శ్లోకానువాదము చక్కని ఉదాహరణము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'భవాని స్తోతుం త్వాం
ప్రభవతి చతుర్భి ర్నవదనై:॥
ప్రజానా మీశాన
స్త్రిపురమథనః పంచభి రపి
న షడ్భి స్సేనానీ
ర్దశశతముఖై రప్యహిపతి
స్తదా న్యేషాం కేషాం
కథయ కథమస్మిన్నవసరః

సతతమ్ము వేద శాస్త్ర స్వరధ్వనుల స
మ్మోద మ్మొసగు చతుర్ముఖుడు కాని!
వర్ణ సమామ్నాయ ఫక్కిచేతక్కను
బోధించు తగ పంచ ముఖుడు కాని!
తన్నుపాసించు వానిన్నెటి సర్వజ్ఞు
బొనరింప గాజాలు షణ్ముఖుడు కాని!
అంజలిం బడుట బతంజలియై భాష్య
మును గూర్చిన సహస్ర ముఖుడు కాని
నీ మహిమ గుర్తెఱుంగ లే రేమియు నన
నితరులకు నెవ్వరికి నెప్పు నెట్లు కలుగు
అవసరం బేక ముఖులకు నరసి చూడ
సహజ దయ బాలన మొనర్ప జనును జనని!

ఇందు మూలమున ముఖ సంఖ్యకే ప్రాధాన్యము చెప్పబడగా అనువాదమున చతుర్ముఖాదుల అర్హతలు విశేషములుగా చూపబడినవి.

'ముఖే తాంబూలం' ఇత్యాది శ్లోకమున 'ముఖే' 'నయన యుగళే' 'లలాటే' 'గళే' అను పదములు 'నిత్య సౌగంధ్యమ్ము నెలకొను నిందు నెమ్మోమున' 'వెడదయై విశ్వంబు వెలయింప జాలిన కందోయి' మొదలగు విధమున సవిశేషణ ములుగా తీర్చిదిద్దబడినవి. ఈ శ్లోకానువాదములోని 'లలి గలాన్యాసముల జగంబు లను మనుచు తల్లి నిజ భక్త నికట మందారవల్లి' అను పాదము లమూలకములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందు 'కలాన్యాస' మనునది శ్రీచక్రోపాసనకు సంబంధించిన విషయము. శంకర భగవత్పాదులు ఈ 'ఆనందలహరీ' స్తోత్రము పార్వతీ పరముగా చేయగా శాస్త్రిగారు దానిని శ్రీవిద్యాపరముగా కామేశ్వరీ దేవతా పరముగా కూడా అన్వయించుట గమనింపదగినది*. శ్రీవిద్యోపాసనయందు పార్వతిని దర్శించుట, తద్రూపముగా పార్వతి నర్చించుట అనువాదము నందలి విశేషములు. 'తల్లి కల్పకవల్లి విద్యామతల్లి' 'పరమకామేశ్వరీ పరబ్రహ్మమహిషి' 'అందముల కందమై కలాన్యాస మెసగి' 'కన్నబిడ్డల కన్న మిన్నగా పాదుకా భక్తుల పోషించు భారమనుచు' మొదలగు అమూలక పాదములు పై అంశములను సూచించుచున్నవి.

ఇట్లు మూలమునకు వ్యాఖ్యానప్రాయముగా శంకరుల భావములనుపలక్షించి, శ్రీవిద్యాపరముగా కూడ ఈ స్తోత్రమును సమన్వయించి శాస్త్రిగారు తెలుగువారికి వెలుగు వెదజిమ్ము అనువాదమును అనుగ్రహించిరి.

—o—

* కామేశ్వరీ సదానందఘనా స్వాత్మైక రూపా దేవతా - భావనోపనిషత్తు, శ్రీచక్రవిలసనము, పుట. 157.

కామేశ్వరీం పరామీడే కాది హాది స్వరూపిణీం
మాతృకావర్ణలిప్తాంగీం మహాశ్రీచక్ర మధ్యగాం, ఆందే, షట-1.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ లక్ష్మీనారాయణ శరణాగతి స్తవము

ఇది శాస్త్రిగారికి సమకాలికులును, సాహితీమిత్రులునగు శ్రీమాన్ నారాయణం రామానుజాచార్యవర్యులచే రచింపబడిన దశోత్తరశతశ్లోక పరిమాణము గల 'శ్రీ లక్ష్మీనారాయణ శరణాగతి స్తవః' అను సంస్కృతకృతికి ఆంధ్రాకృతి. మూలముతోపాటు 1957న ముద్రితము.

శ్రీమాన్ రామానుజాచార్యులవారు గుంటూరు మండలమునందలి ఉల్లిపాలెం గ్రామనివాసులు. శ్రీ శ్రీనివాస కృపా కటాక్షప్రసారమున బాల్యమునందే జన్మ సంస్కారసముపలబ్ధములగు నుభయభాషలందు నిరర్గళ పాండిత్యమును నిమిత్త మాత్ర గురుప్రబోధులై సముపార్జించి విద్వత్కవులై నిలసిల్లిరి. శ్రీరామానంద లహరి మున్నగు సంస్కృత గ్రంథములను శ్రీనివాస శతకాది ఆంధ్రకృతులను రచించి ఉభయ వేదాంతప్రవర్తకులేకాక ఉభయ కవితాప్రచారులునైరి.

చరిత్రప్రసిద్ధినొందిన పంచలక్ష్మీనారాయణ క్షేత్రములలో నొక్కటియై విరాజిల్లెడు నల్లూరు (గుంటూరు మండలము) గ్రామమున వేంచేసియున్న శ్రీ లక్ష్మీనారాయణ స్వామివారిని గూర్చి యీ స్తవము విరచితము.

తాము రచించిన సంస్కృత కృతికి ఆంధ్రానువాదము కూడనున్నచో చెఱకునకు పండు పండినట్లగునని భావించి ఆచార్యులవారు తమకాప్తులగు శాస్త్రి గారిని అనువాదమొనరింప ప్రార్థించిరి. వారిని గూర్చి ఆచార్యులవారు 'అనువాదక ప్రశంస'లో నిట్లనిరి.

అసమాన వైదుష్య మెసలార నుభయ భా
షలలోన బహుకృతు ల్వెలయ జేసి
సకల విద్వత్సభా స్థలముల న్బల్మారు
సుమహిత 'శతవధానము' లొనర్చి
మహి 'కవిసార్వభౌమ' యటంచు సంస్థాన
పతులచేగీర్తి పడయుచు సతము
సుతభావమున్బూని, కుతుకియై శిష్యాళి
కఖిల విద్యారహస్యములు దెల్పి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవని నభినవ జయదేవ యనుచు దిశల
యశము నార్జించుచుండె 'చల్లాన్వయాబ్ధి
శశధరుండైన పిచ్చయ శాస్త్రివర్య'
డభినవానంద సందోహ విభవు డౌచు

అభినవానంద సందోహ విభవులౌ శాస్త్రిగారు మిత్రుని కోరికనంగీకరించి తన 'యనుకృతి'ని వారి కృతికి అంగీకరించిరి. దానికి వారు సంతుష్టులై

నే రచించిన యీ రమానిలయు వినుతి
ప్రేమ నాంధ్రీకరించిన పిచ్చయాఖ్య
శాస్త్రి వర్యుని కవిజనాశ్రయు శుభాత్ము
నాప్త మూర్ధన్యు నహరహం బభినుతింతు

అని అభిష్టుతించిరి.

అనుగమనము -

శ్రీవత్స వక్షసే నన్త బ్రహ్మాణ్డోత్పత్తి హేతవే
వాత్సల్యామృత పూర్ణాయ వేఙ్కటబ్రహ్మణే నమః

శ్రీవత్సము పేరురమున
శ్రీవెలయింపగను నెల్ల, సృష్టికి మూలం
బై వాత్సల్యామృతఖని
యౌ వేంకటబ్రహ్మమునకు నంజలి గూర్తున్

ఈ స్తవమున మూలానువాదములు రెండును అహమహమికతో మధుమాధుర్యధుర్యములై సాగినవనుట వాస్తవము. పై శ్లోకానువాదములు బింబప్రతిబింబములవలె ముచ్చట గొలుపుచున్నవి.

అలంకారభూషణము :

మూలమున లేని అలంకారములు కొన్ని అనువాదమున చోటుచేసుకొని ఆహ్లాదకరము లగుచున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాసాదయ శ్చిదచిదీశ్వర తత్త్వ విజ్ఞా
స్సఞ్చిన్త్య సర్వనిగమాగమ శాస్త్రసారమ్
ధ్యేయః పరః పరమకారుణిక స్త్వమేవే
త్యుద్ధృత్య బాహూ మువదన్మునిచక్రవాళే

సర్వ నిగమాగమాబ్ధుల శాస్త్రగిరిని
తఱచి వ్యాసముఖర్షులు తత్త్వవిదులు
పరమకారుణికుడు ధ్యేయపదుడు నీవ
యనిరి చేయెత్తి జగముల నాత్మహత్తి

శాస్త్రగిరితో నిగమాగమాగమాబ్ధులను తఱచి వ్యాసాదులు దర్శించిన అమృతభాండముగా అనువాదమున హరి చిత్రింపబడెను. ఈ రూపకము మూలమున లేదు.

యో బాలిశ స్సతత పాపరతో నృశంస
స్సోఽపి ప్రియాతి భవదాశ్రయ మాశ్రిత స్త్వామ్
ఇష్ట్వా సపై ర్బహుగుణై రపి తావకీన
దివ్యాఙ్ఘ్రిపద్మవిముఖ స్సుగతిం న యాతి

పాతకుండేని నీచుఁ డే ఘాతుకుండు
నేని నిన్నాశ్రయింప నీ యెడకు జేరు
ఎన్నికం కన్న జన్నమ్ము లెన్ని జేసి
కొన్న గనలేదు నిన్నెన్న కున్నవాడు.

ఇచట మూలములోని ఉత్తరార్థము నందలి భావము అనువాదమున శబ్దాలంకార సాహాయ్యమున ధ్వనిసుందరమాయెను. హరివిముఖుడెంత గొప్పవాడైనను వానిది బహిరాడంబరమేకాని వానికి మోక్షమలభ్యమని అమూలకమగు శబ్దాలంకారము చమత్కరించును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తెలుగుదనము-

శ్రీశేషభోగి ఫణరాజి నిరూఢరత్న
కాన్తి ప్రకల్పిత విలాస విచిత్రశోభమ్
స్మేరాననం కుటిలకున్తల మమ్బుజాక్షం
కాన్తాకృతిం భువనమోహన మాశ్రయే త్వామ్॥

శ్రీలు సమకూర్చ రతనాల డాలు శేషు
వేయిపడగల పాన్పున వెలయువాని
చిఱునగవు పెన్నెఱుల్ తమ్మిసిరి కనులను
భువనమోహను నిన్ జేరి పొగడుచుందు.

మూలమునందలి స్మేరాననాది పదములకు దీటైన తెలుగు పదములు కూర్పబడినవి 'ఫణిరాజిని' వేయిపడగలుగా ననువదించుట తెలుగుదనమే. అనువాదమునందలి అన్వయముకూడ తిక్కనగారి పద్యమువలె తెలుగుదనమును నిండించుకొన్నది.

సమకాలిక రచనలను అనువదించుట సాహసమే. అట్టి సాహసమునకు పూనుకొని చిత్రవిచిత్రగతులలో తెనుగు బాసలో రమానిలయుని కీర్తించి శాస్త్రిగారు కృతకృత్యులైరి.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చాణక్య నీతి దర్పణము

ప్రాచీన భారత ప్రజ్ఞానిధులలో ప్రథమగణ్యుడు చాణక్యుడు. ఆతని రాజనీతి చాతుర్యము, మేధావిలాసము అనన్యసామాన్యములు. అర్థశాస్త్రమున రాజనీతిని బోధించిన చాణక్యుడు నీతి దర్పణమున మానవుని నడవడికను తీర్చిదిద్దు నీతులనెన్నింటినో మంజులమగు శైలిలో గ్రథించెను. హితోపదేశము, విక్రమార్కచరితము మున్నగు సంస్కృత గ్రంథములలో చాణక్య నీతి దర్పణములోని శ్లోకములనేకములు గోచరించును. తెలుగులో నీతిశతకకర్త లెందరో చాణక్యనీతులను సంగ్రహించిరి. ఇవి యన్నియు చాణక్య నీతి దర్పణ ప్రాశస్త్యమునుల్లేఖించును. కాని అచ్చముగా మూలగ్రంథము నాంధ్రీకరించిన వారెవ్వరును గోచరించుటలేదు. శాస్త్రిగారు దానిని గ్రాంథికవచనములో ననువదించిరి. 1958లో ముద్రితము. ప్రకాశకులు : శ్రీ నరేంద్ర సాహిత్యమండలి, తణుకు.

తొలుత శాస్త్రిగారు నీతి దర్పణమునకు పద్యానువాదము నారంభింపగా భాషాపోషకులగు శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజుగారు 'మీరనువాదము గద్యరూపముగా జేయుచో కళాశాలలయందు పాఠశాలలయందు విద్యార్థులకు, స్త్రీ పురుషులకునెల్ల ప్రజలకు పఠనశ్రవణములచే పవిత్ర జీవిత స్వరూపమును దెలియుటకు తామాచరించి కృతార్థులగుటకు నుపకరించు'నని సలహాఇచ్చిరి. శాస్త్రిగారు ఆ సూచనకు ఇంకను మెఱుగులు దిద్ది రాలిన ముత్యములవలె వివిధ్యాయములలో నున్న ఏక విషయ సంబంధులగు నీతుల నొక శీర్షిక క్రిందికి తెచ్చి వివిధ శీర్షికలతో దండలు కూర్చిరి. దీనితో పఠితలకింకను సౌలభ్యమేర్పడినది. పరవస్తు చిన్నయసూరి మార్గములో సాగిన ఈ గ్రాంథిక గద్యానువాదము విద్యార్థులకు నీతులను గఱపుటతో పాటు భాషాజ్ఞానమును కూడ బాగుగా నభివృద్ధి పఱచును. నీతిచంద్రికను దృష్టిలో నుంచుకొనియే శాస్త్రిగారు ఈ విధమగు అనువాదమును సాగించిరి.

మూలదర్పణము పదునేడధ్యాయములుగా నున్నది. దీనిని శాస్త్రిగారు 'విద్వాంసులు, విద్య' 'పుత్రప్రశంస' 'వదలిపెట్టవలయునవి' 'మూర్ఖకుటిల పద్ధతి' 'గుణదోషములు' 'పశుపక్ష్యాదుల వలన నేర్చుకోదగినవి' అను ఆరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శీర్షికలుగా విభజించి అనువదించిరి. ఇవికాక మిగిలిన సామాన్య నీతులను శీర్షికా రహితముగా ననువదించిరి.

నీతిశాస్త్రగ్రంథములకు తలమానికమైన ఈ నీతిదర్పణమున చాణక్యునిచే అస్పృష్టమగు విషయము లేదు: అట్టి మహాగ్రంథమునకు సమగ్రమగు ఆంధ్రానువాదము ప్రాచీనయుగమున జరుగకపోవుట ఆశ్చర్యము. 'నేటి స్వతంత్ర భారతమున మానవజాతియంతయు నీతిపథమననుసరించి నూతనోత్తేజముతో విరాజిల్లి విజ్ఞాననిధులై విజ్ఞాన వీచికల ప్రాక్పశ్చిమ దేశములందు ప్రవహింపజేయవలెనను సదుద్దేశముతో నీతిస్వరూపము సర్వులకు నందుబాటులోనుండునట్లు శ్రీ పిచ్చయ శాస్త్రులుగారు సంస్కృత చాణక్య నీతిని ఆంధ్ర దర్పణమున ప్రతిబింబింపచేసిరి'. అని ప్రముఖ పండితులు ధర్మాల సుబ్బరాయ శాస్త్రిగారు శాస్త్రిగారి ప్రయత్నమును అభినందించిరి.

'.... ఈ అనువాదము అన్నితెగలవారికి ఆమోదయోగ్యమైన శైలిలో సుగమమై ఉంది : కొన్ని వాడుకలోనున్న శ్లోకాలు ఎవ్వరివో అన్నసందేహం దీని వలన పోతుంది ... ఈ నీతిదర్పణాన్ని తెలుగుజాతికి ప్రసాదించిన శాస్త్రులుగారు అభివంద్యులు....*' అని ఆంధ్రపత్రిక సమీక్షించెను.

సమీక్షకులు పేర్కొన్నట్లు సామాన్యులు మాన్యులు కూడ ఆకరము నెఱుగకుండ నుపయోగించు' అతి సర్వత్రవర్జయేత్' 'మౌనేన కలహం నాస్తి' మొదలగు ప్రసిద్ధ సూక్తులు చాణక్య ప్రోక్తములే.

ఈ విధముగా పండితుల, పత్రికల ప్రశంసలనందిన నీతి దర్పణ గద్యానువాదము ఆంధ్రభాషకొక లోటును తీర్చినదని చెప్పవచ్చును.

అనువాద విధానము :

స్థూలముగా నీ యనువాదము యథామూలము. శ్లోకస్య శ్లోకానువాదము కాదు కాని అనూదిత శ్లోకములలో భావములను విడువలేదు. మూలక్రమమున కాక శీర్షికానుసారముగా శ్లోకముల స్థానములను మార్చి యనుసరించిరి.

మూలమునకు సవరణలు, వివరణలు, సంక్షేపణ విక్షేపణములు కూడ గోచరించుచున్నవి.

---

*. 29-12-1957

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వరయేత్ కులజాం ప్రాజ్ఞః విరూపామపికన్యకాం
రూపశీలాం న నీచస్య వివాహః సదృశః కులే

అని విరూపమైనను కులజనే వివాహమాడ వలెనని చెప్పిన చాణక్యుడు మరి రెండు శ్లోకముల తరువాత —

విషాదప్యమృతం గ్రాహ్యం అమేధ్యాదపి కాంచనం
నీచాదపి ఉత్తమాం విద్యాం స్త్రీ రత్నం దుష్కులాదపి

అను శ్లోకమున దుష్కులము నుండి యైనను స్త్రీ రత్నమును గ్రహింప వచ్చునని చెప్పుట వివాదాస్పదముగా గోచరించుట చేతను అట్టి వర్ణాంతర వివాహములు తమకు అనిష్టములగుటచేతను శాస్త్రిగారు నాలుగవ పాదమును తొలగించి -

'విషము నుండి యమృతము తీయబడును. మలము నుండియు బంగారము స్వీకరింపనగు. కొలదికొలము నుండియు విద్య గ్రహింపనగు'. - అని మాత్ర మనువదించిరి.

'లాలయేత్ పంచవర్షాణి దశవర్షాణి తాడయేత్
ప్రాప్తేతు షోడశే వర్షే, పుత్రం మిత్రవదాచరేత్'

అను శ్లోకమున 'తాడయేత్' అను క్రియకు 'పదియేండ్ల వరకు శిక్షింప వలయును' అని యనువదించుట హృద్యము. 'తాడయేత్' అనగా 'కొట్ట వలయును' అని యనువదింపవచ్చును. అది యథామూలముగా కూడనుండును. కాని 'శిక్షించుట' అనునది ఇంకను విస్తృతార్థము నిచ్చును. పిల్లలను కొట్టకయే కొట్టినట్లు కొట్టుచున్నట్లు భయపెట్టవచ్చును. ఎప్పుడును చావబాదినచో పిల్లవాని యొడలు మొద్దువారి భయము తీరిపోవును. కావున భయము కల్గునట్లు శిక్షించుట ముఖ్యము కాని తాడనము కాదు. నలువది యేండ్ల ఉపాధ్యాయ వృత్తిలోని యనుభవమును శాస్త్రిగారు ఈ ఒక్క పదమునందు నిక్షేపించిరి.

కామధేనుగుణా విద్యా, అకాలే ఫలదాయినీ
ప్రవాసే మాతృసదృశీ, విద్యాగుప్తం ధనం స్మృతం

'విద్య కామధేనువు వలె కాలము కాని కాలమందును ఫలమొసంగును

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిచయములేని పరదేశమందును తల్లివలె బోషించును. నిల్వజేసిన ధనమువలె సమయమందు సహాయమొనర్చును'.

మూలములోని ఉత్తరార్థమునకు జరిగిన అనువాదము వ్యాఖ్యానప్రాయము. "మాతృసదృశీ" అనగా "తల్లివంటిది" అని ముగింపక "తల్లివలె బోషించును" అని "గుప్తం ధనం" అనగా "దాచిపెట్టిన ధనమువంటిది" అని కాక "సమయమందు సహాయ మొనర్చు"నని తత్ప్రయోజనమును కూడ వివరించుట ప్రయోజనకరమగు ననువాదము.

అతిరూపేణ వై సీతా, అతి గర్వేణ రావణః
అతి దానేన బలిర్బద్ధః, అతి సర్వత్ర వర్జయేత్

ధర్మములు తెలిసియు, మిక్కిలి వ్యతిరేకమగు దర్పము చూపుట వలన రావణుడు లంకతోగూడ హతుడయ్యె. అతి దురభిమానముచే దుర్యోధనాదులు నశించిరి. అక్రమార్జిత ధనము కొల్లపెట్టుచే నతిదానమున బలిచక్రవర్తి యడుగంటెను.

పై అనువాదమున సీతా ప్రసక్తి విస్మృష్టము. అతి గర్వము, అతి దానము అనునవి స్వయంకృతములు. అతి రూపము అట్టిదికాదు. పై రెండును తగ్గించుకొనుటకు వీలైనవి. ఇది అపరిహార్యము. అవతారమూర్తియగు సీతకు రావణాదులతో తుల్యయోగము కూర్చుట నచ్చక శాస్త్రిగారు ఆ పాదము పరిత్యజించి దుర్యోధనాదులను ప్రవేశపెట్టిరి. అంతేకాక ఎట్టి దర్పము, ఎట్టి దానము నష్టదాయకములో అనువాదమున వివృతములు. "అడుగంటెను" అనునది చమత్కృతిమత్ ప్రయోగము.

ప్రాతః ద్యూతప్రసంగేన, మధ్యాహ్నే స్త్రీ ప్రసంగతః
రాత్రౌ చోర ప్రసంగేన, కాలోగచ్ఛతి ధీమతాం

"ఉదయ కాలమున ద్యూత ప్రసంగము చేతను (రామాయణము సుందర కాండము పారాయణము) మధ్యాహ్న కాలము స్త్రీ ప్రసంగము చేతను (భారత పారాయణము), రాత్రి సమయమునందు చోర ప్రసంగము చేతను (భాగవత పారాయణము) బుద్ధిమంతులు కాలము గడుపుకొనుచుందురు."

పై యనువాదమున మూలములోని ప్రసంగత్రయము యొక్క అంతరార్థము కుండలీకరణములలో వివరింపబడెను. ఇదియే శ్లోకము ప్రాసంగికముగా "ద్యూత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రసంగేన" అను పాఠాంతరముతో కనబడుచున్నది. దానికి పండితులు భారత పారాయణ మను సర్థము చెప్పుచున్నారు. రెండు సమన్వయములు బాగుగనేయు న్నను రెండవ దానిలో పై విధ్యమధికము.

ఇక్షుదండా స్తిలాః శూద్రాః, కాంతాహేమం చ మేదినీ
చందనం దధి తాంబూలం, మర్దనం గుణవర్ధనం
"చెఱకుగడను, సేవకుని .... గుణము వర్ధిల్లును"

పై శ్లోకములోని శూద్ర శబ్దమునకు "సేవకుడు" అనునది నిపుణమగు ననువాదము. ఆ శబ్దము "శుచశోకే" అను ధాతువు నుండి ఏర్పడినదే కాని సేవనార్థము దానియందులేదు. అట్లని శూద్ర శబ్దమును యథాతథముగా ననువదించుట అవివేకమగును. వర్ణవైషమ్య మేర్పడును. పూర్వకాలమున శూద్రులు సేవావృత్తి నాశ్రయించిన వారగుటచే శూద్ర శబ్దమునకు "సేవకుడు" అనునర్థమే చాణక్య హృదయముగా శాస్త్రిగారావిష్కరించిరి.

ప్రశ్నరూపములగు శ్లోకములను అనువదించునపుడు నిర్మాణక్లిష్టతలేకుండ జాతీయత చెడకుండ చూచుట అనువాదకుని బాధ్యత.

కవయః కిం న పశ్యంతి, కింన కుర్వంతి యోషితః
మద్యపాః కిం న జల్పంతి కిం న ఖాదంతి వాయసాః

దీనిని యథామూలముగా ననువదించినచో అర్థముగాని వింత వింత తెలుగు వాక్యము లేర్పడును. సంస్కృతాంధ్ర మర్యాదల నెఱిగిన శాస్త్రిగారు ఇట్లనువదించిరి—

"కవులు సూర్యకిరణములు చొరని ప్రదేశములను చూడజాలుదురు. స్త్రీజన మెంతపని యైనను సాధింపగలరు. త్రాగుబోతులు కైపుచే దేహము తెలియక ప్రేలుదురు. కాకి భక్ష్యా భక్ష్యముల నన్నింటిని తినును".

ఇట్లు మూలమును సునిశితముగా పరిశీలించి ఆవశ్యకమైనప్పుడు, పెంచి, వివరించి, తొలగించి సరళము, సుబోధకమునగు శైలిలో యనువాదమును సాగించి శాస్త్రిగారు కృతార్థులైరి.

— ० —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ కృష్ణ ప్రబోధము

ఇది భగవద్గీతకు సీసమాలికలలో చేయబడిన స్వతంత్రానువాదము. అసంపూర్ణము. అముద్రితము. పంచమాధ్యాయము వఱకు ఇందనూదితము.

భగవద్గీతకు అనువాదములు, వ్యాఖ్యానములు, తాత్పర్యములు ఎన్నియున్నవో ఎన్నుటకు వీలులేదు. సాధారణముగానవి యన్నియు ప్రతి శ్లోకానువాదములే. ప్రకృతానువాదము స్వతంత్రమైన సంక్షేప మార్గమున సాగినది. ధృతరాష్ట్రి, సంజయ, అర్జునాదుల ప్రశ్నలిందుండవు. కేవలము శ్రీకృష్ణుని ప్రబోధము మాత్రమే ఆ ప్రశ్నలను గర్భిత మొనర్చుకొని సాగుచుండును. అందుచేతనే దీనికి భగవద్గీతానువాదమని కాక "శ్రీకృష్ణ ప్రబోధమను" స్వతంత్ర నామకరణము జరిగెను. శ్రీకృష్ణ వచనములు కూడ యథామూలములుకావు. ముఖ్య శ్లోకములు మాత్రమే అనూదితములు.

ఇందలి ప్రథమాధ్యాయము అర్జున విషాదయోగముకాదు. నానా మోహాకృష్టుడగు అర్జునునకు శ్రీకృష్ణుడు ధైర్యము నుపదేశించి పౌరుషవంతుని చేయుట ప్రథమాధ్యాయమునందలి విషయము. మూలమున ద్వితీయాధ్యాయములో "ఆత్మకు చావులేదు", "చంపెడివాడవు నీవుకావు" అని శ్రీకృష్ణుడు వేదాంత ప్రబోధముతో అర్జుని కర్తవ్యోన్ముఖుని చేయును. అనువాదము నందలి ప్రథమాధ్యాయమున శ్రీకృష్ణుడు చేసిన ప్రబోధమంతయు దాదాపు స్వతంత్రమే. క్షత్రియధర్మము ధర్మపరిరక్షణము అను రెండంశముల నుట్టంకించుచు శ్రీకృష్ణుడు అర్జునిని కర్తవ్యోన్ముఖుని చేయును. భారత కృష్ణుని వాక్చాతుర్యము. వాదనాపటిమ ఇందు ద్యోతకములగును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీకృష్ణుడు ప్రబోధమునిట్లు ఆరంభించెను—

రాజసూయ మహాధ్వరమున ధనంజయా!
జయము గొన్నది రణస్థలుల గాదొ
మత్స్య యంత్ర విభేదమహి ద్రౌపదీ స్వయం
వరమున గెల్పు సంగరము కాదా
ఘోషయాత్రను విజిగీషు గంధర్వుల
బొగడుగన్నది యుద్ధముననె కాదొ
తలచు నుత్తర మహత్తర గోగ్రహణమున
యశమును సాంపరాయమున గాదొ

అని అర్జునుని పూర్వ విజయములను జ్ఞప్తికి తెచ్చెను. అజ్ఞాతవాసము పూర్తియై నపుంసకత్వము బోయిన తరువాత కూడ ఆ తీరేల యని చురక తగిలించెను. 'క్లైబ్యం మాస్మగమః పార్థ' అను మూలమునకది కవితారూపము. సత్యము, ధర్మము, నీతి, సదాచారములకు హాని కలుగునప్పుడు వానిని రక్షించుట క్షత్రియ ధర్మము. స్థానమందు చేయదగినది అస్థానమునందు చేయరాదు. దోషమును శిక్షింపవలెను గాని సైరణచేసినచో అది మరింత వృద్ధి యగును. ఆహారమునకే సంహారములు జరుగుచుండగా ధర్మ సంస్థాపనకై సంహారము జరుపుట దోషమెట్లగును ?

రత్నదర్పణమట్లు రాజిలు సత్యమ్ము
నన్నృతంపు మాలిన్య మలమునపుడు
ఉక్కు విధంబున మిక్కలి సారంబు
కలధర్మపు నఘంబు క్రమ్మినపుడు
తచ్చినయట్లు శుద్ధంబైన నడవడి
జార చోరత్వముల్ మీరునపుడు
బడుగు పేదకును నిర్భయతను గలిగించు
దక్షతగల నీతి దప్పినపుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హాని నణగింప యుద్ధముల్ వఱలె జగతి
బాగుగ దలంచి చూడుము పార్థ ! యెదద
అనుచితమ్మున నవివేక మతిశయిల్లు
ప్రకృత మెఱిగి సుధీ! స్వధర్మమున నిలుము

నీ శరాగ్నికి నాహుతులై తమ శరీరములు పవిత్రము లగునని, శిష్యుని చేతిలో ఓటమి నందవలెనని భీష్మద్రోణాదులిట చేరిరి. వారు నీకన్న మిన్నలని భయపడకుము. వీరమాత తనయుడవు వీరపత్నికిష్టుడవు. వంశప్రతిష్ఠ నిలుపవలె గాని వెఱపు నెఱపదగదు.

తలను కేలను మేనను తగిన వీర
రసము లాంఛనముల దాల్చి రాణబొల్చి
మదిని కరుణరసంబును పదిలపఱుప
నగు రసాభాస మది మెచ్చ రార్యులెపుడు

గురువు కృపామూర్తియై శిష్యుని దీవించుచు ఆ గురువును పూలతో పూజింపవచ్చును. దయమాలి అతడే కయ్యమునకు దిగినచో శిష్యుడును యుద్ధోన్ముఖుడు కావలెను. నీవు తప్ప తక్కినవారెల్లరును యుద్ధోత్సాహులగుచున్నారు. రథము దిగి పారిపోవు నుత్తరకుమారునకు వీరధర్మమునుపదేశించిన నీవు చుట్టములను చూచినంతనే పిఱికివౌట తగునా ? ధర్మరక్షణకై ఎవ్వరినైనను చంపదగును. కులము నశించినను సనాతన ధర్మము నిలుచును. నీ చేతిలో చచ్చిన ఈ పాపులకు స్వర్గము లభించును.

కరముఖాదులు లేకున్న దురమొనర్ప
వలను పడమిని మూర్తు లేర్పడగ వలసె
గావున నధర్మ మెల్లను కౌరవులుగ
ధర్మమెల్లను మీరుగా దనరినారు

ఏ యుగమునందైనను ధర్మమే జయించును. ఈ యుద్ధము నిమిత్తమాత్రమే. చింతమానుము. 'మమ' అను అక్షరములు బంధకారణములు. 'న మమ' అను అక్షరములు మోక్షకారణములు. నీవు ఈ యుద్ధము చేయకున్నచో త్రాగు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బోతులు, జూదరులు, జారచోరులు, కోడెగాండ్రు, వంచకులు, నాస్తికులు ప్రబలి పోయెదరు. రాయబారములు నడపి, నిర్ణయములు చేసినది నేను సారథిగా నీ వైక్లబ్యమును చూచుటకు కాదు. అని కృష్ణుడు ప్రబోధించెను.

కృష్ణుని రాజకీయ చాతుర్యమునకు దర్పణముగా నీ అధ్యాయము తీర్చ బడినది. కాంతామిత్ర ప్రభు సమ్మితత్వ సమ్మిళితమగు నీ యుపదేశపు ఫక్కి తిక్కనగారి త్రోవ త్రొక్కినది. ఈ అధ్యాయము ఇరువది పద్యములు. తక్కి నవి ఒక్కొక్క అధ్యాయము ఒక్కొక్క సీసమాలిక.

సాంఖ్యయోగము :

ఇది ద్వితీయాధ్యాయము. మూలమున శ్రీకృష్ణ భాషితములరువది శ్లోకములు. అనువాదమున ఇరువది తొమ్మిది సీసపాదములు. అనువాదము అక్లిష్టము, సహజ సుందరము.

'సిద్ధ్య సిద్ధ్యోః సమోభూత్వా, సమత్వం యోగ ఉచ్యతే'

'సిద్ధించినను పని సిద్ధింపకున్నను
సమత వర్తిలుట యోగమనబడును.

'కర్మణ్యేవాధికార స్తే మా ఫలేషు కదాచన
మా కర్మ ఫలహేతుర్భూః మాతే సంగో స్త్వకర్మణి
'ఫలము కోరక చేయవలయు స్వధర్మంబు
నేమి చేయకయుంట యెపుడు తగదు'

'ఫలము కోరక చేయవలయు స్వధర్మంబు' అనునది వేదశాసనము వంటి అనువాదము.

కర్మయోగము :

ఇది తృతీయాధ్యాయము. భగవద్భాషితములు నలువది అనుష్టుప్పులు. అనువాదము ఇరువదిమూడు సీసపాదములు.

ఇష్టాన్ భోగాన్ హి వో దేవా దాస్యంతే యజ్ఞభావితాః
తైర్దత్తా న ప్రదాయైభ్యో యో భుంక్తే స్తేన ఏవ సః

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పుడమి వారలు యజ్ఞముల వేల్పులం దన్ప
వాన బండింతురు వారు పెల్ల
వారొసంగినదాని వారి కీయక తిను
వాని కంపెను దొంగ వసుధ లేదు

అనువాదములోని తెలుగుదనము, అనుష్టుప్పూర్వ భాగమునకు వివరణ ప్రాయముగా జరిగిన ఆంధ్రీకరణము గమనింపదగినవి. ఎత్తుగీతి లేకపోవుటచే ఇంకను కొన్నిపాదములను వ్రాయదలచినట్లు భావింపవచ్చును.

జ్ఞానయోగము :

చతుర్థాధ్యాయము. నలుబదిరెండు అనుష్టుప్పులకు అనువాదము. ఎనుబది నాలుగు సీసపాదములు. ఈ అధ్యాయమున మూలము యథాతథముగా ననూదితము. జ్ఞానయోగముపైనున్న మక్కువచే కాబోలును శాస్త్రిగారిందొక్క అక్కరమును కూడ విడువలేదు.

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః
తస్య కర్తారమపి మాంవిద్ధ్యకర్తార మవ్యయమ్

నే నేర్పరించిన నియతములౌ గుణ
కర్మలంబట్టి లోకంబు నందు
వర్ణాశ్రమంబుల వరుస నిర్మించితి
నన్యోన్య సంబంధ మందగింప

ఇందు 'అన్యోన్య సంబంధమందగింప' అనునది అమూలకము. మూలమునకు వ్యాఖ్యానము. ఇట్లే 'వర్ణధర్మమ్మును వర్ణమ్ము వేఱుగా దనర దేనాదుబూ(దావి యట్లు' అను పాదము కూడ మూలమునకు వ్యాఖ్యానమే.

'నాయం లోకోऽస్తి న పరో న సుఖం సంశయాత్మనః'

'రెంటికిం జెడినట్టి రేవడౌ గలుగదు
హాయి యెందును సంశయాత్మునకును'

మూలభావమునకు తగిన తెలుగు సామెత నుపయోగించుటచే తత్త్వ విషయము కూడ సజీవమగును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కర్మసన్న్యాసయోగము :

పంచమాధ్యాయము. ఇందు భగవత్సూక్తములు ఇరువది యెనిమిది శ్లోకము లుండగా అనువాదము ఇరువది యైదవ శ్లోకముతోనాగి పోయినది.

'యోఽన్తః సుఖోఽన్త రారామ స్తథాంతర్జ్యోతి రేవ చ
స యోగీ బ్రహ్మనిర్వాణం బ్రహ్మభూతోఽధి గచ్ఛతి'

'లోహాయి లోవెల్గు లోఁ గను నాతండె
యోగి బ్రహ్మానంద మొందగలడు'

పుటల కొలది వ్యాఖ్యానము నపేక్షించు తత్త్వవిషయములను పారిభాషిక పదములే లభింపవని ఈసడింపబడుచున్న తెలుగుభాషలోనికి, మూలముతో పోటీ పడు అలతియలతి మాటలతో అల్పాక్షరములలో ననల్పార్థము లభించునట్లు అనువదించుట అభినందనీయము. 'లోహాయి' 'లోవెల్గు'వంటి పదములు తెలుగు వేదాంతులకు పారిభాషికములగును కదా !

సంస్కృతమున శాస్త్రవిషయములను చెప్పుటకు అనుష్టుప్పు ఎంత అను వైనదో తెనుగున సీసపద్యమంత అనుకూలమైనది. ఛందస్సునకు శాస్త్రమును బలిపెట్టకుండ స్వేచ్ఛగా సాగిపోవుటకు పై వానిలో అవకాశములు మెండు. ఈ రహస్యమును గుర్తించి సీస మాలికలలో విలువైన, సులువైన అనువాదము నారంభించిన శాస్త్రిగారు దానిని కర్మసన్న్యాసయోగమున విడచివెళ్ళుట ఆంధ్రుల దురదృష్టము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఔచిత్య విచారచర్చ

అనౌచిత్యాదృతే నాన్యద్రసభంగస్య కారణం
ప్రసిద్ధౌచిత్య బంధస్తు రసస్యోపనిషత్పరా

అను ఆనందవర్ధనుని కారిక ఆధారముగా క్షేమేంద్రుడను నాలంకారికుడు. ఔచిత్యమే కావ్యమున కాత్మయని ప్రతిపాదించుచు ఔచిత్య విచార చర్చ యను నొక గ్రంథమును రచించెను. అందనేక విధములగు ఔచిత్యములను నిర్ణయించి వానికి పూర్వమహాకవ్యుదాహరణములతోపాటు స్వీయోదాహరణములను చూపుచు అనౌచిత్యమునకు కూడ తన కావ్యశ్లోకములను కొన్నింటి నుదాహరించిన సమ చిత్తుడు. ధ్వనిమార్గమునకు వ్యతిరేకి కాకుండ ఔచిత్యమును గూర్చి వివరించిన ఔచిత్య విచారచర్చకు నలంకార గ్రంథములలో ప్రత్యేకస్థానము లభించెను.

శ్రీయుతులు జమ్ములమడక మాధవరామశర్మగారు, వేదాల తిరువేంగళాచార్యులుగారు ప్రభృతులు ఆలంకారిక గ్రంథములను తెలుగునకు తెచ్చుటయును, శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు కావ్యాదర్శమును యథాతథముగా పద్య రూపమున ననువదించుటయు పరికించి శాస్త్రిగారు కావ్యాదర్శమార్గమున ఔచిత్య విచారచర్చ ననువదించిరి.

క్షేమేంద్రుడు సప్తవింశత్యౌచిత్యభేదములను చెప్పగా అనువాదము ఆఱు భేదముల వఱకే లభించెను. మొత్తము గ్రంథము పూర్తియయ్యెనని శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తిగారు చెప్పిరి. నాకు లభించిన వ్రాత ప్రతి శాస్త్రిగారి రెండవ కుమారులు శ్రీ బ్రహ్మానందం సాపువ్రాసినది. వారినడుగగా దానిని గూర్చిసరిగా జ్ఞాపకము లేదనిరి.

క్షేమేంద్రుని లక్షణ శ్లోకములు, ఇతరుల ఉదాహరణ శ్లోకములు కూడా యథాతథముగా ననూదితములు. లభించిన గ్రంథము కొలదియగుటచే లఘుఫక్కియ మొనర్తును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాదమునకు ముందు క్షేమేంద్రుని జీవిత పాండిత్య విశేషములను తెలియజేయు పీఠిక యున్నది.

.... క్షేమేంద్రుడు కావ్యక్షేమమును గుర్తించిన కుశాగ్రబుద్ధి. కాళిదాసునివలె నుపమాలంకారమున పేరొందినవాడు. పౌర్విక శాస్త్ర వాఙ్మయము, పౌరాణిక శాస్త్రవాఙ్మయము ఛందస్సు మొదలయిన కవితా సామగ్రిని విసువు లేక సక్రమముగా బరిశీలించిన మహాయోగి. శతాధిక గ్రంథకర్త........

ఈ విధముగా క్షేమేంద్రుని గూర్చి వివరించిన పిదప అతడొసగిన యుదాహరణముల "క్రమణిక" నొసంగిరి. దీనిలో నుదాహృత గ్రంథ కర్తృనామము, ఔచిత్యానౌచిత్య భేదము, ఔచిత్య భేదము, గ్రంథ నామము అను నాలుగంశము లున్నవి. మొత్తము ఎనుబదితొమ్మిది యుదాహరణముల వివరములీయనుక్రమణిక యందు కలవు.

పై పీఠికను, అనుక్రమణికనుబట్టి చూడగా అనువాదము మొత్తము పూర్తియై అలబ్ధమైనట్లు తోచును.

అనువాద పరిశీలనము :

కావ్యస్యాలమలంకారైః కింమిథ్యా గణితైర్గుణైః
యస్య జీవితమౌచిత్యం విచింత్యాపి నదృశ్యతే [శ్లో. 4]
బాహ్యము లలంకృతులు కడుబరగుగాక
గుణము లాహార్యకములు పెక్కులగుగాక
వెదకినను ప్రాణమౌచితి వెలయదెందు
నట్టి కావ్యంబు జగతి నిరర్థకంబు

"విచింత్యాపి" అను మూలమునకు "వెదకినను" అనునది తెలుగుదనముట్టిపడు ననువాదము. "కావ్యస్యాలం" అను సంస్కృత భాషా చమత్కారమునకు "నిరర్థకంబు" సమర్థమగు సమోక్తి.

ఇక నౌచిత్య భేదముల నరసినచో నన్నువాదకుని సామర్థ్య మెల్లుకపడును,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పదౌచిత్యము :

తిలకం భిభ్రతీసూక్తి ర్భాత్యేకముచితం పదం
చంద్రాననేవ కస్తూరీకృతం శ్యామేవ చందనం
ఒక్కడే యగుగాక సముచితమయిన
పదము సూక్తికి ప్రస్ఫురత్పరిమళంబు
శ్యామకుం జందనంబటు చంద్రముఖికి
కమ్మకస్తురియటు తిలకముగ మెఱయు

"ఏకముచితం పదం" అనుదానికి "ఒక్కడేయగుగాక" నుడికారముతో శక్తిమంతమగు ననువాదము.

ఇట్లుదాహరణ సహితముగా మూలాభిప్రాయమును సమర్థముగా తెలుగునకు తెచ్చిన ఈ "తెనుగు ఔచిత్య విచారచర్చ" సమగ్రమైయున్నచో సాహిత్య విద్యార్థులకెంతో సహకారియై యుండెడిది.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తృతీయము
స్వతంత్ర కావ్యోల్లాసము

శాస్త్రివరేణ్య రచనారత్నహారమున స్వతంత్రకావ్యోల్లాసము మధ్యమణి స్థానీయము. వర్ణనానైపుణ్యము, కల్పనాకామనీయకము, కథాకథన చాతుర్యము, రసధ్వన్యలంకారాది ప్రస్థానములు, భాషావిశేషములు, మున్నగు సర్వకవితా సామగ్రికి నికషస్థానము. ఏదో కవిత్వము గిలకగల వారెల్లరు కావ్యరచన చేయ లేరు. కవిత్వమదృష్టవిలాసము. కావ్యకర్తృత్వమదృష్టవిశేషము.

శాస్త్రిగారి స్వతంత్రరచనలు మొత్తము పదునాలుగు. వానిలో 'శ్రీ రామకృష్ణ పరమహంసగీతా' అసంపూర్ణ సంస్కృత రచన. తక్కినవానిలో 'శ్రీహేరంబ స్తుతి.', 'కోదండరామస్వామినిత్యసేవావిధి', స్తుతిరచనలు. 'రామదాసుచరిత్రము' ప్రబంధము. 'శుకరంభా సంవాదము' తెలుగులో ప్రప్రథమ వక్రోక్తికావ్యము. 'ఉద్యానము' కాల్పనిక కావ్యము. 'చాటూక్తిరత్నాకరము' ఖండకావ్యసంపుటి. 'మాయావిలాసము', 'త్యాగరాజు', 'గురుచరిత్ర', 'ఉపదేశము' 'సులక్షణో పాఖ్యానము', 'శ్రీమదమరావతీ క్షేత్రమాహాత్మ్యము' 'శ్రీ జయదేవచరిత్రము' రసవల్లఘుకావ్యములు.

ఫుల్లాంభోజ మరంద మాధురికి దీప్పల్ దిద్దునొక్కొక్కచో
మల్లీసూన పరీమళోల్లసనమున్ మన్నించు నొక్కొక్కచో
వాల్లభ్యంబు వహించు బల్లవమృదుత్వస్ఫూర్తిపై నొక్కచో
చల్లా పిచ్చయశాస్త్రి! తావక మనోజ్ఞప్రౌఢ సాహిత్యముల్ *

అని సమకాలిక కవిపండిత సన్నుతులనందుకొన్న శాస్త్రిగారి మనోజ్ఞ ప్రౌఢసాహిత్య సమాలోకనమే ఈ స్వతంత్ర కావ్యోల్లాసము.

—o—

* శ్రీ దీపాల పిచ్చయ్యశాస్త్రి, షష్టిపూర్తి సంచిక, పుట. 8.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హేరంబస్తుతి

గణపతి ప్రీతిగా శాస్త్రిగారు చిన్నతనమున సమర్పించిన నక్షత్రమాలయే ఈ హేరంబస్తుతి. ఇది వారి తొలి రచనము. సుమారు పదునారేండ్ల ప్రాయమున వ్రాసినట్టిది. కాశిలో విద్యాభ్యాసము చేసివచ్చిన శాస్త్రిగారి తొలిగురువులు బ్రహ్మశ్రీ పాతూరి రామస్వామి శాస్త్రిగారు ఉత్తరదేశమున జరుపబడుచున్న గణపతి నవరాత్రోత్సవముల స్ఫూర్తితో ప్రతి సంవత్సరము తమ విద్యార్థులతో కలసి సాహిత్య గణపతి నవరాత్రోత్సవములు నిర్వహించెడివారు. అట్టి సందర్భములో స్వామికి సమర్పింపబడినదియే ఈ నక్షత్రమాల. 'హేరంబా! కృపాంభోనిధీ! అనునది మకుటము.

శాస్త్రిగారి కవితా వికాసములోని ప్రాథమిక దశను పరిశీలించుటకు ఈ స్తుతి యుపకరించును. భాషావ్యాకరణము లభ్యసించుచు భావానుకూలముగా వానిని ఛందస్సులలో బిగించుటకు ఆదిపూజ్యునర్చించి భవ్యాభ్యుదయమునందుటకై యొక బాలకవి చేసిన ప్రయత్నమే ఈ స్తుతిరత్నము.

ఇందు భక్తి ప్రపత్తులకు లోటులేదు. భావావేశమునకు తక్కువలేదు. చమత్కృతికి కొఱతలేదు. సంస్కృతాంధ్ర భాషా ప్రయోగములయెడ జంకులేదు. కాని శయ్యలో సమత ఏర్పడలేదనవచ్చును. భావమును ఛందస్సు అనుకరించుట కాక ఛందస్సువెంట భావము నడచుట కానవచ్చును. పోతపోసినట్లుండు తనదైన చక్కని శైలిని, ఛందోఽధికారమును, నిర్దుష్టప్రయోగనిష్ఠను. భవిష్యత్కాలమున సంపాదింపబోవుచున్న శాస్త్రిగారి బాలసరస్వతియైన ఈ స్తుతిలో నాయా సాముద్రిక సామగ్రి సమగ్రముగా ప్రత్యక్షమగును.

ఈ స్తుతియందు వ్యాజస్తుతులు, వక్రోక్తులు, ఎత్తిపొడుపులు మొదలగునవి అధికము.

అల నారాయణు డెట్టి పేరు బడె ప్రహ్లాదాదులంబ్రోచి కా
పలివాడై యల బాణునింట గిరిజాప్రాణేశు డీ భూమి భ
క్తులచే నెంతటి సంస్తుతుల్ వడసె నీకుందెల్లమా గాదె దు
ర్బలత న్నీవటు సేయవేమి బళి హేరంబా! కృపాంభోనిధీ!

ఇట్లు అనేక విధముల నిందించినను అనన్యమైన భక్తిభావము చెక్కుచెదరలేదు. హేరంబుడొక్కడే దైవమను విశ్వాస మీరీతిగా వ్యక్తము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గగనమ్మందు రవీందురూపుగను నాకమ్మందు దేవేంద్రు రూ
పుగ విద్యాత్మను బ్రహ్మలోకమున నంభోజాక్షభావమ్ముచే
దగ వైకుంఠమునందు శూలిగను శ్వేతక్ష్మాధరన్బొల్చు ధీ
ర! గణేశా! మిము నెంచగా దరమె హేరంబా: కృపాంభోనిధీ!

కృత్యాదులందు మ్రొక్కుబడిగా విఘ్నేశుని స్మరించినవారే గాని ఆంధ్ర కవులలో ఇంతటి గాఢమైన గాణాపత్య మెఱెగినవారు లేరని చెప్పవచ్చును.

వృత్తౌచిత్యము :

ఇందలి మకుటము మత్తేభ శార్దూల వృత్తములకు తగినట్టిది. అయ్యును మత్తేభముఖుని స్తుతికి మత్తేభ విక్రీడితమును మాత్రమే ఉపయోగించి కవి వృత్తౌచిత్యమును పాటించెను.

శకట సాధు రేఫములకు యతిప్రాసమైత్రి పాటింపబడినది. యతిస్థానమునకు ముందునుండి మకుటము నేర్పరుచుట తొలినాళ్ళలో సాహసమే. అదియుగాక అసలు బంధువర్గమే లేని రేఫమును యతిస్థానమున నుంచుట మరింత సాహసము. 'చేతును' అను ప్రయోగమున్నది. ఇది చాలమంది కవులు కావించినదే. 'దరాస్యా' అను సంబోధనము యొక్క యాథ్యర్థము అవగతమగుటలేదు. అల్పమైన నోరుకలవాడా! అని చెప్పవచ్చును. అకారాంతమైన శేషశబ్దము 'శేషువు' అని ప్రయుక్తము. దీనిని ప్రౌఢవ్యాకరణ సూత్రముచే సాధింపవచ్చును*.

స్తుతి అను అర్థములో 'స్తౌత్యము' అను ప్రయోగము చింత్యము.

వక్రోక్తి, ఛేకోక్తి మొదలగు అలంకారములు ఉపయుక్తములు.

భక్తుని ప్రార్థనలాలకించి అపార కవితా సంపదను వర్షించిన హేరంబుడు ఈ స్తుతి మహిమను అంగీకరించి ఆచంద్రతారార్కముగా నందటికిని చాటుచున్నాడు.

—o—

* ప్రౌ. వ్యా., శబ్ద. సూ. 25.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ రామదాసు చరిత్రము

ప్రహ్లాదాది పరమ భాగవత శిఖామణుల స్థాయికి చేరదగినవాడై భద్రాద్రి చరిత్రతో పెనవైచుకొనిన భక్తాగ్రేసరుడు రామదాసను నామాంతరమున ప్రసిద్ధుడగు కంచర్ల గోపన్న. ఇతని చరిత్రము ఐదాశ్వాసములతో సుమారు 700 గద్య పద్యములతో ప్రౌఢప్రబంధముగా శాస్త్రిగారిచే నిబంధింపబడినది. శ్రీభువనగిరి కోదండపాణి గారి ద్రవ్యసహాయమున 1926లో ముద్రించబడినది.

చరిత్రోపలబ్ధమైన కథ సమయోచిత వర్ణలతో ప్రబంధలక్షణ యుక్తముగా స్వతంత్ర కల్పనలతో రసభావాది నిర్ణయములతో ప్రబంధముగా తీర్చి దిద్ద బడినది. తామీ కథను ఎన్నుకొనుటకు నాయకునిలోగల ఔన్నత్యమును గూర్చి శాస్త్రిగారు పీఠికలో ఇట్లు చెప్పిరి.

'ఇంద్రియముల నియమించి సమత్వము గలిగి మైత్రీ కరుణాదులు వెలయ మమత్వము వీడి యహంకారము పోద్రోలి సుఖదుఃఖము లొక్కటిగా గని యోరిమి మెఱయ సంతుష్టియొప్ప యోగారూఢి నెలకొన నిశ్చయయాథార్థ్యము పాదుకొన బరిశ్రేయస్సహనము ప్రబల సంగము ద్యజించి సర్వారంభముల విడనాడి యెందును జొరక నిందాస్తుతుల హర్షామర్షముల పాల్గాక మౌనముద్ర నెడబాయక చింతిలక, శౌచము మసలక దక్షత్వమున దలగక యపేక్ష గొనక యున్నదని యుబ్బక వచ్చుచున్నదని కోరక లేదని వగవక యవస్థాత్రయ మందును హరి యందు జొచ్చి సర్వప్రయత్నములు దదర్పితంబులొనర్చి పేరందిన ప్రహ్లాదాది పరమ భాగవత శిఖామణుల యెన్నికకు జేరదగినవాడు యీ చరిత్ర మందలి రామదాసుడు, భక్తుని కొనియాడుట భగవన్నుతియే అగునని భావించి 'ఇట్టి మహాత్ముని చరితము పద్యాత్మకముగా వ్రాయుట సుకృత పరీ పాకమున నాకు లభించినది' అని శాస్త్రిగారు పోతనగారివలె పొంగిపోయిరి. కవిత్వ రచన మారంభించి నప్పటినుండి తుది వరకు భక్తియే శాస్త్రిగారి కవితా లతకు ఆలంబనమై యొప్పినది. కావుననే పాతిక ముప్పదియేండ్ల నిండు జవ్వనమున కూడ ప్రబంధ రచనకు రామదాసు చరిత్రనే యెన్నుకొనిరి. ఇందు ప్రతిపద్యము ఇందు పేశలము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవితాధార వడపోత పెట్టిన ఇక్షురసము. వర్ణనలు నవీనములు. శాస్త్రిగారి కవితా సర్వస్వము నందు ఈ ప్రబంధమే మేరుమణి అని చెప్పవచ్చును.

చారిత్రక నైపథ్యము :

గోపన్నగారి ఇంటి పేరు కంచర్లవారు. తల్లి పేరు కామమ్మ, తండ్రిపేరు లింగనమంత్రి. నివాసము తెలంగాణమునందలి నేలకొండపల్లి. ఆత్రేయ గోత్రము. ప్రథమ శాఖీయులని చెప్పబడుచున్నది.*1650 నుండి 1687 వరకు గోల్కొండ సామ్రాజ్యము పరిపాలించిన 'అబూహసన్ కుతుబ్ షాహి' వద్ద దివానులుగా ఉండి ప్రసిద్ధులైన అక్కన్న మాదన్నలు గోపన్నగారి మేసమామలుగా చెప్పబడుచున్నారు. రామదాసును బంధించిన తానీషా అసలు పేరు 'అబూహసన్ కుతుబ్ షాహి' ఇతని కాలమును బట్టి గోపన్నగారు పదునేడవ శతాబ్దము వాడని తెలియుచున్నది.** 1620 నుండి 1680 వరకు జీవించినట్లు బాలాంత్రపు రజనీకాంతరావుగారు నిర్ణయించిరి.*** రామదాసు చరిత్రమునకు సంబంధించి ఇంత వరకే చారిత్రక ఆధారములు. తక్కిన కథయంతయు రామదాసు గారి కీర్తనల వలన, పరంపరాగతములైన జనశ్రుతులవలన నిర్మితము.

రామదాసు తహసీల్ ధనమును భద్రాచల ఆలయోద్ధరణముకై వినియోగించి గోల్కొండ నవాబుల చెరసాలలో పడియుండగా రామలక్ష్మణులు మారువేషములలో ఆరులక్షల మొహరీలు తానీషాకు సమర్పించి రామదాసును బంధవిముక్తుని చేసినట్లు జనచరిత్రము చెప్పచుండగా కొందరాంగ్లేయ చరిత్రకారులు, తురుష్క చరిత్రకారులు రామదాసు బంధిఖానాలో ఉండి పైకము చెల్లించనందున విడుదలకాక అందే మృతినందెనని వ్రాసిరట. అట్లైనచో నైజాము వారిప్పటికిని కైంకర్యాదులు చెల్లించు అవసరమెట్లు కల్గెను? అనుశంకకు సమాధానముగా తానీషా గారి కుమార్తె రామదాసును వలచి కృత్రిమము చేసి విడిపించెననియు

* రామదాసు చరిత్రము పీఠిక వెంకటేశ్వర్ అండ్ కంపెనీ, మద్రాసు, [1931] పుట [16.]

** అందే, పుట [18]

*** ఆంధ్రవాగ్గేయకార చరిత్ర, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ [ద్వి. ము. 1975] పుట. [194.]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కొందరు వ్రాసిరట.* సత్యాసత్యములు చరిత్రకెరుక. గోల్కొండ నవాబులు భద్రాచలస్వామి కైంకర్యమునకై ఫర్మానా ఒసంగిన మాట యథార్థమే; అది నేటికిని అమలు జరుపబడుచున్నది.

ఆకరములు :

రామదాసు చరిత్రమని వాడుకలోనున్న గ్రంథములు తాళపత్ర ముద్రిత రూపములో నున్నవి. ఇవి రెండు విధములుగా కనబడుచున్నవి. మొదటిది ప్రాయికముగా 'రామదాసు సంకీర్తనలు' అను పేరుతో కథానుసారముగాకున్నను మొత్తము కీర్తనల నన్నింటిని కలిగియుండును. రెండవది సంధాన గ్రంథము. అనగా రామదాసు కథను గేయ చరిత్రముగా కూర్చునపుడు సందర్భానుసారముగా రామదాసుగారి కీర్తనలు జతపరుచ్చు, కథసాగుటకై నడుమ నడుమ తోహరాలు కొన్ని ప్రాచీన శతకరాజములలోని పద్యరత్నములను అచ్చటచ్చట చేర్చి హరికథారూపమున కూర్చబడినట్టి గ్రంథము.**

ఇట్లు రామదాసుగారి గేయములచే కూర్చబడిన చరిత్రతక హరికథా రూపమున వ్రాయబడిన వానిలో కంచివరద రామదాసు అనుభక్తుడు వ్రాసిన చరిత్రము ప్రాచీనతమము. ఇతడు రామదాసునకు దాదాపు సమకాలికుడై కన్పట్టుచున్నాడు.*** ఇతని రచనమును సింగరిదాసను మహాభక్తుడు సంగ్రహరీతిని సంకలనము చేసెను. ఈ గ్రంథము మిక్కిలి ప్రసిద్ధిచెందినది. దీనిని ఆర్. వెంకటేశ్వర్ అండ్ కంపెనీ, మద్రాసు వారు ముద్రించిరి. ఇదిగాక తిరుకడయూరి కృష్ణ దాసుగారిచే మరియొక రామదాసు చరిత్రము హరికథా రూపమున రచింపబడినది. దానిని అనేక ప్రాచీన ప్రతుల సాహాయ్యముతో పరిష్కరింపజేసి వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్ మద్రాసు వారు 1911లో ప్రకటించిరి. సింగరిదాస కృష్ణదాసుల రచనలలో కథా విషయమున స్వల్పములైన వైషమ్యములున్నను సామ్యమే అధికముగా నున్నది. ఇరువురకును వరద రామదాసు గ్రంధమే ఆధారమగుటచే కాబోలు అనేక పంక్తులు ఉభయత్ర సమానముగా నున్నవి.

---

*. రామదాసు చరిత్రము పీఠిక వెంకటేశ్వర్ అండ్ కంపెనీ, మద్రాసు, 1931. (ఉ.వే. శ్రీ విద్యారణ్య పంచానన వికిరాల రామచంద్రాచార్యులు చెప్పినట్లు) పుట. 26.

**. అందే పుట. 35.

*** పుట. 26,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ విధముగా పరమ భాగవతోత్తముడైన రామదాసు చరిత్రము గేయ రూపమున మాత్రమే ప్రచలితమై పండిత ప్రియమైన పద్య ప్రబంధరూపమునకు ఎక్కకపోవుటను గమనించి శాస్త్రిగారు దానిని ప్రబంధముగా మలచిరి. కావుననే 'ఇట్టి మహాత్ముని' చరితము పద్యాత్మకముగా వ్రాయుట సుకృత పరిపాకమున నాకు లభించినది' అని వ్రాసుచ్చిరి.

కథలోని మార్పులు :

గేయ ప్రబంధములలో లభించుచున్న కథకు శాస్త్రిగారి ప్రబంధములో కొన్ని మార్పులు చేర్పులు కనిపించుచున్నవి.

శాస్త్రిగారి ప్రబంధములో నేలకొండపల్లి ప్రముఖమైన అగ్రహారముగా వర్ణింపబడినది. గురువులయొద్ద బాలరామాయణము చదువునప్పుడు గోపన్న రామ భక్తుడైనట్లు గేయ చరిత్రలో నుండగా ఒక పౌరాణికుడు రామాయణము పురాణము చెప్పుచుండగా శ్రద్ధగా విని జ్ఞానవంతుడైనట్లు శాస్త్రిగారు వ్రాసిరి. గోపన్న రామాయణములోని ప్రముఖపాత్రలను ఉద్దేశించి ప్రసంగించినట్లు శాస్త్రిగారు కల్పించిరి. గోపన్న ఉపనీతుండైనంతనే జననీజనకులు స్వర్గస్థులైనట్లు గేయ చరిత్రలో నుండగా శాస్త్రిగారు దాదాపు ప్రబంధాంతము వరకు గోపన్నగారిని జీవత్తాతపాదులుగా ఉంచిరి. గోపన్న వివాహమై పుత్రోదయమైన తరువాత కబీరు దాసు వచ్చి తారకమంత్రముపదేశించినట్లు శాస్త్రిగారు వ్రాసిరి. గోపన్న బ్రహ్మ చారిగా నున్నప్పుడు తీర్థయాత్రలకేగినట్లు గేయములలో లేదు. దానిని శాస్త్రి గారు కల్పించి అతనిచేత కాశీయాత్ర చేయించి వివాహము జరిపించిరి. గోపన్న గారు నిత్యవిధిగా బ్రాహ్మణ సంతర్పణము చేయునప్పుడు వారి కుమారుడు గంజి గుంటలో పడినట్లు గేయచరిత్రలో నుండగా శాస్త్రిగారు ఆ సంఘటనమును భద్రాద్రి రామాలయ ప్రతిష్ఠోత్సవ సంతర్పణ సందర్భమునకు మార్చిరి.

రామదాసు దారిద్ర్యము నొంది అతిథిసేవాదులు నెఱపుటకు ధనములేక తన మేనమామల నడుగుటకై హైదరాబాదునకేగినట్లు గేయచరిత్రలో నుండగా రామదాసుగారొకనాడు ధ్యానములో నుండగా అందు శ్రీరాముడు గోచరించి నీకు మహాధికారమొకటి లభించుననియు, మా భద్రాచలాలయమును ఉద్ధరించవలసిన దనియు చెప్పెను. దైవప్రేరణ వలననే అతనికి గోల్కొండకు పోవలెనని సించి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బయలుదేరెనని శాస్త్రిగారు వ్రాసిరి. గేయములలో మొట్టమొదట చేయబడిన గోల్కొండ నగరవర్ణన శాస్త్రిగారిచ్చట చేసిరి. గోపన్న మేనత్త పాత్ర శాస్త్రిగారి సృష్టి.

ఆరు లక్షల పైకము బాకీపడుటచే గోల్కొండనుండి ప్రతినిధులు వచ్చుట రామదాసు బదులు చెప్పకపోవుట తానీషా కోపగించి వానిని బంధించి గోల్కొండకు తెమ్మనుట ఇత్యాదియైన కథను శాస్త్రిగారు పరిత్యజించి చెఱలో నున్న రామదాసు సీతాదేవితో మొరపెట్టుకొనుచుండగా సీతారాముల సంభాషణమున తత్కథ వ్యక్తమగునట్లు చేసిరి. గోపన్న తానీషాల పూర్వజన్మ వృత్తాంతములు గేయచరిత్రలో కథాంతమునందుండగా శాస్త్రిగారు వానిని దాసరక్షణమునకు ముందు రామునిచే సీతకు చెప్పించిరి. గేయములలోని విస్తృతమైన బంధిఖానా ఘట్టము కావ్యమున మిక్కిలి సంగ్రహింపబడినది. ఈరాత్రి తనను రక్షింపనిచో విషపానము చేసెదనని రామదాసు విషపాత్రికను సిద్ధముచేసినట్లు, దానిని రామలక్ష్మణులు ఒలుకబోసినట్లు, గేయములలో నుండగా ఆ కల్పనలోని అసంభావ్యతల నూహించి కాబోలు శాస్త్రిగారు దానిని పరిత్యజించిరి. శ్రీరాముడు తానీషా వేషములో చెఱలోనికేగి రామదాసు కనులు తెఱువగనే అంతర్ధానమైనట్లు కృష్ణదాసు వ్రాయగా తానీషారూపమున రామదాసునకు దర్శనమిచ్చి ప్రసీదిచ్చినట్లు సింగరిదాసు వ్రాసెను. శాస్త్రిగారు సింగరిదాసును అనుసరించిరి. రామాదులు మారు వేషములో వచ్చి రామదాసును గుఱ్ఱముపై నెక్కించుకొని ఆలయములోనికి గొంపోయి తమలో ఐక్యము చేసుకొనినట్లు కృష్ణదాసు, శ్రీహరి ప్రేషితమైన విమానము సాక్షాత్కరించెనని సింగరిదాసు వ్రాయగా శాస్త్రిగారు దానినెల్ల పరిత్యజించి విష్ణుసన్నిధికి చేరినట్లు వ్రాసిరి.

అవతారిక :

శ్రీ కౌసల్యను శైశవంబున మహర్షిన్ శిష్యభావంబునన్,
సాకేతమ్మును రాజవృత్తి మునిచానన్ పాదసంస్పర్శచే
లోకద్రోహుల శిక్షచే జగములాలోకమ్ముచే తేర్చు త
ద్రాకాచంద్రముఖంబు రాఘవ పరబ్రహ్మంబు ధ్యానించెదన్

అను ప్రారంభపద్యములో భవిష్యత్ కావ్యకథలోని రామభద్రుని ఆర్తావనత్వము అనేక విధములుగా చూపబడెను. రాముని జీవితములోని సర్వ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంబంధములు ఆయా జీవులను కాపాడుట కేర్పడినవని, అట్టివానిని నమ్మిన భక్తునికే తుది విజయము లభింపబోవుచున్నదని ఇందలి ధ్వని. రామునొక సామాన్య దేవతామూర్తిగా కాక పరబ్రహ్మ స్వరూపముగా ధ్యానించుట తదేకాగ్ర నిశ్చలభక్తి సూచకము. అతడే సర్వజీవ గమ్యమనుట వ్యంగ్యము. కావున ఈ పద్యము రామైకత్వమును స్థాపించుచు రామునియొక్క, తద్దాసులయొక్క చరిత్రలను సూచించుటకు సమర్థమై ప్రకాశించుచున్నది.

ఈ కృతి భద్రాద్రి రామునకు అంకితము. తదుద్దిష్టముగానే షష్ఠ్యంతములు సాగినవి.

కల్పనాకామనీయకము :-

మున్యాశ్రమ వర్ణనము :

ఇది శాస్త్రిగారు చేసిన ప్రౌఢ కల్పనము. రామదాసుచరిత్రమును సూతుని వంటి ఒక ముని శ్రోతలకు చెప్పుచున్నట్లు కల్పింపబడినది. వారి ఆశ్రమము ఆనందసముద్ర తీరమున ఉన్నది. అచ్చటివారు సర్వ వికృతులకు అతీతులు. నిత్యానందులు. అదుఃఖితులు. ముక్తికాంత అచటనే నివసించును. పరమ హంస సేవితమైన ఒక మహానది అచట ముప్త్రోవల ప్రవహించుచుండును. ఈవిధమైన నిగూఢ సాంకేతిక వర్ణనలతో ముక్తిలోకము ఊహింపబడెను. ఈ ఘట్టము మొత్తము ఉదాత్తవేదాంత భావకల్పనాబంధురము, పారలౌకిక నిష్ఠలేని సామాన్య కవి కిట్టి కల్పన లందవు.

> "పెడత్రోవంబడి చెంగనాల్పటచి కుప్పింపుల్ తురాయించి యే
> కడనుం దాన యెసంగి యుల్కిపడి ఆకాశంబునిల్గట్టి పల్
> దుడుకుల్ చూపెడు లేడి అప్పొలమువిందుం గన్న నైశ్చల్య మే
> ర్పడగా డొక్కల గాళ్ళువెట్టి సుఖనిద్రాముద్రనిర్నిద్రమౌ

అన్ని వికారములు చూపు ఆ లేడి ఆ ఆశ్రమప్రాంతమునకు రాగానే సుఖనిద్రాముద్రతో నిర్నిద్రమౌనట. మనస్సును లేడినిచేసి ఈ పద్యము వ్రాయబడినది. ఆ ఆశ్రమమునందుండు వారెవరనగా—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎందరో యుందురందు విజితేంద్రియు లస్ఖలితుల్ నిరీహు లా
నందమయుల్ నిరామయులు నైష్ఠికులాఢ్యులు పండితుల్ శతా
నంద మహానిధుల్ ఘనులు నాకము మెచ్చనివారు లోక సం
స్పందము లేనివా ర్పరమభాగవతుల్ హరిగాన నిశ్చలుల్.

శ్రీనాథుడు కాశీఖండమున కాశీనగర మాహాత్మ్యమును ఎంత తన్మయత్వముతో వర్ణించెనో అంతకు మిక్కుటముగా శాస్త్రిగారు భద్రాద్రి ప్రశంస చేసిరి.

ప్రథితస్యదము దశరథమనోరథము సం
 స్తుతిసీమ నడపిన చోదనంబు
రహి మిథిలానాథ రాజయోగ నిధాన
 మ్మట్టె చూపిన ప్రసిద్ధాంజనమ్ము
స్మిత చంద్రికాపూర్ణ సీతా శరత్పూర్ణి
 మా భవ్య చంద్రమోహమండలమ్ము
భరతప్రపోషిత భక్తి సంపద్వల్లి
 యలరఁ జేసిన దక్షిణానిలంబు
హనుమదాది మహాభక్తజన మనోజ
వము ఫలము రామచంద్రుండు పాయకుండు
లీలమై యెల్ల విశ్వంబు నేలుకొనుచు
నేర్చి యొకమాద్రి భద్రాద్రి నెన్న దరమె.

పురాణ వేదికా ప్రశంస :

గోపన్న బాల్యమున రామభక్తుడగుటకు కారణముగా ఒక పురాణవేదికను కల్పించిరి. పౌరాణికుని రూపము, పురాణ ప్రవచనము తీరుతెన్నులు ఇందుసమ్యగ్వర్ణితములు.

ఆంధ్రదేశపు పల్లెటూళ్ళయందు పురాణ ప్రవచనములు పూర్వము తరచుగా జరుగుచుండెడివి. అక్షరజ్ఞాన శూన్యులైన కర్షకాదులు సైతము పురాణ కథలయందు నిష్ణాతులై యుండెడివారు. తెలుగువారి పురాణ ప్రవచనము విశిష్టమైనది. తొలుత రాగయుక్తమైన పద్యపఠనము, ఆపై అర్థము, విశేషార్థము వివరణము జరుగుచుండును. తమ గురువులు బ్రహ్మశ్రీ తాడేపల్లి వేంకటప్పయశాస్త్రిగారు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తాము ఎన్నో గ్రామములలో పురాణప్రవచనములు చేసిన అనుభవములను అనుభూతులను శాస్త్రిగారు ఇందు పొందుపఱచిరి.

పురాణము చెప్పుట యనగా పాటపాడినట్లు కథ చెప్పికొని పోవుటకాదు. కథ యందలి మహార్థమును శ్రోతలకు ప్రసన్నము చేయగలిగి యుండవలెను. అట్టివాడే ఉత్తమ పౌరాణికుడు. మన కథలోని పౌరాణికుడట్టివాడు.

రామాయణపాత్ర ప్రశంస :

రామాయణ పురాణశ్రవణము చేసిన గోపన్నకు సమస్త విద్యా రహస్యములు తేటపడి అనుక్షణము రామకథామృత లహరిం దోగుచు అందలి పాత్రలను ప్రశంసించినట్లు కల్పించి రామాయణములోని ముఖ్యపాత్ర లన్నింటిని గురించి శాస్త్రిగారు వాఙ్మయ చిత్రావిష్కరణము చేసిరి. "ఏలా పుట్టకపోతీ నాదే రాముల తోడ" అను పల్లవితో రామాయణ కథా ఘట్టములతో కూడిన ఒక కీర్తన గేయ కృతులలో ఉన్నది. గాని ఇట్టి పాత్ర చిత్రణములేదు.

ఈ శీర్షిక క్రింద అహల్య, జనక, కైక, సీత, లక్ష్మణ, రామ, భరత, సుగ్రీవ, హనుమ, గుహ, శబరి, జటాయు, విభీషణ పాత్రలు స్పృశింపబడినవి రామలక్ష్మణులను గొనిపోవుటకు విశ్వామిత్రుడు వచ్చినప్పుడు "యథార్థముగా అపుడున్న నేను పోనిత్తునె చేతులెత్తియె మరెట్టులో మౌని మరల్తుగాకొగిన్" అనియు, కానక గన్న సంతానమై, పసివారిని విశ్వామిత్రుడు తీసుకొనిపోవుటకై రాదగునా ? అనియు ప్రశ్నించి అంతలోనె "మా రాముడు మాత్రమేమి యొక రాజకుమారుడొ పర్వుగగ్గి మార్కొమిడు భూమినేలుకొన ముద్దుగ మర్త్యతగొన్న శౌరియో" అనియు గోపన్న భావించినాడు.

సీత పాతివ్రత్య సంపత్తి ఇట్లు స్మరింపబడినది :

జిలుగు దువ్వలువకు గలక పాటెడు మేన
గరగరలాడు వల్కలము బూన్చి
పువునుదావికి బుల్కారువేనలి
బాలాతపము చాయ పాలుసేసి
చిలుక ముద్దుల పల్కు పలుకను చెవిదోయి
భయదసత్త్వముల రావములకొసగి
కలువ సోకునకును గందువాటెడు కేల
డాల్కృతి శుష్కకాష్ఠములు విఱిచి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామునకు దోడునీడవై భీమమైన
వ్రతము నిర్విఘ్నముగ మహారణ్య సీమ
పావనముజేసి యిడుమల బడితివమ్మ
తల్లి ! మైథిలి నీను బోలు తరుణి గలదె.

ఈ పద్యమునందలి చమత్కారమేమనగా సీత పరిత్యజించిన లలితమైన వస్తువులన్నియు అచ్చతెనుగు పూర్వార్థములలోను స్వీకరించిన వస్తువులు ఉత్తరార్థమున సంస్కృత శబ్దములతోను చెప్పబడి తెనుగుభాష యొక్క లాలిత్యము ధ్వనితమగుచున్నది.

శాస్త్రిగారి గురువులు బ్రహ్మశ్రీ తాడేపల్లి వేంకటప్పయ శాస్త్రిగారు ఈ పాత్రల కల్పనను చూచి "నేను కష్టపడి రామాయణము వ్రాయుచుండగా నీవు రామదాసు చరిత్రలోనే ఆయా పాత్రలన్నింటిని చమత్కారముగా చొప్పించి చిత్రించితివని" శాస్త్రిగారిని అభినందించిరట.*

తీర్థయాత్రా ప్రశంస :

గోపన వివాహము జరుగుటకు పూర్వము కాశీయాత్ర చేసినట్లు కల్పింపబడినది. ప్రయాణ సౌకర్యములులేని దినములు కావున తీర్థయాత్రవలదని బంధుమిత్రులు ఎంతబతిమాలుకొన్నను గోపన్న చిటుకుచిటుకున చనెనట. శ్రీహరి ప్రియాత్ముడగు వానికి ఆమడలు అడుగులయ్యెను.

ఈ ఘట్టమున ఆనాటి పాదయాత్రాతైర్థికుల అనుభవములన్ని పొందుపరుపబడినవి.

కవి కాబోవుచున్న గోపన్న తాను ప్రయాణించు ప్రాంతమునందలి మాండలికములు చెవినిబడినంతనే మూటముడివిప్పి అందలి తాటాకుల పొత్తమందు వానిని లిఖించునని చేసిన ఊహ కవితా కళా రహస్య వేదిజన హృద్యము.

మనోభూమికలు :

రామదాసుగారు మనస్సును హెచ్చరించుచు వ్రాసిన కీర్తనలు కలవు. అట్టి వాని నాధారము చేసికొని మనస్సునకు మహీజ, తురంగ, పయోద, కరండ,

---

* ముఖాముఖి. శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి, తేది 15-6-84

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మృగేంద్ర, ప్రవాళ, భుజంగ, విహంగ, కురంగ, మహీధరములతో అభేదము చెప్పుచు శాస్త్రిగారు ఒక కల్పన చేసిరి.

మనస్తురంగమును గూర్చి :

అరయపు మిట్టు బిల్లముల నక్కట యొక్కటగూలఁద్రోతు మై
యరవడి గూర్తు పెన్నుఁడును నంకెకురావిది యెల్లమాని నే
ర్పరిగగనమ్ముపై ఖగముపై జన జాలినదిట్టరౌతు శ్రీ
హరిని వహింపుమెంతయును హాయిఘటిల్లు మనస్తురంగమా !

ఇట్టి కమనీయ కల్పనలలో కథాగమనము మెఱుగెక్కి, అశిథిల సంధి బంధత్వము ఏర్పడ ప్రబంధ ప్రణాళిక రూపొందినది.

కథాకథన చాతుర్యము :

కథను పురాణపద్ధతిలో నడపుటకును కావ్యపద్ధతిలో చెప్పుటకును ఎంతయో భేదమున్నది. మొదటి పద్ధతిలో ప్రశ్నలకు తావుండదు. రెండవ పద్ధతిలో కార్య కారణ వివేచనము, ఉత్కంఠను రేకెత్తించు కథన ప్రణాళిక, ఉదాత్తక్రమవి కాసము అత్యావశ్యకములు. కావ్యము యొక్క ముఖ్య ప్రయోజనము ఆనంద మగుటయే ఇట్టి స్థితికి హేతువు.

జన శ్రుతులలో పురాణధోరణిలో ప్రచలితమైయున్న రామదాసు చరిత్రను ప్రబంధీకరించుటకు కథా కథన ప్రబంధత్వమే ప్రథమ సాధనము. సిద్ధమైయున్న కథలో దేనిని ముందు చెప్పవలెనో దేనిని తరువాత చెప్పవలెనో ఎచట పెంచ వలెనో ఎచట కుదించవలెనో ఎట్లు ఉత్కంఠ రేకెత్తించవలెనో తెలిసి తత్ప్ర ణాళికాను సారముగా కథనమును సాగించుటయే కథాకథన చాతుర్యము.

భారత భాగవతాది కథలు ఏ వక్తయో ఒకరికి చెప్పినట్లు కూర్పబడెను. రామదాసు చరిత్ర మాధునికమగుటచే దీనికి అట్టి గౌరవము కల్పించుటకు అవ కాశములేదు. అట్టి కల్పన చేయనిచో కథకు మహిమాన్వితమైన అద్భుత రస స్ఫూర్తి కలుగదు. అంతేకాక భద్రాచలక్షేత్ర భౌగోళికవర్ణనము, భవిష్యోత్తర పురా ణములోని భద్రాచలక్షేత్ర మహిమ సంగ్రహమును కవియే వక్తగా నుండి ప్రధాన కథలో కలిపి చెప్పుట ప్రబంధ మర్యాద కాకపోవుటచే పరమ పదస్థులైన కొందరు భక్తులు పరమ భక్తాగ్రేసరుడైన రామదాసు చరిత్రము చెప్పుకొనినట్లు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కల్పించుట కథాకథన సౌలభ్యమునకు మిక్కిలి ఉపయోగకరము. కవి సృష్టించిన ఆధ్యాత్మిక వాతావరణము భవిష్యత్కథాశ్రవణమునకు శ్రోతలను ఉన్ముఖము చేయుచున్నది.

ప్రధాన కథకు అనుబంధముగా తొలుత వక్త భవిష్యోత్తర పురాణములోని భద్రాద్రి పూర్వ వృత్తాంతమును చెప్పెను. అది ఒక ప్రత్యేక కథ. కావున ఇందు భక్తాగ్రేసరుడైన భద్రుని తపః కథ ఆసక్తికరముగా మలచబడినది. తొలుత చిన్నతనమునుండి భద్రుని కథ క్రమముగానడపి శ్రీరాముడు ప్రత్యక్షమై త్రేతాయుగము నందలి వాని పూర్వజన్మ వృత్తాంతము చెప్పినట్లు మలచుటవలన భద్రుని పాత్రౌన్నత్యము శ్రోతకు కథాంతమున మెఱుపువలె స్ఫురింపజేసినట్లైనది. పురాణమున సూతుడు భద్రపాత్ర ప్రవేశమునకు ముందే వాని పూర్వజన్మ వృత్తాంతమును చెప్పివైచెను.

మూలమున సూతుడు చెప్పిన భద్రాచల క్షేత్ర ప్రాశస్త్యమును రామునిచే చెప్పించుటవలన దాని విలువ మరింత హెచ్చినది. ఉష్ణకుండ, శేషేశ్వర తీర్థము లేర్పడిన శేషతపః కథను భద్రుని కథలో కలిపి రామ క్షేత్రములోని శివకేశవాభేదమును సూచించిరి.

ప్రధాన కథ :

ప్రధాన కథకు రామదాసు కీర్తనలు, గేయ చరిత్రలే ఆధారములగుటచే శాస్త్రిగారు కథాకథనమున ప్రబంధానురూపముగా కొన్ని మెలకువలు చూపిరి.

ఒక వ్యక్తియొక్క మనోవికాసముపై అతడు జీవించు పరిసరముల ప్రభావము ఎంతగానో ఉండును. కావున ఎట్టి సమాచారము లభింపని గోపన్న స్వగ్రామమైన నేలకొండపల్లి పరమ భక్తాగ్రేసరులు, మహాపండితులు నివసించు అగ్రహారముగా తీర్చిదిద్దబడెను. గోపన్న కవిగా మహాభక్తుడుగా సదాచార సంపన్నుడుగా అతిథి సేవాపరాయణుడుగా పెంపొందుటకు తగిన సర్వ వాతావరణమును ఇందు వర్ణితము.

పౌరాణికపాత్రను ప్రవేశపెట్టి అతనిచే రామాయణము ప్రారంభింపచేసి బాలకాండము జరుగుచుండగ తోడి బాలకులతో కూడిన బాలగోపన్నను కావ్యములోనికి ప్రవేశపెట్టుట ఒక చమత్కారము. ఆ పౌరాణికుని చేత రామాయణ కథనేమియు చెప్పింపక షట్కాండములు శ్రద్ధగా విన్న గోపన్నచేత విపులముగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రామాయణ పాత్రల ప్రశంస చేయించుటవలన గోపన్న గ్రహణధారణ పటుత్వము, భక్తిప్రపత్తులు వ్యక్తమగుట కవకాశమేర్పడినది.

గోపన్న గృహస్థుడుగా నున్నప్పుడు కబీరుదాసు వచ్చి తారకమంత్రోపదేశము చేసినట్లు గేయచరిత్రలో నున్నదానిని బ్రహ్మచర్యాశ్రమములోనికి మార్చుట మరింత ఉచితముగానున్నది. ఇతనిచే కాశీయాత్ర చేయించి భంగ్యంతరముగా గంగాస్తవాదులు చేయుట గడుసుదనము.

దారిద్ర్యభారము వలన గోపన్న గోల్కొండ కేగినట్లు గేయచరిత్రలో చెప్పబడినది. దారిద్ర్యప్రసక్తి తొలగించి యోగనిద్రలో రాముడు కనబడి స్వకార్యమునకై ప్రేరేపించినట్లు చెప్పుటవలన దైవాదేశమువలననే ఆరు లక్షల వరహాలను రామదాసు వినియోగించెనని సూచింపబడెను. అంతేకాక ఉదరపోషణకై కాక స్వామికార్య నిర్వహణకు మాత్రమే అతడు సేవావృత్తిని చేపట్టినట్లు సూచించు ఈ కథనము నాయకపాత్రకు మిక్కిలి మెరుగులు దిద్దినది.

గేయచరిత్రలో అకారణముగా తొట్టతొలుత చేయబడిన గోలుకొండ పురవర్ణనము గోపన్న గోల్కొండ యాత్రా సందర్భములో సముచితముగా నున్నది. అతడాయావిశేషములను తిలకించుచు మేనమామల ఇంటికి చేరినట్లు ఆ వర్ణనము కథలో చొప్పింపబడెను. గోపన్న మొదట దర్బారునకేగి ఆ తరువాత మేనమామల ఇంటికేగినట్లు గేయచరిత్రలోనున్న కథనము కంటె తొలుత వారింటికేగి యోగక్షేమములు విచారించి ఆ తరువాత దర్బారుకేగినట్లు చెప్పుటయే యుక్తముగా నున్నది.

నవాబును దర్శించుటకు "హర్కారుల వెంబడి హజారమును చేరగా సర్కార్ నడవడు తెల్లను తెలిపిరి హర్కారులు బాగా" అని మూలమున గోపన్న యెంతయో భయభక్తులు ప్రదర్శించినట్లు చెప్పబడగా గోపన తేజమునకు అచ్చెరువంది సభకేగిన గోపన్నను నవాబు తానే స్వయముగా పిలిచినట్లు చెప్పుట గంభీరముగా నున్నది.

నిత్య విధిగా బ్రాహ్మణ సంతర్పణను చేయునపుడు గోపన్న కుమారుడు గంజిగుంటలో పడి మరణించినట్లు ఉన్న ఘట్టమును ఆలయ ప్రతిష్ఠోత్సవ సందర్భములోనికి మార్చుటవలన తనకెంతయో మేలుచేసిన భక్తుని భగవంతుడు వెంటనే పరీక్షించి అనుగ్రహించినట్లు చూపుట సమంజసముగా నున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆలయ నిర్మాణమును పూర్తిగావించి రామదాసు ఇల్లుచేరి స్వాధికార కృత్యములను ఒనర్చుచుండెనని చతుర్థాశ్వాసమును ముగించి పంచమాశ్వాస ప్రారంభమున భద్రాద్రి ఆలయములో సీతారాములు సంభాషించుకొనుచుండగా గోపన్న సీతాదేవితో మొరపెట్టుకొనుచున్నట్లు కథను హఠాత్తుగా కలుపుట వలన నడుమ ఏమి జరిగినదో అను ఉత్కంఠ కథనమున కల్పింపబడి ఆ నడిమి కథ రామునిచే సీతకు చెప్పించుట వలన ఉత్కంఠయేకాక శ్రీరాముడు మొదటి నుండియు ఈ వృత్తాంతమును యెరిగియే ఊరకొన్నట్లు తీర్పబడెను. అతడు భక్తుని బాధను చూచును అట్లేల ఊరకుండెను? అను శంకకు సమాధానముగా గోపన పూర్వజన్మ వృత్తాంతమిచట చెప్పబడినది.

అట్లే నీయంతటివాడు స్వయముగా దర్శనమిచ్చుటకు తానీషా చేసిన పుణ్యమేమి? అని సీతాదేవిచే అడిగించి అచటనే తానీషా పూర్వజన్మవృత్తాంతము కూడ చెప్పబడెను.

అంతటి రామదాసునకు రాముడు కనీసము మారువేషముననైన కన్పించుట యుక్తముగా నుండునని భావించి తానీషా రూపమున చెఱసాలలోనికి ప్రవేశ పెట్టుటయేకాక రామదాసును కౌగలించుకొని 'నీయెడ మహాపరాధమును సల్పితిని నన్ను క్షమింపుము' అని నర్మగర్భముగా చెప్పించుట శాస్త్రిగారి కథన చాతుర్యమునకు పరాకాష్ఠ.

పాత్రచిత్రణము :

పాత్ర చిత్రణమే కావ్యమునకు ప్రాణాధారము. రసనిర్వహణమునకు ఆలంబన విభావములు పాత్రలేకదా. కావున రసపుష్టి సమగ్రముగా సమకూరవలె నన్నచో సజీవమైన, సహజవికాస సుందరమైన పాత్రలను సృష్టించి పోషింప వలసిన బాధ్యత కవిపైనున్నది. ఈ విషయమున ఆతడు విజయుడైనచో అతని పాత్రలు సమాజమున సర్వకాలములయందు విహరించుచుండును.

రామదాసు చరిత్రమునందలి ప్రధాన పాత్రము నాయకుడైన గోపన్న. తదితర పాత్రల పరిధి బహు స్వల్పము. అయినప్పటికిని ఏపాత్ర కాపాత్ర తత్త్వౌచిత్య పరిశీలనమును వాంఛించుచునే యుండును.

ప్రధాన కథయందు రామదాసు భార్య, తానీషా, కబీరుదాసు, గోపన మేనత్త, శ్రీరాముడు, సీత పాత్రలు కలవు. వీనిలో గోపన మేనత్త మాత్రమే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కల్పితపాత్ర. తక్కినవన్నియు ప్రసిద్ధములైన పాత్రలే. పౌరాణికుని కూడ ఒక కల్పిత పాత్రగా భావింపవచ్చును. ఇవిగాక అనుబంధ కథలో భద్రుని పాత్ర, శేషుని పాత్రలు కలవు.

లోకప్రసిద్ధ పాత్రలను చిత్రించునపుడు కవికి స్వాతంత్ర్యము తక్కువ. ఆయా పాత్రల గుణములకు చేతనైనంత మెఱుగులు దిద్ది సచేతనములు చేయుటయే వాని చేతనున్నది. కల్పిత పాత్రలను స్వేచ్ఛగా చిత్రించుకొనవచ్చును. ఇదియంతయు రసాభిముఖముగానే జరుగవలయును.

రామదాసు :

నాయకుడే కావ్యఫలభోక్త. ఆ పాత్ర ననుసరించియే కావ్య సాఫల్యము నిర్ణయింపబడును. గేయచరిత్రలలో పాత్ర చిత్రణమునకు ప్రాముఖ్యము లేదు. అచట పాత్రల క్రమవికాసమును గూర్చి అంతగా పట్టించుకొనుట యుండదు. కావున గోపన్న పాత్రలో క్రమ వికాసము ఉదాత్త లక్షణములు స్ఫుటముగా కన్పట్టవు. అందుచే ప్రబంధనాయకుడైన రామదాసు పాత్రను శాస్త్రి గారు ప్రత్యేక శ్రద్ధతో సర్వాంగీణ వ్యక్తిత్వము వ్యక్తమగునట్లు చిత్రించిరి.

గోపన్న బాల్యమును గూర్చిన సమాచారము గేయకృతులలో లేదు. శాస్త్రిగారు భవిష్యత్ చరిత్రమున కనుకూలముగా గోపన్న బాల్యమును నిర్మించిరి. ప్రహ్లాదాది బాలభక్తుల ప్రతిబింబముగా గోపన్న కనబడును.

గోపన్నను కేవల భక్తునిగానే గాక కర్మిష్ఠునిగా చూపుటకు వాని బ్రహ్మచర్యాశ్రమము వర్ణింపబడెను. సంధ్యావందనము, అగ్నికార్యము, సముద్యత్ శ్రద్ధతో సల్పుచు గురువు చెంతకేగి శ్రుత్యాదులను చదివి బుధాగ్రణులు జయపత్రము లీయగా "మనసిజసుందరుండు సుకుమారుడు గోపనశాస్త్రి దిక్ప్రభాస్థలుల కీర్తిగాంచెనని" గోపన్నను గొప్పపండితునిగా తీర్చిదిద్దిరి.

గేయములలోని రామదాసు కేవల భక్తునిగా మాత్రమే గోచరించును. ప్రబంధకవి భక్తి వానికి సహజాతమైనట్లు జ్ఞానమతనిచే సముపార్జితమైనట్లు కర్మమార్గము వానికి అపరిత్యాజ్యమైనట్లు చిత్రించి గోపన్నపాత్రను భక్తికర్మజ్ఞానముల త్రివేణీ సంగమ మొనర్చెను.

గోపన్న గార్హస్థ్య జీవన సాఫల్యము కూడ విపులముగా వర్ణింపబడెను. ఈ ఘట్టమున గోపన్న పెద్దన్నగారి ప్రవచనకు సహోదరునివలె కన్పట్టును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ దంపతులు వాగర్థములవోలె అవినాభావనులై అన్యోన్యహృదయరాగములను తగుమేరలో నిలిపి శ్రీ గోవింద పదారవిందములను కొలుచుచు అతిథి సేవా పరాయణులైరి.

గోపన్న దాస్యవృత్తితో ధనమును సంపాదించుటకై కాక రామ కార్యమునకై తానీషావద్దకు పోయినవాడగుటచే ఇతరపౌరులవలె అతి వినయము నెఱపిన వాడు కాక తన తేజస్సుతో పరిసరములను, ప్రభువును సమాకర్షించిన శక్తిమంతుడుగా చూపబడెను. గోపన్న రాకతో కొలువుకూటములోని రాజవర్గముల ముఖములు రాజసమువీడి సాత్త్వికతేజము నెనసెననగా అతడొక సామాన్య సాధకుడు కాక "రాజయోగి" అగుచున్నాడు.

ఎంత అంతర్ముఖుడైనను ఉద్యోగనిర్వహణమున అతడు ప్రాలుమాలిన వాడు కాడు. లెక్కలను పట్టి చూచుచునే లెక్కకుదక్కని వానిని చూచుచుండెను.

ఈ ప్రబంధమున గోపన్న ఆర్తికన్న తత్త్వపరిణతియె అధికముగా కన్పట్టును. పుత్రమరణసమయమున, కారాగారమునందు, అతడు అతి దీనముగా విలపించినట్లు గేయకృతులందు కలదు. కాని ఇందుమాత్రము పైరెండు సందర్భములందును నిబ్బరము చెడని నిండుమానిసియై నిలబడినాడు. కీర్తనలలోని దైన్యము, విలాపములు, నిందలు, నిష్ఠురములు, దబాయింపులు ఈ ప్రబంధమున కానరావు. చెఱసాలలో అతడు రామధ్యానము మాత్రమేచేసెను. 'వారినీవిరిని దూఱ నేమియగు నా ప్రారబ్ధ మిట్లుండగన్, తా రాడా సుకృతంబు కల్గినయెడన్ తప్పింపడా బంధమున్' అని విశ్వాసముతో నుండెను.

'శాంతిముఖాదిసాధనలు చక్కగ దా నెరవేర్చుచుండినన్
బంతులు దీర్చిపెట్టినను బ్రత్యహమున్ సరసాన్నసత్రముల్
భ్రాంతులు వీడిపోయినను రాగముమాసిన బూర్వకర్మభు
క్త్యంతమునందు గాని హరి యాకృతి దోపదు జీవకోటికిన్'"

పై పద్యమే ఇందలి రామదాస పాత్రయొక్క హృదయము. రామదాస పాత్ర చిత్రణలో శాస్త్రిగారు చేసిన పెద్దమార్పు ఇదియే. మొదటినుండి తుది వరకు వానిలో దైన్యము విషాదము కానరావు. స్వయముగా రామదాస విరచితములైన ఎన్నో కీర్తనలలో అతడు దుఃఖాది వికారములకు లోనైనట్లు కన్పట్టు చున్నప్పటికి, ఆ కీర్తనల యెడల ప్రజలు అనురక్తులై పాడుకొనుచున్నప్పటికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ విధమైన సానుభూతితో పాత్రను ప్రతికించుట కిష్టపడక చేసినమార్పు అత్యంత సాహసోపేతము. కవి ప్రణాళికదృష్ట్యా సమంజసము. ఆ కీర్తనలు విడివిడిగా భక్తజనులు గానముచేసుకొని తన్మయులు కావచ్చునుగాని రామదాసువంటి జీవన్ముక్తుని నాయక పాత్రవికాసమునకు న్యాయము చేయజాలవు.

గేయచరిత్రలోని రామదాసుకంటె ఈ ప్రబంధరామదాసు భిన్నుడు, తత్త్వసంపన్నుడు. అతడు 'దేశి' రామదాసు. ఇతడు 'మార్గ' రామదాసు. అతడు భక్తిరసమూర్తి. ఇతడు శాంతరసమూర్తి.

తానీషా :

నాయకుని కష్టములకు కారకుడైనను తానీషా ప్రతినాయకుడుకాడు. మీదు మిక్కిలి రామదాసునకు ఉద్యోగమిచ్చినవాడు. పూర్వజన్మ లబ్ధవిశేషపుణ్యుడు. నాయకునకు కూడ లభింపని రామదర్శన భాగ్యము నొందినవాడు. కావున గేయ చరిత్రలలో వలె అతనిని ధీరోద్ధతుడుగా చిత్రింపక శాస్త్రిగారు సహజసద్గుణ సంపన్నునిగానే చూపినారు. రాజధర్మము ననుసరించి భగవల్లీలలోతానును ఒక పాత్రధారియై బాకీపడిన సొమ్ముర్రాబట్టుకొనుటకు గోపన్నను బంధించినవాడె కానీ దురహంకారుడు అధికారాంధుడు కాడనియే శాస్త్రిగారితీర్పు.

రామదాసును గూర్చిన యాథార్థ్యము తెలిసినంతనే వానిని భద్రగజముపై నెక్కించి తనతప్పు క్షమింపమని ప్రార్థించెను. నీవు నా అజ్ఞానమును పోగొట్టిన సూర్యుడవని పాదములపైబడి మ్రొక్కెను. రామలక్ష్మణులిచ్చిన లక్షల వరహాలను, సస్యసమృద్ధములైన కేదారములను, అమూల్యాంబరాభరణాదులను గోపన్నకు సమర్పించి ధన్యుడయ్యెను.

వర్ణనలు :

వర్ణనా నైపుణ్యమే కవి ప్రతిభకు నికషోపలము. కావ్య సౌందర్యమునకు కాణాచి. సమయాది ప్రకృతివర్ణనలు ఎందరుకవులు చేసినను స్వయంవ్యక్తిత్వము కలిగి కథాంశములతో పెనవైచుకొని నవ్యములై విలసిల్లుచుండును.

రామదాసు చరిత్రమునందు సమయ వర్ణనలు, ప్రకృతి వర్ణనలు. వస్తు వర్ణనలు సందర్భానుసారముగా కన్పట్టుచున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమయవర్ణనలు :

ఇందు గ్రీష్మఋతు, సాయంకాల, సూర్యోదయ వర్ణనలున్నవి. గ్రీష్మ ఋతువర్ణన పద్యము సన్నివేశానుకూలమై సహజమై ఒప్పుచున్నది.

అడుగులోనడుగులు తొడుగు మత్తేభేంద్ర
యాన లోలి దురంగయానలైరి
ఘంటాపథాంతర గతులకు బైవల్వ
మడతలే ముత్యాల గొడుగులయ్యె
దెల్వివేటలతమ్మి తీపె యొక్కటిదక్క
సామాన్యలతలెల్ల జంకివాడె
వట్టివేళ్లను జుట్టుకట్టుకొన్నను వేడి
తలయెత్తి జగముల నలమికొనియె
జాత్కృతులుసాగె నొక్కంట సూర్యకాంత
మణుల మృగతృష్ణపారె దిఙ్మధ్యభూమి
జండరశ్మి వియన్మహాసౌధవీథి
నడిమి చక్కికి వేంచేయ గడగునపుడు

దీనిని మధ్యాహ్న వర్ణనగా కూడ పరిగణింప వచ్చును. ఈ పద్యమును విని 'హరికథాపితామహ' ఆదిభట్ల నారాయణదాసుగారు ఆనందముతో రోమాంచితమైన తనచేతిని శాస్త్రిగారికి చూపి ప్రశంసించిరట.*

ప్రకృతి వర్ణనలు :

గోపన్న కాశియందు దర్శించిన గంగ ఇట్లు వర్ణింపబడెను.

ఏతల్లి హరజటాగ్రీయసంధ్యారాగ
కమనీయ చంద్రరేఖామతల్లి
యేమాత నిజరసాహీనప్రభాపూత
ధరణీధరప్రభూతప్రపాత

---

* ముఖాముఖి: చల్లా జనార్దన శర్మ
(శాస్త్రిగారి పెద్దకుమారులు) 3.10.84.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యేయంబ విష్ణుపదేందిరా సుందరీ
ముఖచంద్రమండన ముకురపేటి
యేజనయిత్రి వాగీశాది నిర్జర
స్తోమప్రణీతసంస్తోత్రధాత్రి

యట్టిగంగాస్రవంతిక నంతరస్థ
సకలదేశీయజన నిమజ్జన నినాద
మేదుర దటాంతరస్థ యమిప్రవచన
సక్తయగుదాని గని యనూచానవర్ణి

వస్తు వర్ణనము :

ఇందు ఆనందాశ్రమ, అగ్రహార, గోలుకొండపుర భద్రాద్రి ఆలయ వర్ణనలు పేర్కొనదగినవి.

అగ్రహార సమృద్ధి ఇట్లున్నది.

కొలఁకులున్నవొ లేవొ పిలిచి చెప్పటలేల
యమృతమ్ము సరసులయందు దొరకు
దోటలున్నవొ లేవొ పాట బాడుటయేల
ఫలములు సోమలతల లభించు
బైరులున్నవొ లేవొ పట్టిచెప్పటయేల
పంట యజ్ఞక్షేత్ర పదమొసంగు
పాడియున్నదొ లేదా పల్లెత్తగానేల
పావనగవియ మేల్పాలుగురియ

రాట్ప్రభములున్నవొ లేవొ రద్దియేల
వెల్లయేనుంగు లోకకోటి కొల్లబడిన
నెడము చూపించు మార్గంబు లెన్నొకలవు
హరిపదరామ యయ్యగ్రహారసీమ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిటారుగా నుండి దిగువ పీఠము గలిగిపైన పడగలు విప్పినట్లుండు ధ్వజ స్తంభమిట్లు వర్ణింపబడెను.

తన నిగామేని పొన్పుపై దనరు శౌరి
రాముడై యుంట యెరిగి సర్వప్రధాని
పఱగి నిత్యంబు సేవించు వరుస దోప
దతకళాస్ఫూర్తి తద్ధ్వజస్తంభ మొప్పు

దశావతార వర్ణన :

దశావతారములు చెఱసాలలోనున్న గోపన్న మేలుకొల్పిన విధముగా వర్ణింపబడినవి. ఈ వర్ణనలు భక్తిసుందరములై ధారాశుద్ధి మందిరములైన అమృత భాండములు.

కూర్మావతారము :

సిరిమీగాళ్ళకు బుట్టినింటి సిరులన్ సృష్టించి సర్వం సహా
భరణానమ్ర ఫణాసహస్ర ఫణిభృద్భర్తన్ బ్రసాదించి సం
బరమున్ జెంది సురాసురుల్ ధృతి బయస్స్వద్భాండమున్ద్రచ్చుచో
గిరిధారేయత గొన్న శ్రీకమఠచక్రీ ! యేలుకో మేలుకో !

వ్యక్తి వర్ణనలు :

వివిధ సన్నివేశములలోని వ్యక్తుల భావచిత్రములు కనులకు గట్టినట్లు వర్ణింపబడినవి. శ్రీరాముడు ప్రత్యక్షమైనప్పుడు సాత్త్విక భావ సంపన్నుడైన భద్రుడిట్లున్నాడు.

నేత్రాంతముల నుండి నెఱిజాఱు హర్షాశ్రు
లేకధారను సెలయేళ్ళుగాఁగ
నెమ్మేన నంతట గ్రమ్ము రోమాంచమ్ము
దగ్రమనోజ్ఞవృక్షాళిగాగ
నంతరంగము దాటి యావిర్భవించెడు
కంపంబు దరులపై గాలిగాగ
సకలేంద్రియంబుల సంరంభ ముడిగించు
స్తంభంబు బాషాణతతి యగాగ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తటికి గల్గిన సాత్త్వికోదయము లిన్ని
యును స్వభావోక్తియేకాగ దనకు దనరి
శ్రీహరి కృపాకటాక్షలక్ష్మికిని బట్ట
భద్రుడై యెట్లొ పలికెను భద్రు డిట్లు

ఇట్టివే పౌరాణిక, బాలగోపన్న, కబీరుదాస, బ్రహ్మచారి గోపన్న, గోపన భార్య, తానీషా, ప్రభృతుల వ్యక్తి వర్ణనలు.

స్తవములు :

ఆంధ్ర మహాభారతములోని వాసుకి స్తోత్రమును, కుమార సంభవములోని దారిద్ర్యవిద్రావణ స్తవమును పోలిన స్తవములు ఇందు మూడు నాలుగు కలవు. ఇట్టివానికి మకుట నియమము కూడ కలదు.

తారక మంత్ర స్తవము :

ఇందు "తారక మంత్ర రాజమా !" అను మకుటముతో పంద్రెండు పద్యములు కలవు. ఇవి గోపన తారక మంత్రోపదేశము నందిన సమయములో చేసినవి.

తారకమంత్ర ప్రభావము విశిష్టత వీనియందు బహుధా నిరూపితము.

ధన్యుడు వాడపో ధరణి తత్జ్ఞ శిఖామణి వాడపో జగ
న్మాన్యుడు వాడపో బుధజన స్తవనీయుడు సర్వలోక మూ
ర్ధన్యుడు వాడపో భవపరంపర తాపము నార్పజాలు ప
ర్జన్యుడు వాడ నిన్నెవడు చాటునొ తారకమంత్రరాజమా !

భద్రనగాగ్ర రాఘవా :

ఈ మకుటముతో చెఱసాలలోనున్న రామదాసు పమునాల్గు పద్యములలో కరుణరసాత్మకముగా రాఘవ స్తవము చేసెను.

నీదయ పాలవెల్లువయి నేడిటు పొంగులు పెట్టదేల బా
బా ! దొరవంచు ముత్తఱుల బూనికతో నిను గొల్చుచుండినం
గాదిలిబిడ్డ భక్తుడనగా నటనాతని గన్నతండ్రి వీ
వౌధనగా నిటుల్ నెఱపనౌనొకొ భద్రనగాగ్రరాఘవా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మేలుకో ! మేలుకో ! :

ఈ మకుటముతో చెఱసాలలోనున్న రామదాసు దశావతారములను మేలు కొలుపుచు స్తుతించెను.

తొగవిల్తుండు ధ్వజంబు దిద్దుకొని చేతోవీధి నుప్పొంగ శ్రీ
నగుమొమ్మోము కొలంకులోని కనులానందంబునన్ దోగ దుం
దగంపున్‌దొంగను వార్ధిగిట్టి విధివేడ్కన్ వేదముల్ ధాతకున్
మొగి నర్పించిన గండుమీల దొరబాబూ ! యేలుకో మేలుకో !

రమ్యగుణసాంద్ర భద్రాద్రి రామచంద్ర :

గోపన చెఱసాల నుండి విడుదలై భద్రాద్రిచేరి కళ్యాణాది మహోత్సవము లను తనివితీర చేయించి భక్త బృందముతో ఆనంద సముద్రమున నోలలాడుచు పై మకుటముతో భద్రాద్రి రామ స్తవము చేసెను.

జోహారు పవనాంకురాహారశయ్యావి
హార.! మనోహరాకార ! నీకు
దండంబు దోర్దండతల లసత్కోదండ
కాండ ఖండిత రిపుకాండ ! నీకు
గైమోడ్పు నిజభక్త కామనాపూరణ !
మాన్య ! సంతరణప్రమాణ ! నీకు
నంజలి శ్రుతిశిరః పుంజ మంజులసుమ
మంజరీరంజిత మహిత ! నీకు
ప్రణతి భక్తిరసావేశవశ్య ! నీకు
నేటికోళ్ళు ఖగేశ్వరఘోట! నీకు
ఐదుపది సర్వసురపూజితాంఘ్రి ! నీకు
రమ్యగుణసాంద్ర ! భద్రాద్రి రామచంద్ర !

ఆశ్వాసాద్యంత పద్యములు :

ఇందలి ఆశ్వాసాద్యంత పద్య నిర్వహణతో ఒక విశేషమున్నది. ఆ పద్య ములలో సంబోధనల రూపమున రామాయణ కథ యంతయు చెప్పబడినది. ఈ ప్రబంధమునందు శాస్త్రిగారు రామాయణకథను బహు విధములుగా చొప్పించిరి. శిఖచోట రాముడే స్వయముగా ఒక సీస పద్యములో రామాయణమును భద్రునకు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెప్పెను. బాలగోపన్న రామాయణములోని ప్రముఖపాత్ర లన్నింటిని పరిచ యము చేసెను. ఇవిగాక అశ్వాసాద్యంతములలో రామాయణము నిబంధింప బడెను'

ప్రథమాశ్వాసాంతమున తాటకావధ, యాగ రక్షణము, అహల్యా శాప విమోచనము చెప్పబడినవి. ద్వితీయాశ్వాసాద్యంతములలో ధనుర్భంగము, వివాహము, పరశురామ గర్వభంగము, అభిషేక నిర్ణయము, పితృవాక్యపాలనము, వనగమనము చెప్పబడినవి. తృతీయాశ్వాసాద్య తములలో వనవాసము. మాయా మృగదళనము, జటాయువధ, సుగ్రీవమైత్రి, సప్తతాళఖండనము, సీతాన్వేషణము సూచింపబడినవి. చతుర్థాశ్వాసాద్యంతములలో సముద్రతరణము, ముద్రికా ప్రదానము. యుద్ధయాత్ర, సేతుబంధనము అంగద రాయబారము ధ్వనింపచేయబడినవి. పంచమాశ్వాసాద్యంతములలో రావణవధ, విభీషణ పట్టాభిషేకము, అగ్నిపరీక్ష భరతసమాగమము, పట్టాభిషేకోత్సవములు చిత్రింపబడినవి.

ఉదాహరణకు కొన్ని పద్యములు.

అరుణాంబుజ కోమల నిజ
చరణ రజః ప్రసరణ ప్రసాద విశేష
స్ఫురణ కృతగౌతమరసా !
పరమకృపా సన్నివేశ ! భద్రాద్రీశా !

ఉక్తవచః ప్రకార సమయోచిత దత్త సురారిరాజ్య సం
సక్త విభీషణప్రణుత సప్తకర స్వకరార్పితాంగనా !
శక్తి సమేతపుష్పకవిసారణ ! సన్నిహితర్షి వాటికా
భక్తి వశోన్ముఖానుజకృపా పరిపూర్ణసమావలోకనా !

సకుటుంబ బంధు మిత్ర కు
ల ! కలాలయ ! పౌరమండల సుధారాశీ !
యకలంక! సంతతోత్సవ !
సకలమనోవాస ! భద్రశైల నివేశా !

ఇవిగాక ప్రతి ఆశ్వాసము నందలి చిట్టచివరి పద్యములో జ్ఞానరూపబ్ర హ్మముడు ధ్యానింపబడెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మనోజ్ఞ ప్రకల్ప ప్రమా భూరితేజో
ఘనా! స్థాన సంపన్న కల్యాణదాయీ!
యనూచానమార్గస్పృహా! నిస్పృహాస్త్రా !
దినేశాన్వవాయ ప్రతిష్ఠాపటిష్ఠా.

రసవికాసము :

'నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే' అని భరతుని సిద్ధాంతము. రసమే కావ్యసామగ్రీ సర్వస్వమునకు గమ్యము. రసము లేనిది కావ్యమే లేదు. నిర్ణీతమైన రసమును క్రమోన్మీలన పరిపుష్టము కావించుటయే కావ్యారంభమునకు పరమ ప్రయోజనము.

అంగిరసము :

రామదాసు చరిత్రము నందలి అంగిరసము ఏది? అను ప్రశ్న కొంత చర్చకు దారితీయుచున్నది. ఇందలి రసము కరుణయని కవి పేర్కొనెను. కాని ప్రబంధ పరిశీలనమున అది అంగీకార యోగ్యమైన నిర్ణయముగా కానవచ్చుట లేదు. విభావానుభావాది భావములుగాని, కరుణరస స్థాయియైన శోకముగాని అంగిరసత్త్వమునకు సమర్థములుగా లేవు. గేయచరిత్రలో బందిఖానా ఘట్టములోని కరుణరసోత్కర్షము ఇందు పరిత్యజింపబడినది. కావున కరుణము అంగరస మగునే కాని అంగిరసమగుట సమంజసము కాదు. ఇక భక్తి శాంతరసములలో ఒకదానిని ముఖ్యరసముగా నిర్ణయించుట కవకాశమున్నది.

భక్తి నవరసములలో లేకపోవుటచే దాని అస్తిత్వము సందేహభాజనము. అయినను రూపగోస్వామి వంటివారు భగవద్రతిస్థాయి భావముగా భక్తిరసమును స్థాపించియే ఉన్నారు. తద్రస సామగ్రి యంతయు ఈ ప్రబంధమున పుష్కలముగా నున్నది.

ఎంతచేసినను భక్తికి రసత్వము సందిగ్ధమే. అంతేగాక నాయకునియొక్క భగవద్రతిలో ఆదినుండియు అంతర్లీనమైయున్న వైరాగ్యమును, సుఖదుఃఖ సమత్వమును, మోక్షఫలమును ఇందలి రసము శాంతమనియే చాటిచెప్పుచున్నవి. కవి లోకప్రసిద్ధమైన కథననుసరించి రసనిర్ణయము చేసియుండవచ్చును. కాని వారు నిర్వహించినది మాత్రము శాంతరసమని దృఢముగా చెప్పవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యాకరణము ।

రసవత్తరమగు నీ ప్రబంధమునందు ఒండు రెండు విశేష వ్యాకరణాంశములు కలవు.

"కలదె యిటువంటి పితృభక్తిగలండు జగతి"

అనుచోట "పితృభక్తి గలడు" అను ప్రయోగమున "కలవాడు" అను శబ్దములోని తచ్ఛబ్ద వాకారమునకు లోపము చేయబడెను. ఇట్టి లోపమును బాల వ్యాకరణము చెప్పలేదు. ప్రౌఢవ్యాకర్త 'అట్టి యిట్టి యెట్టి విశేషంబుల మీది తచ్ఛబ్ద వాకారమునకు' మాత్రమే పై భాషికలోపమును చెప్పెను. ధాతుజవిశేషణముల మీది వానికి చెప్పలేదు. కాని "ఎఱుక గలరె పగువవెందు" (అది-2 ఆ-33 ప) మొదలగు నన్నయాదుల ప్రౌఢ ప్రయోగముల ననుసరించి శాస్త్రిగారును ఇట్టి ప్రయోగమొనర్చిరి.

"స్త్రీ పుం విచారణ చిత్తమ్మునకు రాదు" (ప్ర. ప. 116) అను పద్యమునందలి "స్త్రీ, పుంస్ శబ్దములు ద్వంద్వ సమాసమున "స్త్రీపుంస" అని పాణినిచే నిపతితము* దానిననుసరించి పై ప్రయోగము అసాధువనిపించును. శాస్త్రిగారు వ్యాకరణాధ్యయనములోని నిశిత పరిశీలనాదృష్టికి ఈ ప్రయోగము సూచకము. ఒక స్త్రీని, ఒక పురుషుని జంటగా పేర్కొనినప్పుడు మాత్రమే స్త్రీ పుంస నిపాతము సిద్ధమగుట యుక్తము. లింగ నిర్దేశాదులయందు స్త్రీ, పుం శబ్దములు ప్రక్క ప్రక్కన చేరి సమసించునప్పుడు 'స్త్రీపుంస' కానక్కఱలేదని 'స్త్రీ పుం నపుంసకంజ్ఞేయం తద్విశేష విధేఃక్వచిత్'** మున్నగు ప్రయోగముల వలన కలిగిన సమన్వయమును కవి ఇట్లు వ్యక్తమొనర్చెను.

'మోచెయిలోన గ్రంథమిడి' (ప.ప. 113) అనుచోట 'చేయి' ఔపవిభక్తిక నామము. ప్రౌఢ వ్యాకరణము ప్రథమైక వచనమునందుమాత్రమే దానికి 'చెయ్యి' 'చెయి'అను రూపముల నంగీకరించెను:*** అట్టియెడ పై ప్రయోగమునకు గతి ఎట్లనగా 'లోన' యనునది విభక్తిప్రత్యయ ప్రతిరూపక శబ్దము. 'లోను' అను శబ్దమును శబ్దరత్నాకరము చూపెను. దాని అవధారణార్థకరూపము 'లోన' యగును. అంత దూరమక్కఱ లేకుండ లోన అను శబ్దమే 'ఈ లోనన

* అష్టాధ్యాయి. అ. 5. ప్ర. 4. సూ. 88.

** అమరకోశము. శ్లో. 113.

*** శబ్ద.సూ. 105

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రాగదే నిఖిలలోక శరణ్యా మహీయ రక్షకున్" అని భాస్కర రామాయణమున ప్రయుక్తము. (అరణ్య. అ. 5 ప. 153) తట్లయినను చెయి, లోన శబ్దములకు సమాసము చేయక తప్పదు. అప్పుడు సమస్య మరల మొదటికి వచ్చును. ఔప విభక్తికాదేశము నెట్టులో ఆపగలము* కాని ప్రౌఢ వ్యాకరణము ననుసరించి 'చెయి' అంగీకార్యము కాదు. కవి నిఘంటువు ననుసరించి 'చెయి' సర్వ విభక్తులయందును 'చేయి'కి రూపాంతరముగా భావించియుండును. లేదా శ్రుతి హితముగా నుండుటచే సాహసించియుండును. వ్యాకరణ దృష్టికిది నిరంకుశ ప్రయోగమే.

ఖట్వారూఢ, అహంయువు ఇత్యాదులు కవి సంస్కృత వ్యాకరణ శాస్త్రాభినివేశమును తెలియచేయు ప్రయోగములు.

ఉపసంహారము ।

పరమ భాగవతోత్తముడగు గోపన్న చరిత్రమును ప్రబంధ మర్యాదల కనుగుణముగా సంస్కరించి, పాత్రలను తీర్చిదిద్ది, అపూర్వ వర్ణనలతో నలంకరించి, శాంతరస ప్రధానముగా మలచి, మాధుర్య ప్రౌఢిమలు పడుగుపేకలైన చక్కని అల్లిక జిగిబిగితో శాస్త్రిగారు ఈ ప్రబంధము నాంధ్రుల కందించిరి. పాత్రముఖంబున ఏతత్ప్రబంధవైశిష్ట్యమును కవి చమత్కారముగానిట్లు వ్యక్తము చేసెను.

> దేవా! చక్కని కూర్పుతో రసనదీ దివ్యత్తరంగంబులన్
> భావ శ్రీ జలకంబులార్చి విశదత్వప్రాజ్య సౌగంధ్యల
> క్ష్మీ వైశేష్యము గూర్చి చెప్పిన జగత్ క్షేమంకరమ్మున్ సుధ
> క్త్యావేశమ్మనునౌ జరిత్రము మహాత్మా! చెప్పవే మీదటన్

ఇట్టి దీపస్తంభము లాధారముగా రస సాగరమున నీదులాడి భక్తిజ్ఞాన రత్నములను, రసధ్వన్యలంకార మణులను కూడబెట్టుకొను అవకాశమును రసజ్ఞులకీ కావ్యము ఆచంద్రతారముగా నందించును.

•)(•

---

* విభాషయా భవంత్యత్ర భవంత్యుపవిభక్తయః
భవంతి కుత్ర చిన్నైవ నిదానం తత్ర సద్వచః
(వికృతి వివేకము : సంధి. 20)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ జయదేవ చరిత్రము

గీత గోవింద కర్తయైన జయదేవ మహాకవి జగత్ప్రసిద్ధుడు. జగన్నాథ భక్తుడు. అతనికి కవిగా ఎంతకీర్తి యున్నదో మహాభక్తుడుగా నంత ప్రతిష్ఠ యున్నది. భక్తులకా యనఘుని చరిత్ర పారాయణ గ్రంథము. ఆ చరిత్రను శాస్త్రి గారు అరువది పద్యములలో నిబంధించిరి. ఇది 1950లో వారి గీతగోవిందాంధ్రీ కరణమునకు అనుబంధముగా ముద్రితము.

జయదేవుని వాస్తవిక చరిత్రకును పారంపర్యముగా భక్తులు చెప్పుకొను జయదేవ కథకును ఎంతయో భేదమున్నది.

చరిత్రననుసరించి ఇతడు వంగదేశములోని బీర్భూమ్ జిల్లాయందలి కేందు బిల్వము అను గ్రామమునకు చెందినవాడు. 12వ శతాబ్దికి చెందిన శ్రీ లక్షణ సేనుని ఆస్థానకవి. జయదేవునితండ్రి భోజదేవుడు, తల్లి రామాదేవి. భార్య పద్మావతి.

పారంపర్యముగా వచ్చు కథలో జయదేవుడు ఓఢ్రదేశము నందలి జగన్నాథ క్షేత్రమునకు సమీపమునందున్న తిందుబిల్వము అను గ్రామమునకుచెందిన వాడు. వ్యాసనారాయణాంశ సంభూతుడు. ఎన్నియో మహిమలను చూపెను. భక్త విజయము, భక్తమాల, భక్త లీలామృతము, మహాభక్త విజయము మున్నగు గ్రంథములలో మహిమాన్వితమగు ఈ జయదేవ కథ ప్రపంచితము. శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారిచే రచింపబడిన (ప్రచురణకర్తలు—వావిళ్ళ రామస్వామి శాస్త్రి అండ్ సన్స్, మద్రాసు) శ్రీమహాభక్త విజయములోని జయదేవ కథనే శాస్త్రిగారు గ్రహించి పద్యీకరించిరి. *

కథ :

జగన్నాథ క్షేత్ర సమీపమున తిందుబిల్వమను గ్రామమున వ్యాసనారాయణాంశమున జన్మించిన జయదేవుడు పెరిగి పెద్దవాడై గీతగోవిందమును రచించెను. ప్రజలందరును దానినే పాడుకొనసాగిరి. ఆ దేశమునేలెడు సాత్త్వికరాజు

* శ్రీమహాభక్త విజయము. పుట. 147–154. (1952, నాల్గవకూర్పు)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మరియొక గీతగోవిందమును రచించెను. దానినెవ్వరును పాడుటలేదు. దానితో రాజునకు కోపమువచ్చి జయదేవుని కృతిని పాడరాదనియు తన కృతినే పాడవలెననియు శాసనము చేసెను. ప్రజలు దానిని లెక్కచేయలేదు. అంతటరాజు ఇరువురి గ్రంథములను జగన్నాథుని సమీపమున నుంపగా జగన్నాథుడు జయదేవునికృతిని స్వీకరించెను. దానితో రాజు దుఃఖితుడై ఆత్మహత్య చేసికొనబోగా దేవుడు ప్రత్యక్షమై జ్ఞానోపదేశముచేసి జయదేవుని గీతగోవిందములో రాజు రచించిన శ్లోకములు ఇరువది నాలుగుండునట్లు అనుగ్రహించెను.

జగన్నాథము నందలి ఒక సద్బ్రాహ్మణునకు పద్మావతియను కూతురు కలదు. ఆమె గొప్ప సౌందర్యవతి. జగన్నాథు డొకనాడు ఆమె తండ్రికి ప్రత్యక్షమై తన అంశమున జన్మించిన జయదేవునకు పద్మావతినిచ్చి వివాహము చేయుమని చెప్పెను. జయదేవు డాతని కల్లు డాయెను.

సంపన్నుడగు వైశ్యుడొకడు జయదేవుని తన పురమునకు తీసికొనిపోయి అతని బోధలకానందించి అశేష ధనకనక రాసులతో భటులను తోడిచ్చి స్వగ్రామమునకు పంపెను. మార్గమధ్యమున అరణ్యములో ఆ భటులు జయదేవుని కరచరణములను ఖండించి పాడుపడిన బావిలో పడవైచి సంపదను హరించిరి. అచ్చటకు వేటకు వచ్చిన వింధ్యదేశపురాజు జయదేవుని రక్షించి రాజధానికి గొంపోయెను. జయదేవుని చూచుటకు ప్రజలు తండోపతండములుగా రాసాగిరి. వారిలో అతనిని హింసించిన దొంగలు కూడ నుండిరి. జయదేవుడు వారిని గమనించి వారు మహాభక్తులని అనేక సంపదలిప్పించెను. జయదేవుని మీరెట్లు ఎరుగుదురని రాజభటులు వారిని ప్రశ్నింపగా వారు జయదేవుని గూర్చి అబద్ధములు చెప్పిరి. దానితో భూమిపగిలివారుకూలిపోయిరి. జయదేవుడచటికిపోయి భగవంతుని ప్రార్థింపగావారికి ఉత్తమలోకములులభించెను. జయదేవునకు కాలుసేతులువచ్చెను. రాజు జయదేవుని భార్యయగు పద్మావతిని కూడ తన నగరమునకు తెప్పించెను. ఆమె రాణికి జ్ఞానోపదేశము చేయసాగెను. ఒకనాడు రాణి సోదరుడు మరణించెననియు అతని భార్య సహగమనము చేయుచున్నదనియు వార్తవచ్చెను. అదివిని పద్మావతిచలింపలేదు. రాణి ఆశ్చర్యముతో కారణమడుగగా భర్తపోయినాడని వినిన వెంటనే ప్రాణము పోవలెనుగాని సహగమనము చేయుట గొప్పకాదని ఆమె చెప్పెను. రాణి ఆమెను పరీక్షించుటకై జయదేవుడు మరణించెనను కబురు తెప్పించెను. ఆ వార్త వినుచుండగనే పద్మావతి మరణించెను. దానితో రాజు చింతించి ఆత్మహత్య చేసికొన

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బోగా జయదేవుడు నివారించి అష్టపదులను పాడగా ఆమెలేచి కూర్చుండెను. ఆకాశమునుండి పూలవాన కురిసెను.

శాస్త్రిగారు కథలో మార్పులు చేయలేదు కాని కథను భావనా బంధురముగా నడపిరి. జయదేవుని విష్ణ్వంశ సంభూత త్వమును తెలియజేయు ఈ పద్యము కవి సొంతము.

హరి చారిత్రము దక్క బల్క డొక మిథ్యా లోక వృత్తాంతమున్
హరి పాదార్చకు దక్క జూడడు వృథాహంకార హుంకారునిన్
హరిగాన శ్రవణంబు దక్క గొనడ న్యాపార్థగానస్తుతుల్
హరియే తా జయదేవుడయ్యె నన నేలా యింక సందేహముల్

జయదేవుని నడవడి పై పద్యమున ముచ్చటగా మూడు పాదములలో చూపబడినది. అట్టి నడవడి కలవారందరును హరిరూపమును దాల్తురని నాల్గవ పాదమున సూచితము.

"మరునాడు ప్రాతఃకాలమున నందరును బోయిచూడగా జయదేవుని గ్రంథము భగవత్పాదములపైనుండెను. రాజు గ్రంథము దూరమునబడియుండెను" అని శ్రీపాద వారి వచనము. పై కథనము మిక్కిలి సాధారణముగా నున్నది. అంతేగాక జయదేవుని కృతిలో ఇరువది నాలుగు శ్లోకములను చేర్చబోవుచున్న రాజు రచనను "దూరముగా పడియుండెనని" వాచ్యముగా చెప్పుట యుక్తము కాదు. ఆ సన్నివేశమును శాస్త్రిగారు ఇట్లు తీర్చిదిద్దిరి.

మఱునాడు తలుపు తెఱవన్
సురవన మందార ముఖ్య శుభమాల్యమిళ
త్పరిమళమై కన్పడె శ్రీ
గురియుచు హరిమ్రోల గీతగోవిందమటన్

కవి ప్రతిభకు ఈ పద్యము నిలువుటద్దము. "సురవన మందార ముఖ్య శుభమాల్యమిళత్పరిమళము" అనుభావము కవి సొంతము. జగన్నాథుడు ధరించు మాలికల సౌగంధ్యము ఈ గ్రంథమున కంటినది. అనగా స్వామి దానిని తన గుండెల కత్తుకొనెను. అనగా మనసార స్వీకరించెను. స్వామియెదపై వసించు శ్రీదేవిని ఈ కృతి స్పృశించెను. కావున "శ్రీకురియు" చుండెను. అనగా గీత

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గోవిందమున "సురవన మందార ముఖ్య శుభమాల్యముల" పరిమళము నిండి యుండెననియు తత్పఠనమున శ్రీకురియుననియు నిందు వ్యంగ్యముగా సూచితము. జయదేవకృతి స్వీకారమునిట్లు చెప్పి సాత్త్వికరాజ గ్రంథ తిరస్కార ప్రసక్తిని కవి పరిత్యజించెను.

పద్మావతి తండ్రి వంశస్థులు ఉత్తమ లోకములకేగుటను కవి ఇట్లు చమత్కరించెను.

"పద్మావతి నొసంగె నుబ్బువెల్లి
మునిగి వంశస్థు లున్నతభూమి కెక్క"

వెల్లువ వచ్చినప్పుడు పల్లమున నున్నవారు ఎత్తైన చోటికి చేరుచుందురు. పద్మావతి వంశస్థులు ఆనందమను వెల్లువలో మునిగి ఉన్నత భూమి కెక్కిరనుట కవి భావనా శక్తికి, ఉక్తివైచిత్రికి చక్కని నిదర్శనము.

ఇట్లు కావ్యీకరింపబడిన ఈ జయదేవ చరిత్రమనిచో శాస్త్రిగారికి ఎంతయో భక్తి. కావుననే "దీనిం బాడిన విన్న మాధవుడిడున్ దీర్ఘాయురారోగ్యముల్" అని ముగించిరి.

—○—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్యాగరాజు

ఇది శాస్త్రిగారు షష్టిపూర్తి అనంతరము చేసిన రచనలలో నొకటి. వారి మరణానంతరము 1962లో ముద్రితము. ప్రచురణ కర్తలు రాజ్యశ్రీ కల్చరల్ బుక్ రైటర్స్ అండ్ పబ్లిషర్స్, పొన్నూరు వారు. శ్రీ ధర్మవరపు సీతా రామాంజనేయులు గారు ఈ కావ్యమునకు కృతి భర్త.

సుమారు నూట ఇరువది పద్యములు గల ఈ లఘు కావ్యమునకు వేలూరి శివరామశాస్త్రి గారి "పరిచయము," శ్రీ మదద్దంకి తిరుమల సమయోద్దండ కోలాహల లక్ష్మీనృసింహ తిరువెంగడ సింగరాచార్యులు అయ్యవార్లంగారి "ప్రస్తావన," పాతూరి మధుసూదనరాయ శాస్త్రిగారి "ప్రస్తుతి", విశ్వనాథ, తుమ్మల, కరుణశ్రీ గారల పద్యాభిప్రాయములు పూర్వరంగముగా నున్నవి.

వేలూరివారు "ఇట్టి త్యాగబ్రహ్మ చరిత్రమును శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రి గారు పద్యములలో రచించిరి. వీరు త్యాగరాజును చిత్రింప సమర్థులు. వీరు త్యాగరాజుగారి ప్రజ్ఞ వంటి ప్రజ్ఞ గలవారు .... శరవేగమున కావేరివలె ప్రవహించిన ఈ త్యాగరాజ చరిత్రము గాయకులకును. కవులకును, భక్తులకును ఒకరని ఏమిటి తెలుగువారికి త్యాగయ్య కృతులతోపాటు కర్ణపేయము" అని కితపత్రమునిచ్చిరి.

శ్రీమాన్ ఆచార్యులవారు "ఈ త్యాగరాజు అను కావ్యమును రస ఘనముగా, పరమ భోగ్యముగా ఉపక్రమోప సంహార సౌష్ఠవ పరికర్మితముగా ఔచిత్య చమత్కృతముగా సర్వలక్షణ సంపన్నముగా రచించిన భావక కవి పుండరీకుడగు శ్రీ చల్లా పిచ్చయ్యశాస్త్రిగారి కీర్తి మృత్యుంజయమూర్తి" అని తమ ఉపజ్ఞాప్రౌఢమైన ప్రస్తావనలో నిర్ణయించిరి.

చల్లా పిచ్చయశాస్త్రి సత్కవి మనీషాప్రౌఢి దీపింప గా
మొల్లంబౌ గతి త్యాగరాజ చరితంబున్ వ్రాసె పాండిత్య సం
పల్లీలా మతువెల్ల నారసి వచింపన్మేలు మేలంచు బై
నుల్లాసంబును పొంద గల్పనల నోహో యంచు వాచింపగన్

అవి విశ్వనాథ వారును,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తని పెను త్యాగరాజ చరితమ్ము త్వదీయము! రాగరాజువై
మను కవు లిట్టికై తకు సమర్థులు కారను టేమి వింత ! నీ
జననము ధన్యమయ్యె ఋషిసత్తమ! పిచ్చయ! మచ్చలేని కై
తను సృజియింప మిట్టె విబుధ ప్రవరుల్ కవులున్ బలాయనన్.

అని తుమ్మల వారును ఈ కావ్యమును ప్రశంసించిరి.

ఇందు రసము ముఖ్యము. చరిత్ర అనుషంగికము. స్థూలముగా శ్రుతమగు చున్న కథను రేఖామాత్రమగు ఆధారముగా గొని రసతత్త్వముల నున్మీలించుటయే కవిధ్యేయము. నాద బ్రహ్మ స్వరూపుడగు త్యాగరాజు హృదయము నావిష్కరించుటయే కావ్య పరమార్థము.

త్యాగరాజు చరిత్రను పలువురు పలుభాషలలో వ్రాసిరి. తెలుగు భాషలో కొందఱు గద్యరూపమునను, పద్యరూపమునను వ్రాసిరి. త్యాగయ్యగారి చరిత్రను మొట్టమొదట వ్రాసినవారు వారి ప్రత్యక్ష శిష్యులైన వాలాజీపేట వేంకటరమణ దాసుగారట!

అందఱు మహాపురుషుల జీవితచరిత్రలలో వలెనే త్యాగయ్య చరిత్రలో కూడ అనేక మహిమాన్విత సంఘటనలు చోటుచేసుకొన్నవి. ఆయన రచించిన కొన్ని కృతులకు లౌకిక ప్రాకరణికానుభవముల అర్థము కొంత శిష్య పరంపర వలన వెల్లడియైనది. వానిని విన్నవారు క్రమముగా నతిశయోక్తులల్లుట సంభవము ఇట్టి కథలకు, అర్థములకు చరిత్రగౌరవము లభింపకపోయినను వానిని పరిత్యజించి వట్టి చరిత్రను మాత్రమే గైకొన్నచో శాకపాకాద్యనుపానములు లేని శాల్యోదనము మ్రింగినట్లుండును.

చారిత్రాకాంశములు :

ఆంధ్ర వాగ్గేయకార చరిత్రములో (1958) శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావుగారు వ్రాసిన చారిత్రకాంశములకు భిన్నమైన పోకడలు కొన్ని ఈ కావ్యము నందు గోచరించును.

త్యాగయ్య ఇరువదిఐదవయేట పార్వతమ్మ యను తన మొదటిభార్య మరణింపగా ఆమె చెల్లెలైన కమలాంబను ద్వితీయ వివాహము చేసికొన్నట్లున్నది. శాస్త్రిగారు భార్యావియోగ ఘట్టమును ఇంకను ఉత్తరవయస్సునకు మార్చి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ద్వితీయ వివాహప్రసక్తి లేకుండ చేసినారు. జప్యేశ త్యాగయ్యలకు నడుమ రామ నాథ బ్రహ్మమను మఱియొక కుమారుడున్నట్లు అతడు యౌవనమున మరణించి నట్లు ఉన్న చరిత్రను శాస్త్రిగారు పరిత్యజించిరి. రామబ్రహ్మమునకు ఇరువురే కుమారులని నిర్ణయించిరి.

వీణ కాళహస్త్యయ్యగారు త్యాగయ్యగారి మేనమామ యని బాలాంత్రపు వారు వ్రాయగా మాతామహుడని శాస్త్రిగారు వ్రాసిరి.

స్వల్పమైన ఈ చారిత్రక విభేదములు తప్ప తదితరములైన కల్పన లన్నిటియందు సమానమే.

నూట ఇరువది పద్యముల స్వల్ప పరిధిలో త్యాగరాజ జీవిత సర్వస్వము ఇందు చిత్రింపబడినది. బాల్యము, నారదాగమనము, సంకీర్తన పూజావిధానము. రామపంచాయతన నిమజ్జన ఘట్టము, క్షేత్ర సంచారము అను ముఖ్య ఘట్టములు మాత్రము విస్తరింపబడెను. సన్యసించుట, సిద్ధిపొందుట చెప్పబడలేదు.

త్యాగరాజ కీర్తనల పల్లవులనుద్ధరించుచు, వానితో కథార్థమును సమన్వ యించుచు వ్రాసిన పద్యములు ఇందు కలవు. ఇది ఈ కావ్య ప్రత్యేకతను నిరూ పించు శిల్ప విశేషము.

> "మనస! యుండేది" వినవె! "యో మనస భజన
> జేయవే" కోరుచు "భజన చేయరాద"
> కలదు "చక్కని రాజమార్గంబు" తెలిసి
> రామ" కడతేర్పరావె శ్రీరామచంద్ర

పై పద్యమున కొన్ని పల్లవులు మాత్రము ఉట్టంకింప బడినవి. ఈ క్రింది పద్యమున పల్లవులతో వాక్యనిర్మాణము జరిగినది.

> "ఎందు గౌగిలింతు" నే "భవనుత!" యెట్లు
> దొరికితో మునిప్రవరుల కరయ
> "చేతులార" గొల్తు "శ్రీపతే" తులసీ ద
> ళముల" "దులసి బిల్వ సముదయముల!"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"నెనరుంచి" రారయిటు "మో
హనరామా!" "నా మదెందునరుగదురా" నా
"మనవిని వినుమా" "లోకా
నన!" "మఱచెడువాఁడనా" ఘనా! రఘురామా!

పాత్ర చిత్రణము :

ఈ కావ్యమున రామబ్రహ్మము, త్యాగరాజు, నారదుడు అను మూడు పాత్రలు అత్యద్భుతముగా చిత్రింపబడినవి.

త్యాగయ్య తండ్రియైన రామబ్రహ్మముగారిలోనే త్యాగయ్యగారి లక్షణము లన్నియు నెలకొల్పబడినవి. తిరువాయూరే నిత్యతృప్తులు నిరతంబు నెలవుకొను తావుగా తీర్చబడెను. రామధ్యానపరుడు, నిర్మలుడు, నిర్వ్యాజుడు, నీరంధ్ర తేజో మధ్యందిన భాస్కరుడు, ప్రకటాస్తోక ప్రభావాఢ్యుడునైన బుధరాడ్రత్నంబుగా రామబ్రహ్మము పరిచయము చేయబడెను.

"ప్రతిబింబంబును బింబమొక్కడుగ నక్రాంతంబు దర్శించు ధన్యత ముండ్డు" గాను అనేక తీర్థములను సేవించి దైవతములను పసిడిపూలతో కొల్చిన ఘనుడుగాను తీర్చిదిద్దిరి. వేలూరి వారన్నట్లు "ఎవరే నొక గొప్పవానిని చెప్పు పట్ల గోరంతలు కొండంతలు చేయుట కాదిది. ఈ రామబ్రహ్మముగారు కాంచీ పీఠస్థులగు ఉపనిషద్ బ్రహ్మేంద్రస్వామివారికి మిత్రులని చెప్పినచో జాలును" ఈ పాత్రనిట్లు చిత్రించుట వలన త్యాగరాజును గూర్చి విస్తరించి చెప్పవలసిన అవసరము లేకపోయినది.

త్యాగరాజు ననుగ్రహించుటకై కపటసన్యాసి వేషమున వచ్చిన నారదుని రూపము ఇట్లు చిత్రింపబడినది.

మహతినామంబున మహిమగాంచినయట్టి
భుజవీణ తనలోన భజన సేయ
మునిసింహమనుమాట కొనసాగ జేసిన
గడ్డమంతర్ముఖ కలనమెలఁగ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పాణి పద్మంబున బరగిన జపమాల
దివసాంతకమల భృంగవిధి దెలప
పాదపద్మము తొట్రువడ దాండవము జేయు
సంరంభ మానందజలధి దెలుప

త్యాగరాజుని యెదుర బ్రత్యక్షమయ్యె
గపట సన్యాసి వేషమ్ము గాంచి సర్వ
లోక సంచారి పరహితాలోకనుండు
నలినభవు ముద్దు కొమరుండు నారదుండు!

త్యాగరాజు :

కథానాయకుడైన త్యాగరాజు కావ్యారంభమునుండి అంతమువరకు. బాల్యము నుండి వార్ధకము వరకు సమగ్ర సుందరముగా జలగతతైలబిందు వికాసానుకారియై విస్తరించి వెలుగొందినాడు. ఆయన పుట్టుక అనేక తీర్థక్షేత్రములు సేవించిన పున్నెముల పంటగా చెప్పబడినది.

పురిటింటిలోనే అతడు మహిమలు చూపమొదలిడెను. తనకు పురుడు యోగీశ్వరులే అని చాటినట్లు యోగదృష్టి అచ్చుపడనుండెను. తల్లి గర్భములో నుండగా 'కావుకావు' మని భగవంతుని గూర్చి చేసిన ప్రార్థన నేలపైపడినను మరువలేదని కల్పన చేసిన ఈ క్రింది పద్యము త్యాగయ్యను ఆజన్మముక్తునిగా నిరూపించును.

నినునేవీడను నీవెనాకుగతి నిర్నిద్రప్రభా! శ్రీపతీ!!
వినుమా నామొర కావుకావుమని నిర్వేలంబుగా జాలి తా
జననీగర్భమునందు నే నిలుకడన్ స్థాపించెనో యాత్మ దా
నిన నేలంబడియుం జలింపక కొనే న్నెర్వెట్టిదో వానికిన్.

ఈ పద్యమును గూర్చి శ్రీమాన్ ఆచార్యులవారు తమ ప్రస్తావనలో విపులమైన వ్యాఖ్యానము చేసి కావ్య శరీరమునకు ప్రాణభూతమైనదని నిర్ణయించిరి.

అతని బాల్యము పరమయోగ విద్యా రహస్య సముచిత సమయమా అన్నట్లు ఇట్లు నడచినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తనతల్లి పెట్టునుగ్గును ద్రావు సద్గురు
ముఖమండల సుధాప్రబోధమట్లు
తన మాత పోయు లాలను గ్రహించు ప్రవర్తి
తానంద విమల లహరిక యట్లు
తనయంబ కూర్చు జోలను చెవింజేర్చు ను
పనిషద్వధూటి గోష్యంబు లట్లు
తన యమ్మ యూచు నూపునుగొను సర్వేశ
భావనాదృఢ పారవశ్య మట్లు

అతని బాల్యంబు కాదు బాల్యంబు పరమ
యోగ విద్యారహస్య సముచిత సమయ
మనపలయు నట్లు గాకున్న నట్టి వింత
దొడ్డలం గాంతుమే? పుట్టుబిడ్డ లందు!

ప్రహ్లాద నారదాది పరమ భక్త వర్గములోని వాడైన త్యాగయ్య శైశవము ఇట్లుకాక మరెట్లుండును? ఇట్టి కల్పన చేసిన శాస్త్రిగారి పరిణతికి సాహితీలోకము ప్రణతి నర్పించుట సహజము.

నాదతనుదేవుని కొలుచుచున్న త్యాగయ్యగారి రూపము తాత్త్వికముగా నిట్లు చిత్రింపబడినది.

రాగమాలిక బూని రక్తివయస్యతో
గానకళాకాంత గళమునందు!
మర్యాద కొనసాగ మధురార్థములతోడ
వైదుషీసుందరి వాక్కునందు!
రసమున దోగాడి ప్రసరద్రుచులతోడ
గవితావధూటి హృత్కమలమందు!
నవనవత్వంబున దవిలి కల్పనతోడ
ప్రతిభా రమణి సహస్రారమందు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తన్న గొలువంగ ద్యాగయ తగిన శిష్య
వరులు తో రాఁగ నానంద పరవశు డయి
పరగు పంచాపదేశ సప్త స్థలముల
నాదతనుదేవు గొల్చు పెన్నంగ వశమె?

విగ్రహములు మాయమైనప్పుడు త్యాగయ్య దుఃఖము ఇట్లున్నది.

పెన్నిధానఁబు గోల్పడ్డ పేద వోలె
దల్లి కన్పడకున్న వత్సంబు పగిది
భోరు భోరున విలపించె భూధరములు
కరుగ ద్యాగయ్య శ్రీరఘువరుని గుఱిచి!

నాయక పాత్రోపసంహారములో కవిచూపిన చాతుర్య మేమనగా త్యాగయ్య గారు మరణించినట్లు చెప్పకపోవుట. కావ్యమును చదివి ముగించిన వారెవరికైనను త్యాగరాజు నేటికిని సజీవుడై తోచునట్లు ఈ క్రింది పద్యముతో నుపసంహరించెను.

కాకర్ల గిరిరాజు కవిరాజు తనకు బు
ధోత్తముఁడు పితా మహుండు గాగ!
పండితాగ్రణి రామబ్రహ్మము శాంతాంబ
ననిచిన జననీ జనకులు గాగ!
కాళహస్త్యాఖ్యుండు నాగాబ్ధి వీణ వం
ద్యుండును మాతా మహుండు గాగ!
రామాయణ గ్రంథ రచనను గాన గ
ర్భిత పద్యముల్ గేయ విధము గాగ!

కృతుల బొనరింప నా యాజ్ఞ గృతి జనించె
పంచనదమున వాల్మీకి ప్రథిత భక్తి
త్యాగ రాజాఖ్య దన్మయత్వమ్ము తోడ
పాడు చున్నాడు నామది పల్లవింప!

'పాడుచున్నాడు' అను వర్తమానార్థక క్రియను ఉపయోగించుటయేగాక వాల్మీకియే త్యాగరాయాఖ్యతోనున్నట్లు ముగించుటచేత ఆ పాత్రకు సార్వకాలికత్వము, సంపూర్ణత్వము సిద్ధించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రసపోషణ :

ఈ కావ్యమునందు శాంతమే అంగిరసమని నిర్ణయింప వలసియున్నది. త్యాగయ్య జీవితమున జననము నుండి తుది వరకు 'నిను నే వీడను' 'తన తల్లి పెట్టు నుగ్గును ద్రావు' మొదలగు పద్యములందు' 'నిష్ప్రమాణ విషయ సక్తులకై చింత వెల్లడించె' మొదలగు వాక్యములయందును శాంతరస భావములే విస్తరింపబడినవి. భార్యా వియోగసందర్భమున ఇది మరింత స్పష్టము.

అంగ రసములలో కరుణము ముఖ్యము. జప్యేశుడు రామపంచాయతనమును కావేరిలో పడవైచినప్పుడు త్యాగయ్య ఇట్లు విలపించెను.

ఏ తాలు సోకెనో? యీ నీ లతాంత కో
మల గాత్రయష్టి గంటులను గాంచె

ఏ మున్న ప్రామెనో? యీ నీ తటిల్లతా
భంబైన పట్టు పుట్టంబు మాసె

ఏ కొమ్మ పట్టెనో? యీ నీ మొలక వెన్న
లే యొప్పు తులసి మాలికలు చెదరె

ఏ యొత్తిడయ్యెనో? యీ నీ సరోజ సుం
దర సురేఖాఢ్య పాదంబు లరిగె

ఎట్టుల సహింతు నిలువేల్ప! యిట్టి మార్పు
పట్టి నలయించి యిన్నాళ్ళు పడిన హాయి
యిద్దియా? యమ్మ! కావేరి! యెట్టు లోర్చి
తరసి నీ గర్భమున నున్న యయ్య పాట్లు

త్యాగయ్యను దొంగల బారినుండి రామలక్ష్మణులు కాపాడుట, మృత బ్రాహ్మణుని త్యాగయ్య 'నా జీవాధార' అను కీర్తన పాడి బ్రతికించుట అద్భుత రసస్ఫోరకములు.

త్యాగరాజ చరిత్రమును కావ్యవస్తువుగా గైకొని కవి తాగయ్యగారి ఆదర్శవంతమైన ధార్మికజీవనమును, సంగీత పరమార్థమును, అపారమగు రామభక్తిని ప్రబోధించెను. అదియే ఈ కావ్య సందేశముగా కావ్యమధ్యమున నిట్లు స్థాపింపబడెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పార్వతీశ్వర పరస్పర వాద మూలంబు
వాల్మీకి నారద భాషితంబు
శ్రీమద్వశిష్ట విశ్వామిత్ర సుకృతంబు
సౌమిత్రి హృదయ పంజర శుకంబు
భరత యానోన్ముఖ ప్రాణ ప్రదానంబు
సంజనా తనయ రసాయనంబు
శబరీ జనుశ్శత సంస్కార సుఫలంబు
సీతా నిరంతర శ్రీనిధాన

మని యెఱుంగుడు రామ నామామృతంబు
సకల నిగమాగమ సుధాబ్ధి సార మథన
జనితమని గుర్తెఱుంగుడు సరణి విడక
యనుభవింపుడు భక్తితో నఖిల జగము
'గీతార్థ' మనియు 'సంగీత శాస్త్రం' బు గీ
తార్థంబు శోభిల్లు ననియు గొన్ని
కృతుల నాదార్థంబు నెఱిగించె గానంబు
మాధవు దర్శించు మార్గమనియె
రాగ లోభాదులు భోగంబులును ద్యాగ
మొనరించుచో సుఖమనుచు బలికె
కలిలోన జిక్కక కడు మెలంకువ తోడ
శ్రీనాథు నెపుడు భజింపుడనియె
మఱియు ధర్మంబు లెన్నియో మహిని గఱపె
రాగములు జీవనాడులు రక్తి కళలు
భక్తిరస యోగమున దేట పరచి కృతుల
బోత పోసెను జగతి నపూర్వముగను
త్యాగరాజను పేరిటి యోగరాజు

త్యాగరాజ హృదయము నావిష్కరించు ఈ లఘుకావ్యము శాస్త్రిగారి పరిణతికి నిదర్శనమగు భారతీ పరిష్కారము. వేలూరి వారన్నట్లు 'త్యాగయ్య కృతులతో పాటు కర్ణపేయము.'

—౧—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శుక రంభా సంవాదము

శాస్త్రిగారి ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములకు సంగమస్థానమై శాశ్వత యశః పరికల్పన మొనర్చినదీ యలఘు లఘు కావ్యము. ఆంధ్రసాహిత్యములోనే ఇది అనిదంపూర్వప్రక్రియ. ఇందు శ్లేష వక్రోక్తి పరస్పర విరుద్ధములగు శృంగార శాంతరసములకు వారధియైనది. సంస్కృతాంధ్ర వ్యాకరణచ్ఛందోమర్యాదలను ఈ సంవాద కావ్యము చమత్కారముగా తెలియజేయుచున్నది.

ఈ కావ్యము 1958లో శ్రీ ఈదర వేంకటరాయ కళావిద్గణిచే ఏలూరున ముద్రితము. అప్పటికి సుమారు ముప్పదియేండ్ల క్రితము దీనిని రచించినట్లు కవి 'తొలిపలుకు'లో చెప్పుటవలన నిది సుమారు 1926 సంవత్సర ప్రాంతములలో రచింపబడినట్లు నిర్ణయింపవచ్చును.

కొలది శ్లోకములతో పూర్వకవి కృతమై యున్న 'శుక రంభాసంవాదము' అను సంస్కృత కావ్యమును తిరుపతి వేంకట కవులు స్వతంత్రానువాద పద్ధతిలో నాంధ్రీకరించిరి. శాస్త్రిగారు మృదుమధుర శైలిలోనున్న తిరుపతి వేంకట కవుల అనువాదమును చదివిన వెంటనే ఆ నామముతోనే నూటికి పైగా పద్యములతో ఖండకావ్యము స్వతంత్ర రచనగా రచించినట్లు పేర్కొనిరి. కావున ఇది దేనికిని అనువాదము కాదు. సంస్కృత రచనలో నలువది శ్లోకములున్నవి. తిరుపతి వేంకట కవుల యనువాదమును యథామూలములగు నలువది పద్యములతో నున్నది. వాద ప్రతివాద రూపమున రంభా శుకుల నడుమ సంవాదము నడచినట్లు చిత్రింప బడెను. శాస్త్రిగారి రచన పై మూలానువాదములకు భిన్నమైన స్వతంత్ర రచన. శుకుడు, రంభ, వారిరువుని నడుమ సంవాదము, శాంత శృంగార రసముల మధ్య పోరాటము, ఇదియే కావ్య ప్రకాశిక. సంవాదములోని వాదప్రతివాదములు కవి కల్పితములు. రంభా శుకుల సంభాషణలో కవికూడ మధ్యవర్తియై వ్యాఖ్యా నించుచు సూత్రధారకృత్యమును నిర్వహించుట ఈ కావ్యములోని ప్రత్యేకత. రంభాశుకులు మత్తేభములై వివదించుకొనుచుండగా కవి కందముతో వారి నడుమ ప్రత్యక్షమగుచుండును. కావ్యమంతయు నిదే పద్ధతి. మొత్తము పద్యములు నూట పండ్రెండు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కథ :

రంభాశుకుల సంవాదము మాత్రమే మూలానువాదములలోనుండగా శాస్త్రి గారు ఆ సంవాదమునకు పూర్వరంగమేర్పఱచిరి. సూత్రధార వచనమువలెనిది కథా సన్నివేశమును సంధానించుటతోపాటు కావ్యకథను సంగ్రహముగా కవి మాటలలో పాఠకులకందించుచున్నది.

ప్రాయమున బ్రహ్మచర్యతపోదీక్షను పూనినవారిని పరీక్ష చేయుటకై దివ్య సౌందర్య సంపన్నలగు దేవతాంగనలను వేల్పులు పనుచుచుందురు. సర్వమును బ్రహ్మభావనతో చూచు శుకుని స్థాయి నెఱుంగక అతనికడకు వజ్రి శృంగార పరయైన రంభను పంపెను. ఆమె వచ్చుచునే శుకుని విరాగ వాగ్వైఖరులను విడచి శృంగార పరముగా నర్థములు చెప్పసాగెను. అట్లు ఎంత ప్రయత్నించినను ప్రయోజనము కలుగక పోవుటచే రంభ స్త్రీ పురుషయోగమున ప్రసిద్ధిగన్న మరుని ప్రార్థించియు నణుమాత్రమేని ఫలముగానక తనకే వైరాగ్యము కలుగగా దేవేంద్రుని కొలువు చేరెను.

కావ్య విశిష్టత :

సంస్కృతములోను, అనువాదమునందును రంభాశుకుల సంవాదము ఒకరు ప్రతిపాదించిన దానిని మరియొకరు ఖండించు పద్ధతిలో మనుచరిత్రలోని వరూథినీ ప్రవరుల సంభాషణవలె సాగినది. శాస్త్రిగారి కావ్యమున శుకుడు వైరాగ్యపరముగా చెప్పిన పద్యమునే గైకొని రంభ దానికి శృంగారపరమగు నర్థము చెప్పు చుండును. అట్లని ఇది ద్వ్యర్థికావ్యము కాదు. ఒక్క శ్లేషననుసరించియే కాక సంస్కృతాంధ్రవ్యాకరణచ్ఛందశ్శాస్త్రముల నాధారముగా గొని ఈ ప్రయోగము చేయబడినది. ఆంధ్రసాహిత్యమున ద్వ్యర్థికావ్యములు, శ్లేషకావ్యములు నున్నవి కాని ఈ విధముగా రెండు విరుద్ధ రసములకు చెందిన వాదప్రతివాదముల కొకే పద్యమును పాదుగా చేసిన కావ్యములు లేవని చెప్పవచ్చును. అది శ్లేషవక్రోక్తిచే సాధితము. కావున దీనిని 'శ్లేషవక్రోక్తి కావ్య' మనవలెను. సారంగధర చరిత్ర మున చేమకూర వేంకన్న ఇట్టి పద్యములను కొన్నిటిని రచించెను కాని 'శ్లేషవక్రోక్తి కావ్యము'గా చెప్పదగినది మరియొకటి కానరాదు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నాటకీయత :

శుకుడు, రంభ, కవి మూడు పాత్రలుగా నున్న పద్యనాటికగా నీ కావ్యము భాసించుచున్నది. కవి సూత్రధారుడై కృత్యాదిని నాందీప్రస్తావనల వలె నిర్వహించెను. 'శ్రీ చెలంగ నధీతి బోధాచరణల' అను పద్యమును నాందిగా, 'ప్రాయమున బ్రహ్మచర్య' అను పద్యము నుండి 'శుకుడు నీవార శూకవత్' అను పద్యము వఱకు గల కథాసంగ్రహమును ప్రస్తావనగా భావింపవచ్చును. ఆపై కవి రంభాశుకుల సంవాదమున ప్రయోక్తయై పర్యాయ పద్ధతిలోవారి వాదమును నడపించుచుండును. ఆ వాదమున వారిలో కలుగు భావతీవ్రతలను, ఆంగికాద్యభినయములను కవి సూచించుచుండును. చివరకు సంవాద ఫలితమును కవి ప్రకటించుటతో నిది ముగింపబడెను. పందొమ్మిది వందల ఏబది ఎనిమిదిలో ఈకావ్యమును ఆకాశవాణి వారు యథాతథముగా పద్యనాటికగా ప్రసారముచేసిరి.* దీనిలోని నాటకీయ శిల్పమునకు అది ప్రమాణము.

కవి హృదయము :

ఈ కావ్యమున ఆనందజనకత్వము కంటె ఆశ్చర్యకారిత్వము అధికమన వచ్చును. శ్లేషలు, విఱుపులు, చమత్కారములు పఠితలకు ఆశ్చర్యమునే కలిగించును. వైరాగ్యమును. వేదాంతమును బోధించుటకు కవి ఈ మార్గమున పోవలసిన ఆవశ్యత లేదు. వానికొఱకై దీనిని చదువువారికి విశేషములేమియు కన్పట్టవు. మఱి కవి ఇట్లేల రచించెను అను ప్రశ్నయుదయించుట సహజము. కృత్యాదిలో కవియే 'కవి హృదయము' అను శీర్షికతో ఆ ప్రశ్నకు ఇట్లు సమాధానము చెప్పెను -

భాషాంగము లెన్నో సుర
భాషకు నవియెల్ల నాంధ్రభాషనె యనుచున్
భాషాభిమాని భాషా
పోషకులకు దెల్ప గృతిగ బొసగించితి జూ

సంస్కృతభాషలోనున్న ఛందోవ్యాకరణాలంకార విశేషములు ఆంధ్రభాషకు కూడ చెందుననియు, వానిని ఆంధ్రభాషలో కూడ చూపవచ్చుననియు

---

*. 19-11-1958 రాత్రి 9.15 నుండి 10.15 వరకు ఆకాశవాణి, విజయవాడ కేంద్రం.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాషాభిమానులకు తెలియచేయుటకే కవి ఈ ఇతివృత్తమును కృతిగా పొసగించె నట. 'తొలిపలుకు'లో ఇట్లు చెప్పబడెను.

'నా ప్రధానోద్దేశము పూర్వకవి కృత రచన రీతిగానే శుక పాత్రోచితము లగు వైరాగ్యవాక్యములు, రంభాపాత్రోచిత శృంగార వాక్యములు ప్రయోగింప బడినవి. కాని యొకమారు వైచిత్రిని జూపితిని. మొదట శుక ప్రయుక్తమగు వాక్యమును నొకచోనక్షరము కలిపి, యొక అక్షరమును వదలి రంభా సమాధాన శృంగార వాక్యములుగా మార్పు చేయబడినవి. ఆ మార్పులలో ఛందోవ్యాకరణాది గ్రాంధిక భాషానియమములు, కేవల సాంస్కృతికుడు ఆంధ్రాభాషాపదములను ప్రయోగించు విధము, కేవలాంధ్రుడు సంస్కృత భాషాపదములు ప్రయోగించు విధము తెలియ జేయుటయే' -

పై అభిప్రాయములను బట్టి కేవల సంస్కృతమును, కేవలాంధ్రమును అభ్యసించుట చాలదని, దానివలన వివాదములు, అర్థభేదములేర్పడునని, సమన్వ యజ్ఞాన మావశ్యకమనియు కవి హృదయమని చెప్పవచ్చును. అట్లే యైనచో కవి తన హృదయమును ఆవిష్కరించుటకు అత్యంత చమత్కార భరితమగు మార్గము నెన్నుకొని కృతకృత్యుడయ్యెననవచ్చును. ఒకరిమాటలోని ఆంతర్యము మరి యొకరికి సరిగా అర్థము కానప్పుడే విపరీతార్థములేర్పడి వివాదములగును. ఆ సత్యమే రంభాశుక పాత్రల ముఖమున నిందు చెప్పబడెను. ఇరువదవ శతాబ్ది తొలినాళ్ళలో సంస్కృత పండితులు తెలుగును నిరసించెడువారు. దానితో మరి కొందఱతివాదులు తెలుగునకు సంస్కృత భారమును వదలింప వలెనని ఘోషిం చెడివారు. పై రెండు అతివాదములను దృష్టిలోనుంచుకొని తత్ఫలితములను సూచించుటకై శాస్త్రిగారు ఈ కావ్యమును వ్రాసినట్లు తోచును.

ఈ కావ్య వైశిష్ట్యమును గూర్చి తమ పీఠికలో శ్రీ నాగలింగం వేంక టేశ్వర శాస్త్రిగారు ఇట్లు పేర్కొనిరి.

'ఈ కావ్యమున నభిలషితమగు శాంతివిజయము సమర్థముగా; పుష్కల ముగా నిర్వహింపబడినది. అయితే, యుక్తి ప్రతియుక్తులతో గాక, పూర్వపక్ష సిద్ధాంత సరణితో గాక, వాద సరళి ఉక్తిప్రత్యుక్తి చాతురీ సామాగ్రితో సంపా దితమైనది. మాటల విఱుపులును, అర్థ పరిణామములును. అభంగ సభంగ శ్లేషల నిరూపించుచు; ప్రణయ ప్రసంగ సంగతయగు ప్రియురాలి మోవి విఱుపులవలె తళితీపులు కూర్చుచున్నవి.'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆంధ్రపత్రికలో నీ కావ్యమును సమీక్షించుచు శ్రీ యామిజాల పద్మనాభ స్వామిగారు ఇట్లు ప్రశంసించిరి.

"శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు తేనెలు ఊటలూరే తీరుతో కూర్చారు సంస్కృతాంధ్ర పదాలను. దీనిని చదివి అర్థం చేసుకొని ఆనందించాలంటే సంస్కృతాంధ్ర భాషల పర్యాప్త క్షుణ్ణంగా తెలుసుకోవాలి. శాస్త్రిగారికి రెండు భాషలూ కరతలామలకాలయిపోయాయి. ఆ ప్రజ్ఞానిధికి కావలసినట్లు రెండు భాషల పదాలూ ఈ రచనలో లొంగిపోయాయి. రెండు భాషలనూ ఇష్టార్థపూర్తికి వాడుకొన్న విద్వత్కవులు తెలుగువారిలో పింగళి సూరన్న, రామరాజ భూషణుడూ అనే ఇరువురూ దిగ్గజాలవంటి వారు. శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు ఈ రచనను ఆ మేధావుల రచనలకు దీటుగా సంతరించారు.

రసచర్చలోనూ, వాక్యప్రతివాక్యాల పొందికలోనూ ఇంత లలితమైన శయ్యలో వెలువడిన ఆంధ్రీకరణంలో* ఇదే ఉత్కృష్ట రచన. కామ వైరాగ్య ప్రబోధ చర్చా ప్రసంగావిష్కరణలో శాస్త్రిగారు కూలంకషధిషణాధురంధరులై దీనిలో దర్శన మిస్తున్నారు. ప్రతి పద్యమూ వారి శక్తికీ, యుక్తికీ మూర్తి నిచ్చింది."**

అంతర్దర్శనము :

అలంకార శాస్త్రమున, అలంకార ప్రకరణమున, శ్లేషాలంకారమువలె వివాదాస్పదమైన అలంకారము మరియొకటి లేదేమొ! దానిని శబ్దాలంకారములలో చేర్చవలెనా అర్థాలంకారములలో చేర్చవలెనా రెండువిధములుగా అంగీకరింపవలెనా, ఆనుషంగికమా, స్వతంత్రమా? ధ్వనికిని శ్లేషకును భేదమేమిమున్నగు చర్చలెన్నింటికో శ్లేష రంగభూమి. సాహిత్య దర్పణకారుడు, మమ్మటుడును శ్లేషను శబ్దాలంకారములతో చేర్చి ఎనిమిది భేదములు పేర్కొనిరి. మమ్మటుడు తొమ్మిదవ భేదమును కూడ ప్రతిపాదించెను. దండి అర్థాలంకారములలో కూర్చి సప్తధావింగడించెను. శ్లేషానుషక్తములుగా ఉపమాద్యలంకారముల నేడింటిని

---

* సమీక్షకులు పేర్కొనినట్లు ఇది మూలమునకు ప్రత్యక్షముగా ఆంధ్రీకరణము కాదు. అనుసరణము మాత్రమే.

** తేది. 15-12-1957 (ఆదివారం)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిరూపించెను. విద్యానాథుడు స్థూలముగా ప్రకృతాప్రకృతోభయ భేదములను చెప్పి ముగించెను.

శుకరంభా సంవాదమున బహువిధములగు శ్లేషభేదములు గోచరించు చున్నవి. ప్రాచీన సంస్కృతాలంకారికులు చెప్పినవేకాక వారి మార్గమున ఆంధ్ర భాషా మర్యాదల ననుసరించి మరికొన్ని నూత్న ప్రభేదములను ప్రతిపాదించ వలసి యుండును,

వక్రోక్త్యలంకారమును శ్లేష వక్రోక్తి, కాకు వక్రోక్తి యని రెండు విధములుగా మమ్మటాదులు పేర్కొనిరి.* ఆ శ్లేష వక్రోక్తి మరల సభంగా భంగ భేదముచే ద్విధాకృతము. ఈ సంవాదమున ప్రత్యర్థు లిరువురు తమ వాద ములను కొనసాగించుట కీ యలంకారమే ఆధారము.

ప్రకృతశ్లేష :

శుకుని మోహింపజేయుటకై అతని ఆశ్రమ ప్రాంతమున కేతెంచిన రంభ అచ్చట నున్న చిలుకకు, శుకునకు అన్వయించునట్లుగా ఇట్లనెను.

సకలార్థ ప్రతిపాదకుండవు వచస్సంధాత వుద్యన్నవీ
న కలాశాలివి యాగమాంతర రహో నాదజ్ఞరత్నంబవా
శుకవిగ్రామణి పుత్తరోత్తరపదక్షుణ్ణ ప్రచారుండ వో
శుక! నీవేయిటులున్న నింకెవరు మాచుట్టంబు లిచ్చోటునన్
"నిరతము శ్లిష్టవిశేష్యత
నమదందును ప్రకృతములు నప్రకృతములున్"**

అని నరసభూపాలీయము. విశేష్యము "శుక" పదమిందు శ్లిష్టము. విశేషణములన్నియు శ్లిష్టములే.

చిలుక :

ప్రేమికులకు సందేశప్రయోజనమునిచ్చును. మాటలు కలుపును. చక్కని కాంతి కలిగియుండును, చెట్ల గుబురులలోని మర్మపు కూతల నెఱిగి యుండును. శుకములలో శ్రేష్ఠము. అందముగా మున్ముందుకు నడచుచుండును.

---

* యదుక్త మన్యథావాక్య మన్య థాన్యేన యోజ్యతే
శ్లేషేణ కాక్వా వా జ్ఞేయా సా వక్రోక్తిస్తథా ద్విధా
(కావ్య ప్రకాశః, నవమోల్లాసః శ్లో : 1)

** పంచమాశ్వాసము, ప. 162,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శుకుడు :

అనేక సారస్వత తాత్త్వికార్థములను ప్రతిపాదించువాడు. కవి. చతుష్షష్టి కళలు తెలిసినవాడు. వేదములలో వినిపించు రహస్య ప్రణవనాదము నెఱింగిన వాడు. ఆశువుగా కవనము చెప్పగలవాడు. ఒకదానికన్న మరియొక్కటి బాగుండు నట్లు పదప్రయోగములు చేయువాడు.

అప్రకృత శ్లేష :

కలశాస్త్రింబులు చక్కబెట్టు విదుషీ కాంతామతల్లుల్ గదా
యల జేజే జలజాక్షు లట్లగుట నీ యా మంత్రణం బన్యథా
కలనం దేల్చితి తెల్వి మాలి యెటు పాకద్వేషి లాలించు నీ
పలుకుల్ కేవల కాముకుం డతడు రంభా! యింత యోచించునే

ఇచ్చట అప్రకృతపగు శ్లేష యుత్థితమగుచున్నది. జేజే జలజాక్షులకు విశేషణమగు "కలశాస్త్రింబులు" అను వాక్యమున కల అను పదము దేశ్యమై "అన్ని శాస్త్రములు" అనియు, సంస్కృతమై "అవ్యక్త మధురధ్వని"- యనగా పారావత కూజితోపమ మణిత ధ్వని శాస్త్రములు అనియు అర్థద్వయము సిద్ధము. ఆ పదమునే "కలశ + అస్త్రంబులు" అని సభంగము చేసినచో నిగూఢోపమేయమై "కలశముల వంటి స్తనములనెడి ఆయుధములు" అను మరియొక అర్థము లభించును. "పాకద్వేషి" యనుచోట "పాకుడను రాక్షసుని సంహరించినవాడు" అను సాధారణార్థముతో పాటు "మంచి వనమును ద్వేషించువాడు" అను వేరొక యర్థము జనించుచున్నది. దేవకాంతల పాండిత్యమిందు ప్రకృతము. దానిని తెలియజెప్పు పదములనుండి ప్రకృతమున కక్కరలేని పై శ్లేషలన్నియు యుద్భవిల్లుటచే నీ పద్యము అప్రకృత శ్లేష కుదాహరణము.

అభంగశ్లేష :

సకలార్థ ప్రతిపాదకుండవు వచస్సంధాన వుద్యన్నవీ
న కలాశాలివి ఆగమాంతర రహోనాదజ్ఞ రత్నంబ వా
శు కవిగ్రామణి వుత్తరోత్తర పదక్షుణ్ణ ప్రవాహుండ వో
శుక!...............

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను పద్యమున "ఆశు కవి గ్రామణి" అను విశేషణము తప్ప తక్కిన వన్నియు శుకుని పక్షమున, శుకము పక్షమున పదముల విఱుపు లేకయే శ్లేషను సాధించుటచే నిది యభంగ శ్లేష కుదాహరణము.

సభంగ శ్లేష :

జలజాయత నేత్ర! యిందు నెటులన్ సాధింతువో చూతు గే
వలముం గమ్మని మారుతమ్ముల భంజింపం జాలి యెంతే....

అను పద్యమున "మారుతమ్ములు" శుకునిచే "గాలి" అను నర్థమున ప్రయుక్తము. రంభ ఆ పదమును సభంగము చేసి "మన్మథ బాణముల" ను అర్థమును సాధించును.

ఈ సభంగ శ్లేష వర్ణ, పద, లింగ, భాషా, ప్రకృతి, ప్రత్యయ, విభక్తి, వచన భేదములచే అష్టవిధమని దర్పణకారాదుల వక్కాణము. ఇట్టి శ్లేష భేదములన్నియు వక్రోక్తియందు పర్యవసించి శ్లేష వక్రోక్తులగును.

ప్రాచీనాలంకారికులేర్పరచిన శ్లేష భేదములే కాక నురికొన్ని ఇందు వక్రోక్తిని సాధించుచున్నవి. వాని నుట్టంకింతును.

పారిభాషిక పద శ్లేష :

సంస్కృతాంధ్ర వ్యాకరణములందు, ఇతర శాస్త్రములందు పరిభాషలుగా సిద్ధమైన కొన్ని పదములు లౌకికముగా లద్భిన్నార్థకములగును. ఈ భేదము నాధారము చేసికొని సాధింపదగు శ్లేషను పూర్వాలంకారికులు చెప్పలేదు. "నపుంసక మితి జ్ఞాత్వా ప్రియాయై ప్రేషితం మనః" మున్నగు చాటువులలో నిట్టి శ్లేష కనప్పటును. దీనిని పారిభాషిక పదశ్లేష యనవచ్చును.

తెలియం జేసితి వున్నదున్నటులహా ధీమంతురాలా! యెటుం
దొలగం జేసితి సంధి మున్నిపుడు నంధుం ద్రోసితే! ఈ యతిన్
కలికీ! యెంతలు సేయ సాగితివి సాకల్యంబుగా నీ కథల్
తెలిసెన్ ....

అను పద్యమున శుకుడు పూర్వపద్యమున రంభ యతిస్థానమును, సంధిని తప్పించుటను గూర్చి 'యతి' 'సంధి' అను పదములను పారిభాషికములుగా నుపయోగింపగా రంభ—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యతులొ వారల నొప్పకుందుమొకొ? శ్రోయం జూతుమే వారి మీ
మతి కిట్లయ్యె నొకో సువర్ణరచనా మాధుర్య పాథోధి సం
ధి తిగం ద్రోసితి వంటిరే యెదుట నెంతేసిట్లు శాఖోపశా
ఖ తగన్ వేఱుగ సంధి యేల.........

అని ఆ పదములను "సన్న్యాసి" "రాయబారము" అను లౌకికార్థమున సాధించెను. "ఆమంత్రణము", "అనుకారము", ద్విరేఫప్రక్రియ" మొదలగు పారిభాషికములచే కూడా ఇందు శ్లేషలు సాధింపబడెను.

అన్యోన్య శ్లేష :

భిన్న శాస్త్రముల యందు ఒకే పదము పారిభాషికమై భిన్నార్థమై యుండ వచ్చును. అట్టి యెడ శ్లేషను సాధించినచో దానిని అన్యోన్య శ్లేష యనవచ్చును.

అతివా ! ఏమిది ఇట్లు చేసితివి సంఖ్యావాచకమ్మున్ సుశ
బ్ద తిరోధానము ధాతులోపమును నీవల్లన్ ఘటించెంగదా !

అను పద్యమున "ధాతు" శబ్దమును శుకుడు క్రియా పదమను వ్యాకరణ పరిభాషలో నుపయోగింపగా —

"ఇంత ప్రస్ఫుటముగా గై సేయు చున్న న్ననున్ భ్రమివై ధాతువెపోయె నంటివి" .... అని రంభ వసాసృఙ్మజ్జాది సప్తధాతువులుగా వైద్యశాస్త్ర పరిభాషలో అన్యథాకరించెను.

ద్రుతశ్లేష :

తెలుగు ప్రాయికముగా అజంతభాష యగుటచే నిందుహలంత శబ్దములను అజాది శబ్దములతో కలిపి సభంగ శ్లేష సాధించు నవకాశములేదు. సంస్కృతమున "కామ్, అరతిం" "కామరతిం" అను విధముగా శ్లేషలు సాధ్యములు. తెలుగున ద్రుతప్రకృతికముల విషయమున అజాది నకారాది పదములకు శ్లేష కల్పింపవచ్చును. ఇట్లు ద్రుతముచే జనించు సభంగ శ్లేషను "ద్రుతశ్లేష" యనవచ్చును.

అనుకారక్రమ మేను నిన్నడుగగా సప్రస్తుతంబైన నీ
యనురాగంబను శబ్ద మెత్తెదది యేలా మాని నీ యుక్తికిం
జనుమా ! మానిని ! రాగు లేరు గలరీ స్థానంబు నందెందు నే
ననురాగంబుల పుట్టునేమొ జలజాతాక్షీ ! విమర్శింపుమా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను పద్యమున "నిన్నడుగ గాన్, అప్రస్తుతంబు" "ఎందునేన్, అనురాగంబు" అని శుకుడు ద్రుతాంతములుగా ప్రయోగింపగా.

"నను రాగంబులు పుట్టు నేమొయని గాన ప్రస్తుతంబైన"

అను పద్యమున "నను" అనగా నా యందు అని హలాదిగాను, "గాన ప్రస్తుతంబైన" అని ఒభంగముగాను రంభ అర్థము చెప్పుటకు సహకరించినది ద్రుతమే.

కథన శిల్పము :

విరుద్ధ స్వభావములైన రెండు పాత్రల నడుమ సంవాదనముతో రసవంతముగా కావ్యము నాసాంతము నడపుట కష్టసాధ్యము. వేరియొక సిద్ధాంతమును ప్రతిపాదించుకొనుటయో, ఒకరు ప్రతిపాదించిన దానిని మరియొకరు ఖండించుటయో కొంత తడవు చమత్కారమును కలిగించును. ఆపై ఆ శాస్త్ర వాదములు విరసములై అనాసక్తికరములగును. అట్లుకాక ఒకరు మాటాడిన మాటను ఎదుటివారు శ్లేషాదుల సాహాయ్యమున తమకు అనుకూలముగా త్రిప్పుట, మొదటివారు కటకటపడి మరియొక మాట వదులుట. దీనిని రెండవ వారెట్లు త్రిప్పెదరో చూతమని శ్రోతలు ఉత్కంఠతో ముందుకు సాగుట. అను గడుసైన పద్ధతితో గూడిన కథన శిల్పముతో ఇద్దరు తెలివైనవారు వాకోవాక్యముగా మాటల బాణములతో చేసిన యుద్ధముగా ఈ కావ్యము తీర్చబడెను.

"వాకోవాక్యమును" ఒక అనిబద్ధ కావ్య భేదముగా శ్రీ సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి సూచించిరి. * వాక్యోప వాక్యము రెండుండునో అది వాకోవాక్యము.

ఉక్తి ప్రత్యుక్తిమ ద్వాక్యం వాకోవాక్యం విదు ర్బుధా :

ద్వయోర్వక్త్రోస్త దిచ్ఛంతి బహూనామపి సంగమే. — అని సరస్వతీ కంఠాభరణము. ఈ ఉక్తి ప్రత్యుక్తులు ఋజూక్తి, వక్రోక్తి, వైయాత్యోక్తి, ప్రశ్నోత్తరోక్తి, చిత్రోక్తి అని పంచ విధములుగా నుండుననియు అందు చెప్పబడెను. **

---

* కావ్యాలంకార సంగ్రహము, పుట : 264 (1945 ముద్రణ)
** అదే పుట.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై లక్షణ వాక్యముల ననుసరించి ప్రకృతకావ్యము వక్రోక్తి వర్తిత వాకో వాక్యమగు లఘు కావ్యమగును.

రసపోషణము :

మహాకావ్యమునందు పరిపుష్టమగు రస నిర్వహణము జరిగినట్లు ఉపకావ్యములందు జరుగక పోవచ్చునుగాని తత్పోషణము అసాధ్యముకాదు. అంతేకాక అవశ్య సాధ్యము. "నహిరసాదృతే కశ్చిదర్థః ప్రవర్తతే" అను మతము సర్వ సమ్మతమే కదా !

సామగ్రీ సాహాయ్యమున ఒక రసమును తుది వరకు పెంపొందించుట సామాన్యమే. రెండు రసములను మొదటి నుండి తుదివఱకు పరస్పర స్పర్ధతో ప్రవర్తింపచేసి ఏది అంగిరసమగునో చిట్టచివరి వఱకు తెలియని యుత్కంఠను రేకెత్తించుచు, రెండిటికి సమప్రాధాన్యమునిచ్చుచు విరుద్ధరసద్వయమును, అందును శాంతశృంగారములను పోషించుట విశేషము.

కవి యత్నమేమియు లేకుండ ప్రత్యర్థులిరువురు తాము ప్రాతినిధ్యము వహించుచున్న రసములను తామే నడుపుట మరియొక విశేషము.

శుకుడు శాంత రసోపయోగిగా పల్కిన పల్కులో నుండియే రంభశృంగారమును సృష్టించుట ఇంకొక విశేషము.

చివరకు రంభ శుకుని గెలువలేక తన యోటమి నంగీకరించుటతో అంగిరసము శాంతమయ్యెను.

అలంకార భూషణము :

కావ్యము మొత్తము మీద శ్లేష వక్రోక్తి, వక్రోక్తియను అలంకారములు వఱచుకొని యున్నవి.

"నీ రమణీయంబగు పోకపోకయ కదా ! రంభా ఫలంబున్నదే"

అను శుకవాక్యమును కాకువుచే సంప్రార్థనముగా మార్చి రంభ చెప్పిన ఈ క్రింది పద్యము కాకు వక్రోక్తికి కమనీయోదాహరణము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నను గ్రొందేనియ లూటలౌ పలుకులన్ రంభా ! ఫలంబున్నదా
యని వాక్రుక్కుచ్చితి వంతకన్న కలదా ఆధిక్యమో సత్కవీం
ద్ర ! నిగారమ్మగు మోవి నొక్కుచు పరీరంభంబు లిమ్మింక దీ
రని నా మోహము తీర్చు మింకెర లీ రంభాఫలం బీవకా

దీపము చిన్నదయ్యును దీధితి పెద్దదన్నట్లు ఈ శుక రంభా సంవాదము "శ్లేష వక్రోక్తి కావ్యము" "వక్రోక్తి సిద్ధ వాకోవాక్య కావ్యము" అను రెండు క్రొత్త ప్రక్రియల కాదోదాహరణమై రసపోషణోల్లసితమై వెలయుచున్నది. క్రొంగ్రొత్త శ్లేష భేదములు కూడ ఇందు గోచరించినవి.

కాయికముగా రంభాశుకులకు కలుగని ఆశ్లేషమును శాస్త్రిగారు కవిత్వమున కల్పించిరి. అనుత్థాతైకశయ్యాగతుల నొనర్చిరి. ఈ కావ్యము హరచూడా హరిణాంకవక్రము. చండికా పరుషోద్గాఢ పయోధర కఠినము. చంద్రికా సరసము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాయా విలాసము

ఇది 'కాశీమజిలీ కథల' లోని తొమ్మిదవ మజిలీ కథతో నిర్మితమైన ఏకాశ్వాస కావ్యము. సుమారు నూట ఎనుబది పద్యములుగల ఈ కావ్యము 1918లో శ్రీ 'మాటూరి నాగభూషణ' మను కవి సుహృద్రత్నముచే ముద్రితము.

ఇది శాస్త్రిగారి బాల్యరచనయే. దీనిని ముద్రించు నాటికి శాస్త్రిగారి కవిత నిగ్గుదేలి ప్రౌఢత నందుకొన్నది. కాని తమ బాల్య కవితా మధురస్మృతి పరిశీలకులకు స్వీయ కవితా పరిణామ సమ్యక్ స్వరూపము రూపుకట్టుటకు కాబోలు యథాతథముగా ముద్రింపించిరి. అవ్యక్త మధుర కల్యమైన బాల్యమును అక్షర మొనర్చుకొనిరి.

తనకలవడిన కవితను కథారూపములో తీర్చి 'కావ్యకవి' కావలెనను నొక బాలకవి ఆకాంక్షా విశేషమే ఈ మాయావిలాసము. ఈ మొగ్గలో తావులకు తక్కువలేదు కాని కైతలు 'పసరుపూవ బెడంగులు' చూపునట్టివి.

పాత్రచిత్రణ :

కథాగమనమునకే తప్ప పాత్రచిత్రణ, పాత్రపోషణలకు, ఇందు ప్రాముఖ్యము లేదు. నాయకుడైన సింహదమనునికి పరాక్రమము, సాహసము, సమయస్ఫూర్తి. వాక్చాతుర్యము భోగలాలసత, మాతృభక్తి మొదలగు లక్షణములున్నవి.

మణిమంజరి శృంగార భావసమేత, వచశ్చతుర. లేఖను మార్చి వ్రాసిన నేర్పరి. ఆమె అట్లు చేయుటవలననే కథాగమనము మలుపు తిరిగెను.

మోహిని అతిలోక సుందరి. భర్త కొరకై బహు కష్టములు పడినది. శాంతస్వభావ. ఈమెవలననే పాత్రలన్నియు తిరిగి కలసికొన కల్గినవి.

యజ్ఞదత్తుడు ధర్మ పరిపాలకుడు. పితృభక్తి పరాయణుడు. కథామేలన కారకుడు.

శత్రుంజయుడు కామమోహితుడు; అశక్తుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృత్యాది :

కావ్యరచనతో పాటు కాక తన్ముద్రణ కాలమున అనగా ఐదారేండ్ల తరువాత కృత్యాది పద్యములు కవి వ్రాసినట్లు శైలీభేదమును బట్టి యనుమానింప వచ్చును. ఇవి ప్రౌఢ సుందరములు, ధారాశుద్ధి విదగ్ధములు.

శ్రీయోషా దరహాస చంద్రికలచే రేకెత్తు హృత్కైరవం
బా యేణాంకముఖీ పనంబు మృదువాక్యాలాపకల్లోలినీ
తోయంబుల్ విరజల్లి దేల్చు జగదాద్యుండప్రమేయుండు నా
నాయోగీశ్వర సేవ్యు డీపుత ననంతంబైన సంపత్కళన్

ఈ కథాగమనమంతటికి శత్రుంజయుని కామమే మూలమగుటచేత, సింహదమనుడు కూడ ముగ్గురు నాయికలతో ననేక విధ శృంగార విహారములు సల్పియుండుట చేత కవి తత్సూచకముగా పై కృత్యాది పద్యమును రచించి తదుపరి శంకర కృష్ణ బ్రహ్మ స్తుతులను చేసెను.

పైట తొలంగి రాధచనుబంతులు వింత యొనర్ప జూచి యో
బోటి సుమోపమాంగి యెటు పూసెద వీ గిరియుగ్మ మంచు మో
మోటముతో నఖక్షతపుముచ్చట తీయనటుల్ తమాసగా
గోటను బట్టి యెత్తు చిటిగొల్లడు మాకిడుగాత భద్రముల్

సీసపుజిలుగులు :

ఈ పొత్తమునందున్న వృత్తజాత్యుప జాతి పద్యములన్నియు కేవల కథన మాత్ర ప్రయోజనములై యున్నవి. వానిలో కథనడచుట తప్ప వర్ణనాది విశేషము లేవియు కన్పట్టవు. కాని సీసపద్యములు మాత్రము తద్భిన్నములై విశేషలక్షణములతో విరాజిల్లుచున్నవి. సీసపుజిలుగులే ఈ కబ్బపు వెలుగులని చెప్ప వచ్చును.

ఒక వింత గుబ్బమును, దాని చుట్టుముట్టిన జనులను ఈ క్రింది సీసము రూపు కట్టించు చున్నది.

ఒక దెక్కలేక యింకొక దెక్క చనలేక
యెక్క డీ రెంటికి నొప్పలేక
ఒకడు ప్రజ్ఞకు గ్రోశమో లేక గవ్యూతి
యో పోయి దిగుటకు నూహలేక

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఒకడు చుక్కల జూచియున్వచ్చి యొడలెఱుం
గక నేల బడ చన గాళ్ళురాక
ఒకడిన్ని రీతులందున్న ప్రోడైనను
గ్రయమిచ్చి కొనగ బైకమ్ము లేక

తెల్ల మోములతో బిట్టు కళ్ళె మొకడు
జూలు నొక్కడు నివురుచు జోద్యముగను
జూచు జట్టీల నడుమను గీచులాడు
గుట్టమొకదాని గనె రాచకూన దాన

పై రూప చిత్రణ శాస్త్రిగారి యుపజ్ఞము.

భంగ్యంతరముగా అంగ వర్ణన చేయుచు శృంగార రసోదంచితమైన ఈ నర్మగర్భ సీసము సుధాసోదరము.

తొలుదొల్త ప్రాణముల్ నిలిపి యొక్కట గప్ర
పుటనంటి కంబాల బోయిపోయి
అంతట కందోయి కానందముం గూర్చ
నిసుకతిన్నెలపై కెక్కియెక్కి
ఆమీద గొంతచో టఱుగంగ గన్పట్టు
బట్టబయల్ పొంత ప్రాకి ప్రాకి
అట బైన మొనరింప నట్టట్టు నలరారు
రెండుకొండల మధ్య నుండి యుండి

పిదప నొక్కడుగిడిన గన్పించు చంద్ర
మండలమ్మందు రాజిల్లుచుండు పాన
కమ్ము నిండినకొలకు జాగ్రత్తతోడ
ద్రావుచుండుండు మేలిసుధాద్రవంబు

పై పద్యము నందలి సంకేతములకు మూలము నందలి సంకేతములకు భేదమున్నది. అచ్చటనవి శ్రీ కూర్మము, మకరాకరము. కదళీవనము, కాంచీ స్థానము మొదలగు పేర్లలో చెప్పబడినవి. మూలమునాధారము చేసికొని అదే ఊహ ఇచ్చట కవిచే నూతనముగా చెప్పబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మణిమంజరిని వర్ణించుచున్న ఈ క్రింది సీసమ్ము శాస్త్రిగారు ఆగర్భకవితా శ్రీనాథుడని నిరూపించును.

నీ మోమునకు నల్ల నింగికిం దిరుగాడి
సగమయ్యెనో లేమ చందమామ
నీ తియ్యమోవి తేనియ తావి కడు గ్రోలి
గడుసయ్యె నో బోటి గండుతేటి
నీ చిక్కు చనుదోయి నా చిక్కములజిక్కి
భ్రమజెందె నోయింతి వరువుబంతి
నీ లేనికౌనులో నెటిబయల్ దిరుగాడి
కన్పింప దల్ల సింగంపు బిల్ల

అయరె ఎంతటి దానవో అంబుజాక్షి
ఇంత పేర్వడ్డ వారినే ఇట్లు జేసి
తింక మాబోటివారల నెంచనేల
ఫాలరేఖాకురంగి శంపాలతాంగి!

నిజముగా ఈ పద్యము పరమభావుక పట్టభద్రుడైన ప్రౌఢ ప్రబంధకవి విరచితమనిపించును.

ఇట్లు సీసపద్యములలోనే రూపచిత్రణలు, వర్ణనలు రసావిష్కారములు, అలంకారములు మొదలగు కావ్యసామగ్రి గమనికకు వచ్చినది.

రసము :

ఇందలి అంగిరసము వీరము. రాక్షసీ పీడ తొలగించి తల్లులకు మేలు కూర్చి తాననేక శుభముల నొందుటకు కారణము సింహదమనుని ఉత్సాహమే. అది లక్ష్యసాధనమున రసత్వము నందినది. అంగరసములు అద్భుతశృంగార కరుణాదులు.

నామకరణము :

కాశీమజిలీ కథలలో నిది 'సింహదమనుని కథ' అనుపేరుతోనుండగా దానిని 'మాయావిలాసము'గా మార్చుట విశేషము. రాక్షసియైన కంకాళి మాయయే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కథానిర్మాణమునకు మూలము కాగా అవిద్యారూపమైన మాయ, సింహదమనుని పలుమారులు మరపునకు గురిచేసి కథను మలుపులు త్రిప్పినది. విధిమాయ ప్రతి పాత్రతోను ఆడుకొని ఏడిపించి నవ్వించినది. అంతేకాక ఎగిరెడి గుఱ్ఱము, చిలుకలలో నుండెడి ప్రాణములు, సముద్రమధ్యములనుండెడు స్థావరములు మొదలగు మాయలు ఇందనేకమున్నవి. ఇన్ని రకముల మాయలనుతనలో నిముడ్చుకొన్న ఈ కథను 'సింహదమనుని కథ'గా తేల్చివేయుట కంటె 'మాయా విలాసము'గా భావించి ఆ యా మాయలను విస్తరించి తద్విలాసముగా దీనిని తీర్చి దిద్ది 'మాయా విలాసమ'ని నామకరణము చేయుట వలన వికసించుచున్న కవి ప్రతిభా పుష్పము నుండి వెలువడు తత్త్వ సౌరభము నలుగడలకు పరిచిత మగు చున్నది.

ఇట్లు బహుముఖములుగా కవిప్రతిభా వికాసక్రమమును సూచించు ఈ మాయావిలాసకావ్యము దళదరవిందము.

—:o:—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉద్యానము

ఇది శ్రీకృష్ణదేవరాయల కాలము వఱకు గల ఆంధ్ర కవుల కవితా విశేషములు, చరిత్రలు వారిని పోషించిన రాజశేఖరుల వదాన్యత, మూర్తి చిత్రణతో కూడిన కల్పిత నిర్వచన కావ్యము. ఇందు సుమారు నూఱు పద్యములు కలవు. ఉంగ్రాజవరపు ఎస్టేటు జమీందారు శ్రీ ముళ్ళపూడి తిమ్మరాజు దీని ముద్రాపయిత. 1923లో ముద్రితము.

ఈ కృతి ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రశంసావశంబున వ్రాయబడినట్లు కవి పేర్కొనెను. ఆ సన్నివేశము ఎట్లు ఏర్పడినదో వివరములు అలభ్యములు.

కథ :-

విద్వత్కవి యొకడు కృష్ణానదిలో స్నానముచేసి కనకదుర్గను గొల్చి చనుచుండగా నతనికొక ఉత్తుంగ సౌధము కనపడెను. దానిలోనికి ప్రవేశింపగా లోలోపల అద్భుతమైన ఒక సీమ తోచెను. కవితోద్యానమొకటి కాననయ్యెను. అందు చనగా నన్నయభట్టు, తిక్కన ప్రభృతి కవులు, రాజరాజనరేంద్రాది రాజకులైక భూషణులు క్రమముగా కానవచ్చిరి. చివరకు ఇది యంతయు అతని అంతర్దృష్టిగా చెప్పబడెను. "రసభావకల్పనాదుల గుర్తెఱుంగుట కంతర్దృష్టి కాక బాహ్య దృష్టి చాలదను విషయము స్ఫుటీకరింప బడుటయే ఈ కావ్య ప్రయోజనమని కవి వాక్కు.

పూర్వరంగ కల్పనము :

శ్రీరాసుల్ వెలయించు కాలువలలో జెన్నొందు కృష్ణానదీ
వారిన్ మజ్జనమాడి శైలశిఖరావాసన్ ద్విషద్భీకరా
కారన్ భక్తజనావనన్ గనకదుర్గం గొల్చి తత్క్షేత్రయా
త్రారంభంబు నుపక్రమించి చనుచో నందొక్కచో గ్రొత్తయై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను పద్యముతో కావ్యమారంభింపబడెను. ఇష్టదేవతా ప్రార్థనము, వస్తు నిర్దేశరూప కథారంభము ఇందే ఇమిడిపోయినవి. కవితాతత్త్వమును అంతర్దృష్టితో చూడగలుగు విశదీభూత మనోముకురము భగవద్భక్త్యారాధనల వలననే లభ్య మగునని వ్యక్తము చేయుటకే ఇట్టి ఆరంభము.

అట్లు విజయవాటీ సంచారము నారంభించిన విద్వత్కవికి—

ఆంతరంగిక శుద్ధి బయల్పడంగ
జేయు క్రమమున దెల్లనై చెలువు మిగుల
నాకసంబాను సుకవుల యశమనంగ
గాన బడె నొక్క మేడ శృంగములతోడ

సుకవుల యశమన్నట్లున్న ఆ మేడ అంతరార్థమున సుకవుల యశమే సుధాలేపముగా గల సాహిత్యసౌధము.

ఆ మేడలోనికి ఎందరోవచ్చుచు బోవుచుండిరి. మెచ్చునకే మెచ్చుగా నున్న దానిలోనికి కవి ప్రవేశించెను. క్రొక్కారు మెఱుగు వంటి యొక తేజము భక్తితో వాణికి నీయబడిన నివ్వాళివలె కనుల కానందమును గూర్చెను. ఇంకను లోనికేగగా మణీమయ సాలభంజికలు పల్కినట్లు, చేతులు చాచినట్లు గోచ రింప విశ్రాంతి నొందక దిట్టతనముతో నతడు మరింత లోనికేగెను. ఆ సాల భంజికలు బహుశః చిత్రకావ్యములై యుండవచ్చును.

ఆ॥ దట గొంత దవ్వరుగ నద్భుతమై యొక సీమ తోచె న
చ్చో దనరారు నంతరము చొప్పది యెంతయొ! గ్రంథదేశముల్
ప్రోది యొనర్చి భావపురముల్ తవణిల్లె రసప్రవాహముల్
పాదయి నట్టి స్థాయి గిరి ప్రక్కల బాఱుచు నుండె నిండుగన్

కవి యేగినచోటు మిక్కిలి విశాలమై గ్రంథదేశములతో, భావపురములతో నిండియున్నది. స్థాయి గిరుల ప్రక్క భాగములలో రస ప్రవాహములు పాఱుట యనగా స్థాయి భావమునుండి రసమేర్పడుట. విభావాదులతో కూడిన స్థాయి రసముగా మారి తన అస్తిత్వమును కోల్పోవునా? లేక మరల తానుగానే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉండునా? స్థాయి రసత్వమునకు పూర్వము తదనంతరము స్థిరముగా నుండున దగుటచేత దానిని పర్వతముతో పోల్చుట సమంజసమైన లోతైన యూహ.

అట్టితావున నొక్క కవితోద్యానము కన్పట్టెను. అందు దళదుత్పలములు, నవచంపకములు, హాయియెలపయ్యెరలు వలపించుచుండెను. ఆ ఉద్యాన సీమ ఇట్లు వర్ణితము—

మత్తకోకిల గాన మాధురి చెవికెక్కె
నలినలి తేటగీతులు రహించె
మేఘ విస్ఫూర్జిత శ్రీ ఘనత్వంబొప్పె
వనమయూరము తాండవము రచించె
మాలినీ గణములుయ్యాలలూగ దొడంగె
మలయజ పాదపంబులు తనర్చె
ధృథ లయగ్రాహి గాత్రచయంబు చెన్నొందె
సాధ్వీమతల్లుల జాడ తోచె
బూచె నంబురుహంబులు పొలిచె బృథ్వి
సరస సంచార యోగ్యమై జాలుకొనియె
మంతు గొన్న వసంత దినాంతవేళ
జెలువమందు దదుద్యాన సీమయందు

పై పద్యమున అనేక వృత్తనామములు స్వార్థత్యాగము చేసి ఉద్యానమును తీర్చిదిద్దినవి. అట్టి వనములో కవికి—

కొందఱు వాగ్బ్రహ్మలటన్
గందాహారులయి యొప్పి కదలక సతమా
నందంబున దోగుచు గ
న్పించొనరించిరి తదీయ విలసన మసదో!

పూర్వాంధ్ర మహాకవులు కవి శబ్దముతో కాక వాగ్బ్రహ్మలుగా పేర్కొన బడిరి. కందహారులనుట శ్లేష చమత్కారము. "కందము వ్రాసినవాడే కవి"

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యని కదా సామెత. పద్యము కూడ కందమే వ్రాయబడెను. ఈ పద్యముతో పూర్వరంగ కల్పనము పూర్తియై రాజరాజనరేంద్రపాత్ర ప్రవేశపెట్టబడెను.

కవి పాత్రలు :

సాంప్రదాయిక కాలక్రమము ననుసరించి ముఖ్యులైన కవులు కొందఱు ఇందు చిత్రింపబడిరి. వారు ఏయే రాజుల ఆస్థానమందుండిరో ఎవరికి కృతు లంకితమిచ్చిరో వారెల్లరు పరివేష్టించి పూజించుచున్నట్లు చిత్రించుట కవుల ఆధిక్యమును చాటుచున్నది.

నన్నయభట్టు :

రాజరాజనరేంద్రుని ప్రక్కనున్న నన్నయ ఇట్లున్నాడు.

ఆ రాజర్షి కుఱంగుట
ధీరుడు బ్రహ్మర్షి యొకడు త్రేతాగ్నులతో
జేరువ గుములై శిష్యులు
తోరంబుగ గొల్వ దోచె ద్రుహిణుడు వోలెన్

శ్రీనాథుడు :

మఱియొక ఆశ్రమమున ప్రౌఢదేవరాయలు, సర్వజ్ఞసింగ, పెదకోమటి వేమారెడ్డి, వీరభద్రారెడ్డి, అన్నయమంత్రి, సింగనమంత్రి, అవచి తిప్పయ్య సెట్టి మొదలైనవారు కలసిమెలసి కూర్చుండి తన కావ్య విశేషముల నుగ్గడించు చుండగా—

కొలుచు శారద నిర్మాల్యకుంకుమంబు
దహరమున దాల్చి, నవ కవితా ప్రభుత్వ
సార్వభౌముండు జరిబుటా శాటి గప్పి
వచ్చె నచటికి శ్రీనాథభట్ట సుకవి.

అట్లు వచ్చి ఆ సభ్యులకు తన పొత్తములను ముద్దుగా మఱియొకసారి విప్పించెను. వారు పరవశులైరి. మరుత్తరాట్చరిత్ర, శాలివాహన సప్తశతుల పేర్లు చదువునంతలో వేళయగుటచే ఎచ్చరిండ్లకు వారు పోయిరి. శ్రీనాథుని ఘనత ఇట్లుగ్గడింపబడినధి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఘన రాజసపు బోక తనయందకాక త
　　త్కవితా కుమారికి దాపినాడు,
చిప్పిల గ్రొందేనె జీవకళల్ నింపి
　　పూజ్య కావ్యేందర బ్రోచినాఁడు,
కులుకు రాయంచల పొలుపు మేల్నడలతో
　　సీసమ్ము బలుపోత బోసినాడు
జిగిసకిషీ పనిన్ శృంగార లక్ష్మికి
　　గ్రొత్త సొమ్ములు మేన గూర్చినాడు
సరసులకు మేన బులకలు జారుకొలుపు
　　భావములు గుప్పి నేర్పు గన్పఱచినాడు
భట్ట పద వాచ్య సత్కవి పట్టభద్రు
　　డై దనరినాడు శ్రీనాథు దగుల త్రాడు

పినవీరభద్రుడు :

పినవీరభద్ర పరిచయము చమత్కారముగా చేయబడినది. అతని ఆశ్రమము చెంతకేగగనే—

ఆయాశ్రమమ్ము కెడ వై
　హాయస పథ మాక్రమించి నట్టిది చుట్టున్
వేయూడలు దిగినది జటి
తోయము గలదొక్క పట్టి తోచెన్ బ్రోలన్

వేయూడలు దిగిన ఆ 'పిల్లలమఱ్ఱి'ని బట్టి అది పినవీరభద్రుని ఆశ్రమమని గుర్తుపట్టనయ్యెనన్నమాట.

రామకృష్ణుడు :

కాళీదత్త వరప్రభావ జనితాఖండ ప్రభాపుండు ని
వ్వాళిం గన్నుల కద్దినట్లు కవితన్ వాకుచ్చుధీరుండు భూ
గోళంబంతయు నాక్రమించిన స్థిరాఖ్యుండా సభాంభోజినిన్
హేళిప్రక్రియ రామకృష్ణకవి హాయిం జూపె కర్ణోత్సుకిన్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ పద్యమదుద్ధృతమైనది. ఇది చదువునపుడు పాఠకుని మనస్సులో శ్రీనాథుని 'బ్రాహ్మీదత్తవరప్రసాదుడ'వను పద్యము స్ఫురించును. 'భూగోళం బంతయు' నన్నప్పుడు 'ఉదయం బస్తనగంబు' అన్న పద్యము గోచరించును. ఇది యొక రచనా శిల్పము.

రాజపాత్రలు :

ఇందు దాదాపుగ కవులందఱును తత్తత్కవితాగుణాభిజ్ఞానములతో చిత్రింపబడి పరిచయము చేయబడిరి. రాజ పాత్రలు స్వీయ గుణ రూప చిత్రణముతో విరాజిల్లెను. కవుల, రాజుల చిత్రణలో నిది శాస్త్రిగారు చూపిన వైలక్షణ్యము.

రాజరాజనరేంద్రుండు :

రత్నంబు లెన్నియో రాశిబోయుచునున్న
కవి పద్య రత్నంబు కాంక్ష నెఱపు
సౌధంబు లెన్నియో చలువలీనుచునున్న
భావ సౌధంబు లోపలన నిలుచు
దీర్ఘి కలెన్నియో దృష్టిలాగుచునున్న
నవరసంబులయందు నాటుమనసు
హారంబులెన్నియో యక్కున నెలకొన్న
గుణహారములయంద కోర్కెపెట్టు
అతడలంతి యొక్క యవిధి నేగిన దన
తరుణినైన నాడిసి తఱుగువాడు
విష్ణువర్ధనుండు వేగిదేశపు రాణ్మ
హేంద్రపురవరంబు నేలువాడు.

ఇందు సారంగధర చరిత్ర ప్రసక్తి సంప్రదాయ కథా మహిమముతో గావించినది.

ప్రోలయ వేమారెడ్డి !

కటకు తురుష్క సేనావాహినులను ఆంధ్రదేశపు పొలిమేరలు దాటించిన ధీరులలో నొకడై, కవిత్రయములో నొకడైన ఎఱ్ఱాప్రెగ్గడను ఆస్థాన కవిగా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోషించి భాషాసేవ చేసిన మహానుభావుడును, ధర్మరక్షకుడునగు 'ప్రోలయ వేమారెడ్డి అంతర్బహి సౌందర్యములిట్లు వర్ణితములు.

చే గంకణము గట్టి శ్రితజనావనదీక్ష
ననిశంబనుష్ఠించు నట్టి దాత
అఖిల దిక్కులను జయధ్వజంబులు నిల్పి
యద్దంకి పురమేలు నట్టి నేత
వీరుల తలలు త్రిప్పించు మల్లారెడ్డి
గాదిలి తోడుగా కలుగు జేత
ఏకపత్నీ వ్రతుండై కాపెఱుంగని
భవ్యతేజంబున బరగు త్రాత
సప్త సంతానము లొనర్చి శాంతి కలిగి
యీశ్వరారాధనంబున నెసగువాడు
పల్లవాదిత్య బిరుద విభ్రాజితుండు
వేమ భూమీవరుండు కన్పిందొనర్చె.

ఈ విధముగా సాహితీపోషణ సముపలబ్ధ శాశ్వత యశస్కులైన ఆ రాజన్యులకు శాస్త్రిగారు సాహితీమూర్తులను కూడ చెక్కి ఉద్యాన చతుష్పథములందు ప్రతిష్ఠించిరి.

కవితా లక్షణ నిరూపణము :

ఆయా కవుల నామధేయములు చెప్పకయే వారివారి కవితా గుణ వర్ణనమున వారి నామము స్ఫురించునట్లు శాస్త్రిగారు ఇందు వ్రాసిరి. ఈ కావ్య రచనము యొక్క పరమ ప్రయోజనము పూర్వ మహాకవుల కవితా లక్షణములను భంగ్యంతరముగా పరిచయము చేయుటయే.

నన్నయ స్వతంత్రానువాద పద్ధతిని సమర్థించుచు-

'చూడక కాదు మూలమును జూచి యెఱుంగక కాద యర్థమున్
బోదయతండు భాషకెటు ముద్దగునో యటు వ్రాసె నేర్పునన్'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని తీర్మానించిరి.

లేదు కాఠిన్య మింతయు బాద పూర
ణార్థ మొక యక్కరమ్ము వాక్యమున బడదు
తావులకు బొందువడని శబ్దములు చొరవు
నన్నపార్యుని కావ్య సంధానమందు

'సమగ్ర కళా కవితా ప్రదర్శితాత్యాయత నూత్న మార్గముల' నాతడు చూపెను 'గుణత్రయోచిత సమాసముల' నెలకొల్పెను.

పైని చెప్పిన లక్షణములు 'సారమతిం గవీంద్రులు' పద్యములో చర్వితము లైనవి కాక నూత్నములు.

తిక్కన :

ప్రభువు వాక్కురీతి ప్రౌఢమై యున్నది
సంగ్రహమ్ము శక్తి చాలగలదు
వచన రచన నొడువ వలనుగా దొచితి
ప్రాణమట్లు నిలిపె భారతమున
నాయకోదాత్తతకు జీవనంబువోసె
పాత్రముల నెట్టెదుట నుట్టిపడ రచించె
చిత్తవృత్తుల జిత్రించె జిత్తరువుల
వృత్తముల రసాభ్యుచిత సంపత్తి నడపె

నవలా లీలలు నాటకమ్ముల గతుల్ నానా వచోభేదముల్
వివరించెన్ బ్రతిభా విశేషమును నిర్వేలంబుగా జూపె దా
గవి మాత్రుండొకా? సోమయాజి నవతా కందంబు స్వాతంత్ర్య 'మూ
ర్తి వదాన్య ప్రముఖుండు దిగ్విదిత కీర్తి స్ఫూర్తి తిక్కంబుగన్

తిక్కన ప్రభువుగా పేర్కొనబడినాడు. సంగ్రహణ శక్తి, నవలా లీలలు, నవత్వము, స్వతంత్రత ఇందు చెప్పబడ్డిన గుణములు.

నాచన సోముడు 'యజ్వాను గదియు నెటీని నించుమించుగా నూహాలలో', 'నాచన సోముని పద్య మమృత మండలమటంచు బాడ' దగినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎఱ్ఱన :

నన్నయకు దిక్కనకు గవనమున మిగుల
ముద్దు సూపిన ప్రగ్గడ సుద్దిపలుకు
విని యవల నా కవితోపవనము నందు
బ్రకృతి వైచిత్రి గనుచు గాల్పులచు నంత

ఎఱ్ఱన నన్నయ తిక్కనల శైలులను సంధాన పఱచుట, 'సుద్దిపలుకు' అనగా నాతని సూక్తి వైచిత్రి, ప్రకృతి వర్ణనా చాతుర్యము ఇందు పేర్కొన బడినవి.

శ్రీనాథుడు ;

వక్రోక్తి యొడుపు, సహజో
పక్రమ వైచిత్రి, మధుర ఫణితి స్ఫురణల్
చక్రము ద్రిప్ప సమాస
ప్రక్రమ మా సుకవిసార్వభౌముడె యెఱుగున్
ధార గంగాఝురికి తోడు, తళుకు మెండు
వర్ణనయు గంటి కగుపడు వరుస కలదు
ప్రస్తరించిన యట్లుండు వచన రచన
సార్వభౌముస కెవ్వరు సాటి జగతి

శ్రీనాథుని కవితలోని ప్రధాన గుణ సమాహార మిందు వర్ణితము. పోతనను గూర్చిన అల్పాక్షరములలో ననంత పరిచయము ఇట్లు-

వినిచె దన వాగ్విలాసమ్ము వింటి భక్తి
సహజ పాండిత్య బిరుదంబు సార్థకముగ
దోచె పాకంబు ద్రాక్ష గుణౌచితియును
మేలుశైలియు నిలుపునే మెకము నేని
కవితాగుణముల నేకరువు పెట్టక 'వింటి భక్తి'

'శైలియు నిలుపునే మెకమునేని' — అనుటలో పోతన కవితా ప్రాణము లగు భక్తి, శైలీమాధుర్యము వ్యక్తములు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లు ఆయా కవుల కవితా లక్షణములను ఛందో రూపమున పరిచయము చేయుట సాహిత్య పరిశోధన వ్యాసములు అంతగా వెలువడని ఏబది ఏండ్ల క్రిందటి కాలమునాటి సాహిత్య విద్యార్థులకు, సారస్వత ప్రియులకు కరదీపికా యితమైన కమనీయమైన ప్రయోగము.

చరిత్రానుశీలనము :

ఇందలి కవుల పౌర్వాపర్యము కొన్నిచోట్ల నేటి వాఙ్మయ చరిత్రకు భిన్నముగా గోచరించును. ఈ రచన 1930 నాటిదగుటచే ఆ నాటికి వివాదములు తీరి నిర్ణయము లేర్పడక పోవుటవలన, పరంపరాగత జనశ్రుతులందు గల ప్రగాఢ విశ్వాసము వలన ఇట్టి కూర్పు జరిగియుండును.

నన్నయ తిక్కన్నలకు నడిమివాడుగా ఇప్పుడు నిర్ణయింపబడిన భాస్కరుడు ఎఱ్ఱనకు తరువాత చెప్పబడెను. కాల నిర్ణయమునకు లొంగని వేములవాడ భీమకవికూడ ఎఱ్ఱనకు తరువాతనే చెప్పబడినాడు. పదునేడవ శతాబ్దివాడుగా నిర్ణయింపబడిన పింగళి సూరన శ్రీనాథుని వెనుక చెప్పబడెను.

అష్టదిగ్గజ కవి నిర్ణయము జనశ్రుతులాధారముగా చేయబడెను. పెద్దన, భట్టుమూర్తి, రామకృష్ణుడు, తిమ్మన, రామభద్రుడు, ధూర్జటి, పింగళి సూరన, మఱియొక కవి ఎవరో అనామకుడు. శ్రీనాథుని తర్వాత పోతనకు ముందుచెప్పిన పింగళి సూరన్నను మరల అష్టదిగ్గజములలోనికి తెచ్చుట చింత్యము.

కవులను పోషించిన రాజన్యుల పేర్లు, కృతులు అంకితము గొన్నవారి పేర్లు అన్నియు నుట్టంకింపబడినవి. కవుల ననుసరించి వారి కాలములు కూడ ముందు వెనుకలగుట సహజము.

కావున కవి చరిత్రకు కాక కవితా చరిత్రకే ఈ లఘుకృతి యుద్దిష్టము.

కవితా సౌందర్యము :

ధారాశుద్ధి శాస్త్రిగారి కవితకు ప్రాణము. వారి నిర్దుష్ట నిశిత పద ప్రయోగ కౌశలము నిరుపమానము. ఈ లఘు కావ్యములో గోచరించు అట్టి కవితా సౌందర్య రేఖలను కొన్నింటిని ఆవిష్కరింతును.

రాజరాజనరేంద్రుని గూర్చి చెప్పునప్పుడు తత్సమపదబంధురమై నన్నయ శైలిని అనుకరించుచున్న ఈ క్రింది పద్యము వ్రాయబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఘను వంశోదిత మౌక్తికంబు గవిరాణ్మందార ముద్యత్కళా
ఖని చాళుక్య శిరోవిభూష సుగుణగ్రాహిప్రధానుండు సా
ధన సంపన్నుడు విష్ణువర్ధనుడు విద్యామూర్తి శ్రీ రాజరా
జనరేంద్రుండొకచో గనంబడె యశస్సౌధాగ్ర భాగంబునన్

తిక్కనగారు—

"కిమస్థిమాలా కిముకౌస్తుభంవా;
కింకాలకూటః కిము వా యశోదా స్తన్యం"

అను శ్లోకమునకు తెనుగు తీర్పు ఇట్లున్నది.

గళమునం దాల్చుకొనునది కౌస్తుభంబొ
కలుకుటెముకల దండయో! కమిచి మ్రింగ
నీకు రుచి కాలకూటమో! లేక నంద
పత్ని చను బాలొ తెలుపుమో ప్రభువ! యనుచు

నన్నయగారి లలిత సమాస ఘటనా చాతుర్యమును ఉట్టంకించు పద్యమిది:

సొందుగ నందునందును బ్రమోదపరీత మిళించగీతికా
తుందిల రాజహంసముఖ తోయవిహంగ నినాదమేదురా
నందద సుందరాంబుజవన ప్రచయాగత మందమారుతా
మందగుణత్రయోచిత సమాసములన్ నెలకొల్పె మెల్పునన్

ఇందలి అనుప్రాస వైభవము, కూర్పు నేర్పు నన్నయగారిని జ్ఞప్తికెల యించును.

"రహి వహి" "హాయి యెల పయ్యెర" "తఱగ యూయెల" "అలరు వాడని పూదండ" 'సుద్ది పలుకు' 'కులుకు రాయంచల పొలుపు మేల్నడలు' మొదలగునవి ఇందలి తీయని తెలుగు పలుకుబడులు.

ఉద్యాన శబ్దము 'తోట' అను నర్థమునే కాక 'పైపైకి ప్రయాణము చేయుట' అనగా ఊహలలో విహరించుట అను నర్థమును కూడ ఇచ్చును. ప్రకృత కావ్యము కవి యూహయే యగుటచే కావ్యనామము శ్లిష్టమై అంతర్దృష్టులకు ఆనందమును గూర్చుచున్నది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లు పూర్వాంధ్ర మహాకవులకు, తత్పోషకులైన రాజన్యులకు నివాళిగా, సాహిత్య విద్యార్థులకు, సారస్వత ప్రియులకు కరదీపికగా లఘుపరిధిలో నెల కొనిన ఈ ఉద్యానమున ప్రబంధ యుగము తరువాతి కవులను కూడ నిరూపింప వలెనని శాస్త్రిగారు భావించినట్లు కావ్యాంతమున 'ఇది ఉద్యాన పూర్వభాగము' అని పేర్కొనుట వలన ఊహింపనగుచున్నది. కాని ఉత్తర భాగము రచింపబడలేదు. ఈ కావ్యమును చదివిన వెనుక ఆంధ్ర కవులెల్లరు మనోహరమైన ఉద్యానమున తమ తమ కృతి కన్యలతో. వారి వారి భర్తలతో పరివేష్టింపబడి అందమైన ఆశ్రమ ప్రాంతములలో నివసించుచుండుట స్వయముగా చూచిన అనుభూతి పఠితలకు కలుగుట తథ్యము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ హనుమచ్చరిత్ర

పరాశర సంహితలో చెప్పబడిన మహిమాన్వితమగు హనుమచ్చరిత్ర భక్త కోటికి శ్రవణపేయము; మోక్షదాయకము. అట్టి చరిత్రను శాస్త్రిగారు సీసమాలిక లలో రచించిరి. ముద్రాపకులు తెనాలి వాస్తవ్యులు శ్రీ ఆలూరి సుందరరావుగారు. **1956**లో ముద్రితము. శ్రీరామకృష్ణపరమహంస సమాజము తరపున ఈ కృతి ముద్రింపబడుటచే శ్రీరామకృష్ణ పరమహంసకు, తత్సమాజమునకు ఇది అంకితము చేయబడినది. కృతి సమర్పణ పద్యమున శ్రీరామకృష్ణ పరమహంస మహిమమిట్లు వర్ణితము.

సర్వమంత్రములుపాసనసల్పి సాకార
తత్త్వము నెఱిగించు తరుణమందు
ఏ మంత్రమున కుర్కి, యే వేలుపునకగు
తద్దేవతామూర్తి. తానయయ్యె
అందాంజనేయ మంత్రానుభూతిని పొల్చ
తన్మూర్తికగు తోఁకతగి యెసంగె
రామకృష్ణావతారమ్ముల మారుతి
భక్తుండు రథజయధ్వజమునగుట
ఇట్టిదై యుండునని శిష్యు లెంచిరాత్మ
అట్టి సకలామరాంశల నమరినట్టి
పావనుడు, రామకృష్ణాఖ్య పరమహంస
పేరనిది తత్సమాజమ్ము పేర వెలసె.

శ్రీరామకృష్ణుడు హనుమదాకృతిని దాల్చిన సన్నివేశమును పేర్కొనుట పై పద్యమునందలి విశేషము.

హనుమంతుని కీర్తి వైభవమునకు, వీరవిహారమునకు సుందరకాండము రంగభూమి. వాల్మీకి మహాకవి మిగిలిన కాండములకు భిన్నముగా సుందరకాండ మను నామముంచుటకు విజ్ఞులనేక కారణములూహించిరి. ఈకాండమున సర్వమును సుందరమగుటయే కారణమని చమత్కరించిరి. శాస్త్రిగారు ఈ క్రింది విధముగా సుందరమగు హనుమత్ స్తుతి నొనర్చిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సుందరకాండమూర్తి గుణసుందరమందిరవర్తి జానకీ
సుందరకీర్తి భూభువన సుందరపావనమూర్తి నన్ను దా
సుందరబాల్య మందు సరసుం దరహాసమొనర్ప జేయు వా
క్సుందర సత్కవిత్వముఖసుందరు జేసినవేల్పు గొల్చెదన్

పరాశరుడు మైత్రేయునకు జెప్పిన హనుమచ్చరిత్ర నూటఇరువది సీస పాదములయ్యెను. వానిలో సువర్చలోత్పత్తి, బదరి కావనమునందు వేల్పులురాక్షస వధోపాయము విచారించుట, ముక్కోటి వేల్పుల అంశములను నారాయణుడీశ్వరునితో చేర్చుట, సహవజ్రకవచకుండలములతో ఆంజనేయస్వామి జననము, హనుమంతుడు సూర్యుని పండుగా భక్షించుట, ఇంద్రాదులు పరీక్షించి మహిమకుమెచ్చి వరములిచ్చుట, సూర్య సన్నిధిని విద్యాభ్యాసము, సూర్యుడు సువర్చలనిచ్చి వివాహము చేయుట, అను కథాంశములు చోటుచేసికొన్నవి.

ఆ తరువాత ఎనుబది యొక్క సీసపాదములలో శ్రీ పంచముఖాంజనేయ చరిత్రము వర్ణితము. ఇందు శ్రీ పంచముఖ వీరాంజనేయోత్పత్తి, శ్రీరామ విచారము, హనుమంతుడు శ్రీరాముని కుత్సాహమొసగుట, గర్గుడు సీతాదేవికి పంచముఖహనుమన్మంత్రమును బోధించుట అనుఘట్టములు కలవు.

మైత్రేయుడడుగగా పరాశరుడు చెప్పినట్లు ఆరంభింపక సూటిగా కథను మొదలుపెట్టి కథాంతమున మైత్రేయ పరాశరులను ప్రవేశపెట్టుట ఇందలి కథన శిల్ప విశేషము. హనుమచ్చరిత్రను ముగించుచు పరాశరుడు హనుమన్మంత్ర ప్రభావమున సీతాదేవి శతకంఠ రావణుని సంహరించెనని చెప్పగా మైత్రేయుడు ఆ కథను చెప్పుమని అడుగగా పరాశరుడు పంచముఖాంజనేయ చరిత్రనుచెప్పెను.

భక్తులు నిత్యము పాడుకొనుటకు వీలుగా నుండునని కాబోలును శాస్త్రిగారు ఈ హనుమచ్చరిత్రను సీసపాదములలో వ్రాసిరి. మంజరీ ద్విపదవలె సీసమును మాలికగా చేసి కావ్యమును వ్రాయుట అరుదే. సీసము, ద్విపద మొదలైన దేశి ఛ్ఛందస్సులను గేయములుగా నుపయోగించుట జానపద వాఙ్మయము నందున్నదే. అందుకే దీనిని పద్యకావ్యమనక "గేయమెల్లెడ వీరాంజనేయ మహిమ" అని కవి గేయముగానే పేర్కొనెను.

పాల్కురికి సోమన, గోన బుద్ధారెడ్డి మొదలగు దేశికవుల శైలిని శాస్త్రిగారీ గ్రంథమున ప్రత్యక్షమొనర్చిరి. ఈ కావ్యము చదువుచున్నంత సేపునుదేశి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవితాలోకమున విహరించుచున్నట్లుండును. ఆంజనేయస్వామి జన్మించిన సన్ని వేశము ఇట్లు వర్ణితము.

జేజేలు పుష్పవృష్టిని గురిపించిరి
హాయివీచెను మలయానిలుండు
వేదుల త్రేతాగ్నులాదృతిని బ్రదక్షి
ణార్చుల వెలుగొందె సమర మునుల
ముఖములు వికసించె మొగిదైత్య నాథుల
తలలను మకుట రత్నములు డుల్లె
తత్పత్నులకు నిమిత్తములేకయే మహా
కంపంబు పొడమె సంగంబులందు
వైశాఖమధ్యాహ్న వైధృతియోగముల్
తార పూర్వాభాద్ర దశమితిథియు
స్థిరవారమగువేళ బరమపతివ్రత
యగు నంజనాదేవియందు బొడమి
నట్టి యమృతశిశువాంజనేయుండయ్యె
మునుపుగా గేసరిపుత్రుడయ్యె
అగ్నిసంభవుడయ్యె నగ్నియందుండుట
పవనజుండయ్యెను వాయువిడుట
పార్వతీపరమేశ భవుడయ్యె నట సర్వ
దేవమయుండయ్యె దివ్యలీల

పాల్కురికి సోమన పదముల ధాటిని ఈ క్రింది పంక్తులలో గమనింప వచ్చును.

దివ్య లాంగూలంబు దివ్యకిరీటంబు
దివ్యో పవీతముల్ దివ్యశాటి
దివ్యహారంబులు దివ్యాభరణములు
దివ్యకుండలములు దివ్యభాష
దివ్య సంహననము దివ్య వజ్రాంగియు
దివ్య ప్రభావంబు దివ్యకాంతి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సకలంబు దివ్యమై చదలున జను దివ్య
గణమున కచ్చెరువ్వ గలుగజేసె

సువర్చలా హనుమంతుల వివాహము తెలుగువారి సంప్రదాయము ప్రకారము సూత్రధారణాదులతో సొగసుగా నిట్లు జరిగినది.

హస్తమస్తక యోగమయ్యె జంటకు జీర
ధారణ శుభముహూర్తముననయ్యె
తెరవీడె లోసిగ్గు తెలుఁగున సాత్తప
దీనంబు నడచెను, దివ్యులలర
సూత్రధారణ ప్రేమ సూత్రధారణ దెల్పె
నక్షతారోపణ పక్షతత్వ
మెఱిగించె వివరించె నెదరాగబంధంబు
క్రమము బ్రహ్మగ్రంధి రాణ దెలిపె

హనుమన్మంత్ర వైశిష్ట్యమును అధికారియగు మైత్రేయుడడుగగా పరాశరుడు చక్కని ఉపమానములతో తన్మంత్ర మహిమను వర్ణించి, దానిని జపించిన వారెట్టి ఫలితములను పొందిరో ఇట్లు వివరించెను.

శైవ వైష్ణవ సౌర శాక్తేయ ముఖమంత్ర
సప్తకోటి యెసంగు జగతిలోన
తన్మహామంత్రసంతానమ్మునను లెస్స
పంద్రెండు మంత్రముల్ పరగుచుండు
నదులలో జహ్నుకన్యక యట్లు గ్రహముల
గ్రహపతిమాద్రి దారకలయందు
పూర్ణేందుతేవ విబుధుల పితామహు
పగిది పుల్గులను సుపర్ణునోజ
వానిలో హనుమంతు వరమంత్ర మెల్లెడ
మంతుకెక్కినది తన్మహిమ వినుము
ఆచమించెను వార్థి నర్థి నగస్త్యుండు
ప్రాల్చె జరాసంధు వాయుజుండు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గాండీవి తానెల్లకదలను జయమంది
   జయనామముం గాంచె శాశ్వతముగ
సీతామహాదేవి చీల్చి చెండాడెను
   శతకంఠరావణు సమరభూమి
పొల్లింతయునుగాదు ముమ్మాటు బలికెద
   నిదిసత్యమని భుజమెగుర జేసి

హనుమంతుని వివాహము, శతకంఠ రావణ వృత్తాంతము వాల్మీకి రామాయణమందు ప్రసక్తములు కాకపోవుటచే వానిని అవాల్మీకములని కొందరు చిన్న చూపు చూచెదరు. కాని హనుమంతుని గూర్చి ప్రత్యేకముగా చెప్పుచున్న పరాశర సంహితలో వీనికాకరము కలదు. కావున హనుమద్భక్తులకు పై కథలపై భక్తి విశ్వాసములు చెదరవు. శతకంఠ రావణవధను శాస్త్రిగారు వీరరసముట్టిపడ ఇట్లు రచించిరి.

ఆహవదోహలయై కరాళాస్యయై
   కాళికాకృతిని మ్రింగం బొదంగె
క్రమ్ము దానవ చమూకాండమ్ము లప్పుడు
   రణరంగతలము నిర్దనుజమయ్యె
శతకంఠు డదిగని చలదధరోష్ఠుడై
   తోకద్రొక్కిన త్రాచు వీకనెగసి
బాణవర్షంబును పఱపె శ్రీరామసై
   న్యంబుపై నట్టహాసంబుజేసి
అవనిజాతయు నంత నవయవసంధుల
   నెదిరిపై గురియించె ప్రదరములను
చిమ్మిన గ్రోవులు చిమ్మిన వడువున
   రక్తధారలు దుమారమ్ము లడఁచె
ఇదియొక వింతగాదిల బడ దైత్యుని
   తనురక్తబిందు లత్యద్భుతముగ
శతకంఠ రావణ శతసహస్రంబులు
   కల్పించె దనుజులు కదనసీమ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

క్రమ్మి భూజాతపై క్రమ్మబి పుంఖాను
　　పుంఖముల్ గురిసిరి పౌడము నపుడు
బెడిదంపు టడిదముల్ పెల్లుగ నదిగని
　　హుమ్మని క్రూరశరోత్కరముల
వర్షించె దేవియు వారిపై నవ్వారి
　　గా దొరంగెడు నెత్తుకణముకెల్ల
లక్షల గోటుల రాక్షసవీరుల
　　సృజియించె పురల నిశ్చేష్టుయ్యె
జానకి దీర్ఘ నిశ్వాసంబు విడుచుచు
　　నదిగని పంచాస్యుడైన హనుమ
ఆలోచనమొనర్చి వాలమ్ము విస్తృత
　　మొనరించి వటచెను యుద్ధభూమి

దానిని మెచ్చి విద్యామూర్తి సింహానా
　　దమునల్పి కవిసిన దైత్యకోటి
తో శతకంతుని ద్రుటిలోన దునుమాడె
　　నభమున దేవదుంభులు మొఱసె

పై పాదములలో సీతా శతకంఠరావణుల యుద్ధము హోరాహోరిగా తెలుగుదనముట్టిపడ తిక్కనగారి యుద్ధవర్ణనలకు దీటుగా వర్ణించబడెను.

"మిసిమితుండును గాక" "మిన్నుమానికము" "మేటి నిసుపు" "కొమరు ద్రాయపు పెండ్లికొడుకు" మొదలగు తీయని తెలుగు పలుకుబడుటను "చిచ్చర పిడుగట్లు" "చురచురమను గోరుచుట్టుపై రోకలిపోటు" మొదలగు కమ్మని లోకోక్తులను ఇందు కోకొల్లలు.

ధారాశుద్ధి శోభితమై, పూర్వమహాకవుల సుగుణములను పుణికిపుచ్చుకొన్న సరళసుందర శైలితో నొప్పారుచున్న ఈ హనుమచ్చరిత్రము ద్విపద కావ్య పద్ధతిలో సాగిన అపుదైన ప్రయోగము.

—: ౦ :—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ కోదండరామస్వామి నిత్యపూజా సేవావిధి

గుంటూరు మండలమున రేపల్లెకు సమీపమున ధూళిపూడి యనుగ్రామము కలదు. అందు పరమ ధార్మికుడును, సంపన్నుడునగు శ్రీ తడవర్తి బాపయ్య యను గృహస్థుడు శ్రీ కోదండరామాలయమును కట్టించెను. స్వామి నిత్యపూజా విధులు నిర్వర్తించుటకు కరదీపికగా తేటతెనుగులో షోడశోపచారపూజాదికమును వర్ణించుచున్న ఈ గ్రంథమును బాపయ్యగారి కుమారుడు శ్రీ సత్యనారాయణ ముద్రింపించెను. 1954లో ముద్రితము.

శాస్త్రిగారు సుబద్ధమగు ప్రణాళికతో నీ కృతిని రచించిరి. పద్యములు లేనె యూటలు. భావములు కోయిలపాటలు. ఇట్టి స్థల మాహాత్మ్యములు రచించు పట్టున శాస్త్రిగారు శ్రీనాథావతారమును దాల్చుచుందురు. ధూళిపూడి గ్రామవర్ణనతో నారంభమైన ఈ కృతియందు ఆ గ్రామమున నేయే దేవతలుండిరో తెలుపుటతో పాటు ఆ గ్రామమేయే దిక్కులుగా నున్నదో చమత్కారముగా నెఱిగించు ఈ క్రింది పద్యము హృద్యము -

ప్రాగ్దిశ గృహాళి నిలఁబెట్టు పరమకరుణ
తాళమాంబ, ప్రతీచి ముత్తయుల యందు
రాజగోపాల కోదండరాము లట్లు
మంత్రు గోకర్ణ విభుడు నేమమున ప్రజల

తాళమాంబ గ్రామదేవత. తూర్పున నున్నది. ఆమె ఆ దిక్కున ఇళ్ళను నిలబెట్టును. రాజగోపాల: కోదండరామ, గోకర్ణేశ్వరులు పడమటి దిక్కున నుండి ముత్తయుల ప్రజలను మనుచుచుందురు. తూర్పు, పడమరలుగా వ్యాపించిన గ్రామము మన కనులకు గోచరించును.

పెద్దనగారిని జ్ఞప్తికెలయించు నీ క్రింది పద్యము గ్రామ వర్ణనలో కవి చూపెడు యుత్సాహమునకు కారణములను వివరించును.

సూత్రంపట్టినయట్టు వీధులచటన్ శోభిల్లు సౌధంబులున్
నేత్రంబుల్ విరియించు కట్టడములన్ నీరంధ్రకాంతీందిరా
పాత్రంబుల్ కవివర్ణ్య శిల్పరచనా భవ్యప్రభాపూర్ణముల్
స్తోత్రింపందగు భారతీభవనపంక్తుల్ సత్కళాబోధముల్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అపరపోతన యని యశంబందినట్టి
వాసుదాసాంఘ్రిభక్తుడై వన్నెకెక్క
అరసి కోదండరామాలయంబు నిలిపె
బాపయాఖ్యుండు తడవర్తి వంశభవుడు

ఇట్లుత్తమమానవుడై వెలుగొందిన బాపయ్యగారు కట్టించిన కోదండ రామాలయమున నిత్యపూజ, నిత్యసేవలు నేటికిని యథావిధిగా జరుగుచున్నవి. ఆ స్వామిపేరుతో పూజా విధానములను తెలుగున చియింపజేయుట ధర్మకర్తల వేడుకయేకాని గుడిలో మామూలుగా సంస్కృతపూజావిధానమే సాగుచున్నది. అదియే సంప్రదాయముకదా ! పూర్వము కల్యాణోత్సవములు వైభవముగా జరుగురోజులలో నిందలి పవళింపుసేవలు మొదలగునవి గానము చేసెడివారట.*

ఈ గ్రంథమున మొదటి అంశము షట్కాండ రామాయణ కథాంశసహిత సీతారామనామ భజన.

సీతారాం, సీతారాం, సీతారాం, జయ, సీతారాం అనెడు పల్లవితో రామ సంబోధనలు, ఆ సంబోధనలలో రామాయణ కథ నడచుచుండును. భజనలో ఆసక్తిని, లయవేగమును పెంచుటకై యతి, అంత్యప్రాస లిట్లు ఉపయుక్తములు-

దశరథనందన! సీతారాం, ధార్మిక చందన! సీతారాం
యాగరక్షణా! సీతారాం, అఘవిమోక్షణా! సీతారాం

తరువాతి యంశము 'శ్రీ కోదండరామాష్టకము'. ఇది సంస్కృతమున వ్రాయబడిన అష్టకము. 'ధౌతపుర స్థిరామరతరుం కోదండరామం భజే' అని దీని మకుటము. ధూళిపూడి సంస్కృతనామము ధౌతపురము. ఈ అష్టకము కంఠస్థము చేయదగినంత కమనీయము! ప్రతి పద్యము నందలి నాలుగు పాదములును ఒకే హల్లులో మొదలగుట ఈ స్తోత్రమునకు మరింత వన్నె చేకూర్చుచున్నది -

"భద్రాణాం నిలయం కరస్థవలయం భద్రావతీనాం ఫలం
భద్రాద్రీశ సుతస్య తుంగశిఖరే భద్రాకృతి ప్రస్ఫుటమ్
భద్రాంచత్పదబంధురం సుమధురం భవ్య ప్రభావస్థిరం
భాస్వద్ధౌతపురస్థిరామరతరుం కోదండరామం భజే -

*1 ముఖాముఖి. శ్రీ తడవర్తి సత్యనారాయణ (ధర్మకర్త) 4-6-1986

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తరువాతి యంశము శ్రీ కోదండరామస్వామి షోడశోపచార క్రమము. ఇందు ధ్యానావాహనాది షోడశోపచారములు, ఒక్కొక్క ఉపచారమునకు ఒక గీతపద్యము, ఒక కీర్తన చొప్పున విరచితములు. గీతపద్యములకు 'ధౌతపుర వరధామ కోదండరామ' అను మకుటము నియమితము.

ఇందలి ఉపచారక్రమము సంస్కృతమునందలి ఏ పూజా విధానమునకును అనువాదము కాదు. భావములన్నియు శాస్త్రిగారి సొంతములు. ఉపచారములలోని ఆంతర్యమును అవిష్కరించుచు ఈ రచన కొనసాగెను.

ధ్యానోపచారము :

చలనమింతయులేక నిశ్చలసముద్ర
మట్టులు నివాతదీపమునట్లు వెలుగు
వెలుగ! నిన్ ధ్యానమొనరింతు విశ్వవినుత!
ధౌతపురవరధామ! కోదండరామ!

నిశ్చల సముద్రమువలె నివాతదీపము వలె ధ్యానముయొక్క పరమార్థము సూచితము. అర్ఘ్యోపచారమున ఆవిష్కృతమైన భావనాభానురత్వము భావుకుల కానంద సంధాయకము.

కల్పవృక్షంబయైన నీ కాయమందు
దండియగు బాహుశాఖల దనరు చిగురు
టాకులగు నీదుకరముల కర్ఘ్యమిడుదు
ధౌతపురవరధామ! కోదండరామ!

తదుపరి అంశము పవళింపుసేవ. ఇందు పవళింపు కీర్తన, బహుపరాకులు, హెచ్చరికలు, సురటివిసరుట, చూర్ణిక, మేలుకొల్పులు రమణీయములు.

శాస్త్రిగారి సంస్కృతరచనా పాటవమును, సంగీత సాహిత్య వైభవమును ఈ రచన వెలయించుచున్నది. సామర్థ్యము- తాదాత్మ్యము భావనాశక్తి కల కవి మట్టినైన చేపట్టి బంగారమొనరింప కలడనుటకు ఈ గ్రంథమొక తార్కాణము.

— ౧ —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

గురుచరిత్ర

ఇది సుమారు నూటయెనిమిది పద్యములు గల అముద్రిత రచనము. కొన్ని చివరి పుటలను పురుగులు కొట్టి పెద్ద రంధ్రములు చేసెను.

శాస్త్రిగారికి ఇద్దఱు గురువులు. బ్రహ్మశ్రీ పాతూరి రామస్వామి శాస్త్రి గారు తొలి గురువు. బ్రహ్మశ్రీ తాదేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు మఱిగురువు. ఆ ఇరువురి చరిత్రములు లఘువుగా నిందు వర్ణింపబడెను. గురువులపట్ల శాస్త్రి గారికి ఎంత భక్తివిశ్వాసములున్నవో, గురువులు నివసించిన పొన్నూరు, చందోలు గ్రామములపై ఎంత ప్రేమ యున్నదో ఈ కావ్యమునుండి గ్రహింప వచ్చును.

రామస్వామిశాస్త్రి చరిత్ర :

ఇందలి గోష్ఠీవన వర్ణనము శ్రీనాథుని కాశీఖండ భీమఖండ వర్ణనల కెన వచ్చుననవచ్చును. భావనారాయణస్వామి దేవాలయము, పౌరాణికగాథ కన్నులకు కట్టినట్లు వర్ణింపబడెను. ఆలయ ప్రాంగణములోని "కోనేఱు" ఇట్లు వర్ణితము—

పగలు మిళితపరీమళ పంకజములు
రాత్రులుత్పతదళులు కైరవము లాత్మ
నలరఁజేయగ భావనారాయణాల
యాస్యమున నొప్పు నొక్క పద్మాకరంబు

ఇట్లే తులసీవనము, పేరులేని పెద్ద మ్రానులు, తుంగభద్ర, కల్యాణోత్సవములు వర్ణింపబడెను.

పాతూరి వంశ్యులు ఆత్రేయ గోత్రులు. ఆపస్తంబ సూత్రులు, కృష్ణయజుశ్శాఖాధ్యాయులు. అట్టి వంశమున రామస్వామిశాస్త్రి జనించెను.

అప్పయ్యశాస్త్రి దంపతులకు గురురామస్వామి శాస్త్రిగారు జన్మించుటను కవి ఇట్లు చమత్కరించెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆ యప్ప కనకతమాంబల
కా యనఘుడు తాత, సేవకలరి యనెన్ మీ
యీ యప్పు నెట్లు తీర్తును ?
మీ యుదరము జొచ్చిగాక మించిన వేడ్కన్

"చచ్చి నీ కడుపున పుడతాను" అని కృతజ్ఞతాపూర్వకముగా పలుకుట తెలుగు పలుకుబడి. దాని నాధారముగా గొని తాతయే మనుమడుగా జన్మించెనని కవి మలచెను. తాత ఎంతటివాడో మనుమడంతటివాడన్నమాట.

ఇక కథానాయకుడగు రామస్వామిశాస్త్రిగారు దక్షిణామూర్తి అవతారము. పరమశాంతమూర్తి. వారి నడవడికకు శిష్యుని భాష్యమిట్లున్నది.

మౌనముద్ర ధరించు మర్మమంతయు నాత్మ
వీక్షించుటక కాని వేఱుకాదు
ఇచ్చు ద్రవ్యముగొను ముచ్చట పరమేశ్వ
రార్చకు గాని యన్యంబుకాదు
పరమేశ్వరార్చనాపరత గొప్పము జగ
ద్రక్షకే గాని యితరము గాదు
శాస్త్రసమాహార చర్చారహస్య మా
చరణమ్మునకు గాని పరము కాదు
అతి గోత్రోద్భవుని యెడ నఖిల జీవ
సమరసజ్ఞుని యెడ శిష్యజన సమగ్ర
కృత సుకృత మూర్తియెడ మహర్షి ప్రహర్ష
జనకునెడ దివ్య దస్మదాచార్యునెడల

శాస్త్రిగారి జీవితచరిత్రము రేఖామాత్రముగా నిట్లు చిత్రింపబడెను -

చదివె గాశికయందు జాహ్నవీజలముల
దోఁగి శ్రీ విశ్వనాథుని భజించి
చదివించె బెక్కండ్ర సంతానమునకన్న
మిన్నగా శుభమున మేలుకొలిపి
తా జూచి తరియించె దారక బ్రహ్మంబు
పంచాక్షరీక సోపానమెక్కి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నిలిపె యశః పతాకల దిశాధ్వజముల
దక్షిణామూర్తిప్రథన్ వహించి
నిత్య మల్లము నందున నిస్తరంగ
సమ్మదపయోధి దేలుచు సహజ కరుణ
దీనజనముల నోముచు దేజరిల్లు
రామ పండిత గురుడు నిర్మలుడు సముడు

గురుపత్ని బాయమ్మగారన్నచో కవికి తల్లికన్న నెక్కువ. తల్లిలేనివాడని ఆమె ఎంతయో వాత్సల్యముతో నన్నము పెట్టెడిది. ఆమె నడవడి ఇట్టిది —

సాహసిక్యము జేసి సంఘంబులో జొచ్చి
చిత్రముల్ చూడంగ చిత్తమిడదు
శ్రవణ కఠోరమై జనబాధకంబైన
నుడికారమెన్నడు పెదలనీదు
అర్థరాత్రంబంచు నలసట యంచును
బీదకన్నము బెట్ట విసువుకొనదు
విద్యార్థులను కన్నబిడ్డలతో జూచు
భేదవృత్తిని మది బెట్ట బోదు

సతుల మేల్బంతి, ప్రస్ఫురదతులకాంతి
శ్రుతిహితాచార, కుటిల దుర్మతవిదూర
బాయమాంబిక జగదీడ్య భవ్యచరిత
నస్మదాచార్య మైచాయ నభినుతింతు

రామస్వామిశాస్త్రిగారు వారణాసినుండి తిరిగి వచ్చినప్పటినుండి అచ్చటి సంప్రదాయము తెగకుండ ఏటేట సాహిత్య గణపతి నవరాత్రోత్సవములు జరుపుచుండెడివారు. ఆ యుత్సవములలోనే శాస్త్రిగారి గ్రంథరచన మారంభమైనది. గణపతి స్తుతితో నీ చరిత్ర పూర్తియాయెను. విఘ్నేశ్వరా! అను మకుటముతో పది పద్యముల స్తుతి సాగెను.

సిందూరద్రవ దిగ్ధ ముగ్ధ ముఖరాజీవా! కృపాసింధు! రా
కేందుశ్రీకర! మౌళిభాగవిధృతాహీనా! జగద్బాంధవా!
వందారుప్రియ! సర్వలోకహిత! దేవా! సిద్ధి బుద్ధీశ్వరా!
ఛందోభాగ విహార! యేల్కొనుము రక్షాదక్ష! విఘ్నేశ్వరా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని గణపతిని స్తుతించు గురుని ముఖములోని బ్రహ్మవర్చసము శిష్యుని కానంద దాయక మాయెను.

వేంకటప్పయ శాస్త్రి చరిత్ర :

శ్రీశైలమున కీశాన్యమున కృష్ణాకావేరీ నదుల మధ్య చంద్రపురి యను విద్యానగరము కలదు. గృహపతుల బ్రహ్మతేజము, మహిళల పతిభక్తి, వర్ణి మండలకృత నిత్యహోతోపాసనయు ఆ పురమును నాలుగు వంకల రక్షించు చుండును. ఆనీటిలో కైతకుతోడు, నందనమునకు జోడునగు నొక పూలతోట కలదు. ఆ యూరిని చేరినంతనే తత్త్వానుభూతి కలుగును.

ఆ యూరిపై చంచలూడు మహాలక్ష్మి కరుణ పుష్కలముగా కలదు. అందు శంకాపంకిలమానసకింకరులను చేర్ప నల్వంకల కీర్తిగనిన శంకర విద్యాలయము కలదు. అంచపరశివావతారమగు అత్రిసగోత్రుడు వేంకటప్ప సద్గురుడు కన్పట్టును. ఆయన చూపు ప్రోడునైనను చిగురింపజేయును. ఆయన యొక సమ్రాట్టు. ఆ రాజభోగము లిట్లున్నవి—

వినయావనమ్రమై తనమ్రోల సాగు శి
　ష్య ప్రకాండంబె సైన్యంబుగాగ
తేజోవిశేష ప్రదీప్త సత్రిధర్మ
　శాసనం బుచ్ఛత్కరాసి గాగ
సంతతానంద ప్రసక్తి జొక్కించు భా
　వకవిత చామర పాణి గాగ
నీరంధ్ర నిరపాయ తారకబ్రహ్మంబు
　పావృత్తి మేన వజ్రాంగి గాగ

దశదిశల వెన్నెలలుగాయు యశము విమల
సౌధములు గాగ దుర్మత శత్రుకోటి
వాదయుద్ధంబునం బడవైచు గెరలి
దిట్ట వేంకట సుకవిసమ్రాట్టు గురుడు

వేంకటప్పయ్య శాస్త్రిగారు గోష్ఠిసలుపుచుండగా విన్న మూగయు వక్తయై వెలయును. సగుణ నిర్గుణోపాసనలు రెండింటిని గూర్చి చెప్పగల బుధప్రధాని యాయన. ఆకలిగొన్న కడుపును చూచినచో తానుతినబోవు అన్నమును పెట్టుటకై

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వెనుకాడని రంతిదేవుడు. వారి ధర్మపత్ని అనసూయమ్మగారు. సాక్షాత్తు అనసూయామాతయే. కొడుకు నారాయణుడు. కోడలు శ్రీదేవి. గోత్రము ఆత్రేయము. అందుచే కవి ఇట్లూహించెను.

రంజితాఖిలమూర్తి నారాయణుండు
కొడుకు, శ్రీదేవి కోడలై గొప్పజేయ
భార్య యనసూయయై కీర్తి ప్రబల జేయ
అత్రిముని వేంకటాభిఖ్య నవతరించె

అనసూయమ్మగారి ద్వంద్వాతీత సమదృష్టి ఎట్టిదో ఈ క్రింది పద్యమున గమనింపవచ్చును—

పంటపైరులు నిండుపట్ల నేయూర్మియో
యాయూర్మియే కంటకాగనుముల
సరస తీర్థావగాహులల నేప్రేమమో
యా ప్రేమమే విషమ్యాదులందు
శుద్ధసాత్త్విక తపస్సుల నే ప్రసాదమో
యా ప్రసాదంబె క్రోధాగ్నులందు
రమణీయతర పదార్థమున నేమాడ్కియో
యామాడ్కియే తదన్యంబులందు
నెనగి విసువక నిరతము నెల్లజీవ
కోటి భరియించు భూదేవి సాటియే క్ష
మావతీ రత్నమునకు నమ్మహిత చరిత
నస్మదాచార్య సతి నెన్న నలవి యగునె?

వేంకటప్పయ్యశాస్త్రిగారికి కోపమునెందు.దానితో వాక్పారుష్యము మరల అంతతో శుద్ధ సత్త్వమూర్తిగాగోచరించెడివారు. ఈసన్నివేశము పిచ్చయ్యశాస్త్రిగారి జీవితచరిత్రలో వివరించబడినది. దానిని మనస్సులో నుంచుకొనియే కాబోలు "శుద్ధ సాత్త్విక తపస్సులనే ప్రసాదమో, యా ప్రసాదంబె క్రోధాగ్నులయందు" అని వ్రాయుట. శాస్త్రిగారింట అన్నపూర్ణ, సావిత్రి, సరస్వతి, అక్కలక్ష్మి ఎప్పుడు పిలిచినను ఓయని పలుకుచుందురు. అట్టి శాస్త్రిగారికి కుమారుడు చేతికందివచ్చెను. రాఘవనారాయణశాస్త్రిగారు అష్టభాషాకవిత్వముల నారితేరి శిష్యుని కివిధముగా పాఠప్రవచనము చేయసాగిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవిభావంబు రసప్రచారము సలంకారంబు వ్యంగ్యంబు ధా
తువు మున్నైన విశేషముల్ పదికి దోడ్తో దోప విద్యార్థిధీ
నవతా దోహద కల్పనా కళల విన్నాణంబు జెన్నొంద రా
ఘవ నారాయణ శాస్త్రి చెప్పు రసవత్కావ్యాది పాఠంబులన్

శాస్త్రిగారింట ప్రతిదినము బాలాత్రిపురసుందరికి షోడశోపచార పూజలు జరుగుచుండును. అప్పుడు వారు అమ్మవారిని ఎట్లు స్తోత్రము చేయుదురో "మహాసరస్వతి మహాలక్ష్మి మహాకాళికా" అను మకుటముతో పది పద్యములలో దిఙ్మాత్రముగా చూపబడెను.

శ్రుతులన్ దచ్ఛిఖలన్ స్మృతి ప్రతతులన్ శుంభత్పురాణమ్ములన్
శ్రుతిపేయోత్తమ కావ్యరత్నఖనులన్ జొక్కించు గీతావళిన్
ప్రతిభన్నిల్పి ప్రభుత్వశక్తి జగముల్ పాలించు నిన్నెంతు హృ
ల్లతికావాల! మహాసరస్వతి! మహాలక్ష్మి! మహాకాళికా!

ఇట్లు ప్రత్యహంబును దేవీస్తుతి సల్పుగురుని ముఖములోని బ్రహ్మవర్చసము శిష్యున కానందదాయకమగును.

గురుపులిద్దఱును అన్నదమ్ములవలె నుందురు.

"అత్రిగోత్రు లనఘు లాచార్యు లౌట ధన్యోస్మ్యయంటి" నని కవి ధన్యతను ప్రకటించెను. "వారి పత్నులు మాతల్లు లౌరసులను బోలె శిష్యుల దిలకించు పుణ్యమతులు, అక్కసెలియండ్రు"........అని ఆ తల్లులకు మ్రొక్కెను. రెండు తేజముల నొకటిగా దర్శించెను.

గురువులను స్మరించుట, స్తుతించుట సాహిత్య సంప్రదాయమే కాని అత్యంత భక్తిశ్రద్ధలతో గురువుల చరిత్రములను కావ్యముగా మలచుట శిష్యభావమునకే శిఖరాయమాణమగు విషయము. ఇట్టి నూత్న ప్రక్రియకు తెలుగులో శ్రీకారము చుట్టిన శ్రీ చల్లావారు ప్రాతస్స్మరణీయులు.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రబోధము

ఇది సుమారు నూట ఇరువదియైదు పద్యములు గల అసంపూర్ణలఘు కావ్యము. శాస్త్రిగారు అపర వయస్సులో సాగించిన రచనలలో ఇదియొకటి. దాదాపు పూర్తి కావచ్చినను ముగింపు లేకుండుటచే దీనిని అసంపూర్ణ కావ్య మనవలసి యున్నది.

సత్త్వరజస్తమో గుణములలో చివరి రెండు గుణములే మానవులలో ఎక్కువగా కనిపించును. వానిలో కూడ తమస్సు ఇంకను బలీయము. దాని మాయలో పడి మానవుడు మానవత్వమును మాధవతత్త్వమును మరచి ప్రవర్తించు చుండును. కావున నిరంతర ప్రబోధము ఆవశ్యకము. ఆర్షధర్మజ్ఞులైన కవులు ఇట్టి ప్రబోధములకే తమ కవితా శక్తిని వినియోగించుచుందురు. ప్రకృత కావ్య మున సత్త్వరజస్తమోగుణములకు ప్రతీకలుగా మూడు పాత్రలు సృష్టింపబడెను. (కృషీవల కుమారుడు సత్త్వము. రాజు రజస్సు. దొంగ తమస్సు.) సత్త్వము రజస్తమస్సులకు జ్ఞానోదయము కలిగించి పురుషార్థ పరమార్థమును బోధించుటయే ఈ కావ్యము లోని అంతస్సూత్రము. ఏ తత్ప్రబోధమునకు లోకములో వాడుక లోనున్న రెండు మూడు చిన్న కథలను కవి ఒక కథగా మలచి సుందరమగు కావ్యముగా పరిష్కరించెను.

సత్త్వగుణము కర్మ, భక్తి, జ్ఞాన మార్గములలో దేనివలననైనను సంపా దింప దగినది. జ్ఞానులగు మహర్షులు, మహాకవులు, మహాభక్తులు సత్త్వసంపన్నులై ప్రబోధమును చేయుట అనూచానమే. కర్మమార్గమునందు ప్రవర్తించు మానవులే ఎక్కువమంది కనుక కర్మజాతమగు సత్త్వమే ప్రబోధ మునకు బాగుగా పనికివచ్చునను ఊహచే కాబోలు కవి ఇందొక కృషీవలుని నాయ కునిగా చేసిరి.

కథ :

ఒకచోట నాల్గవ కులము ఆలుమగలున్నారు. వారిది అన్యోన్య దాంప త్యము. వ్యవసాయము, పాడిపంటలతో నిత్యతృప్తులై పరిశుద్ధజీవనము సాగించు ఆ దంపతులకు శ్రీహరి దయవలన సద్గుణ సంపన్నమగు నొక పుత్రరత్నము

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కల్గెను. ఆ బాలుడు వినయ విధేయతలలో విద్యాభ్యాసములో పెద్దల మన్ననలను బడసి తోడి బాలురకు ఆదర్శప్రాయుడయ్యెను. ఒకనాటిరాత్రి ఒకదొంగ వారింటికి కన్నము వేయుచుండగా మరునాడు వేకువన గ్రామాంతరము పోబోవుచున్న కాపు కొమరుడు తల్లితో జరిపిన సంభాషణము వానికి వినబడెను. 'ప్రయాణములో భుజించుటకు రెండు చద్దిమూటలను కట్టి యిమ్ము. అందొకటి నాపాలు మరి యొకటి మట్టిపాలు' అని ఆ బాలుడనెను. ఈ మాటలు దొంగకాశ్చర్యమును కల్గించెను. అతడు కన్నము వేయుట మాని వేకువ జామున కాపుకొమరుని ననుసరించెను. అతడు చద్ది తినబోవునప్పుడు దొంగ సమీపించి పలుకరించెను. కాపు తాను తెచ్చిన రెండవ మూట నాతనికిచ్చి ఆకలి తీర్చెను. అప్పుడా చోరుడు రాత్రి జరిగిన సంఘటనను వివరించి ఆ మాటలకు అర్థమేమని యడిగెను. కాపునవ్వుచు ఇప్పుడు నేను తిన్నది మట్టిపాలు. నీకిచ్చినది నా పాలు. ఇతరులకు పెట్టినది మనవెంటవచ్చునని పరోపకారాది ధర్మములనుపదేశించి వాని మనసు మార్చి పంపెను. అటనుండి ఆ యువ బాటవెంట నడచుచు పెద్ద కాయలతోనున్న గుమ్మడి తీగెను, చిన్న కాయలతోనున్న మఱ్ఱిచెట్టును చూచి సృష్టివైపరీత్యమని భావించుచుండగా ఎక్కడినుండియో ఒక మహాపురుషుడు వచ్చి 'విశ్రాంతిగైకొనుము నీ సందేహమునకు సమాధానములభించును' అని చెప్పెను. మఱ్ఱిచెట్టుక్రింద నిద్రించుచున్న కుఱ్ఱనిపై కాయలు రాలి మెలుకువ కలిగెను. సృష్టి రహస్య మవగతమయ్యెను. ఆ మహాపురుషుడు మరల వచ్చి జ్ఞానోపదేశము చేసి వెడలెను. కాపుకొమరుడొక నగరమునకు చేరెను. అచ్చట రాజభటులు వానిని 'నీకు వైద్యము తెలియునా?' అని ప్రశ్నించిరి. ఈతడు 'అలతియలతిగా తెలియు' ననగానే వారి రాజు నొద్దకు గొనిపోయిరి. వృద్ధుడగు నా రాజు మరల యౌవనము వచ్చుటకు మందు నిమ్మని యడిగెను. వాని యవివేకమును పోగొట్ట దలచి ఒక యవివాహితుని రక్తమును త్రాగుమని సలహా ఇచ్చెను. భటులు దేశమంతయు తిరిగిచచ్చుటకు అంగీకరించిన అవివాహితునొకనిని తెచ్చిరి. వాడువధ్యశిలపై పెద్దగా నవ్వెను. రాజు కారణమడిగెను. 'నీవు అనుభవింపవలసిన యౌవనము నంతటిని అనుభవించితివి. నా యౌవనము ప్రారంభములలోనే అంతమగుచున్నది. పోయిన దశ తిరిగి వచ్చుట ఎచ్చటను చూడము గదా!' అని నవ్వ వచ్చినదని అతడు సమాధానము చెప్పెను. రాజునకు జ్ఞానోదయమయ్యెను. అతనిని మంత్రిగా నియమించెను. కాపు కొమరుని ఆస్థానకవిగా నియమించెను. అతడు సభామధ్యమున రాజునకు పురుషార్థస్వరూపమును వివరించెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ కావ్యమునందు కథన శిల్పమంతగా కానరాదు కాని ప్రబోధ పారదృశ్వత్వము, వర్ణనారామణీయకము పఠితలను ఆకర్షించును. గ్రామీణ వాతావరణము, కర్షక జీవితసౌందర్యము భారతీయజానపద ప్రశాంతజీవిత విధానము ఈ చిన్నకావ్యమున చోటు చేసికొన్నవి. ఆస్తికబుద్ధి, ధార్మికప్రవృత్తి చుక్కానుల వలె మానవులను చక్కని మార్గమున ఎట్లు నడపించునో ఇందు బోధింపబడెను.

ప్రబోధ గౌరవము :

ఈ కావ్యమునందు ఇహపరమార్గదర్శకములగు సూక్తులు ప్రబోధితములు. సూర్యోదయమునకు పూర్వమెందుకు స్నానము చేయవలెనో ఇట్లు చెప్పబడెను.

అంబుజాప్తుండు తన కిరణాళి క్రుంకు
నప్పుడంబువులందున నగ్నియందు
నునిచి చేకొను క్రమ్మఱ నుదయమందు
కాన నుదయమునకు మున్నె స్నానమొప్పు

తాను చేయు పని చెడుదైనను భగవంతుడే తమ చేత చేయించుచున్నాడని కొందఱు వితండవాదము చేయుచుందురు వారికి సమాధానము -

తప్పుపనికూడ దేవుడే తాను చేయు
మనుచు జేయించుచోను శాసనమునందు
విధినిషేధములను నిరూపింపనేల?
శిక్షణము రక్షణమ్మును జేయనేల?
తనకు తోచినదే ధర్మమనుకొను వారికి గుణపాఠము—
భగవదాశాసనమె ధర్మమగును గాని
మనకు తోచిన దెల్ల ధర్మంబు గాదు
వివిధమును జంచలము నౌట వెదగుమనము
పెత్తనంబున కర్హత వెలయదెపుడు

ఇట్లే శ్రేష్ఠానుసరణము, శాంతత్వము, ఆత్మశోధనము, పరదోషకథావిముఖత్వము మొదలైన వానిని గూర్చి కాపుకొమరుడు దొంగకు బోధించును.

కథాంతమున కాపుకొమరుడు ఆస్థాన కవియై రాజునకు చతుర్విధపురుషార్థతత్త్వమును ప్రబోధించుటతో నించరి ప్రబోధాంశములు పూర్తియగును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సంసారజలధిలో సాగిపోవు జీవితనౌకను దరిచేర్చుచుక్కానిగా చోరహార్యముగాని ధనముగా ధర్మము వర్ణితము. ధర్మోరక్షతి రక్షితః అను సూక్తికి మనోహరమగు రూపకల్పన మీ క్రింది పద్యము —

పాపమను నుప్పు నీర్వోయ రూపు చెడును
పుణ్యమను మంచినీర్వోయ బ్రోపు గాంచు
పెలయ బ్రాపులు నిలువనీడలు ఘటించు
ధర్మవృక్షంబు భువనమంతయును నిండి

ఇట్లే అర్థకామముల స్వరూపమును నిరూపితము. మోక్షమును గూర్చి వివరింపకముందే ఈ కావ్యరచన మాగిపోయెను.

విశ్వము నొక మహాగ్రంథముగా నిరూపించు ఈ క్రింది పద్యము శాస్త్రిగారి సాహిత్యసృష్టివెనుకనున్న ఆధ్యాత్మికదృష్టిని పట్టిఇచ్చును.

సంలగ్నకలల బీజక్షేత్రములె యట్ట
లమరికనగు దివసములె పుటలు
సత్త్వ రజస్తమస్తనువులు చిత్తర్వు
లామ్నాయములు ప్రస్ఫుటాక్షరములు
ఆశ్వాసములె యమితాశ్వాసములు కల
విషయంబు వివిధ జీవప్రవృత్తి
పంచభూతంబు లచ్చుపలకలు పరగు బ్ర
హ్మస్థానమే ముద్రణాలయంబు
పాఠకుడు జ్ఞాని హృదయమే వ్యాసపీఠి
రమ్యతరవిశ్వమను మహాగ్రంథమునకు
ప్రళయమనునది మూత తెఱచుట సృష్టి
గురువు శిష్యుదు నరసి కన్గొదగినది

వర్ణనలు :

కావ్యానందసంధాయకములగు నంశములలో వర్ణనలు భావనారమ్యములు, భావుకజన గమ్యములు. కొన్ని వర్ణనలు ఆంధ్ర సాహిత్యమునందు అనిదంపూర్వములనిపించును. సూర్యోదయము, సరోవరము, ప్రొద్దుతిరుగుపువ్వు, గుమ్మడితీగె, మఱ్ఱిచెట్టు ఇందువర్ణింపబడిన యంశములు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మఱ్ఱి చెట్టును వర్ణించుచునావుస పండ్లతో నిండిన పచ్చనాకులను జూచి చిలు కలు తమకులమని కదియజేరినట్లు వర్ణించుట క్రొత్తయూహ.

ఈ చిన్న కావ్యమున ఎడనెడ కొన్ని శబ్దాలంకార చమత్కారములను కూడ శాస్త్రిగారు చూపిరి.

వేఁడి వేఁడి యైన పాఁడి యావుల పాలు
క్రోల గలిగి యున్న గోరి కోరి
వేడి వేడి యెల్ల విశ్వ మాకాంక్షించు
పాడి యావు పాలు వారి పాలు

పై పద్యమున వేడి, పాడి, పాలు శ్లిష్టములు. సబిందువగు పాఁడి క్షీరము. నిర్బిందువగు పాడి ధర్మము. పాడియావు అనగా ధర్మమను గోవు.

తలచు పెరుగును తలచుచు దలుగు పెరుగు
లేని వేలుపు మేల్కొల్పు.

అను పద్యమునందలి యమక విలాసము కూడ నవ్యసుందరమే.

విశ్వశ్రేయమే కావ్యప్రయోజనమని త్రికరణశుద్ధిగానమ్మి తత్సిద్ధికై నడువ వలసిన నడవడికలను కాంతా సమ్మితముగా శాస్త్రిగారిందు ప్రబోధించి కృత కృత్యులైరి.

—:—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సులక్షణోపాఖ్యానము

ఇది మనుష్యయత్నము కంటె దైవయత్నము బలమైనదను సత్యమును నిరూపించు ఏబదిరెండు పద్యముల లఘుకావ్యము. మాఘపురాణాంతర్గత సులక్షణ రాజ చరిత్రము.

పరిశీలింపగా నీ కావ్యము అలవోకగా రచింపబడినదే తప్ప ఆలోచనా మృతము కాదనిపించును. బహుశః ప్రారంభ రచనలలో నొకటియై యుండును. ధారాశుద్ధి శోభితమగు రచనా విన్యాసమే ఇందలి ప్రధాన విశేషము. భక్తిప్రబోధమే ఏతత్కావ్య ప్రయోజనము.

హరియే తల్లియు దండ్రియు
హరియే సోదరుడు సతము హరియే సఖుడున్
హరియే సర్వము హరియే
మరియెవ్వరు లేరు దిక్కు మనుమన్ దనుమన్

అనియు

ఈ కథ పఠించు వారల కెరుక పడెడు
నరసి చూడగ భువి మనుష్య ప్రయత్న
మింతయనియు ఫలియింపదెపుడు దైవ
యత్న మెనయక యిద్ది సత్యంబటంచు

అనునదియును ఈ కావ్యము నుండి లభించు సందేశములు.

"కానడు వాడు కన్నులకు కప్పురపుంబలుకైన బిడ్డనిన్"
చల్లని మేనుగొన్న యొక చక్కని యగ్నియొనా దనర్చు......"

మున్నగు ప్రయోగములు కవిభావుకతను పట్టి యిచ్చును.

"రాజా! తొల్లిటి జన్మమందిటులనే రాజాధిరాజుండవై"

అనుచోట "రాజాధిరాజుండు" అను ప్రయోగము అసాధువు. "మహత్త్వంబున స్వార్థపరంబగు రాజశబ్దము రాజునాబడు" (తత్సమ 78) అను బాలవ్యాకరణ సూత్రము ఉపసర్జనత్వమునందు మాత్రమే రాజశబ్దము డుమంతమగును.

"అధ్వానపడవి" యనుచోట టుగాగమము చేయలేదు.

ఇది ప్రారంభ రచనమను విషయమునకీ ప్రయోగములు నుపబలకములు.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీమదమరావతీక్షేత్ర మాహాత్మ్యము

పంచారామములుగా ప్రసిద్ధములైన అయిదు శైవక్షేత్రములలో అమరావతీ క్షేత్రము ఆద్యము. అమరావతి పౌరాణికముగానే కాక చారిత్రకముగా, రాజకీయముగా, మతపరముగా కూడ మిక్కిలి ప్రాముఖ్యము కలది. ఆ యూరిలో నెలకొన్న శ్రీ బాలచాముండికా సమేత శ్రీమదమరేశ్వర స్వామి ఆవిర్భావమును గూర్చి స్కాంద పురాణమున సమగ్రముగా చెప్పబడినది. ఆ పురాణకథకు కొంత కల్పనను జోడించి శాస్త్రిగారు ఈ కావ్యమును రచింప నారంభించిరి. సుమారు అరువది గద్యపద్యములు లబ్ధములు.

కాళిదాసు ఏ పురాణమననుసరించి కుమారసంభవ కావ్యమును రచించెనో కాని అదే వృత్తాంతము చిన్న మార్పులతో అమరావతీ క్షేత్ర మాహాత్మ్యముగా స్కాందమున చెప్పబడెను.

స్కాందకథ :

''పూర్వము తారకుడు అను రాక్షసునకు మహేంద్రునకు చాల సంవత్సరములు ఘోరయుద్ధము జరిగినది. అందు మహాబలవంతుడైన తారకాసురునిదే పైచేయిగా నుండెను. అప్పుడు దేవతలు భయపడి దేవతాస్త్రీలతోసహా వైకుంఠమునకు పారిపోయి శ్రీమహావిష్ణువుతో తమ కష్టములు విన్నవించుకొనిరి. వారి మొరలాలకించిన విష్ణువు "సురలారా! తారకుడు గొప్ప శివభక్తుడు. అతనిని సంహరించుట యెవ్వరికైనను దుస్సాధము. కనుక అందరము శివుని దగ్గరకు వెళ్ళినచో అతడే ఉపాయము గూర్చి ఆలోచింపగలడు." అని నచ్చజెప్పి వారందరిని తీసికొని కైలాసమునకు పోయి శివునకు విషయమంతయు అతడే వివరించెను. అప్పుడు లయకారుడైన మహేశ్వరుడు ఆలోచించి దేవతలతో "భక్తులారా! మీ బాధను గమనించితిని. తారకుడు నా భక్తుడు. కాని ధర్మ సంరక్షణ ముఖ్యము. కనుక నా అంశమున జన్మించిన కుమారస్వామిని మీ దేవసేనకు అధిపతిగా చేసికొని తారకునితో యుద్ధముచేయుడు. మీకు తప్పక విజయము చేకూరును." అని చెప్పెను. అందులకు ఇంద్రాది దేవతలు సంతసించి కుమార

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వామినే తమ సేనాధిపతిగా జేసికొని తారకాసురునితో యుద్ధము చేసిరి. అతడు తారకుని కంఠమునందుగల శివలింగముపై లక్ష్యముంచి బాణమును ప్రయోగించెను. ఆ బాణఘాతమునకు తారకుని కంఠమునందుగల శివలింగము ఐదుముక్కలై అయిదుచోట్ల పడెను. ఆ అయిదు ప్రదేశములే పంచారామములనెడి పేరుతో శివ క్షేత్రములుగా ప్రసిద్ధినొందినవి.*

పై కథలో తారకుడు శివభక్తుడు. కుమారసంభవమున బ్రహ్మ వరము లను బడసినవాడు. పార్వతి తపస్సు, కామదహనము మొదలగు సంశములు స్కాందమున ప్రస్తృతములు కావు. కాళిదాసు, నన్నెచోడుడు శివ పార్వతుల వివాహము వఱకు జరిగిన కథకు ప్రాముఖ్యము నొసంగి, మహాకావ్యముల నిర్మించిరి. శాస్త్రిగారు స్కాందమునందలి క్షేత్రమహాత్మ్యమును రేఖామాత్ర ముగా ననుసరించి, కాళిదాస మార్గమున పూర్వకథను విస్తరించి, స్వతంత్రమగు త్రోవనేగిరి.

తారకాసురుడు మహాశివభక్తుడు. ఘోరమగు నాతని తపమునకు అఘోర ముఖుడు మెచ్చి అమృతలింగాకృతియై వానిలో ప్రవేశించెను. నాటినుండి ఆ తారకుడు లోకవిదారకుడాయెను.

తారకునిది తామసిక తపమగుటచే జగములల్లకల్లోలమయ్యెను. దేవతలు బ్రహ్మను ప్రార్థింపగా నాతడు శివతేజమే తారకుని సంహరింప సమర్థమని చెప్పెను. అప్పటికి దాక్షయణి లాక్షాయష్టివలె యోగాగ్నిలో కరగి పార్వతిగా జన్మించెను. నారదుడు ఆమెకు శివుడు భర్తయగునని, తపమొనర్చుచున్న శివుని శుశ్రూషకు పార్వతిని పంపుమని హిమవంతునకు చెప్పెను. పార్వతి శివుని సేవింపసాగెను.

ఇంద్రాదులాలోచించి మన్మథుని పంచిరి. అతడాలీఢపాదుడై సమ్మోహ నాస్త్రమును విడచెను. శివుడు మూడవ కన్ను తెఱచెను.

తోడనే పంచశరుఁడు విల్లూపు లీవి
యున్నదున్నట్లు బూదియై యొఱపునెఱపె
తెల్లనయ్యె నెదిర్చుట దెల్ల ముగను
తాను నటు తెల్లనయ్యయై తనరె ననఁగ

---

*. అమరావతిక్షేత్రము, శ్రీ దీవి దీక్షితులు (సం) శ్రీ అమరేశ్వరస్వామి దేవస్థానము. ప్రచురణ, పుటలు. 1-3.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై పద్యములోని ఉత్తరార్థము నందలి యూహ స్వతంత్రము. కాళిదాసు కాని, నన్నెచోడుడుకాని, శ్రీనాథుడుగాని స్పృశింపని చమత్కారము.

పార్వతి తపము నారంభించెను. ఆమె ఆదిశక్తియగుటచే కాలానుగుణ మగు తపములలో బదలిపోకుండ ఋతువులు కాపాడసాగెను. ఈశ్వరుడామెను పరీక్షించి పాణిగ్రహణము చేయనెంచి కపటబ్రహ్మచారియై వచ్చెను.

బ్రహ్మచారి ప్రవేశము నుండి నడచిన కథ కల్పితము. పార్వతి ఆశ్రమమునకు వచ్చుచున్న బ్రహ్మచారి ఆ ప్రాంతమందున్న సరస్సులోనికి పాదక్షాళమునకై దిగి కాలుజారి పెద్ద శబ్దముతో నీటిలోనికి తూలెను. ఆ శబ్దమును విని పార్వతి చెలికత్తెలు వచ్చి అతనిని రక్షింపబోయిరి. "మీరు నన్ను రక్షింపలేరు. బ్రహ్మచారి నుద్ధరింప బ్రహ్మచారిణికే తగును పొందన"గా వారు పార్వతిని తెచ్చిరి. ఆమె అతనికి ఎడమకేలందీయబోయెను. "దానమిచ్చునప్పు డెవ్వరైనను ఎడమకేలిత్తురా?" అని అతడు తిరస్కరించెను. "స్త్రీది వామభాగమే దక్షిణభాగమును శివునికై జన్నెగట్టి యుంచితిని వామహస్తము నందుకొని పైకి రమ్ము" అని పార్వతి యనెను. "పరమేశ్వరుని గుండె ఱాయియా? ప్రాణరక్షణకై చేయూతనొసగిన తప్పవట్టునా? ఔచిత్యము నెఱుగడా? కృపారహితుడా? నీ అనుమానమే కాని నాకు కుడికేలిచ్చినంత మాత్రమున అతడు పాణిగ్రహణమును మానడు. అతని చిత్తమును నేనెఱుగుదును. నీటిలో నేదియో నన్ను లాగుచున్నది. త్వరగా చేతినందిమ్ము" అని బ్రహ్మచారి తొందరపెట్టెను. పార్వతికి కోపము వచ్చెను. "శివుని గూర్చి నాకన్న నీకెక్కువ తెలియునా? కుడియెడమల ప్రసక్తిలేకుండ ప్రాణరక్షణ మొనర్చుకొమ్మని శివతత్త్వము నుపన్యసించి ఇష్టమైనచో వామహస్తమును పట్టుకొనుము. లేనిచో శివుని ప్రార్థించుకొనుము." అని వెనుదిరుగునంతలో శివుడు నిజరూపమున ప్రత్యక్షమయ్యెను.

జగత్పితరులు, సృష్టినియంతలు నగు పార్వతీ పరమేశ్వరులకు పరస్పర దర్శనమున కలిగిన సాత్త్వికభావోదయమును శాస్త్రిగారు తత్త్వ గంభీరముగా నిట్లు వర్ణించిరి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భూతత్త్వమయి యొప్పు మూర్తిమై
స్తంభమన్ సాత్త్వికోదయము దెలుప
తతచరాచర జలతత్త్వమ్ము మూర్తిమై
హర్షాశ్రుసాత్త్విక మమరి తెలుప
అగ్నితత్త్వము మూర్తి నఖిలతేజోలోక
వర్చస్సు దుర్లోక్య ఫక్కి దెలుప
వాయుతత్త్వము మూర్తి ప్రాణాధికమునగు
ననుభూతి యోగమ్ము హాయి దెలుప

గౌరి సౌందర్యలహరితో గలసిమెలసి
పొందుగూర్చెను శ్రీ శివానందలహరి
నవరసమ్ముల సారమై నెనుచు రసము
స్థాయి యగుతటి జగముల హాయిగాదె

ఆచార్య శంకరుల సౌందర్యలహరి, శివానందలహరి రసప్రవాహమున స్ఫురించుట చమత్కారము. నవరసముల సారమైన రసము స్థాయియగుటయనగా స్థిరమగుట, స్థాయి భావత్వమునందుట జగములకు హాయిగూర్చునుకదా! తారక సంహారము జరిగి శాంతి నెలకొనునుగదా!

బ్రహ్మఋషులు రాయబారమును నడపిరి. వశిష్ఠుడు ముహూర్తనిర్ణయ మొనర్చెను. ముక్కోటి దేవతలు తరలివచ్చిరి. ఓషధీప్రస్థపురము మహోజ్జ్వల మయ్యెను. ఇంతటితో కావ్యరచన మాగిపోయెను.

పార్వతీపరమేశ్వర సమాగమము జగద్రక్షకుడగు కుమారుని జననమున కేయగుటచే కవి ఈ కథలోని ఆంతర్యమును, సందేశమును ఇట్లావిష్కరించెను.

దంపతుల యైక్యమన గృహస్థాశ్రమమున
తనుసుఖము గూర్చ నింద్రియార్థమ్ముగాదు
హృదయ భావ సమైక్య మతీంద్రియమ్మె
జీవితావధి ముద్రికా శ్రీగ్రథితము

పై పద్యమున దంపతులు శారీరకవాంఛతోకాక హృదయ భావ సమైక్యముతో నుండవలెనను దాంపత్య ధర్మముపదిష్టము. శారీరక సౌఖ్యము యొక్క పరమార్థమును ఈ క్రింది పద్యము చెప్పను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఋతుకాలాభిగమనమున
వితత చరాచరమునందు పీసల్ సూసల్
సుతులుదయించుటకే దం
పతులుగ స్త్రీ పురుషులుంట తత్త్వము తెలియన్

ఇట్టి విశ్వశ్రేయోదాయకమగు సందేశముతో, మనోజ్ఞమగు కల్పనతో, హృదయంగమమగు వర్ణనలతో విరాజిల్లుచున్న ఈ క్షేత్రమహాత్మ్యము క్షేత్ర ప్రసక్తి రాకమునుపే అసంపూర్ణముగా నాగిపోవుట విచారకరమే అయ్యెను, లభించినంతవరకు స్వతంత్రతా మనోహరమైన రచనా విలాసము రసజ్ఞులకు ఆనందప్రదమగును.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చాటూక్తి రత్నాకరము

చాటువు అనగా ప్రియమైన మాట అని అర్థము. (శ. ర.) ఈ అర్థము క్రమముగా పరిణామము నంది కావ్యనిబద్ధములైన సందర్భము ననుసరించి ఆశువుగా చెప్పబడిన, వ్రాయబడిన పద్యముల యందు పర్యవసించెను. "చాటు పద్య మణిమంజరి" మొదలగు గ్రంథనామములీయర్థము నందేర్పడెను. ప్రకృత చాటూక్తి రత్నాకరమున చాటు శబ్దము పై రెండర్థములను సమన్వయించును. అవధానములందు ఆశువుగా చెప్పినవియు వివిధ సన్నివేశములందు వ్రాసినవియు నైన రమ్యములగు పద్యములిందు సంగ్రథితములు.

"ఈ చాటూక్తి రత్నాకరమందు బాల్యము నుండి భారతి, మధుర, భారతి, నవ్యభారతి, వెలుగు, విభూతి కళాంజలి మొదలయిన మాసపత్రికలయందు ఆంధ్ర, కృష్ణ, త్రిలింగ, ప్రభ మొదలయిన పత్రికలయందు ప్రకటింపబడినవి. అవధానములయందు ఆశువులో జెప్పినవి, వివిధ విషయములు లేఖనరూపమున నున్న సమయాది వర్ణనాంశములు, మహాపురుషుల స్మృతులను, మాలికలను ప్రకటించితిని" అని కవి వివరణము. 1957లో ముద్రితము. ముద్రాపయిత శ్రీముదిగొండ సుబ్రహ్మణ్యశర్మ, తెనాలి.

ఈ గ్రంథమునందు ఆరువందలకు పైగా పద్యములు, పద్యమాలికలు నున్నవి. దీనిని ఆంధ్రపత్రికలో శ్రీ యామిజాల పద్మనాభస్వామి గారిట్లు సమీక్షించిరి.

"చాటువులు నదురూ బెదురూ లేకుండా కవికి ఉండే ఆగర్భ స్వాతంత్ర్యాన్ని వెల్లడించే భేరీధ్వనులు. చాటువులకు ఉన్నంత పస రుచిమత్తత ఒక్కొక్క కావ్యంలో కూడా కనపడదు.........ఈ గ్రంథం రత్నాకరమంతటిది. వివిధ భావాలతో వివిధ రీతులతో, పలు వన్నెల, చిన్నెల పదాల నడకలతో, స్తుతులతో, విమర్శలతో, హేళనలతో, బోధలతో ఏమేమి చెప్పవలసి ఉంటే అవన్నీ ఈ రత్నాకరంలో చెప్పివేశారు"....

శాస్త్రిగారి హృదయమును, సాహితీ వ్యక్తిత్వమును ఆవిష్కరించుటకు ఈ గ్రంథమెంతయో ఉపకరించును. లౌకిక పారలౌకిక విషయములపై వారి అభిప్రాయములను, ఆత్మీయతను ఇందు సమగ్రముగా దర్శింపవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇందలి పద్యములు "సారస్వతము", "భక్తి-భగవంతుడు", "మహాపురుషులు", "సమయాది వర్ణనాంశములు", "వివిధ విషయములు", "మాలికలు", అను నాలు విభాగములలో నున్నవి.

ఈ గ్రంథము నందలి ప్రతి పద్యమును ఉదాహరణీయ రామణీయక శోభితము. ముద్రిత గ్రంథమగుటచేతను, పరిధి నియత మగుటచేతను విహగ వీక్షణ మొనరింతును.

సారస్వతము :

ఇందు "సరస్వతీ" అను మకుటముతో పదునెనిమిది పద్యములు కలవు. ఇట్లు నియతమకుటములైన శీర్షికలు మరికొన్ని గోచరించును. శాస్త్రిగారి సంకల్పమున నివి శతకాకృతులై యుండవచ్చును.

> పాడుము గూర్చ శ్రీ విరియ బాఱిన నీ స్మితకౌముదీలతా
> గ్రోదిత శబ్దమంజరి కహో సుమ మంజరి బోల్ప జెల్లునే
> పోదు పరీమళంబెపుడు బుట్టదు మోదు నొకప్పుడే ఫల
> శ్రీ దయివారు వేళకును జెల్వు దొలంగదు మా సరస్వతీ

పూర్వ కవ్యనుసరణమును హేళనచేయు వారికి నెత్తిపొడుపు—

> క్రొత్తకు గావు నేటికవికోటుల త్రొక్కిన త్రోవలంచు వా
> రుత్తర మందుచుంద్రు తలిదండ్రుల పోల్కియె మేనమామ మే
> నత్తల పోల్కియో పడయనట్టి కుమారుని నేమియందురో
> బొత్తిగ లో విమర్శ గానబోవరు వీరిటనో సరస్వతీ

కట్టమంచి వారి విమర్శన మార్గమును వ్యంగ్యముగా నెత్తిపొడుచు పద్యమిది.

శాస్త్రిగారి ఆత్మీయతను పట్టియిచ్చు "కవితా నియమము" ను ఈ క్రింది పద్యమున చూడవచ్చును.

> ఏ రసమేని కైత జగదీశ సమర్పిత మించు గానిచో
> నీరసమౌను నెంత చెవికెక్కగ విన్చిన-మూడివాడియా
> నారసమౌను నెల్ల భువనంబుల నెమ్మది నీరసంబుగన్
> దారసమూర్తి యౌట గవి తప్పక దీని నెఱుంగ గా దగున్

పై పద్యము "రసోవైసః" అను వేద వాక్యమునకు వ్యాఖ్యానప్రాయము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"భక్తి-భగవంతుడు" అను విభాగమున భగవదారాధనము, గురుజనారాధనము, కళారాధనములను ప్రకటించు బహుశీర్షికలు కలవు.

తొలిగురువులు శ్రీపాతూరి రామస్వామి శాస్త్రిగారిని వీడి వెడలునపుడు వ్రాసిన గుర్వనుజ్ఞలో గురుభక్తినిట్లు చూపిరి.

చిత్తమ్ము చలనమ్ము జెందకెల్లప్డు మీ
  పదచింతనాసక్తి బరగునట్లు
కనులెప్డు మీ యాస్యకైరవాప్తుని బెడం
  గులపోకలను బత్తి దలచునట్లు
చేతులెల్లప్డు మీ శ్రీకరమ్మగుమూర్తి
  చెన్నుమీఱంగ బూజించునట్లు
శిరసెప్డు సాష్టాంగ భరిత నమస్క్రియా
  చరణాతురత్వమ్ము జరుపునట్లు
వేదశాస్త్రములందును విబుధులందు
దేవతామూర్తులందు నదీనదముల
నిరతము ప్రమాణబుద్ధిని నెగడజేయు
మయ్య ! శ్రీ దక్షిణామూర్తి యపరమూర్తి

ఒక రాగ సంచారము యొక్క వివిధ దశలను చిత్రకారుడు బొమ్మగీసినట్లు వర్ణించుట సంగీత సాహిత్య మాధుర్య మర్యాదలను ఎఱిగిన వానికి కాని సాధ్యముకాదు. అట్టి రూపచిత్రములను ఈ దేవగాంధారి రాగప్రశంసా పద్యమున దర్శింపవచ్చును.

క్షీరసాగరమున జిడ్డుమీగడతోడ
  పోతుపెంటికరళ్ళు పొరలునట్లు
చందన శీతల స్పర్శ హస్తమున
  కొనవేళ్ళతోడ జోకొట్టినట్లు
ఉద్యానసీమల నొఱపుపూదీగెల
  తూగుటుయ్యెలల యందూగునట్లు
కమ్మగా గడుమెల్లగా జల్లచల్లగా
  మలయానిలాంకురం బొలయునట్లు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దేవగాంధారి లోపల దిరుగుచుందు
దేవగంధర్వ సంస్తుత్య భావలీల
పాలితాశేష బ్రహ్మాండజాల ! గాన
లోల ! మోహన మురళి గోపాల బాల !

త్యాగయ్యగారి "క్షీర సాగర శయన" అను కీర్తన దేవగాంధారి రాగమున విరచితము. పై పద్యమున మొదటి భావము తజ్జనితము. కవి ఊహాశక్తికి రమ్య పదసంధాన చాతుర్యమునకు ఈ పద్యము మంచి ఉదాహరణ. ఈ క్రింది పద్యము లోని మురళీ కృష్ణుని మూర్తి చిత్రణము అక్షర చిత్రలేఖనమే.

శిరమందించుక రేగ బర్హము చెవిన్ శ్రీకర్ణికారంబు న
ట్లరవ్రాలన్ గరపల్ల వాంగుళులు రంధ్రాచ్ఛాదనంబాచరిం
ప రహిన్ నీ యధరామృతంబునను నా ప్రత్యక్షమందే యిటన్
మురళీకాంత సపత్నియైనను హరీ ! ముద్దయ్యె ప్రేమోయింపుమా

మహాపురుషులు :

శాస్త్రిగారిలోని స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని ఈ శీర్షిక తెలియజేయును.

గాంధీమహాత్ముని దర్శించినప్పుడు కవికి కలిగిన అనుభూతి ఎంతటి ఆర్ద్రమైనదో !

ఎవనినామము విన్న హింస్రసత్త్వములైన
సహజవైరము బాసి శాంతిగాంచు
ఎవనిరూపము గన్న రవులుకార్చిచ్చైన
నావేశముడిగి చల్లారిపోవు
ఎవని వృత్తంబెన్న నితరభాషాసేవ
జేసినదోషంబు చెదరిపోవు
ఎవనిముందటనున్న నిహజన్మ జన్మాంత
రార్జిత పాపమ్ము లణగిపోవు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవని నెవ్వని నేకాదశావతార
మనుచు బుధులెంచు చుందురో యాంధ్రదేశ
భక్తు లెవ్వనిభుజములలో భవ్యమూర్తి
గాంధిని మహాత్మ దర్శించు కలిమిగల్గె

పై పద్యమున కవి గాంధిమహాత్ముని సర్వశక్తి సమన్వితమైన భగవతార ముగా నిరూపించెను. దశావతారములలో మిగిలియున్న కల్క్యవతార లక్షణములు మహాత్మునిలో లేవని సూచించుటకు "ఏకాదశవతార"మని చమత్కరించెను.

పై సందర్భమునందే "క్రియాత్ముని గాంధిమహాత్మ నెన్నెదన్" అను మకుటముతో ఏడు పద్యములు రచితములు.

వల్లభాయిపటేలు సమగ్ర స్వరూపము ఈ క్రింది పద్యమున దర్శింప వచ్చును. పటేలు మహాశయుని గూర్చి విశదముగా చెప్పగల అరుదైన పద్యము లలో నిదియొకటి.

రాజ్యాంగవేత్తల రాణగాంచితివయ్య
చాణక్య తిమ్మరుసు సాటియగుచు
ధీరత్వమునను ప్రతిష్ఠ జెందితివయ్య !
కడల ధౌరంధర్య గరిమ నెఱయ
అరయ సింహస్వప్నమైతయ్య దుష్టని
రంకుశ కష్టగజావళులకు
ఐక్యభావంబున నమర జేసితివయ్య !
కట్టుబాటున గల క్రమము జూపి

మఱతురే యిట్టినిన్ను నేమరిక ప్రజలు
నీదు వల్లభ శబ్దంబు నిక్కపముగ
ఇల గల ప్రవృత్తిని మహాత్మ కెఱుకపఱుప
నరిగినావొక్క దివికి నయ్యా! పటేల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమయాది వర్ణనాంశములు :

వేసవి చమత్కారముగా నిట్లు వర్ణింపబడెను.

'పవలు బయలికిరానీవు బాలునేని
రాత్రినెల్లర ద్రిప్పెదు రక్తి గాలిపి
నీదురాజ్యంబు తలక్రిందుగా దనరెచ్చె
మండువేసవి! చాలు నీ దుండగంబు'

ఋతుసంహారములోని ద్వంద్వ సాహిత్యమును కవి ఇట్లావిష్కరించెను.

ఆమని యకృతయోగాభ్యాసులకు బాధ
తరుణులకున్ కామతత్త్వబోధ
వేసవి పడమరభూసవిత్రికి కంద
వానకోయిలకు తీవరపుగంద
ప్రావృట్టు కాల్నడబాటసారికి ముల్లు
సస్యలక్ష్మికి నరుసంపు బెల్లు
శారదశ్రీ నిశాచరణ గళగ్రాహి
సజ్జన మానసోత్సాహవాహి
శీతు ముసలికి మొసలి మచ్చికల మజిలి
శిశిర మాకులరాల్పు సుశ్రీలమెల్పు
సర్వమును ద్వంద్వసహితంబు సంతతంబు
నరసి చూచిన భేదమింతైనలేదు.

పశ్చిమ దేశములలో మామిడి పండ్లు దొరకవు. ప్రాచ్యమగు భారతదేశమున సమృద్ధిగా పండును. ఈ సత్యమునసరించి కవి చేసిన ఈ క్రింది సాయంకాల వర్ణన అతి నవీనము. అత్యంత మనోహరము.

అక్కా! మామిడిపండ్లులే విచట మీ కచ్చోట బండుంగదా
నిక్కమ్మొక్కటియైన బంప దగవే నీ కింత పంతంబె య
మ్మక్కా? యంచును పూర్వదిక్సతిని పాశ్చాత్యాశాసరోజాక్షి ప
ల్కొక్కన్ ప్రాక్సతి వేయుపండనగ భానుందేగె నస్తాద్రికిన్.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వేకువను, కోడికూతను శృంగారరస పరముగా వర్ణించిన వారేగాని ఈ క్రింది విధముగా వర్ణించిన ప్రబంధకవులు కానరారు.

చిక్కల్వెట్టెడి దీ రిరంసయని లో జింతించి యెంతేనియున్
న్యక్కారమ్మును జేయకే యకట కాంతాలింగన ప్రక్రియన్
కొక్కోకమ్మున బండియుంట తగునొక్కో యంచు నొక్కమ్మడిన్
కొక్కోకొక్కొరో యంచు కుక్కుటములుం గూసెన్

కులాయమ్ములన్

వివిధ విషయములు :

వీనిలో అధికభాగము అవధానాది సందర్భములలో ఆశువుగా చెప్పినవే. చుట్ట, సూది, మొదలగు అల్పవస్తువులను గూర్చి చమత్కారభరితముగా పద్యములు చెప్పగలుగుటకు సమయస్ఫూర్తి సద్యస్స్ఫూర్తి, చమత్కారస్పృహ, మిక్కిలి ఆవశ్యకములు. తిరుపతి వేంకటకవుల అనుయాయులైన శాస్త్రిగారికి ఈ ప్రక్రియ కరతలామలకమైనది.

ట్రంకుపెట్టె వర్ణనము :

తెరవర్లచేతిలో తీయకుండెదవెప్డు
వారు నిన్నివుల వహ్వారె యనఁగ
ముందు మేల్నిగ్గుల మూడుగఖ్ఖన్నంత
నే వైష్ణవుడవయి నెగడ గలవె
కొన్ని చిర్గుబ్బల గుల్కుచుందువు గాని
చిన్నారి పొన్నారికన్నె కావు
ఎపుడునిస్త్రీబట్టలే తాల్చెదవుగాని
యుద్యోగి వనునట్టి యూహవలదు

నోరుతిరుగని మూర్ఖులనోట నెప్డు
'రంకుపెట్టె' యటంచు పేర్పడుచు నుందు
వరయ నెటులైననేమి నిన్నరయువారు
లెంతయే నిత్తురి నిశ్శంక ట్రింకటంక !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొడుమును గూర్చి-

పన్నీటముంచి కవ్రపుముగ్గిగ్గ లిడ్డ చో
 పైన గాకుల కులాయంబుగాదె
జున్నుపాల్పైరుగుతో నున్న మేదపైనన
 నల కరీంద్రము మ్రింగు వెలగగాదె
పెళపెళలాడు చల్వలగన్న గుడ్డైన
 నేరేడు రంగుతో నెగడుగాదె
చనుచున్న నెట్టి తిష్ఠన్మూర్తుగ్గినైన శా
 స్త్రిలవారనుచు బిల్వ జూచుగాదె
చుట్టముక్కకు దగ్గఱ చుట్టమౌను
గాదె సఖ్యంబు చిత్రగంధోదయంబు
అఖిలజనుల కసహ్యమై యలరుగాదె
యెన్నికకు మాత్రమిది సుంత మిన్నయగును

శాస్త్రిగారి కావ్యరచనా శైలికిని, పైపద్యము వంటి పద్యముల శైలికిని కలభేదము గమనార్హము. అది శ్రీనాథాదుల దారి నేగును. ఇది తిరుపతి వేకట కవుల త్రోవను పోవును.

'పెండ్లి రాయబారము' ఇందులోనున్న పద్యనాటిక. సీతారామ కల్యాణము కథావస్తువు. నాటికను పద్య రూపమున రచించుట పాశ్చాత్య సంప్రదాయము. తొలిరోజులలో ఆంధ్రనాటక కర్తలు పద్యరూపకములను రచించిరి. ఆ ప్రభావముతో శాస్త్రిగారీ నాటికను రచించియుందురు.

సంఘసంస్కరణము, యంత్రనాగరకత, అనార్షవర్తనములు మానవుని దుఃఖముల పాలుసేయునని శాస్త్రిగారి దృఢవిశ్వాసము. తదనుగుణమగు పద్యముల నిందు దర్శింపవచ్చును. కవి యొక్క సామాజిక దృక్పథమును విశ్లేషించుటకవి ఎంతయో తోడ్పను. కవి పురోగామియో తిరోగామియో మనమతమునుబట్టి నిర్ణయించుట సమంజసముకాదు. ఆతడు మానవాభ్యుదయమును కాంక్షించుటయే ప్రధానము. శాస్త్రిగారు సంఘసంస్కరణలను వ్యతిరేకించుటకు గల కారణమునీ క్రింది పద్యము తెలియ జెప్పును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉపవాసముల హరినుల్లంబు జేర్పమి
విధవా వివాహముల్ వెలసె జగతి
సత్సంతతికె పెండ్లి చట్టపుం చెఱఁగమి
ప్రౌఢావివాహ నిర్బంధ మొదవె
భక్తివశ్యుడు భగవంతుడన్మతి లేమి
వర్ణధర్మముల వ్యవస్థ తప్పె
దౌర్బల్యహేతువుల్ తలపున జేరమి
సంతానరోధ ప్రచారమొలసె

కెరలి యస్థానమునను చికిత్స జేయు
వెజ్జు చేనున్న మందుల వీర్యమట్లు
పదను పోయినయట్టి భూపదములందు
వాత బడి ధర్మగతి విపరీతమయ్యె

యాంత్రికమగు నాధునిక నాగరకతను, సినిమాలను, ఇట్లు నిరసించిరి.

కాళ్ళు సైకళ్ళగాగలరోజులేగెను
సైకళ్లె కాళ్ళగా సాగెనేఁడు
తనువు విమానమై తనరురోజులు చనె
నలవిమానమె తనువయ్యెనేఁడు
జ్ఞానమ్మె కన్నుగా గల రోజులు గతించె
కన్నె జ్ఞానమ్ముగా గలిగె నేడు
దేవుడున్నాడని తెలియు రోజులుపోయె
దేవుడులేడంట తేలెనేఁడు

చెన్నపట్టణమందు నార్జించునట్టి
డబ్బువరె దలక్రిందుగా డాబుహెచ్చె
మైనసులు మేజరులు నేకమై నడచెడు
సంచలమ్మగు సినిమాప్రపంచమందు

అవైదికజీవనమున ఎట్టికష్టములు వాటిల్లుచున్నవో ఈ క్రింది పద్యమున చెప్పబడెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రత్యక్షమునయంచ ప్రామాణ్య మొప్పుట
స స్కారమున దృష్టి సమసిపోయె
తినుటకే బ్రదుకని తేటతెల్లంబౌట
ననియతాహార విహారమయ్యె
కేవలభోగాళికే వివాహములౌట
బహుధావధువులను బడయుటయ్యె
అసమయకేళీ సమావేశములె యౌట
నెదిరించుసంతతి యెసగుటయ్యె
సృష్టియందున నే యుగంబేని దలప
కారణానుగుణంబగు కార్యమొసగు
తిట్టిసను కొట్టినను నెట్టి రట్టులయిన
ననుభవింపక తప్పదే యనువులేదు.

ఇట్లు నిర్భయముగా తాను నమ్మిన దానిని చాటిచెప్పగల నిజాయితీ సమాజమును నడిపించు కవులకుండ వలసిన ముఖ్యలక్షణము.

'మాలికలు' అను శీర్షిక క్రింద శాస్త్రిగారు వివిధ సమయములలో వ్రాసిన మాలికలున్నవి. శ్రీ తాదేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిలవారియొద్ద విద్యాభ్యాసము చేయనెంచి నూటఎనిమిది పాదముల చంపకమాలికను ప్రార్థన పూర్వకముగా వ్రాయగా వారానందముతో అంగీకరించిరి. నలువది యెనిమిది పాదముల అఖండ సమాసము ఇందలి విశేషము.

తిరుపతి వేంకటేశ్వర కవులకు వ్రాసిన ఇరువది రెండు పాదముల చంపకమాల, జంటకవిగానుండగోరి శ్రీ రాళ్ళబండి వేంకటసుబ్బయ్యశాస్త్రికి వ్రాసిన యుత్పలమాల, ఉభయభాషాచరిత్రను తెలియజేయు ఉత్పలమాల, భక్తినిగూర్చిన చంపకమాల. 'భావప్రపంచము' 'పూదండ', 'కాలము మృత్యువు', 'ఆదిభట్ల నారాయణ దాసప్రశంస' అను గీతమాలికలును, శ్రీ దేవీభాగవతమును ప్రశంసించు చంపకమాల ఇందున్న మాలికలు.

ఈ చాటూక్తి రత్నాకరము నిక్కముగా రత్నాకరమే. వర్ణనలను రత్నములను, సమకాలిక కవిగాయక నాయక ప్రశంసలను ముత్యములును, భక్తికవితలను పగడములును, విమర్శలను తిమితిమింగలాలును, సునిశితాధిక్షేప వ్యంగ్యములను తరంగములును, ఆత్మీయతయను గాంభీర్యమును ఈ రత్నాకర వైశిష్ట్యమును వేనోళ్ల చాటుచున్నవి.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ రామకృష్ణపరమహంస గీతా

ఆధునిక భారతీయాధ్యాత్మిక తేజస్సాగరమున ఎగసిన ఉత్తుంగ తరంగము లలో శ్రీరామకృష్ణపరమహంస ఒకరు. ఆమహనీయుని జననముతో 19వ శతాబ్ది పరమపవిత్రమైనది. తాను భగవత్సాక్షాత్కారమునొంది, తద్భాగ్యమును శిష్యులైన వివేకానందులకు కల్పించి విశ్వమున కొక క్రొత్త వెలుగు నందించిన మహాను భావుడాయన. శ్రీ రామకృష్ణుల శిష్యగణము అసంఖ్యాకము. భక్తవర్గమనంతము. ఆసేతుశీతనగ నివాసులగు ఆస్తికజనులపై వారిప్రభావము అనల్పము. ఎందరో భక్తులు, భక్తకవులు శ్రీ రామకృష్ణుని గూర్చి అనేక రచనలను వెలువరించిరి. శాస్త్రిగారు కూడ రామకృష్ణ బోధామృతమును గ్రోలిన ఆనందమున ఈ సంస్కృత రచన మారంభించిరి.

శ్రీ రామకృష్ణ మఠము వారిచే ప్రచురింపబడు "శ్రీ రామకృష్ణ ప్రభ" అను మాసపత్రిక 1954 ఆగష్టు సంచికలో "శ్రీ రామకృష్ణ పరమహంస గీతా" అను పేరుతో ఇరువదిమూడు శ్లోకములు తాత్పర్య సహితముగా ప్రచురితములు. "ప్రథమాధ్యాయః" అను సూచన ననుసరించి విస్తృత ప్రణాళికతో భగవద్గీత వలె ఈ గ్రంథమును రచింపదలచి యుందురు. తరువాతి సంచికలతో మిగిలిన అధ్యాయములు కానరాలేదు.

లభించిన ప్రథమాధ్యాయమున గదాధరుడు దేవీసాక్షాత్కారమునకై ఆరాట పడుట, జగజ్జనని ప్రత్యక్షమై అతనిని ఊరడించి ఆశీర్వదించుట అను కథ భాగము నడచినది. మాతృదర్శనమునకై గదాధరుడు చెందిన తహతహ స్ఫూర్తిమంతముగా నిందు వర్ణితము.

సాధుకాంత దీక్షితులకు మోక్షదాయినియు భక్తులకు చంద్రికా మూర్తియు ఇతరులకు అగ్నిరూపయు అయిన దేవిని గదాధరుడిట్లు ప్రార్థించెను.

"ప్రసీద! దేవి! మాత! త్వాం దర్శనం దేహి సత్వరం
విలంబం న సహేసోహం నాన్యం దైవతమాశ్రయే

నీవు ప్రత్యక్షము కానిచో నాస్తికుల మాటలు యథార్థములగుననియు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనన్యభక్తితో బహుకాలమునుండి పూజించుచున్న నాకు వేరు మార్గము లేదనియు గదాధరుడు దుఃఖించుచు ఇట్లనెను.

రుదంతం బాలకం లోకే కా మాతా సముపేక్షతే
దినేదినే తు యాచేహం భవతా భాషితుం ప్రసు !

కాయశోషణమునందు ఇంద్రియ జయమునందు కోశాగార రక్షణయందు (పంచకోశములు) తనకు దుఃఖము లేదనియు తల్లి అదర్శనమొక్కటియే దుఃఖకరమనియు విన్నవించెను. తగులబడుచున్న గృహమునందున్న వానివంటి తనను త్వరగా రక్షింపుమని ప్రార్థించెను. ఇట్లు బహువిధముల విలపించి నిద్రాహారములను పరిత్యజించిన గదాధరునకు కాళికా దివ్యరూపము సాక్షాత్కరించెను. అతడు మహానందపరవశుడాయెను. దేవి గదాధరుని జన్మకారణమును ఇట్లు చెప్పెను.

"సుదృఢాస్తిక్య బుద్ధీనాం! భగవద్దర్శనం సదా
భవత్యేవ న సందేహ! ఇతి బోద్ధుం త్వమాగతః !!

భవిష్యత్కాలమున జరుగబోవు విశేషములను తల్లి ఇట్లు వివరించెను.

మమాజ్ఞయా సమప్రజ్ఞ ! ప్రజ్ఞాపయ సుతారకం
తవ శిష్యా భవేయుశ్చ నరేంద్రాః కవయో బుధాః
మహాధికార సంపన్నాస్తర్తుకామా భవార్ణవం
ఇత్యుక్త్వా కృపయా దేవీ ప్రసన్నాంతస్స్మితిం దదౌ !

పై శ్లోకములలో నరేంద్ర శబ్దము శ్లిష్టము. వివేకానందుని జన్మనామము నరేంద్రుడు.

అంతటితో ప్రథమాధ్యాయము పూర్తియాయెను. భగవద్గీతలోని అర్జున విషాదయోగమువలె ఇందు గదాధరుని విషాదయోగము నిరూపితము. అధ్యాయాంతమున దేవి "ప్రజ్ఞాపయ సుతారకం" అని చెప్పుటచే ద్వితీయాధ్యాయము నుండి శ్రీ రామకృష్ణుల బోధలను కవి గ్రథింపనెంచెనని గ్రంథనామమును బట్టి ఊహింపవచ్చును.

భగవద్గీతాదులననుకరించు ఈ గ్రంథప్రణాళికలో రచనాశైలిని కూడ కవి వ్యాసాదులమార్గమున పౌరాణికముగా మలచుకొనెను. కావ్యశైలివలె ప్రౌఢతను ప్రదర్శింపక సరళసుందరముగా సర్వసుబోధకముగా సురభారతీసౌకుమార్య పారమ్యరమ్యత్వమును పుణికి పోహళించెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆపాతమధురమగు ఇందలి అలంకార విన్యాసము, భావుకజనహృద్యము. ఈ క్రిందివానిలో అకృత్రిమోపమారామణీయకము ద్రష్టవ్యము.

సరస్థితానాం పద్మానాం వికాసో రవి రశ్మిభిః
మన్మనః పద్మపుష్పస్య వికాసో దర్శనం తవ
"దహద్భవన మధ్యస్థ జనస్యేవ గతిర్హి మే"

సాభిప్రాయ విశేషణ పరికర పరికల్పితమగు ఈ వక్రోక్తి వైభవము తల్లి హృదయమును తప్పక కల్లోల పరచును—

ద్వాదశాబ్దావధిగత మాక్రోశం మే కృపానిధే
కథం న శ్రోష్యసి శివే సర్వవ్యాపిని సర్వదే

పై శ్లోకములోని నాలుగు సంబోధనలు సాభిప్రాయములే.

శ్రీ రామకృష్ణులను "ఆస్తిక్య పరమావధిః" "సుబోధకః" మొదలగు విశేషణములతో పేర్కొనుట చూడగా శాస్త్రిగారు రామకృష్ణ బోధలను బాగుగా అనుశీలించి ప్రభావితులైనట్లు స్పష్టమగును. సంస్కృతభాషా సారళ్య సౌందర్య సంభరితమగు ఈ గీతామృతము ప్రపంచమునకు సంపూర్ణముగా దక్కకపోవుట దురదృష్టము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చతుర్థము

గద్యోల్లాసము

'గద్యం కవీనాం నికషం వదంతి, - సుప్రసిద్ధసూక్తి. నిన్న మొన్నటి వఱకు తెలుగు వచన రచనల సంఖ్యస్వల్పము. నేడు అనల్పము. ఆంగ్లభాషా ప్రభావమే అందుకు కారణము. గద్యశాఖకు నవల, కథ, విమర్శ, వ్యాసము మున్నగు నుపశాఖలనేకము.

ఛందస్సాహాయ్యము లేకుండుటచే పాఠకులను రంజించుటకు గద్యకవి సర్వశక్తులు కేంద్రీకరింపవలెను. సంయమనమును పాటింపవలెను. తనదైన కథనమార్గమును, శైలిని సృష్టించుకొనవలెను.

శాస్త్రిగారి గద్యరచనలలో కాల్పనికము లేమియులేవు. మొత్తము ఏడు వచనరచనలలో 'చాణక్య నీతిదర్పణము' సంస్కృతశ్లోకముల కనువాదము. దానిని అనువాదములలో చేర్చితిని.

'భాషాభ్యుదయము' సంస్కృతాంధ్ర పద్యసంవదితమయ్యును స్వతంత్రము. 'వారణాసి రామసుబ్బయ్య జీవితచరిత్ర' వ్యక్తిచరిత్రము. 'స్వీయచరిత్ర' అసంపూర్ణము, అముద్రితము. 'ప్రపంచము' తాత్త్విక రచన. అముద్రితము.

'ఇది అనుకృతియే యైనను కవిరచనాశిల్పమహిమచే స్వతంత్రానుభూతితో పాఠకుల హృదయాలను రంజింపజేయుచున్నది.* అని చాణక్యనీతిదర్పణ పీఠికలో శ్రీ ముళ్లపూడి నారాయణ శాస్త్రిగారు చేసిన ప్రశంస పిచ్చయ్యశాస్త్రిగారి గద్య రచనాశిల్పమునకు లభించిన విద్వత్పరితోషము.

—ం—

* భూమిక. పుట, 4,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భాషాభ్యుదయము

విద్యార్థులలో భాషాజ్ఞానమును. సత్ప్రవర్తనను, ప్రాచీన కథావిజ్ఞానమును పెంపొందించుటకు ఉద్దేశించి శాస్త్రిగారు ఈ గ్రంథమును రచించిరి. 1930లో ముద్రితము. ముద్రాపకులు యం.యస్. శర్మ అండు కో. తెనాలి. కొంతకాలము ఉన్నత పాఠశాలా విద్యార్థులకిది పాఠ్యగ్రంథము.

ఇందు తొమ్మిది వ్యాసములు కలవు. 'విద్య-విద్వత్కవులు' అనువ్యాసమునందు ఆంధ్రవాఙ్మయ చరిత్ర పరిచయము చేయబడినది. 'సత్యము' 'దైవబలము' 'పరోపకారము' 'నిర్దోషిత్వము' 'దానము' 'తృష్ణ' 'అలకామార్గము' 'మనోనిశ్చయము' అనువ్యాసములు విద్యార్థుల నడవడికను తీర్చిదిద్దును. తొలుత శీర్షికను వివరించుట, తదనంతరము భారతాది గ్రంథములలోని యొకకథననుసరించుట పై వ్యాసముల సాధారణ ప్రణాళిక. ఆయా గ్రంథములలోని కథలను వచనీకరించునప్పుడు, ఆంధ్రీకరించునప్పుడు రచయిత చూపిన నైపుణ్యమిట పరిశీలనీయము. ఏతద్గ్రంథరచనోద్దేశమును, ప్రణాళికను రచయిత పీఠికలోనిట్లు తెలియజేసెను.

'నేనీ గ్రంథరచనకు దొడంగుట చదువరులకు భాషాప్రవేశము సులభముగా గలుగుటకొఱకే. ఇందు దీర్ఘవిషయమును క్లుప్తీకరించుట కొన్నిచోట్లను, గొన్ని యెడల స్వల్పవిషయము విపులీకరించుటయు ఋతువర్ణనాదులును దెలియ జేయబడినవి. మఱియు బూర్వకవుల వాఙ్మయవిశేషములు వెల్లడింపబడినవి.'

పై ప్రణాళిక ననుసరించి పరిశీలించినచో శాస్త్రిగారు మూలగ్రంథముల సారమును ఎంత విస్తారముగా, హృదయంగమముగా గద్యపుమూసలో పోసి బొమ్మలు చేసిరో గమనించవచ్చును.

విద్య - విద్వత్కవులు :

విద్యార్థులకు విద్యయందు అసక్తిని, విద్వాంసులయందు భక్తిని కలిగించు వ్యాసము. సంస్కృతాంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహమిది. భర్తృహరి సుభాషితాదులననుసరించి విద్యావిశిష్టత వివృతము, తత్పూర్వకవుల ఘనత ఇట్లు చెప్పబడెను.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'విద్యత్కవులు మదపుటేనుంగులవలె నిరంకుశులు. గౌరవముతోడి సంపదలనే గ్రహింతురు. వారియెడ గౌటిల్యము పనికిరాదు. తత్త్వార్థ నివేదనమున వశులగుదురు. రాయంచలవలె గుణదోషములు విభాగించి, భాషాస్వరూపమెరిగి మృదుమధురములగు వాఙ్మయ ప్రబోధముల నెల్లరకు భావముప్పొంగ రసము ప్రసరింప గర్తవ్యాళములు తేటపరచుచుందురు.'

కవుల స్వభావము. కవిత్వప్రయోజనము పై వాక్యములలో సుందరముగా చెప్పబడెను. అటుతరువాత వాల్మీక్యాది సంస్కృత కవుల నామములను పేర్కొని ఆంధ్రకవి పరిచయమునకు కడంగిరి.

శ్రీ కృష్ణదేవరాయ యుగమువఱకు గల వాఙ్మయచరిత్రయే ఇందు లిఖితము.

సత్యము :

'సుత జలపూరితంబులగు' అను పద్యము తరువాత రచయిత సత్య మహిమను ప్రస్తావించి దానికి నుదాహరణముగా భారతారణ్యపర్వము నందలి 'యక్షప్రశ్నల' కథను చెప్పును.

ధర్మరాజు సోదరులతోకూడి లేడివెంట పరుగెత్తునపుడు ఆలేడి పరుగు - 'ఒయారముగా మెడ ద్రిప్పి బెదరి బెదరి చూచుచు శరపాత భయమ్మున శరీరమ్ము వలయాకారమ్మున జుట్టికొనుచు....' అభిజ్ఞాన శాకుంతలము ననుసరించెను.

నకులుడు సమీపించిన సరోవరమును రచయిత రమ్యముగా వర్ణించెను. ఇది అమూలకము. దీని వలన జలజంతు పక్షిపుష్పాది విజ్ఞానము విద్యార్థులకు లభించును.

ధర్మరాజు యక్షప్రశ్నములకిచ్చిన యుత్తరములు సరళమగుభాషలో ననూదితములు.

దైవబలము :

దైవబలము యొక్క విలాసమిందు వివృతము. తత్సమర్థకముగా భారతము నందలి గృధ్రగోమాయు సంవాదకథ ప్రపంచితము.

పితృబంధువర్గమోహమునకు కారణమై, మరణింపబోవుచున్న బాలుని సౌందర్య వర్ణన ముచ్చట గొలుపును. ఆ బాలునకై శ్మశానమున అంతసేపేడ్చుటకు కారణము తెలియును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరోపకారము :

'ఈ శరీరము పరోపకారమునకేర్పడినది. అయ్యది ప్రతి మనుజుండును నాచరింపదగు' అని ప్రారంభించి, తరుజల పర్వతాదులు ఎట్లుపరోపకారమునకై జీవించుచున్నవో వివరించి, ఆ యర్థమును సమర్థించు సువర్ణష్ఠీవి వృత్తాంతమును రచయిత ఇందు పొందుపఱచెను. ఈ కథ భారతమునందలి ద్రోణపర్వద్వితీయాశ్వాసము నందును, శాంతిపర్వప్రథమాశ్వాసము నందును, ప్రసక్తము. కవి శాంతిపర్వము ననుసరించెను.

సృంజయుని భక్తికి మెచ్చి నారదుడాతని కుమారుడగు సువర్ణష్ఠీవిని పలుమారులు బ్రదికించుట ఇందలి పరోపకారము.

నిర్దోషిత్వము :

గుణదోషవిభాగము నెఱిగి మసలుట మానవకర్తవ్యము. దోషమునకు అంతరాత్మయే సాక్షి. దోషము బుద్ధికృతము, ప్రమాదకృతమని ద్వివిధము. ప్రమాదమునకు ప్రాయశ్చిత్తము కలదుకాని బుద్ధికృతమునకు లేదు. ఈ యర్థము తేటపడుటకు మహాభారత శాంతిపర్వమునందలి సుద్యుమ్న చరితము నిందను సంధించిరి.

'నిర్దోషుడెందును సుఖించును. ఎంతవాడైనను దోషయుక్తుండైన రాణింపడు' అనునది కథాసందేశము.

దానము :

'దానము స్వయశోనిదానము. పాపనిస్తరణ సాధనము. ఉత్తమశరీరాధానము.' అట్టి దానమును పాత్రాపాత్రవిచారణ చేసి యొసర్పవలెనను సందేశమును ఈ వ్యాసమందించును. శ్రీమంతుడు తన లక్ష్మిని పంకరహితము, పవిత్రమునగు యాచకుని పాణిపద్మమునందు నెలకొల్పవలెనని చెప్పను. తదర్థసమర్థకమగు రఘుకౌత్సవృత్తాంతమును రఘువంశమునుండి గ్రహించి రచయిత ప్రతిపాదించెను.

తృష్ణ :

'తృష్ణయనగా నెంతయుండినను సంతుష్టి చెందకుండుట. దీనినాశ్రయించినవాడు చెడును.' అసదులు దీనికిలోనై హత్యలు సయితమొనర్తురు.' అని తృష్ణా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వరూపనిరూపణమునకై శాస్త్రిగారు భోజచరిత్రమునెన్నుకొనిరి. భోజుని పినతండ్రియగు ముంజుని తృష్ణ ఎన్ని దుర్మార్గములకు దారితీసినదో వివరించిరి.

అలకామార్గము :

కాళిదాసుని కవితాసౌందర్యమును బాలకులకందించుటకై మేఘసందేశ కావ్యమును పై శీర్షికతో నాతివిస్తరముగా ననుసరించిరి. 'యక్షుండట శాప విముక్తుడై నిజార్ధాంగముంజేరి సుఖంబుండి స్వపదమంద్రప్రమత్తుడై మెలంగె' అని సుఖాంతముగా ముగించిరి. కమ్మని తెలుగు పలుకుబడులతో కాళిదాసకవిత యందలి కామనీయకమును ఈ వ్యాసమావిష్కరించును.

మనోనిశ్చయము :

'మనోనిశ్చయముచే సమస్త శ్రేయములు చేకూరును. కాని దృఢజ్ఞానము సుస్థిర ధైర్యమును లేనిచో నందు జయము సంభవించుటదుర్లభము. పరీక్షలు ప్రతిపదంబునందును భయపెట్టుచుండును. వాని యందేమరక జాగ్రత్తగా మెలంగిన మనోనిశ్చయము ఫలించును. ఇదిలేని మనుజుడు మోహజనకంబులగు నస్థానములయందు ప్రవేశించి చెడిపోవును. ధర్మపథమునకు నిశ్చయమ ప్రథమావ సథము.

పరీక్షలనుగూర్చి భయపడు విద్యార్థులకు విజయరహస్యము నుపదేశించు పై శీర్షికకు నిరూపణముగా దమయంతి మనోనిశ్చయ విజయమును ప్రకటించు శృంగారనైషధకథను శాస్త్రిగారు సంగ్రహముగా వచనీకరించిరి. శృంగారమును తొలగించి నైషధమును మాత్రమే విద్యార్థుల కందించిరి.

'పనులందు సహస్రాక్షుడు', - 'దక్షిణనాయకుడు' - 'ప్రబలవాహినీ సేవితుడు,' శాత్రవతృణంబులకగ్ని' మొదలగు పదములతో శ్లేషచమత్కారమును బాలకులకు రుచిచూపిరి.

భాషాభ్యుదయము :

బాలుర భాషాశక్తి పెంపొందించి చక్కని గద్యశైలిని అలవరచుట ఈ గ్రంథరచన ముఖ్యప్రయోజనము. తదనుగుణముగా నిందు పర్యాయపదములు, కఠిన, పదములు, చిన్నచిన్న సంస్కృత సమాసములు అచ్చతెలుగు వాక్యములు కూర్పబడినవి. ఉపాధ్యాయుల వివరణమావశ్యకమగు విషయములు చొప్పించబడినవి. గద్యమున కలంకారమును చేకూర్చు శబ్దాలంకార సౌందర్యము ప్రదర్శింపబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధునికయుగమున గ్రాంథికగద్యశైలికి చిన్నయసూరి గద్యమే యొఱవడి. తదనంతర రచయితల కదియేమార్గము. శాస్త్రిగారును చిన్నయార్యుని చిన్నెలను వన్నెలను చూపుట నీ క్రింది వాక్యములు గమనికకు తెచ్చును.

'ఎవ్వండర్థ విరహితుడో వాని పాండిత్యము, సౌందర్యము, సౌశీల్యము. గుణగ్రాహిత్వము నిరర్థకములు .... దాక్షిణ్యము, సందియము, వెఱపును గల వానికి సంపదలు దూరముగా దొలగిపోవును. మానావమానముల పాటింపకర్థముం జేకూర్పవలయు. కుశాగ్రబుద్ధియగు వాడెప్పుడు దనకు రాబోవుననర్థము తెలిసి నప్పుడు దానికి దగిన చికిత్సయప్పటికప్పుడ యాలోచించుకొననగు. పగతునేని రోగమునేని బుట్టినప్పుడు పేక్షించిన నెట్టి పుష్టాంగుడైనను వానివలన దప్పక చేటందును.'

చిన్నయసూరి నీతి చంద్రిక వరుసలో బాలురకు భారత ధర్మములను, సంస్కృత కావ్య సౌందర్యమును, భాషావిశేషములను అందించిన ఈ 'భాషాభ్యుదయము' ఆంధ్ర గద్య భారతికి అమూల్యాభరణము.

— ० —

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ వారణాసి రామసుబ్బయ్య శాస్త్రి జీవిత చరిత్ర

స్వరజ్ఞాన స్వరకల్పవల్లరి, అర్వాచీనాంధ్ర గాయక వాచస్పతి, బాలగంధర్వేత్యాది బిరుదవిరాజితులై సంగీత సరస్వతీ స్వరూపమని విద్వాంసులచే పొగడ్తలుగని విజయ పరంపరలతో విరాజిల్లి ముప్పది యేండ్లకే దేహమును విడచిన మహాగాయకుడు శ్రీ వారణాసి రామసుబ్బయ్యశాస్త్రిగారు లోకము తెలిసికొనవలసిన జీవిత విశేషములుగల మహాపురుషుల కోవలోనివారు. వారి స్వల్ప జీవితములో ఆశ్చర్యకరములగు విశేషాంశయు లెన్నియో కలవు. వారికి ఆబాల్యమిత్రులును, సంగీత కళా రహస్య నిధులును అగు శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు అభిమానుల కోరికమేరకు సుబ్బయ్యశాస్త్రిగారి జీవిత చరిత్రను రవ్వంత అతిశయోక్తియును అసత్యమును లేకుండ రచించి నాటి మహావిద్వాంసుల అనుమోదముతో ప్రకటించిరి. పేటేరు వాస్తవ్యులు శ్రీ రావు సూరయ్యగారు ఈ గ్రంథ ముద్రాపయితలు. 1953లో ముద్రితము.

సర్వశ్రీ కాశీ కృష్ణాచార్య, హరి నాగభూషణము, నిరాఘాటం రామకోటయ్య. వేటూరి ప్రభాకరశాస్త్రి గారలు రామసుబ్బయ్యశాస్త్రిగారిని గూర్చి వారి జీవిత చరిత్రను గూర్చి చేసిన ప్రశంసలు పత్రికా ప్రకటనలు ఈ గ్రంథమునకు తొలినుడులు.

"కథానాయకుని యోగ్యతను నేనాబాల్యము నెఱింగిన వాడనగుటంచేసి చరిత్ర జూచిన నాకు కథానాయకుడగు వారణాసి రామసుబ్బయ్య మహాశయుడు కళ్ళఎదుట సాక్షాత్కరించినట్లు తోచెను....... కావున ఈ చరిత్రలో చెప్పబడిన ఇతివృత్తమంతయును జల్లిపొల్లులు లేక అతిశయోక్తులు లేక సత్యమే యున్నదున్నట్లు వ్రాయబడెననియె నేను నమ్మితిని" అని శ్రీ కాశీ కృష్ణాచార్యగారును,

"శ్రీ రామసుబ్బయ్యగారు నేనెఱిగిన గాయకులలో ప్రథమశ్రేణికి చెందిన వరిష్ఠులలో నొకరుగా పరిగణింపదగినవారు. ....మృదుమధుర గంభీర మగునట్టిదియు, త్రిస్థాన గమక ప్రౌఢిగలట్టియు సుశారీరము ఇట్టిది అప్పటి కాలములో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేను విన్నట్టిది కాదు. ఇప్పటికిని అట్టి గాత్రము కలవారు కానరారు. వారి గాత్రము నుండి ప్రసరించెడి గానప్రసారములు గవ్వగుత్తులనుండి ప్రసరించెడి ధ్వని విశేషములు గలవిగా నుండెడివి. అట్టి ప్రసారములు వారి గాత్రమునుండియే వినవలయు గాని మఱియొకరి వలన వినుటకు సాధ్యపడవు. ఇక వారి మేధా సంపన్నత వర్ణనాతీతము. వారి రాగరూపకాలాప్తులు వారికే తగియుండెను. స్వర ప్రస్తారముగూడ అట్టిదియే. ఇతరులు ప్రస్తరించెడు రీతులు వారి గానములో గనయ్యెడివి గాని వారి గానములో ప్రస్తరించెడు శైలి రీత్యాదులు మఱియొకరి గానములో ఒదిగెడివికావు. వారి గాన గాత్ర మేధా పాండితులు, అప్పటికిని ఇప్పటికిని అపూర్వములని చెప్పదగియున్నవి." అని శ్రీహరి నాగభూషణము గారును,

"ఆంధ్రదేశ చరిత్ర వ్రాయబడు సందర్భమున సంగీతశాస్త్రభాగమునందు పేర్కొనబడదగు మహామహులనేకుల నామధేయములతో అస్మద్గురువర్యులు శ్రీ వారణాసి రామసుబ్బయ్య గారి పేరుకూడ చేర్పదగినదైయున్నది." అని శ్రీ నిరాఘాటం రామకోటయ్యగారును రామసుబ్బయ్యగారి ప్రతిభావిశేషములనుగ్గడించిరి.

శ్రీ రామసుబ్బయ్య జీవిత చరిత్ర :

శ్రీ రామసుబ్బయ్య పౌరాణిక ప్రసిద్ధిగన్న పొన్నూరుగ్రామమున చిత్రభాను నామ సంవత్సర (1882) కార్తీక శుద్ధ పాడ్యమి ఉదయాది 5-8 గడియలకు జన్మించెను. తండ్రి కోటయ్యగారు భరతశాస్త్రప్రవీణులు. లక్ష్మీనరసమ్మ గారు సాధ్వీమతల్లి.

బాల్యము :

రామసుబ్బయ్యగారు మిక్కిలి అందగాడు. "తదీయములగు శతపత్ర జైత్రములగు నేత్రములును నిర్మలశరత్పూర్ణిమా మండలమును గ్రీడించు సుందర వదన మండలమును; నాజానులంబమానములగు బాహువులును, నెక్కుపెట్టిన మరువిండ్ల ధిక్కరించు కన్బొమలును సహజస్మిత వికాసములును చూపఱునాకర్షించు చుండెను." తోడు బాలకులతో ఆటలాడు సమయముననే సంగీత జ్ఞానము వెలార్చుచు నాయకత్వ లక్షములు కలిగి పెద్దవారలను సైతము ఆశ్చర్యచకితులను చేసెడివాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విద్యాభ్యాసము :

రామసుబ్బయ్య ఏకసంధాగ్రాహి. వీధిబడికి పంపిన కొలది కాలములోనే భారత భాగవత రామయణాదులను ధారాళముగా చదువను వ్రాయను సమర్థుడయ్యెను. సహజాతములో శ్రుతిలయలతో ప్రకృతిలోని భిన్నస్వరములతో తన గొంతుకలిపి పాడుచుండెడి వాడు. తండ్రి పాడెడు కీర్తనలు వినిన వెంటనే ఆయనకాశ్చర్యము కలుగునట్లు విశేషసంగతులతో పాడి ఆనందమును కలిగించెడి వాడు.

ఇట్లుండ తల్లిదండ్రులాతనికి ఉపనయనము చేసిరి. వటువు రూప రేఖా విలాసములను, మధుర కంఠస్వరమును, ప్రతిభావిశేషమును పరికించి కోటయ్య గారింటి ప్రక్కనే ఉన్న గృహస్థు పాతూరి వేంకటరత్నంగారు రోశమ్మయను తన కుమారిని కాల్గడిగి కన్యాదానమొనర్చి తరించెను. అప్పటికి రామసుబ్బయ్యకు చదివినది కొద్దియైనను ధారాళముగా నాంగ్లభాషయందు వ్రాయను జదువను నేర్పు కలిగెను.

సంగీత శాస్త్రాభ్యాసము :

ప్రముఖ సంగీత విద్వాంసులగు సుసర్ల దక్షిణామూర్తిశాస్త్రిగారి శిష్యులగు రాజనాల వేంకటప్పయ్యగారు ప్రత్తిపాడులో అనేకులకన్నోదకము లొసంగి పోషించుచు సంగీత శాస్త్రమును గఱపుట తెలిసి కోటయ్యగారు రామసుబ్బయ్యను వారియొద్ద ప్రవేశపెట్టిరి. ప్రజ్ఞావంతులగు విద్యార్థులకు నాలుగైదు సంవత్సరములు అభ్యసించినను పూర్తిగాని సంగీతము రామసుబ్బయ్యకు రోజులలోనే పూర్తి యయ్యెను. గురువుగా రానందించి "నాయనా! నావద్ద నీవు గ్రహింపదగిన విద్య పూర్తియైనది మరియెక్కడైన దక్షిణదేశమున ఉన్నత విద్వాంసులకడ నభ్యసింపుమని ఆశీర్వదించి పంపెను. ఆ తరువాత కాకినాడలో శ్రీనివాస అయ్యంగారిని (పూచి అయ్యంగారు) తన గానముచే మెప్పించి చెన్నపట్టణము చేరి వారి యొద్ద కొన్ని కీర్తనలను నేర్చి అంతటితో సంగీతాభ్యాసమునకు స్వస్తి చెప్పి జైత్రయాత్రకు బయలుదేరెను.

సమ్మానములు :

తొలుత 1906వ సంవత్సరమున రామసుబ్బయ్య ఎట్టియాపుర సంస్థానమున చేరెను. అచ్చట ప్రముఖ వాగ్గేయకారులగు దీక్షితులవారి మనుమడు పరీక్షాధికారి. కొన్ని సంవత్సరము లభ్యసించినను పట్టువడని గ్రహస్వరములు భాష

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సుబ్బయ్య ఒక్కసారి వినినంతనే తిరిగి పాడి యాశ్చర్యమొదవించెను. సంస్థాన ప్రభువునెదుట రామసుబ్బయ్య పాటకచేరి చేసి ప్రభు సత్కారమునందిరి.

1909లో రామనాథపుర సంస్థానమున జరిగినగాన విద్వత్సభలో పండారు సన్నిధిగారు పరీక్షాధికారిగా నుండగా కచేరిచేసి సమ్మానము నందిరి.

ఒకసారి మాదల వెంకటరావను సంగీత విద్వాంసుడు వివరముగా నొక పల్లవిని ఇంటియొద్ద తయారుచేసికొని వచ్చి దానిని సర్దుడని సభలో సవాలు చేసెను. ఆ సభలో రాజనాల వేంకటప్పయ్యశాస్త్రిగారితో సహా అనేక విద్వాంసులు దానిని సర్దుటకు అశక్తులైరి. ఇంతలో అనుకొనకుండ రామసుబ్బయ్య అచటికి వచ్చి ఆ పల్లవిని త్రుటిలో సర్ది పాడి గర్వభంగ మొనర్చెను. ఈ విధముగా పల్లవి పాఠకులమని అహంకరించిన పండితుల ద్వారఫలకముల నూడ గొట్టించెను. శపథముల రద్దుసేయించెను.

1907లో రామసుబ్బయ్య గవాయిపాటలో జయ పొందుటకు కలకత్తాకు వెళ్ళెను. అచ్చట సుప్రసిద్ధగాయనియగు మాల్జానును గెలుచుట కష్టమని పలువురు చెప్పగా తొలుత ఆమెను దర్శింపనేగెను. ఆమెను పాడుమని యడిగెను. ఆమె రామసుబ్బయ్యనే మొదట పాడుమనెను. అతని గవాయి పాటవిని ఆమె ఆశ్చర్యచకితురాలయ్యెను,

చేబ్రోలులో రామసుబ్బయ్య ఒకసారి ఋషభగ్రామమున* సంగీతము పాడుచుండగా బాటనుబోవు ఎడ్లు ఆగి వినినవట. దక్షిణ దేశమున జయపత్రము లంది వచ్చిన తరువాత దక్షిణాదినుండి పాటకచేరీలకై అసంఖ్యాకములుగా ఆహ్వానములు వచ్చెను.

ఒకసారి రామసుబ్బయ్య ఒక అపూర్వరాగమును సృష్టించి జన్యరాగమైనను మేళకర్తరాగమువలె పాడగా వినిన శ్రీ ఆదిభట్ల నారాయణదాసుగారు ఆనందభరితులై "నీ శ్రుతి జ్ఞానము విశ్రుతము" అని పొగడిరి. మరియొకసారి సుసర్ల దక్షిణామూర్తి శాస్త్రిగారు రామసుబ్బయ్య గానమును విని కన్నీరు కార్చిరి. ఇదేమని యడుగగా "గానము దేవగానము మనుష్యగానమని ద్వివిధము. గంధర్వ కంఠములోని శ్రుతులు మనుష్యకంఠములో పలుకబడవు. అట్టి గంధర్వ కంఠశ్రుతులు నేటి రామసుబ్బయ్యగారి కంఠమున వినబడుచున్నవి. ఇట్టి పాటను వినుట కొలదిరోజులవరకేయని దుఃఖించుచున్నాను." అనిరి.

---

* గ్రామము = షడ్జాది స్వరము. శ.ర.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఎందరో ప్రభుత్వాధికారులు ప్రముఖులు రామసుబ్బయ్యకు అభిమానులై సేవించెడివారు. లండన్ పట్టణములోని ఆలిండియా మ్యూజిక్ అకాడమీలోను, ప్యారిస్ పట్టణ మ్యూజిక్ అకాడమీలోను సభ్యులగు "జ్యోతీంద్ర మోహన ఠాగూర్, శరచ్చంద్రమోహన ఠాగూరు గారలు రామసుబ్బయ్యకు సర్టిఫికెట్ల నొసంగి, ఇరువదియారు నవరత్నాల బంగారు పతకము నొసంగి, తమ అకాడమీ తరపున విదేశీములకు రావలసినదిగా ఆహ్వానించిరి. ఇట్టి బహుకృతులు వారికెన్నో ! !

రామసుబ్బయ్య అనేక కీర్తనలు వ్రాసి వాగ్గేయ కారుడయ్యెను. సంస్కృతాంధ్రములందు మంచి పాండిత్యము కలదు. ఛందః ప్రస్తారమువలె వారు స్వరప్రస్తారమును తయారుచేసిరి. ఇది అపూర్వము. గ్రామఫోను రికార్డుల నిచ్చిరి. పొన్నూరులో నొక సంగీత కళాశాల నెలకొల్పుటకై ప్రయత్నించిరి.

ఢిల్లీలో జరుగు జార్జి పట్టాభిషేక మహోత్సవ సభలో పాట కచేరి చేయుటకై రెండువందలు విలువగల దుస్తులు కూడ తయారు చేయించిన రామసుబ్బయ్యకు మలేరియా జ్వరము వచ్చెను. పొన్నూరులో దొరకని ఫలములను, మందులను అభిమానులు మద్రాసు మొదలగు దూరప్రాంతములనుండి పంపసాగిరి. జ్వరము తగ్గలేదు. చివరకు మదరాసు జనరల్ హాస్పిటల్‌లో 1911వ సంవత్సరమున తన ఇరవైతొమ్మిదవ యేట రామసుబ్బయ్య భగవంతుని సాయుజ్యమును పొందిరి.

ఈ జీవిత చరిత్ర చివర "వారి జయములను కీర్తింపవలసిన కవితకు విషాదగీతికల నాలాపింపవలసిన దుస్థితి జనించినది. రామసుబ్బయ్యగారి సంగీతము విన్న చెవుల కింకొకరి సంగీతము జన్మజన్మలకు నచ్చదు." అని శాస్త్రిగారు తమ ఆవేదనను వ్యక్తమొనర్చిరి.

అనుబంధములు :

అనుబంధములలో 1899లో రామసుబ్బయ్యగారి పాట విని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు ఇట్లు ప్రశంసించిరి.

> మ్రింగునొ లేక ముక్కుకొని మిక్కిలి నొక్కునొ లేక మీదికిం
> జెంగున దాటునో యన గుచేష్ట లొనర్చెదు వారి పాటలే
> రంగుగ నుండుచో విన గరమ్ము గుతూహల మబ్బు రామసు
> బ్బంగజుపాట శ్రోతముల కర్ణలకున్ ముదమార జేయదే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరోక్ష అనుబంధముగా శ్రీ రామసుబ్బయ్యగారి నిర్యాణ సందర్భమున శాస్త్రిగారు వ్రాసిన పద్యములున్నవి. ఇవి ఆంధ్ర పత్రికలో ప్రకటితములు. నాటి సాహితీప్రియులెందరో ఈ పద్యములను కంఠస్థము చేసిరని శ్రీ గూడూరి నమశ్శివాయ గారు చెప్పిరి.* వీనిలోని పెక్కు పద్యములను శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారు అప్పగించిరి.** ఈ పద్య రచనా కాదమునకు శాస్త్రిగారి వయస్సు పదునేడేండ్లే. తుమ్మలవారప్పగించిన ఒక పద్యము —

> వెయ్యేండ్లన్నము నీరు లేక యడవిన్ వేంద్రమ్ముకున్ వానకున్
> వ్రయ్యల్కాఁగ శరీరముత్కట తపోవ్యాపారముల్ సల్పియున్
> వెయ్యూళ్ళం దిరుగాడియున్ మరియు వేవేలిచ్చియున్ రామ సు
> బ్బయ్యంబోలినవాని దే గలవె దౌర్భాగ్యంపు సంగీతమా!

శాస్త్రిగారు రామసుబ్బయ్యగారికంటె వయసున చిన్నవారు. అయినను వారిరువురు ప్రాణస్నేహితులు. రామసుబ్బయ్యగారితో స్నేహము శాస్త్రిగారికి సంగీతము జ్ఞానమును కల్గించి "శారదాదేవి ఉభయ పార్శ్వముల స్తన్యమారగ్రోలిన ధన్యునిగా చేసినది. ఈ జీవిత చరిత్ర రచన వలన శాస్త్రిగారు రామసుబ్బయ్యగారి ఋణమును కొంత తీర్చగలిగిరి. ఒక మహాపురుషుని జాతి మరువకుండ అక్షరాకృతి కల్పింపగలిగిన ఈ గ్రంథము రామసుబ్బయ్యగారికి సంబంధించిన సర్వసమాచారమును అందించును. తెలుగు విజ్ఞాన సర్వస్వమున నాల్గవ సంపుటిలో శాస్త్రిగారు రామసుబ్బయ్యగారిని గూర్చి వ్యాసము వ్రాసిరి. అద్భుత రసప్రవాహమై కరుణరసముతో ముగిసిన ఈ చరిత్ర సంగీత సాహిత్యాభిమానులందరకును హృదయముల నార్ద్రి మొనరించు రసతరంగము.

— ౦ —

---

* ముఖాముఖి (15-8-1984)

** ముఖాముఖి (3-6-1886)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రపంచము

ఇది పండ్రెండు అరటాపుల అసంపూర్ణవచన రచన. ప్రశ్నోత్తర రూపమున ఆధునికులకు వేదోపనిషత్సారాంశము సందించి భగవంతునియందు విశ్వాసము కలిగించుటయే ఈ కృతి ప్రయోజనము.

ఆధునికుడును సనాతనుడును మిత్రులు. ఆధునికుడు ప్రశ్నించుచుండగా సనాతనుడు సమాధానము చెప్పుచుండును. అంతటితో తృప్తిపడని ఆధునికుడు మఱియొక ప్రశ్నయడుగుచుండును. ఈ విధముగా సృష్టిక్రమమును గూర్చి, మానవజన్మ వైశిష్ట్యమును గూర్చి, పరలోకమును గూర్చి, దేవతాబాహుళ్యమును గూర్చి విగ్రహారాధనమును గూర్చి, దైవస్వరూపమును గూర్చి, మతమును గూర్చి, ఈశ్వరుని అస్తిత్వమును గూర్చి ఆధునికుడు ప్రశ్నించును. వానికి సనాతనుడిచ్చు సమాధానములు హృదయంగమములు. ఈ సమాధానములు తత్త్వజ్ఞులగు వారికి క్రొత్తవి కాకపోయినను జిజ్ఞాసువులకు ఉపయోగకరములు.

కొన్ని ప్రశ్నలు చమత్కారముగను మఱికొన్ని గంభీరముగను ఇంకొన్ని నిశితముగను కల్పితములై వీనికి సమాధానమెట్లుండునో అను ఉత్కంఠ చివరివరకు కలుగుచుండును.

ఆధునికుడు : ఒక కుటుంబముతోనే మానవుడు విచారపడుతున్నాడు గదా! ఇక జగత్కుటుంబీకుడు భగవంతుడు నిత్యానందమెట్లనుభవించుచున్నాడు ?

సనాతనుడు : ఇదియా? నీ సందేహము. తీర్చెదనులే వినుము. జీవసృష్టి ప్రదేశాంతరమందున్నప్పుడు దూరముగాను, స్థానమందున్నప్పుడు దగ్గరగాను నెడబాటు కలుగుట వలన తనకు వేరై విచారము కలిగించుచున్నది. ఈశ్వరుని సృష్టిలో తాను నిలచి చూడని చోటేలేదు. నిద్దురలేక సర్వకాలమును కనిపెట్టియే యున్నాడు. కాబట్టి సృష్టియెన్ని కోట్లైనను పరమేశ్వరుడు నిర్విచారుడై నిత్యానందము ననుభవించు చున్నాడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై కొంటె ప్రశ్నకు చక్కని సమాధానము వచ్చెను. సంయోగ వియోగములు లేనివానికి ఆనందము సంభవమని సూచింపబడెను.

సూటియైన ప్రశ్నకు చమత్కారమైన సమాధానము ఇట్లున్నది—

ప్రశ్న ॥ భగవంతుడు తానుండియును తండ్రి బిడ్డలకు బలె తన వలన బయలు దేరిన ప్రపంచమునకు తనముఖమేల చూపకున్నాడు?

సమా ॥ లోకములో గర్భస్థశిశువునకు మాతృముఖ సందర్శన మగుచున్నదా? అట్లే విశ్వగర్భములో నున్నంతవరకు విశ్వగర్భుని ముఖసందర్శనము కానేరదు.

కొన్నియెడల ప్రశ్నించిన వానిచేతనే సమాధానము చెప్పించు సమాధానములు నున్నవి.

ప్రశ్న ॥ మృద్దారు శిలామయములగు విగ్రహములందు లక్ష్యమెట్లు నిలచును?

సమా ॥ చనిపోయిన తల్లిదండ్రుల ప్రతిబింబములనే పూల బూజించు కొనుచుండ గడ్డిపరక మొదలు బ్రహ్మవరకు లోపల వెలుపల సంతత నిండియుండిన భగవంతునియందు లక్ష్యమేల కుదురదు ?

మతమనగా నేమి ? దానివలన ప్రజలకుపయోగమేమి?

దేవుడొక్కడెకదా ఇక వివిధములైన మతములెందుకు? బహు నామముల దేవుళ్ళెందుకు? మున్నగు ఆస్తికతమములగు ప్రశ్నలు, వానికి సునిశితములు సుదీర్ఘములునగు సమాధానములు, ప్రపంచము యొక్క స్వరూపము ఆధునికులకు తెలియజెప్పుచున్నవి.

వైదేశికములగు క్రైస్తవ, మహమ్మదీయ మతములను భారతీయములగు సర్వమతములను శాస్త్రిగారు అంగీకరించిరి. దేవుడొక్కడేయని చాటిచెప్పిరి. పాపపుణ్యములు స్వర్గనరకములు కలవని వక్కాణించిరి. పరోపకారమును ధార్మిక జీవనమును ప్రబోధించిరి.

సనాతనుడు చెప్పిన సమాధానములను ఆధునికుడు ఒక్కొక్కసారి ఒక్కొక్క విధముగా మెచ్చుకొనుచు అంగీకరించినట్లు చెప్పుట రచనాశిల్పము.

ప్రశ్నోత్తరరూపమునమున్న ఈ రచన నాటకశాస్త్రానుగుణము గాకపోవుటచే వచన రచనగానే భావించుట సమంజసము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్వీయ చరిత్ర

ఒక వ్యక్తి జీవిత ప్రమాణము అనేక కోణములలో సాగుచుండును. అతడు కేంద్రబిందువుగా చిన్నదో పెద్దదో ఒక వృత్తమేర్పడును. సామాజికముగా, రాజకీయముగా, సాహిత్యపరముగా, సాంప్రదాయికముగా, ఆధ్యాత్మికముగా, వైయక్తిక బాంధవ్య మైత్రి సంబద్ధముగా విస్తరించుకొని యుండు మహాపురుషుల జీవిత విశేషములు తరువాతి తరముల వారికి మార్గదర్శకములై అనంతమైన అనుభవము నందించును. కావున ఇట్టి రచనలు ప్రయోజనకరములే. ఒక వ్యక్తి చరిత్రను ఇతరులు వ్రాయునపుడు అతనికి సంబంధించిన సమాచారమంతయు సమగ్రముగా లభింపక ఆ చరిత్ర అసంపూర్ణముకావచ్చును. ఎవరి చరిత్రమును వారే వ్రాసికొన్నప్పుడు సంపూర్ణసమాచారము లభించుట కవకాశముండును. ఇట్టి స్వీయ చరిత్రలకు ఆంగ్లసాహిత్య ప్రభావమున మన సాహిత్యమున స్థానము లభించినది. అనేక ఆధునిక సాహిత్య ప్రక్రియలకు ఆద్యులైన శ్రీ కందుకూరి వీరేశలింగంగారు తెలుగులో మొట్టమొదట స్వీయచరిత్రను వ్రాసిరి. ఆ తరువాత వివిధ రంగములలో ప్రసిద్ధులైన అనేకులు స్వీయచరిత్రలను వెలువరించి ఆ శాఖను సమృద్ధమొనర్చిరి. 'ఘనకార్యములు చేసిన మహాపురుషులు పరులకు మార్గదర్శకములుగా నుండుటకై తమ చరిత్రలు తప్పక వ్రాయవలయును' అని చిలకమర్తివారు తమ స్వీయచరిత్ర అవతారికలో స్వీయచరిత్రల ఆవశ్యకమును వక్కాణించిరి.

ఆత్మప్రశంసలకు సాహిత్యమున ఎచ్చటను తావీయని శాస్త్రిగారు తన వ్యక్తిత్వమును లోకమునకు చూపుటకై ఆధునిక దృక్పథముతో ఆత్మకథను వ్రాయబూనుట అభినందనీయము.

ఈ స్వీయచరిత్రము శాస్త్రిగారి పదునైదవ సంవత్సరము వఱకుమాత్రమే నడచినది. వారి బాల్యము, వివాహము, కొంతవఱకు విద్యాభ్యాస విశేషములు దీనివలన తెలియుచున్నవి. ఆయా విశేషములన్నియు జీవితోల్లాసమున విపులముగా వివరింపబడినది.

ఈ చరిత్రవలన శాస్త్రిగారికి విద్యాభ్యాసము కంటె ముందుగానే కవితాశక్తి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లభించినట్లును రెడవతరగతిలోనే సమస్యాపూరణముచేసి పండితుల ఆశీస్సుల నందినట్లును, తెలియుచున్నది. వారిని బ్రదికించి సరస్వతి కందించిన పాతూరి సుబ్బమ్మగారి వాత్సల్యము లోకమునకు వెల్లడియైనది. ఆనాటి విద్యాభ్యాసక్లేశ మొక్కింత యెఱుగనైనది.

చరిత్ర రచనములోని వచనము నీరసముగా నుండుట సహజము. అయినను శాస్త్రిగారు ఒక కథను చెప్పుచున్నట్లు రసవంతముగా నిందు రచనముసాగించిరి. బాల్యమునందలి విషయములను కూడ స్పష్టముగా వ్రాయగల్గిరి. వారు ప్రత్తిపాడు నుండి పొన్నూరునకు సాగించిన ప్రయాణమునిట్లు చెప్పిరి-

'తరువాత మూడుగంటలకు బయలుదేరి పొన్నూరు గ్రామము సాయంకాలము సంధ్యారాగము పొడమి యంతరించు సమయమునకు చేరితిమి.'

పై వాక్యములోని సాయంకాల వర్ణనము పాఠకుని ఆలోచనకు పని కల్పించును. వారి జ్ఞాపకశక్తి ఆశ్చర్యము కల్గించును.

డబ్బు లెక్కువయడిగిన పూటకూళ్ళ పెద్దమ్మను గూర్చి-

'....పుణ్యమెఱుగని పూటకూళ్ళ పెద్దమ్మ మీ అబ్బాయి వంకాయకూర యెక్కువగా తినుచున్నాడు....'

పై వాక్యమున పూటకూళ్ళ పెద్దమ్మకు 'పుణ్యమెఱుగని'యను విశేషణమును చేర్చుటవలన ఆ సమాచారము చమత్కారభరితమాయెను.

పెద్దక్కగారు తనకు పాలిచ్చి బ్రదికించిన సన్నివేశమును కన్నులకు కట్టినట్లు కరుణరసభరితముగా నిట్లు తీర్చిరి.

'....కన్నులలో ప్రాణము బెట్టుకొని కొనయూపిరితో నున్న నన్ను జూచి జ్యేష్ఠుని దలంచుచు మిక్కిలి కనికరముతో నొడిజేర్చి నాకు గూడ కడుపునిండుగా పాలిచ్చి నిదురపుచ్చుచుండెడిదట. నాకు లోకజ్ఞానము కలిగిన వెంటనే నా జీవికకాధారమగు నీ గాథ విని తల్లి యయి స్తన్యమిచ్చుటను, ముఖాకారాదులయందు నామె యందు మా తల్లి సామ్యముండుటను నేను తల్లిగానే భావించితిని.'

ఇట్టి స్వీయచరిత్రము పూర్తియైయున్నచో నాటి సాహిత్య రంగములోని విశేషములు, శాస్త్రిగారి కవితా వికాసవిలాసములు, జీవితానుభవములు అక్షరబద్ధములై పరిశోధకులకుపకరించెడివి.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పంచమము
శతకరచనోల్లాసము

ఆంధ్ర సాహిత్య ప్రపంచమున శతక ప్రక్రియా సామ్రాజ్యము సువిశాలము. అది పుట్టినది సంస్కృత ప్రాకృతముల నుండియే యైనను పెరిగి పెద్దది యైనది తెనుగు నుడిలోనే. (దాదాపుగా శతకము వ్రాయని కవి లేడనిపించును) ఆకసములోని చుక్కలను లెక్కించుట ఎంతకష్టమో ఆంధ్రభాషలోని శతకములను అంకెలకు తెచ్చుట అంత కష్టము.

కవులు కవిత్వాభ్యాస కాలమున, కష్టసమయమున జీవిత చరమదశయందు తమ జీవునివేదనను అక్షరబద్ధమొనర్చుకొనుటకు శతక మెంతగానో తోడ్పడును. తన కష్టమును, ఆవేదనను, అనుభవమును ఎవరికో చెప్పికొనిన కాని మనస్సు తేలికపడదు. ఆ చెప్పెడివారు కవులు కావున అది కవిత్వాకృతి దాల్చును. కవి ఆత్మీయతకు శతకము నిర్మలాదర్శము.

శతక నియమ నిబంధనములు సుప్రసిద్ధములే. వస్తు వైవిధ్యమును బట్టి అనేక శాఖలేర్పడినను భక్తి శతకముల సంఖ్యయే బహుళము. వానిలోనే జ్ఞాన వైరాగ్యములును గోచరించును. నీతులు నెలకొనును. అధిక్షేపణలగుపించును.

శాస్త్రిగారు బాల్యయౌవనకౌమారవార్ధక దశలలో హేరంబ, సీతానగరహనుమత్, దుర్గామల్లేశ్వర, బాలకోటీశ్వర శతకములను రచించిరి. ఇవికాక సంఖ్యా నియమము తప్ప తక్కిన శతక లక్షణములు గల రచనలు కొన్ని యున్నవి. వానిని చాటూక్తి రత్నాకరమున పరిశీలించితిని. సంపూర్ణ శతకములిందు విమర్శింపబడును.

శాస్త్రిగారి శతకములు నాలుగును ముద్రితములయ్యును ఆంధ్రశతక సాహిత్యవికాస పరిశోధకుల దృష్టికి మూడు మాత్రమే చేరినవి. వానిలో బాలకోటీశ్వర శతకము నామమాత్రోక్తము. హేరంబ శతకమును గూర్చి—

"శతావధాని చల్లా పిచ్చయ్యశాస్త్రి తమగురువుగారొనర్చిన గణపతినవరాత్రి ఉత్సవముల సందర్భమున నొకనాటి లోపల (1953) ఈ శతకమును రచించెను. పార్వతీసుతుని పదసేవ కంటె వేరొండు భాగ్యమేమి కలదని కవి షోడశోపచార

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యుక్తముగ గణపతిని ప్రస్తుతించితిరి. తనకుగల భక్తి పారవశ్యమును చాటెను పిచ్చయ్యశాస్త్రిగారి శతకమున శబ్ద ప్రపంచమును గూర్చి చేసిన కల్పనము గమనింపదగినది. శబ్ద ప్రపంచము కవనపుదోట. కావ్యము జొంపము. ఈ పూదోటలో తిరిగి కావ్య పుష్పముల తిరిగెడు తుమ్మెదలకు చవిచూపెడివారు మాత్రమే ఉత్తమ కవులని కవి ఉత్తమకవి ప్రశంసగావించెను. నవనాగరికులలో రసికతా ధర్మము లోపించినదనియు, వారు కావ్య సౌరభమున నానందించలేరనియు కవి విమర్శించెను. ఈ శతకమున గణపతి ప్రభావము హృద్యముగ వర్ణింపబడినది.*

డా॥ గోపాలకృష్ణారావు పేర్కొన్నట్లు హేరంబ శతక రచనాకాలము 1952 కాదు. అది ముద్రణ సంవత్సరము. సుమారు 1912న నవరాత్రోత్సవ సందర్భమున విరచితము.

సీతానగర హనుమచ్ఛతకమును గూర్చి—

"అభినవ జయదేవ బిరుదాంకితులగు చల్లా పిచ్చయ్యశాస్త్రి ఆంజనేయుని అనుగ్రహమున కవితా శక్తి నొంది సీతానగరమున కొండలో వెలసిన వీరాంజనేయుని దర్శించి ఏకప్రాస నియమమున సీతానగర హనుమచ్ఛతకమును (1928) రచించెను.

...."అభినవ జయదేవ బిరుదమీ కవికి సార్థకముగ నున్నది. శాస్త్రిగారి పద్యరచన మధురమైనది. మనోహరములగు కల్పనలు, రూపకములు మున్నగు వానిచే ఈతని కవిత భక్తి పారమ్యమును వ్యక్తీకరించుచున్నది." **

అనంతమగు శతకవాఙ్మయ పరిశోధన సందర్భమున ఆమాత్రపు ప్రశంస చాలును. శతకవాఙ్మయ చరిత్రలో శాస్త్రిగారి స్థానము సుస్థిరము.

—: ౦ :—

* డా॥ కె. గోపాలకృష్ణారావు, ఆంధ్ర శతక సాహిత్య వికాసము. పుట 217–218.

** పుట. 223.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హేరంబశతకము

ఇది శాస్త్రిగారి తొలిశతకము. సుమారు పందొమ్మిదేండ్ల ప్రాయమున రచింపబడినది. **1953**లో తొలిసారి, **1966**లో మరియొకసారి ముద్రితము.

బ్రహ్మశ్రీ పాతూరి రామస్వామి శాస్త్రిగారు గణపతి నవరాత్రోత్సవములు చేయుచున్నప్పుడు వారి యొద్ద శిష్యులుగా నున్న పిచ్చయ్య శాస్త్రిగారు తమ రచనలు నిర్విఘ్నముగా కొనసాగుటకై సూర్యోదయమున ప్రారంభించి సాయంకాల పూజ కందింప లేఖనాశువులో నీ శతకమును పూజించి గణపతిస్వామి యెదుర పఠించిరి.

హేరంబస్తుతి, కుచేలోపాఖ్యానము, మాయావిలాసముల రచనతో శాస్త్రిగారి కవిత బాల్యమును దాటి హేరంబ శతకరచనా సమయమునకు ప్రౌఢతను, సమతను, తాత్త్వికతను సంపాదించినది. కావుననే ఈ శతకమునకు మహాపండితుల మెప్పులు లభించినవి. దీనిని గూర్చి జాగృతి పత్రిక (1960)లో నొక వ్యాసము వ్రాసిన కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు శాస్త్రిగారిని "సర్వకవితానిధి" యని కీర్తించిరి. శతకాంతర్గత బహువిధ తత్త్వ సౌందర్య రహస్యములను సోదాహరణముగా ప్రకటించిరి. రెండవ ముద్రణకు పీఠిక వ్రాసిన ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు "ఈ శతక మాశు కవితారూపమున వెల్వడినను పదప్రయోగ భావగాంభీర్యాదులందు ప్రౌఢమై మహాకవులాశువుగా చెప్పినను ఆలోచించి చెప్పినను కవిత ఆనందకందమై సహృదయుల హృదయములను ఆవర్జింపజాలుననుటకు సాక్ష్యమై అలరారుచున్నది" అని తీర్మానించిరి.

ఇందలి ఛందము కందము. "హేరంబా" యనునది మకుటము. పద్య సంఖ్య నికరముగా శతమానమే. ఇదియొక విశిష్టమైన పద్ధతిలో రచింపబడిన శతకము. స్థూలముగా భక్తిశతకముల విభాగములో చేరును. కాని కేవల భక్తిశతకము మాత్రము కాదు. ప్రపత్తి, గురు మహిమ, శబ్ద ప్రపంచవర్ణనము, లోకవర్తనము అను విషయ వైవిధ్యము గోచరించును.

విశ్వనాథవారన్నట్లు "విఘ్నేశ్వరుని సామాన్యముగా నుపాసించరు. కావ్యారంభమునందు తదారాధన చేయుటయేగాని ఆయనను ప్రధానోపాస్యదేవతగా ఆరాధించుటలేదు. కాని అట్టివారందందు కలరు". ఆంధ్రకవులలో గణపత్యుపాసకులు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అరుదనియే చెప్పవచ్చును. అట్లే గణపతి శతకములకూడ. విఘ్నేశ్వరుడనియు, గణపతియనియు తదధికార నామమును పేర్కొనుటయే ప్రసిద్ధము. హేరంబ నామము వానివలె కాక ప్రత్యేకమై, శుభకరమై, శౌర్యస్ఫోరకమై విరాజిల్లు చున్నది. *

ప్రపత్తి :

సర్వదేవతా స్వరూపమును హేరంబునియందు దర్శించి భజించుట ఇందలి అనన్య ప్రపత్తి విశేషము. హేరంబుడు సర్వదేవతారాధ్యుడు. అది గ్రంథారంభమున ఇట్లు చెప్పబడినది.

శ్రీకమలజాది దివిజా
నీకము సకలార్థముల వినేయత నెవనిం
దేకువ గొలిచి కృతార్థత
జేకొనిరో యతడవీవ శ్రీ హేరంబా!

శబ్ద ప్రపంచము :

కవి హేరంబునకు కవితాలోకమును గూర్చిన కల్పనను ఒక కథగా సుమారు ముప్పది పద్యములలో విన్పించును. ఈ కల్పన తన "ఉద్యాన" కావ్యములో చేసిన ఊహవంటిదే. దాని కన్న ఇది ముందు రచింపబడినదగుటచే దీని నుండియే అది రూపుకట్టియుండును అచ్చటి వర్ణవ్యవస్థ ఇట్లున్నది.

అచ్చటి వర్ణంబులు పొర
పొచ్చెము లేకుండ నేకముగ నొకమాటన్
మెచ్చున్ జెలగు నికేమన
వచ్చును తత్పదము దివ్య పద హేరంబా

పుష్పలావికల వర్ణన—

చంపకములు నుత్పలములు
నింపగ మది జుట్టి త్రోవనేగు బుధులకున్
కొంపోయి యిత్తురట ని
ష్కంపమ్ముగ బుష్పలావికలు హేరంబా

* హే + రబి—రంబి. శుభకరమైన శబ్దము చేయువాడు, శౌర్యగర్వముచే హే యని ధ్వని చేయువాడు అని ఆంధ్రశబ్ద రత్నాకరము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రబంధపుర వర్ణనలలో కన్పట్టు చాతుర్వర్ణ్య, పుష్పలావికా వర్ణనా సామగ్రిగా కవితా సామగ్రిని భావపురములలో ప్రత్యేక మొనర్చుట పై పద్యముల లోని చమత్కారము.

ఆయూరి మేడలకు ఏడంతస్సులకు మించిన అంతస్సులు కలవు. కాని అన్ని మేడలలోను ఒక కాంతయే తిరుగుచుండును. అందొక యుద్యానముకలదు. అది "ఎదకంటి"కి ఇంపొనరించును.

ఆ కవనపు పూదోటకు మే
ధా కాంతామణి యభిన్నతన్ సుకృతశ్రీ
రాకా చంద్రాననతో
రాకలు పోకలు నొనర్చురహి హేరంబా

కవిత్వమునకు మేధావిశేషముతోకల అభిన్నత ఇందు పేర్కొనపడినది. ఈ పద్యమును విశ్వనాథ వారిట్లు వ్యాఖ్యానించిరి.

"కవిత్వమునకు మేధాశక్తికి నభేదాధ్యవసాయ మీ పద్యమునందు చెప్ప బడినది. ఏతాదృక్ యథార్థ కవితా రహస్యజ్ఞత్వము కొలది మంది కుండును. ఊహలేని ఉప్పచప్పని కవులె పెక్కుమంది. అతని కవనమందు యూహయుం డును. లేకపోవును. మేధావిశేషము, భావనాసంపత్తి, విశేషపరిశీలనము లేనిచో కవనము కవనమే కాదన్న విషయము పలువురికి తెలియదు."

చిలుకలు, రాయంచలు, కోకిలలు, నెమళులు సరసగీతులు పాడగా కలకల మను ఆ పూపు దోట శోభనుగని ఎదద కరుగని వారెవ్వరో ? అట్టి తోటకు తన చిద్నారి చెలికత్తె దారి చూపుచుండగా తీరికగా ఆ కాంత విహారార్థమేగెను. అందామెకు రసాపగలు కన్పింపగా —

అంతస్తాపము తెల్లను
శాంతింపగ నందు మునిగి జలజేక్షణ వి
శ్రాంతి గని శుద్ధయయి యా
కాంతామణి కొంత సాగెగా హేరంబా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రసధ్వనికి కల్పన :

చనవు చెలి త్రోవ జూపగ
జనుచో నప్పూవు దోట సతికట చెవికిన్
వినిపించె నొక్క మధుర
ధ్వని ప్రాణము లైదు తృప్తిబడ హేరంబా

రసానందానుభవమిట్లున్నది.

చేతనము మఱచి యంతట
జేత యెదియు దోపకా పిశేషజ్ఞ కళా
న్వీతయగు చెలిమికత్తియ
పై తొరగెన్ మపుల వింతపడ హేరంబా

ఈ విధముగా నామె కావ్యములను పూల జొంపములలో కాలాతిక్రమమెన్నక విహరించి—

అమృతత్వమంది దేవ
త్వముతోడం దానె సేర దగి నూత్నముగా
కమలానన బ్రహ్మాదుల
ను మఱుగనట్టి పదమందెనున్ హేరంబా

ఇట్లు బ్రహ్మానందమే యనదగిన కావ్యరసానందమున మునిగి ఆమె తబ్బిబ్బులయ్యెను. ఆ రసానందమహిమ నీకు తెలియదా ? యని కవి హేరంబుని ప్రశ్నించును.

తన ప్రాణనాడి కెక్కిన
యనన్య మోదంబు నందు నమరిన జన మీ
తనువు సుఖము గానునే నీ
కును దెలియదె దాని రసము గుణీ హేరంబా

శారీరక సుఖముల కన్న కావ్యానందమెంత యున్నతమో పై పద్యమున స్పష్టము చేయబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ కల్పనకు ప్రయోజనమేమనగా—

ఇంతకు నీవోకలకు హృ
దంతర భావమ్ము వినుమయా ! యిదె సి
ద్ధాంతముగ భావరసజా
నంతముదం బెలుగ జేయుటయ హేరంబా

రసానందలహరీ మహిమను వర్ణించుటకే ఇట్లు కల్పింపబడినది.

లోకవర్తనము :

సమాజములోని, వ్యక్తులలోని, కాలములోని లోపములను ఎత్తి చూపుచు సున్నితముగా చురక లంటించిన పద్యము లిందుకొన్ని కలవు. ఈ ఆక్షేపణ శక్తిని గూర్చి విశ్వనాథ వారిట్లనిరి.

"తులువలైన వారిని అక్షేపించుటలో శతక భావములు కొన్ని యుండును. జీవుని యొక్క గడుసుదనము లౌకికమైనది సగముమించి ఆక్షేపణలో నుండును. ఈ ఆక్షేపణశక్తి తెలుగులో తిక్కన, నాచన, సోమన, కాసుల పురుషోత్తము ఈ ముప్వురు సమృద్ధిగా కలవారు. ఆ కోవలోనివారు శ్రీ పిచ్చయ్య శాస్త్రిగారు ....ఏ కవి రమ్యముగా నాక్షేపించగలడో ఆ కవికి ఆంధ్రాభాషా శక్తి యెక్కువ తెలియునని చెప్పవచ్చును."

కొన్ని పద్యములలోని శాస్త్రిగారి ఆక్షేపణ శక్తిని గుర్తింతము.

ఆధునిక పాఠకులను గూర్చి

నవనాగరికులు కావ్యపు
బువుతావిం గొనగలేరు బుద్ధిచనదునున్
ఎవియో పోకల బోదురు
కవనంబిక నేల చెప్పగా హేరంబా

ఆధునిక కవితను గూర్చి—

లక్షణము చూడ జూడగ
విక్షేపంబట యహో కవిత కటులగుచో
నేక్షణమున నెటులో నే
నక్షయమని కొలుతు గృష్ణునటు హేరంబా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవిశ్వాసమును గూర్చి

నమ్మరు శాస్త్రవచనముల
నమ్మరు గురు వాక్యములను నమ్మరు శ్రుతులె
ట్లిమ్ముగ చను కన్నయ్యన్
నమ్మెదరో వీరు కనరు నగి హేరంబా

మిడి మిడి వేదాంతులను గూర్చి

మిడి మిడి వేదాంతులు ప్రము
క్కడులై శృంగార రసము గెరలెద రెపుడుం
దడబడి దాని న్నడిపిం
చెడువాడున్ వాడుగాడె శ్రీహేరంబా

తత్త్వజ్ఞునకు శృంగార రసము నందును భగవత్తత్త్వము గోచరించుననియు దానికి భీతిచెంది దూషించవలసిన పనిలేదనియు సర్వ రసములు పరమేశ్వర విలాసములే అను వివేకము శాస్త్రిగారికి బాల్యము నందే అలవడుటచేతనే తరువాతి గీత గోవిందాది రచనలో శృంగారమును భగవదంకితముగా తీర్చిరి.

గురువు మహిమ :

ఈ శతకమున గురుభక్తి అధికమా? దైవభక్తి ఘనమా? అన్న ప్రశ్నకు గురుభక్తి యనియే సమాధానము చెప్పవలసి యుండును. గురురూపము దైవము నందు దైవరూపము గురునియందు దర్శింపబడెను. "శ్రీ శాస్త్రిలవారి ఈ గురుభక్తి చూసినప్పుడు కుమారసంభవమున నన్నెచోడుడు చూపినగురుభక్తి జ్ఞప్తికి వచ్చుచున్నది." అని దివాకర్ల వేంకటావధాని గారి మాట.

శతకారంభమున దైవస్తుతితోపాటు గురుదంపతుల స్తుతి–
గురుతమము నడచి మిక్కలి
కరుణను జ్ఞానామృతమ్ము గలిగించి ననున్
నిరతమ్ము నేలు గురు "బా
తురి రామ" బుధేంద్రు గొలుతు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మాయయ్య గురుని నెమ్మెయి
చాయను చదువరుల పాలిసౌరసురభి సు
శ్రీయిమ్మున్ బాయమ్మన్
మాయమ్మన్ గొల్తు సతము మది హేరంబా

ఇట్లు గురుదంపతులు మాతాపితరులుగా పూజింప బడిరి. దైవముకన్న గురువు, గురువుకన్న మాతృప్రేమ పారమ్యమును చూపిన గురుపత్ని శాస్త్రి గారికి అత్యంత భక్తి పాత్రమని చెప్పవచ్చును.

మఱికొన్ని సద్గురు లక్షణములు -

'కొండలు మాఱ్కొనినన్ గల
గుండు పడడు పరుల సొమ్ము గొన దూరక వా
క్కాండవ మొనరింపఁడు'

గురుస్తుతి కంటె గురుపత్నీ స్తుతి ఎక్కువ పద్యములైనది. ఎందు చేతననగా-

గురుకన్న నేను మఱుగులు
కరుణన్ మము సాకునట్టి కల్పలతన్ సు
స్థిరలక్ష్మి నుపాధ్యాయిని
స్మరియింతుం గొలుతు

ఆమె గురుకీర్తికి తావు. ఏ గడియ యందును విద్యార్థుల శుభముల నామె కోరుచుండును. నడిరేయి యందైనను అతిథులకు నలయక సరసాన్నములిడును. ఎన్నడును శుభలక్షణములను విడిచియుండదు. ఆమె నోట ఎప్పుడును శుభ వాక్కులే వెడలుచుండును. ఆమె లలిత విగ్రహమును చూచినచో కలహములు తొలగిపోవును.

నను గన్నతల్లి నెఱుగను
మును జిన్నతనాన లోపముగ నెంచెద దా
నిని మఱపించెన్ గురుసతి
చనదే తత్పూజ

కన్నతల్లి నెఱుగని లోపమును మఱపించిన ఆ తల్లి ఘనత ఇద్దరు తల్లుల ముద్దు బిడ్డనెఱుగకుండునా ?

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షోడశోపచారపూజ :

దైవమున కొనరించు ధ్యానావాహనాది షోడశోపచారముల ఆంతర్యమును, పరమార్థమును వ్యక్తము చేయుచు ఉపచార క్రమము ఇందు వర్ణింపబడినది.

వస్త్రప్రదానోపచారాంతరార్థము ధ్వనిమంతమై, వేదాంత విజ్ఞానమును వెదజల్లుచున్నది -

చినుగక మాయక సంతత
మును నిగ్గులుదేఱు వస్త్రములు మాకొసగం
జనువాడవనుచు నీమెయి
పొనుపుగ నర్పింతు వస్త్రములు హేరంబా

ఆ చినుగక మాయక నిగ్గులు దేఱెడు వస్త్రములు భక్తిజ్ఞాన వైరాగ్యములై యుండును. యజ్ఞోపవీతమేమి సూచించుననగా—

గుణముల మూడింట న్ని
ర్గుణడయ్యున్ మెలగుచుండు గురుతుగ భక్తిన్
గుణికుంజర! నీ కంఠం
బున జందెపు బ్రోగు లుంతు

ఇచట గుణ శబ్దము శ్లిష్టము.

దీపోపచార పరమార్థము హృద్యానవద్యము.

సకలోపాధుల లోపల
ప్రకటంబుగ వెలుగునట్టి పరమప్రభ యీ
వెకదా యని నాయిడు దీ
పకళిక జేకొనుము భద్రపద హేరంబా

ఇట్లు అన్ని ఉపచారములకు అద్భుతమైన వ్యాఖ్యానము చేయబడినది. ప్రదక్షిణోపచారమునకు వ్రాసిన ఈ క్రింది పద్యము విశ్వనాథవారి విపుల మైన వివరణకు పాత్రమైనది.

ఎన్నిమతమ్ముల దిరిగిన
నన్నియు నీయందె యన్వయంబగుటలు దె
ల్పన్నీచుట్టు ప్రదక్షిణ
సన్నాహము గూర్తు శంభుజా హేరంబా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'ప్రదక్షిణ సన్నాహము హేరంబునియందు సర్వమత సమన్వయమును కుదుర్చుచున్నదని దీని తాత్పర్యము.... మనము సర్వదేవతలకు ప్రదక్షిణింతుము. ప్రదక్షిణంచుట యనగా నొకసారి చుట్టు తిరిగి వచ్చుట. సున్నచుట్టుట వంటిది. సున్నయనగా పరిపూర్ణత. ఇది మన మత రహస్యము.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదుచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమే వావశిష్యతే

అన్న వేదములోని యర్థమే క్రియారూపమున ప్రదక్షిణమగుచున్నది. ప్రదక్షిణము చేసినంతనే తద్దేవతయందు సర్వ దేవతా భావారోపణము జరిగినది. ఏకాకారములో బుద్ధిభాసించినది. ఈ మహార్థము నిట్లు పద్యములో నిక్షేపించుట సర్వకవితా రహస్యజ్ఞత్వము.'

కవీనాంకవియై, విఘ్నహంతయై, కవిగా, వీరుడుగా పేరుపడిన హేరంబుని గాయకునిగాకూడ శాస్త్రిగారర్చించిరి. గానముపట్ల వారికి గల మక్కువ అట్టిది.

గానరసాంభోనిధి! యే
గానంబున నీకు దృప్తి కలుగున్ గండ
స్థాన గళద్దాన ఝరీ
పాన కృతానన మదాళిపా హేరంబా

వ్యాజస్తుత్యాది రూపములలో భక్తులు భగవంతు ననేక విధముల మాటలాడు చుందురు. దానిని శాస్త్రిగారిట్లు సమర్థించిరి.

చనవున నెంతటి మాటల
యిన నని యెదరయ్య భక్త లేపుమిగిలి వా
నిని సహియింపన్వలె నే
లినవాడవు గావున

వ్యాకరణ విశేషములు ;

ఈ శతకమున వ్యాకణదోషములకు తావేలేదు. నిర్దుష్టమైన, సమత కలిగిన ధారాశుద్ధి శోభితమైన ప్రౌఢశైలిని ఈ శతకమున మనము దర్శింపవచ్చును.

'బుద్ధి చనదునున్' అనుచోట వ్యతిరేక క్రియపై ద్రుతము వచ్చుట వ్యాకరణ శాస్త్ర సమ్మతము కాదుకాని వ్యావహారిక భాషా సిద్ధమైన సముచ్చయముతో

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కూడిన కాకువును [ఉదా: చనదున్నూ] గ్రాంథికీకరించి విశ్వనాథాది ఆధునిక మహాకవులు తఱచుగా ప్రయోగించిరి.*

'తలపుపువ్వు' 'ఎదకంటికి' 'మొవ్వపుబూలు' మొదలగు రమ్యమైన అచ్చిక సమాసములందముగా కూర్చబడినవి.

అలంకారములు ;

నీ వప్రక్రీడలు నీ
నా పెన్నును గొన్న విఘ్ననామక గిరులన్
వేవేగ జూపవే! యో
దేవా! యిట జాల బడలితిని హేరంబా

ఈ పద్యమున విఘ్నముల యందు గిరిత్వము నారోపించి వప్రక్రీడలు సలుపమనుటచే రూపకాలంకారమగుట స్పష్టము. ఇట్లు ఎన్నియో రూపకములు కలవు. ఈ శతకమును 'రూపకములపుట్ట' యనవచ్చును.

దైవభక్తికి, గురుభక్తికి, కల్పనకు, అధిక్షేపణకు, నిర్దుష్టతకు, ధర్మజ్ఞతకు, అనన్య విశ్వాసమునకు, విశిష్టవైదుష్యమునకు, రసానంద స్వరూప నిరూపణమునకు నిలయమైన ఈ శతకమును శాస్త్రిగారు ఇరువదియేండ్లు నిండకమునుపే రచించి సర్వ కవితా రహస్య నిధిగా విమర్శకులచే కీర్తింపబడుట అరుదైన విషయము. విశ్వనాథ వారన్నట్లు ' ఈ హేరంబ శతకము నిజముగా శతకము గాదు. ఇది ఈ కవి యొక్క కవితా దేవతా భావ సంపుటి. ఈ గ్రంథము వారి ఆత్మను సర్వదా ప్రతిపాదించుచున్నది.'

—0—

---

* 'గుండియ బట్టి లేదునున్' శ్రీమద్రామాయణ కల్పవృక్షము; అయోధ్య. పుట. 15 [చతుర్థ ముద్రణము]

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ సీతానగర హనుమచ్ఛతకము

ఇది విజయవాడ యొద్ద కృష్ణానది తటమున సీతానగర పర్వతముపై నెలకొనియున్న వీరాంజనేయస్వామిని గూర్చి రచింపబడినది. రచనాకాలము **1928** ప్రాంతము. తొలిముద్రణకు శ్రీ తమ్మన ఆంకమ్మ శ్రేష్ఠి **(1928)**, రెండవ ముద్రణకు శ్రీమతి శరణు వెంకట సుబ్బమాంబ **(1956)**, తృతీయ ముద్రణకు శ్రీ వరుకూరి శ్రీనివాసరావు **(1965)** ముద్రాపయితృత్వము వహించిరి.

ఈ శతక రచనకు ప్రేరణమును కవి ఇట్లు వివరించెను. 'నా యెడ కృపాదృష్టిని బాల్యమునందే కవితాధార యనుగ్రహించినది ఆంజనేయస్వామి యగుట నా మూర్తి వీరాంజనేయమూర్తిగా సీతానగరమునందు కొండలోయలో వెలసి మహాప్రభావము జూపుచుండుట విని చని సందర్శించితిని. వెంటనే యేకప్రాసతో ఈ సీతానగర హనుమచ్ఛతకమును రచించితిని.'

కేవల హనుమత్ శబ్దము మకుటముగా స్వీకరింపక క్షేత్రనామముతో కలిపి మకుటీకరించుట వలన ఈ క్షేత్రమాహాత్మ్యముపై కవికి గల నమ్మకము స్పష్టమగును.

ఇందు క్షేత్రచరిత్రము, హనుమత్ ప్రాశస్త్యము, లోకవిమర్శనము, హనుమత్కథలు, ఆస్తిక్యప్రచారము, కృతి కన్యా దాన విశేషములు అను అంశములను గుర్తించవచ్చును.

క్షేత్ర చరిత్రము ;

పర్వతముపై వెలసి పొదల మధ్య దాగియున్న స్వామిని బాలాజీ అను నతడు అభిగమ్యునిగా చేసిన వైనము ఇట్లు చెప్పబడినది.

సీతనువు గప్ప పొదలొగి
నాతతదీక్షం దళించి బ్రాజ్ఞుఁడు బాలా
జీ తెలియజేసె మార్గము
సీతానగరాంతరస్థ శ్రీ హనుమంతా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధునికకాలమున తమ్మన అంకమ్మ శ్రేష్ఠి అను భక్తుడు దేవాలయము నుద్ధరించెను.

రోతలుగల నీ తలమును
భూతలమై కుంతముగను బొనరించెనుగా
దా తమ్మన యంకమ
సీతానగరాంతరస్థ శ్రీ హనుమంతా!

ఈ క్షేత్రనామము సీతానగరమగుటచే స్వామి అవతరించుటకు కారణ మిట్లూహింపబడినది.

ఆ తల్లి జనకజాతన్
పాతివ్రత్యప్రపూత భక్తిం గొల్వన్
ప్రీతినిట నుదయమందితొ
సీతానగరాంతరస్థ శ్రీ హనుమంతా !

హనుమత్ ప్రాశస్త్యము :

హనుమదవతార ఘనత, తదారాధన ప్రాశస్త్యము ఈ శతకమున బాగుగా ప్రస్తరింపబడినవి. నామమహిమను గూర్చి —

భూత ప్రేత పిశాచ
వ్రాతమునకు గుండెదిగులు వందారుసుధా
స్రోతోవతి నీ నామము
చేతఃకమలము విచ్చున్
వీ తెంచున్ హాయిపయెర నెటి నీ ధ్యాన
ప్రాతః కాలమునందున్
ద్వైతాద్వైతవిశిష్టా
ద్వైతమతస్థులగు నెల్లవారలు భక్తిన్
ధ్యాతభవత్పదులగుదురు

వీరాంజనేయ రూపమిట్లు వర్ణితము —

ఆ తామ్రముఖముతో గ
దాతతహస్తంబుతోడ నాలీఢాంఘ్రిన్
భీతిం గొలిపెదరాతికి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లోకవిమర్శనము :

లోకమునందలి దుర్వాదములు, దురాచారములు; దుష్కృత్యములు అనియ తవర్తనము, విషయలోలత, వర్ణసాంకర్యము కాపట్యము, అన్యభాషా వ్యామోహము మొదలగునవి ఇందు ఖండింపబడినవి. ఈ పద్యములు శాస్త్రిగారికి గల ధార్మిక లోకాభిమానమును చాటుచున్నవి. అన్యభాషావ్యామోహమును గూర్చి —

ఏ తావున జూసిన గడు
గౌతుకమున నన్యభాష కై పున నున్నా
రో తండ్రి మతమెఱుంగను

కలికాలమును గూర్చి :

కైతవము కట్టుపుట్టము
వాతప్పుట పాయసాన్నభక్షణముద్రే
కాతిశయమె కళ ఈ కలి

ఆస్తిక్యప్రచారము :

నాస్తికభావములు, హేతువాదము, వేదనింద మొదలగు వానిని ఖండించుట ద్వారా ఇందు ఆస్తిక్యప్రచార మొనర్పబడెను.

వేదనిందకులనుగూర్చి —

గీతమువంటిది స్వరమేవ
రో తెల్వినిఁవ్రాసిరనుచు నుద్ధతులు త్రయీ
మాతన్ నిందింతురహో

హనుమత్కథలు :

ఎడనెడ హనుమంతునకు సంబంధించిన కథలు సూచింపబడినవి.

లంకాగమనము, రాయబారము, లంకాదహనము, సంజీవి పర్వతాహరణము, భీమాంజనేయ సంవాదము మొదలగు రామాయణ, భారత కథలతోపాటు అవాల్మీక మైన మైరావణ కథకూడ స్పృశింపబడినది. పట్టాభిషేకానంతర రత్నహార కథ కూడ చెప్పబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కృతికన్యాదానవిశేషములు :

ఈ శతకము హనుమంతునికే అంకితము. ఏతత్కృతి కన్యాదానసన్నివేశము చమత్కారముగా వర్ణింపబడినది.

ఎక్కువ కట్నమీయలేనని ఒకశతకము నర్పించుచున్నారు.

భూతల మాదిగ గట్నము
లీతటి నిడ జాల శతక మిత్తున్ గన్యా
దాత నని కరుణ జూడుము

చిన్నతనమగుటచే తప్పులు చేసినచో క్షమింపుమని వేడుచున్నారు.

లేతటిక మగుట నగు నె
న్నో తప్పుల సైపుమయ్య ! నోనాడకు మ
య్యా ! తీర్చుమయ్య ! కవితన్

నీతోపాటు రమ్యమైన ప్రదేశములకు విహారయాత్ర గైకొనిపొమ్మని కోరుచున్నారు.

పూతమహోన్నత రసతటి
నీ తీరము లందు భావనీరంధ్రవనిన్
నీతో ద్రిప్పుము దీనిన్

పై కృతికన్యాదాన పద్యములు కృతికిని, కన్యకును హృద్యముగా సమన్వయించును.

సంబోధనలు :

కేవలసంబోధనలతో గల కొన్ని పద్యములు కవీశ్వరుని భక్తి పారవశ్యమును దెల్పుచున్నవి.

భూతాంతరస్థ ! కవిధిష
ణాతామరసాంతరస్థ ! నగరగ్రామ
స్థా ! తాడేపలికృష్ణా

కొందరు పూర్వకవులవలె తమ కంద పద్యములను గూర్చి ఇట్లు చెప్పకొనిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కై తకుగందమ్ములు కవి
ధాతృనకందములు వాగ్లతాకందమ్ముల్
నా తీయని కందమ్ములు

తృతీయ ముద్రణకు పీఠిక వ్రాసిన శ్రీ దివాకర్ల వేంకటావధాని గారు పైపద్యము ఉదాహరించుచు,'.... అని వారు చెప్పకొనుటలో నతిశయోక్తి ఇసుమంతయు గానరాదు. అట్టి సుందర కందమ్ములలో వారు వాయునందనుని మహత్వపు జందములన్ని ఈ శతకమున వెల్లడి చేసియున్నారు', అని నిర్ణయించిరి.

భక్తిరమ్యము, భావగమ్యము విశ్వశ్రేయోనిదానము అగు నీ శతకము శాస్త్రిగారి ఆత్మీయతకు నెలవైన రతనాల పతకము.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ దుర్గామల్లేశ్వర శతకము

ఇది విజయవాడలోని దుర్గాపురమునందు శ్రీ బేతపూడి వీరశరభయ్య, శ్రీ పుచ్చా కోటయ్య, శ్రీమతి పోషిత కనకదుర్గాంబ గారలచే నిర్మింపబడిన దుర్గామల్లేశ్వరాలయాంతర్గత స్వామిని గూర్చి వ్రాయబడిన ఏకప్రాస శతకము. సుమారు 1946లో రచింపబడి 47లో ఆలయ ధర్మకర్తలచే ప్రప్రథమముగా ప్రకటింపబడినది. 1936లో ద్వితీయ ముద్రణ నందినది.

ఏతత్ రచనారంభ కారణమును రచయిత ఇట్లు వివరించెను.

"నేనొక సమయమున దుర్గామల్లేశ్వరాలయములు దుర్గాపురమునందపూర్వముగా నిర్మింపబడి యున్నవని విని, తద్దర్శనార్థము చని సంచరించితిని. వెంటనే "దుర్గామల్లేశ్వర" యను చూళికతో గొన్ని పద్యములు దుర్గామల్లేశ్వరులు రచియింప జేసిరి. వానిని తదాలయ ధర్మకర్తలందు బేతపూడి వీరరాఘవయ్యగారు విని, భగవత్ప్రేరణమునకు గడుంగడు సంతసపడి శతకముగా రచియింపుడని ప్రేరేపించిరి."

తరువాత శాస్త్రిగారీ శతకమును రచించి దేవీ శరన్నవరాత్రోత్సవములందు విద్వత్కవి సభామధ్యమున వినిపింపగా పదవిభాగ ప్రతిపదార్థ తాత్పర్యములతోకూడ ముద్రింపించిరి. ప్రథమ ముద్రణకు శతావధాని భమిడిపాటి అయ్యప్ప శాస్త్రిగారు "పండితాభిప్రాయమును" ద్వితీయ ముద్రణకు ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు "పీఠిక"ను సమకూర్చిరి.

శ్రీ దుర్గామల్లేశ్వర శతకము ప్రాచీన ధర్మములు బోధించుటలో నేమి నూతన భావములు ప్రోత్సహించుటలో నేమి మిక్కలి ప్రశంసనీయమై యున్నది........ ఇయ్యది పూర్వశతకములనుబోలి ధర్మవులను క్రొత్త శతకములను వలె నియమములను వెదజల్లుచున్నయది. సంస్కృత పదభూయిష్ఠమైనను తేటతెనుగువలె మిక్కలి రుచిని, ఆసక్తిని కలిగించుచున్నది. వేదములలోనివియు, శాస్త్రములలో నివియు బహువిషయములు మిక్కలి తేటతెల్లముగా విశదీకరింపబడినవి." అని అయ్యప్పశాస్త్రిగారి అభిప్రాయము.

"........ఇందు వారికి జ్యోతిర్మంత్రాగమ శాస్త్రములలో గల కూలంకష

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పరిచయము సర్వతోముఖముగా గోచరించుచున్నది. సమాసభూయిష్ఠములైన ఇందలి శార్దూలములు కొన్ని ధ్వని గంభీరములై శ్రీనాథుని పద్యములను తలపించుచున్నవి........" అని దివాకర్ల వేంకటావధాని గారి వివరణము.

పరమప్రౌఢమైన ఈ శతకమునందు "దుర్గామల్లేశ్వర సర్వదేవ పరివారా హారహీరాకృతీ" అనునది మకుటము. దుర్గాసమేతుడై సర్వదేవపరివేష్టితుడైన మల్లేశ్వరుడు రత్నహారమునందున్న మేలుమణివంటి వాడని ఇందు సంబోధింపబడినాడు. హీరము అనగా నాయకమణి. సంబోధనకు తగినట్లు ఆలయమునందున్న పరివార దేవతలందరు వర్ణింపబడిరి.

పరివారదేవతలు :

ఇందు క్షేత్రపాలకుడైన కాలభైరవుడు, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మణ్యుడు, గాయత్రి, సీతాసోదర సమేతుడైన రామచంద్రుడు, హనుమంతుడు, నవగ్రహములు, దత్తాత్రేయుడు, శంకరాచార్యులు, త్యాగరాజు, నంది సింహ వాహనములు వర్ణింపబడినవి. దుర్గామల్లేశ్వరస్వామి ఆలయమున పైన పేర్కొనబడిన దేవతాది విగ్రహములన్నియు ప్రతిష్ఠింపబడి యున్నవి. ఈ శతకమును పఠించినచో ఆ దేవాలయ స్వరూపము మనోనయన గోచరమగును.

క్షేత్రపాల వర్ణనము :

శ్రీ మించుల్గల నీపురిన్నలుగడన్ జేబూని ఖడ్గంబరి
స్తోమమ్ము న్విదళించి భైరవతనుజ్యోతుల్ప్రదీపింపగా
యామమ్ముల్కనిపెట్టు దిస్సమొుల దీవ్యత్క్షేత్రపాలుండు దు
ర్గామల్లేశ్వర సర్వ దేవపరివారా! హారహీరాకృతీ !

చతుర్వేదముల ప్రాముఖ్యము, ప్రాశస్త్యము ప్రయోజనము ప్రశంసింపబడినవి.

వేదాంగములైన శిక్ష, వ్యాకరణము, తర్కము, మీమాంస నిరుక్తము, జ్యోతిషము ఛందస్సుల ప్రశస్తి కలదు.

ఆలయ ధర్మకర్తలైన కోటయ్య, శరభయ్య, పోషిత కనకదుర్గాంబ గారల భక్తిప్రపత్తులు పదిపద్యములలో ప్రశంసితములు.

కామాద్యరిషడ్వర్గ విలాసము ఆరు పద్యములలో వర్ణితము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కాళిదాసు అభిజ్ఞాన శాంకుతలమున పేర్కొనిన ఈశ్వరుని అష్టతనువులు ఆరు పద్యములలో వర్ణింపబడినవి. తక్కిన రెండు సూర్యచంద్రులగుటచే నవ గ్రహ వర్ణనలలో అంతర్గతముకాగా పంచభూతములు, యజమాని ఇచ్చట వర్ణింప బడెను.

గోప్రశంస :

గోవుయొక్క మహిమ, గోసేవాఫలము, గోవు యొక్క పూజనీయతలు పది పద్యములందు హృదయంగమముగా వివరింపబడినవి.

ఈ ముల్లోకములందు నెన్నగను గోవే జీవరత్నంబు గో
వే మందారము గోవె మేలుసిరి గోవే భూమి సర్వస్వమం
చే ముమ్మాటువచింతు గట్టిగను ప్రమోయింతున్ యశోధక్క ....
తా మందల్ప్వనరించి గోవుల నమందానంద సాంద్రాత్ముడై
నేమంబొప్పగ మేత నీరు తఱులన్ నిండించుచున్ గాలి రా
నా మేరన్ విడియించుచుం గను దయాస్యందుండె ధన్యుండు ....

లోకోపదేశము :

భక్తిని పరమేశ్వరార్చనాసక్తిని పారలౌకిక దృష్టిని లోకమునకుపదేశించు చున్న పద్యములు కొన్ని కలవు. ధనము,బలము మొదలగు ఐహికశక్తులన్నియు పరమేశ్వరాంకితము కానిచో వ్యర్థములేనని వక్కాణింపబడెను. మానవుడు ఉన్నత స్థితిలోనున్నప్పుడే గర్వింపక జగత్క్షేమమునకై పాటుపడవలెనని చెప్పబడెను.

తామేల్పట్టున నున్నయప్పు డనుభూతంబైన దానిన్ జగ
త్క్షేమమ్ముం బొనరించు పొంటె సలుపంజెల్లున్ విచారింప నే
నే మేధానిధినన్న గర్వమగు నేనిన్నిల్వ దా పట్టు.........

చీమలు దోమలు గూడ పాల్గొను ఇంద్రియ భోగములలో మునిగితేలక పరమేశ్వరునిచేరు ఉపాయమునన్వేషింపవలెనని ఉపదేశింప బడెను. కుబేరుని వంటి సంపన్నుడైనను ఇంద్రునివలె పరిపూర్ణ భోగములననుభవించిన వాడైనను పరమేశ్వర మూర్తిని లోపల వెలుపల చూడనియెడల ముక్తుడు కాలేడని నిష్క ర్షింపబడెను.

దేవతలు స్తుతించుట సంస్కృతభాషయందును ఆంధ్రులు కొలుచు పద్ధతి అచ్చతెనుగునందును ఇట్లు వ్రాయబడినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నేమస్మిన్ వపుషస్సతీ హృదిఫణీ నేతానిశశ్శేఖరే
భీమం యస్య పురత్రయప్రహరణం భిల్లోऽ స్త్రిదానే చ యో
నౌమి స్వాత్మని పల్లికార్జునమహం తమ్మంత్రము జేజేలు....
ప్రామంజేయవె బత్తి నీ వయని బాబా పత్తిరిం బూలనే
నీ మై జల్లెద నిల్కడన్నిలువవే నెమ్మిన్ సతంబున్ మదిన్
నీ ముందే నెలకొందునంచు గొలుతుర్నిన్నాంధ్రులాసక్తి....

ఇంతేకాక పంచాక్షరీ, రుద్రాక్ష, భస్మము, పసుపు కుంకుమల ప్రభావములు కూడ ఇందు వర్ణింపబడినవి. రుద్రాక్షను గూర్చిన క్రింది పద్యము భక్తభావుకజన హృద్యము.

తామ్రసంబున గూలనీయదు శుభస్థానంబున న్నిల్పు సు
శ్రీ మేల్కొల్పు నదల్చు ఘాతభయమున్ శీఘ్రంబు భక్తి ప్రసూ
నామోదంబున గండుతేఁటి యగు రుద్రాక్షంబు భద్రాక్ష....

కన్నప్ప, మార్కండేయుడు మొదలగు భక్తుల కథలు కూడ స్మరింపబడెను. కేవల సంబోధనలతో రెండు పద్యములు విరచితములు.

ఇట్లు విషయవైవిధ్యముతో బహుదేవతాస్వరూప చిత్రణలతో సాగిన ఈ శతకము శతకప్రక్రియలో విలక్షణ ప్రయోగము. ఈ శతక రచన వలన దుర్గామల్లేశ్వర దేవాలయములు సాహిత్య జగత్తున శాశ్వతములై అక్షర రూపమున భక్తుల హృదయములలో నిరంతరము ప్రత్యక్షమగుననుట సత్యము.

"ఈ పద్యములన్నిటిని బఠించిన ఆ దేవాలయమును ప్రత్యక్షముగా జూడకున్నను అందలి సర్వ విగ్రహ సన్నివేశము బఠితల మనోనేత్రములకు సాక్షాత్కరించును. ఒక్కొక్క దేవతను వర్ణించునప్పుడు శ్రీ శాస్త్రిలవారాదేవత గుణ స్వరూపాదులను విశదముగా వివరించి తమకు సర్వదేవతలను గురించి గల విజ్ఞాన విశేషములను వెల్లడించియున్నారు" అని దివాకర్లవారి సమీక్ష.

వ్యుత్పత్తి సంపత్తి :

శాస్త్రిగారి వ్యుత్పన్నతకు ఈ శతకము ఆదర్శాయితము. జ్యౌతిష, మంత్ర సంగీత, వ్యాకరణ మీమాంసాది శాస్త్ర వైపధ్యము ఇందు సువ్యక్తము. ఆయా గ్రహముల విశిష్టతను పేర్కొనుచు నవగ్రహ వర్ణన చేసిన తావున జ్యౌతిషము షట్ శాస్త్ర వర్ణన సందర్భమున ఆ యాయి శాస్త్రములందుగల పరిచయము "ఐమా

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కారము దుర్గయందుగల అయ్యష్టాక్షరీసారమున్" మొదలగు పద్యములలో మంత్రశాస్త్రప్రవేశమును కానవచ్చుచున్నది. వేదశాస్త్రములను పరమేశ్వర రూపములుగా భావించి అర్చించుట ఈ శతకము నందలి విశేషము.

ఛందస్సు :

మకుట నియమము ననుసరించి ఇందలి పద్యములన్నియు శార్దూలములైనవి. అన్నిటియందును మకారమే ప్రాస. ఇట్లు ఏక ప్రాసముతో శతక రచన చేయుట ఛందస్సుపై, భాషపై, కవికి గల అధికారమును సూచించుచున్నది. ఛందోగమనము నిరాటంకమై శ్రీనాథాదుల ధారాశుద్ధిని తలపించు చున్నది.

వ్యాకరణము:

ఇందలి భాష నిర్దుష్టము. వాక్య నిర్మాణము ప్రౌఢము. సంస్కృతాంధ్ర వ్యాకరణములలో కవికి గల నిష్ణాతత్త్వము, నిష్ణాతత్వము ఇందు గోచరించెను. "యువరూపున్" అన్నచోట సాధ్య సమాసము 'యువన్' అనునది సంస్కృత రూపము దీనికి 'పడుచువాడు' అని అర్థము. భరతుని గూర్చి చెప్పుటకు సమర్థముగా అట్లుపయోగింపబడినది. యువశబ్దమునిట్లు తత్సమరూపమున వాడిన ప్రయోగము లరుదు.

'ప్రామిన్కుల్ రతనాలపేటి' అనుచోట షష్ఠీవిభక్తి లకారములోని అచ్చు లోపించుట ప్రౌఢ వ్యాకరణ సమ్మతము. జన్మ శబ్దమునకు అస్త్యర్థమున 'ణినిన్' ప్రత్యయము చేర్చి 'జన్మి' అను రూపమునుండి జీవులు అని అర్థము సంపాదించుట ప్రౌఢ చమత్కారము. నిద్రాణ, కుక్షింభర, గర్విష్ఠ మున్నగు శబ్దములు సంస్కృత వ్యాకరణ పారావార మందరత్వమునకు ఉదాహరణములు.

విషయ వైవిధ్యమును, వ్యుత్పత్తి మంధరత్వమును, భక్తిజ్ఞాన వైరాగ్య ప్రబోధకత్వమును పెనవైచుకొని ఏకాకృతి ధరించిన ఈ శతకము భక్తి శతకములలో విలక్షణము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ బాలకోటీశ్వర శతకము

ఇది శాస్త్రిగారు సుమారు అరువది సంవత్సరముల ప్రాయమున రచించిన శతకము. 1955లో తొలిసారి ముద్రితము. శ్రీ తలమంచి నాగలింగం అను నాయన తన తండ్రి శ్రీ తలమంచి బాలయ్యగారి జ్ఞాపకార్థము ముద్రింపించెను. రెండవ ముద్రణ 1966లో నయ్యెను. దానికి శ్రీ దివాకర్ల వేంకటావధాని గారి పీఠిక కూడ కలదు.

"బాలకోటీశ్వరా!" అనునది ఇందలి మకుటము. గుంటూరు జిల్లా ఇంటూరు గ్రామమునకు సమీపమునందున్న "దగ్గుమల్లి" అను ప్రాచీన నామమును "గోవాడ" అను వ్యావహారిక నామమును కలిగియున్న గ్రామమున వెలసి ఉత్సవాదులతో వైభవోపేతుడై యున్న శ్రీ బాలకోటీశ్వర స్వామినుద్దేశించి ఈ శతకము విరచితము.

అనుభవ సర్వస్వమును లోకపరిశీలనమును అక్షరీకరించుచు వార్థకమున వ్రాసిన శతకముల విలువ హెచ్చు. ధూర్జటి మహాకవి శ్రీకాళహస్తీశ్వరశతక మిట్టిదే. శాస్త్రిగారు జీవితమున, కవిత్వమున పరిణతి సాధించి పెద్ద వయస్సున వ్రాసిన ఈ శతకము పై శతకముల కోవలోకి చేరినదని పండితాభిప్రాయము.

"పదప్రయోగదృష్టితో జూచినను, భావగాంభీర్యము దృష్టితో జూచినను, పద్యరచనాశిల్పము దృష్టితో జూచినను, శ్రీ శాస్త్రులవారి బాలకోటీశ్వర శతక మత్యంత ప్రౌఢమై యలరారుచున్నది. . . . ఈ శతకము ధారాశుద్ధి శోభిత మును, ప్రౌఢతాపరిపక్వమునై 'శ్రీకాళహస్తీశ్వర' 'దాశరథీ' శతకములతో పోటీచేయుచున్నది.' అని దివాకర్లవారి నిర్ణయము.

"భక్తితోపాటు లోకస్వభావాన్ని వెల్లడించే రక్తిలో కూడా శాస్త్రులుగారు సమర్థులు అని ఇందులో కొన్ని పద్యాలు ఋజువుచేస్తూఉంటాయి.... ఈ శత కంలో కురంగాష్టకం అత్యద్భుతంగా నడిచింది. అపూర్వములైన భావాలు....' అని శ్రీయామిజాల పద్మనాభస్వామిగారు ఆంధ్రపత్రిక (29-12-57)లో సమీ క్షించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారి వైయక్తిక కష్టసుఖములు, వైరాగ్యభావములు, వివిధ విషయములకు సంబంధించిన లోకవృత్త విమర్శనము, ప్రగాఢమగు భావనాశక్తి ఈ శతకమునందు సమ్యక్పరివ్యాప్తములు. వారు రచించిన చివరి శతకము ఇదియే యగుట వలన వారి ఆత్మీయతా పరిపక్వతను వెల్లడించుటకు కూడ ఇది సమర్థము.

శ్రీలం గూర్పఁగ జాలు నీ చరణరాజీవంబుల న్నిల్ప గా
దే లీలాపరిపాటిలేక యొకచెట్టేఁ జేమయేలేక యా
భీలంబై చవుదూరు దగ్గుమలినా బెట్టైన బాహ్యంబు శ్రీ
భూ లీలాసతి చుక్కబొట్టగుట శంభూ! బాలకోటీశ్వరా!

తాత్త్వికములు:

శరీరముయొక్క అనిత్యత్వమును జగత్తుయొక్క మిథ్యాత్వమును, మానవజన్మయొక్క పరమార్థమును, స్మృతికి తెచ్చుచు మోక్షసాధనోపాయములు ఇందు బోధింపబడినవి.

నీవాడించెడు తోలుబొమ్మలు భవానీనాథ! చిత్రంబు లెం
తో వేడ్కంబయికేగు నొక్కపుడు క్రిందుంగూలు నట్టట్టునై
యేవో పోకల జూపు నొక్కపుడు తండ్రీ! యూరకే యుండు నీ
శా! విశ్వేశ! పలాశినాశక! యనీశా! బాలకోటీశ్వరా!

వైయక్తికములు :

సుదీర్ఘ మగు జీవితయాత్రలోని కష్టపరంపర వలన బడలి భగవంతునకు కవి చేసిన విన్నపములిందు కాననగును.

రావా? యంగదవెట్టివారికి జగద్రక్షామణీ! యంతనే
పోవా? నా తొలివ్రాలనౌ ఫలమదేమో కానియోదేవ! యే
దో వెన్నంటియ యుండునింతవటకో యుద్యద్దయా! యింక నే
నా విశ్రామము గూర్చి యేలుకొనుమయ్యా బాలకోటీశ్వరా!

వక్రోక్తులు :

శతకస్వామిని, ఆ స్వామినాధారము చేసుకొని లోకమును వ్యంగ్యముగా ఉక్తివక్రత్వముచే ఉత్పాదించుట ఇందు గనవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏ కొంపల్ తగముంప బోవుగద తండ్రీ నిల్పుటేకాని యిం
కే కల్లల్ తెగ బల్క బోవు గద స్వామీ! చూచుటే కాని యిం
కే కయ్యంబులకీవు బోవుగద శూలీ! యూరకే యేలయా ?
హా? కాలాంతకుండంద్రు నిన్ను నరులయ్యా! బాలకోటీశ్వరా!

లోకవిమర్శకములు :

సంఘమునందు నెలకొనియున్న లంచగొండితనము, కన్యాశుల్కము మొదలగు దురాచారములను, దైవదూషణము, నాస్తికవాదము, అలసత్వము మొదలగు వానిని మాత్రమే కాక వైదికమార్గ భిన్నమైన ఆధునిక సంస్కరణల పేరుతో వెలయుచున్న విధవా పునర్వివాహములు, వర్ణాశ్రమ ధర్మరాహిత్యము మొదలగు సిద్ధాంతములను నిశితముగా, నిర్భయముగా వాగస్త్రములతో ఖండించిరి. స్త్రీ పురుషులయందు విజృంభించుచున్న అధర్మదృష్టిని బహువిధములుగా నిరసించిరి. సత్యము, ధర్మము, పాతివ్రత్యము, కర్మణ్యత, పారమార్థికచింతన మొదలగు సద్గుణముల పునరుజ్జీవమునకై ఎలుగెత్తి ఘోషించిరి. సాంఘిక జీవనముపై కవికి గల అవగాహనము, అభిప్రాయములను ఈ శతకము పట్టి ఇచ్చినది.

కన్యాశుల్కమును గూర్చి—

అన్యాయమ్ముగ గన్నబిడ్డ సుఖమింతైన న్విచారింపకే
హైన్యంబుం దలపోయకే పరగతివ్యాసంగముల్ చేయకే
కన్యం గాటికి కాలుసాచు చెడుబక్కంగట్టెద ర్వేలకీ
కన్యాశుల్కము మానిపింపుమనలాక్షా! బాలకోటీశ్వరా !

లంచగొండితనమును గూర్చి :

ఈనాడౌయధికారులట్లు గిరిధన్వీ కోరగాబోవుగా
వేనూరారులు లంచమిచ్చుటకు నివ్వేడం బనేలేదుగా
నీ నామస్మరణంబు జేయుటకు దండ్రీ యేలొకో వీరహా
యీ నాల్కం గదలింప బోవరు మహాత్మా ! బాలకోటీశ్వరా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సహపంక్తి భోజనాదులవలన సంఘములో ఐకమత్యము సాధింపబడదనియు మానసిక పరిపక్వత వలన మాత్రమే అది సాధ్యమగుననియు ఇట్లు నిష్కర్షించిరి.

ఒక కూజాగలనీరుద్రావుచును నెంతోవేడ్క నేనాటి కా
యొక కంచాన భుజింతురో యపుడకాదో యైకమత్యంబటం
చకటా మ్రోగెదరైకమత్యమన నీయాభేదముల్లేక తా
మొకచే బుద్ధిని నుంటగాక యిటులౌనో బాలకోటీశ్వరా !

దుర్మార్గవర్తనులై పురుషాహంకారముతో భార్యలను బాధించు భర్తలను గూర్చి—

అల్లోలక్ష్మణ! యన్నమాత్రవిని రండా! యెవ్వడేవాడు నీ
యుల్లమ్మందున జొచ్చినాడు విటకాదో తొత్తయిట్లంచు మే
లిల్లాలిన్ బడగొట్టి తిట్టుచును దానేతొత్తునో కూడి పే
రిల్లున్ గుల్లలుసేయు దుర్మతుల గంటే బాలకోటీశ్వరా !

దారిద్ర్యము, ఆకలి బాధించుచున్నపుడు ధర్మవిచారమక్కరలేదను ఆధునిక అపసిద్ధాంతము ఇట్లు ఖండితము —

జ్యేష్ఠాదేవికి తాళలేక యెదియే జేయంగనౌ నంద్రు పా
పిష్ఠుల్ వీరలు పుణ్యపాపముల నద్దింగల్పి యా లేమికై
నిష్ఠన్ నాలుగు కొంగులున్ ముడిచి తండ్రీ! యెత్తగా రాదొ నల్
కాష్ఠల్ కద్పది నిండదో యిటులసల్పన్ బాలకోటీశ్వరా !

కల్పనాసుందరములు :

శతక ప్రక్రియయందు కావ్యత్వ సమగ్రత లేకపోయినను, వర్ణనలకు కల్పనలకు అంతగా ప్రాముఖ్యము లభింపకపోయినను భావుకుడైన కవి తన కల్పనాశిల్పమును ఈ ముక్తకములయందు సైతము వ్యక్తమొనర్చగలదు. నిర్వికారమగు భగవద్రూపమును, నిశ్చలమగు భక్తిని కూడ సమర్థుడగు కవి వస్తువులుగా చేసికొని కల్పనా చమత్కృతిమత్కృతులను వెలయింపగలడని శాస్త్రిగారిందు నిరూపించిరి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారి కల్పనాసామర్థ్యమునకు కురంగాష్టకము అచ్చపగు మచ్చుతునక. మనస్సును లేడిగా చేసి, దాని లక్షణములు వర్ణించి, పరమేశ్వరునకు సమర్పించుట ఇందలి విషయము. 'మనుస్సునందు కురంగత్వము నారోపించి వ్రాసిన యీ యెనిమిది పద్యములు భావమునందును నడకయందును గూడ మిక్కిలి రమ్యములై కవిగారి కవితా కౌశలమున కెత్తిన పతాకల వలె నలరారుచున్నది.' అని దివాకర్ల వారి వాక్కు.

ఏనీ నేలను బుట్టుటే మొదలుకాదే దీని బోషించుటల్
తానే పోకల బోవుచుండినను మోదన్నాకు జేరాక యెం
తేనిన్నర్మిలి జూచినానిపుడు నీ కే నిచ్చుచున్నానుగా
ఈ నా ముద్దు మనఃకురంగమును కామ్మీ! బాలకోటీశ్వరా!

నవీన కల్పనాసనాథములైన వర్ణనాసందర్భములు హృదయావర్జకములు. కైలాసమును గూర్చి-

ప్రాకుర్వెట్టని నందివాహనము, పైపైబోని రాయంచ, యీ
లోకానీకములాను శేషుతల దక్కల్ చిల్కురత్నంబు, త
న్నాకస్త్రీలకు నిల్వుటద్ద మొకచో దద్రాశియానవ్వునా
నీ కైలాసము మమ్ము బ్రోచునయ తండ్రీ! బాలకోటీశ్వరా!

ప్రపత్తిబోధకములు ;

వేదోక్తమైన ఉపాసనా విధానముతో నిండిన కర్మ మార్గమును, క్లిష్టమైన తత్త్వచింతనలతో కూడిన జ్ఞానమార్గమును మర్కటకిశోరన్యాయమున జీవునియందే ఎక్కువ బాధ్యతను నెలకొల్పుచున్నవి. భక్తిమార్గమున భగవంతునిదే భారము. ప్రపన్నుడైన భక్తుడు అనన్యముగా భగవంతునాశ్రయించుటయే చేయవలసిన పని. ఈ మార్గమున తిర్యక్కులు కూడ మోక్షమునంది యుండుట సిద్ధము. పరమభద్రమగు ఆ మార్గము యొక్క ఔన్నత్యమును గుర్తెరిగి పూర్వకవులవలెనే కవి అనన్యమగు ప్రపత్తి ఎట్లుండవలెనో సోదాహరణముగా నిట్లు పేర్కొనిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సుతులన్నమ్మను, నమ్మనీ నరుల, నీ చుట్టాలనేనమ్మ, నీ
హితులన్నమ్మను, నమ్మగేహముల, నీ యీ రిత్తభాగ్యంబులన్
పతులన్నమ్మను, నమ్మలోకముల త్వత్పాదద్వయీభక్తినే
గతిగానమ్మితి, నేమిచేసెదవొ? బక్కన్! బాలకోటీశ్వరా!

క్షేత్రసంబంధములు :

అప్రసిద్ధకుగ్రామమగు దగ్గుపల్లి [గోవాడ] శుద్ధ సాత్త్విక స్వరూపుడగు శివుడడుగు పెట్టుటచే సిరివీడుగా నైనదట. ఆ ఊరి శివుని పేరు బాలకోటీశ్వర స్వామి.

కోటప్పకొండపై నెలకొనియున్న కోటీశ్వరస్వామికి, ఈ స్వామికిభేదము తెలియుటకై 'బాల' శబ్దము విశేషణముగా చేరియుండవచ్చునను క్రింది అభిప్రాయము సమంజసము.

కొండం బెద్దలనాటినుండియును దా గోటీశ్వరఖ్యాతి, నా
క్కండుండెంగద తత్ప్రభావమునె వీకంజూపు చీదేవు డి
ట్లుండన్, భేదమెఱుంగకుందురని కాదో! బాలశబ్దమ్ము ముం
దుండం బిల్చుటయంద్రు కొందరటు శంభూ! బాలకోటీశ్వరా!

భక్తులు కట్టుకొని వచ్చు ప్రభలను వర్ణించిన విధము అత్యంత మనోహరము. అవి గోవాడ శివుని భక్తపాలన కళను గూర్చి దివిలో చర్చించుటకై పాతాళము నుండి యేగుచున్న ఆదిశేషుని పడగలవలె నున్నవని చెప్పుట అచుంబితమగు నూహ.

వైరాగ్యబోధకములు :

కాంతాకనకములపై కాంక్ష వదలినగాని కైవల్యసాధనకు ఏకాగ్రత కుదురదని ఆది శంకరులు. భర్తృహరి మొదలగు వారు తమ రచనలలో స్త్రీలపట్ల వైముఖ్యము కలుగునట్లు వైరాగ్యమును బోధించిరి. ఆయా సూక్తులలోని యాథార్థ్యము నెఱింగిన శాస్త్రిగారు తాము తమ శతకమున వైరాగ్యమును బోధింప దొరకొనిరి. తోలుబొమ్మలగు శరీరములను మంచిమంచి ఉపమానములతో పోల్చుకొని ఆనందించుటను ఇట్లు పరిహసించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మేనుల్ బంగరుతీవెలంట యికనో మృత్యుంజయా! మోవులన్
దేనెల్చిప్పిలునంట? వెంౘ్రుకలు మేల్నీలాలె యౌనంట: శం
భూ! నిక్కమ్ముగ నా యురోజములునున్ బూబంతులౌనంట! యే
మీ, నాయమ్మొకొ తోలుబొమ్మలివి స్వామీ! బాలకోటీశ్వరా!

ఇట్టిది భక్తిశతకమే అయ్యును జ్ఞానవైరాగ్యములను కూడ బోధించు చున్నది. నైతిక ప్రమాణములును, ధార్మిక భావములును ప్రబోధితములు. సాంఘిక దురాచారములను, తనకు నచ్చని సంస్కరణలను నిర్భయముగా విమర్శించి తనకుగల సామాజికావగాహనను కవి చాటుకొనెను.

ఇహమునకు సంబంధించిన సమ్యగ్జీవనమును పరమునకు సంబంధించిన పరమేశ్వరారాధనమును లోకమునకు బోధించు ఈ శతకము ఇహపరములకు నడుమ కవి నిర్మించిన కవితా సేతువు.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

షష్ఠము

హరికథా వాఙ్మయోల్లాసము

'హరికథ' ఆంధ్రసాహిత్యమునందొక ప్రక్రియగా నేడు గుర్తింపబడినది. ఈ ప్రక్రియ 19 శతాబ్దపు ఉత్తరార్థమున ఆంధ్రదేశమున కాలూనిను శ్రీ మదజ్జాడ ఆదిభట్ల నారాయణదాసుగారు రంగప్రవేశము చేసిన తరువాతనే దానికట్టి గుర్తింపు, పేరు ప్రతిష్ఠలు కలిగినవని చెప్పవచ్చును.*

దాసుగారికి పూర్వము హరిదాసులు అచ్చటచ్చటి కీర్తనలతో, సంస్కృతాంధ్ర పద్యములతో కథలనల్లుకొని గానము చేసియుండుటచే కాబోలు వానికి సాహిత్యగౌరవము లభింపలేదు. దాసుగారు తమ పాండిత్య ప్రకర్షతో ప్రౌఢ మార్గమున హరికథా రచనముచేసి ప్రచారమొనర్చుటతో 'హరికథ' సాహిత్య ప్రక్రియయైనది,** సాహిత్యముతోపాటు సంగీతమునందు ప్రవేశమున్న కవులు దాసుగారి ప్రభావముతో బహుళ సంఖ్యలో హరికథా రచనమొనర్చి ఆ ప్రక్రియను పరిపుష్ట మొనర్చిరి.

బాల్యమునందే సాహిత్య సంగీతములయందు ఆసక్తి యుదయించిన శాస్త్రి గారికి అప్పటికి ఆ రెండు కళల యందు కమనీయ తేజోమూర్తులై వెలుగొందు చున్న తిరుపతి వేంకట కవులు, నారాయణదాసుగారు ఏకలవ్యగురువులైరి. దాసు గారి సర్వతోముఖప్రజ్ఞకు ఆకర్షితులైన శాస్త్రిగారు గ్రంథ రచనలను హరికథతోనే ఆరంభించి అనేక హరికథలను రచించిరి. స్వయముగా గానము చేసిరి.

---

* శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ. నారాయణ దర్శనము, ఆంధ్ర విశ్వవిద్యాలయ పరిశోధన నిబంధము. పుట. 40

** 'తెలుగు హరికథా సర్వస్వము'ను రచనకు ఆంధ్ర విశ్వవిద్యాలయము ఆచార్య తూమాటి దొణప్పగారికి డి. లిట్., బిరుదమును ప్రసాదించినది.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

హరికథాస్వరూపము :

హరికథా ప్రక్రియను ఎందరో పండితులు, పరిశోధకులు, కథకులు బహు విధములుగా నిర్వచించిరి. ఆ నిర్వచనములన్నియు హరికథా ప్రదర్శన స్వరూప మును నిరూపించుచున్నవే కాని రచనా స్వరూపమును, సంప్రదాయమును సమగ్ర ముగా నిర్వచించుటకు సమర్థములు కాకున్నవి. అనేక నిర్వచనములను పరిశీలించి పైమాటగా శ్రీ గుండవరపు లక్ష్మీనారాయణ గారు తమ పరిశోధన నిబంధములో ఇచ్చిన నిర్వచనమిది —

'సంగీత సాహిత్యనృత్యాభినయవేత్తయగు కథకుడొకడె ఆహార్యశూన్యుడై బహుపాత్రాపరిపోషకుడై దృశ్యాంతర రహిత రంగస్థలముపై నైకవిధ చమత్కార ధోరణీయుత ఉపన్యాసైక మాత్రసాధనముతో కల్గించు రసస్ఫూర్తికి ఆకరమగు ప్రబంధ సదృశ ఆఖ్యాన గేయాత్మక దృశ్యరీతి హరికథ.*"

పై నిర్వచనమున 'ప్రబంధ సదృశ ఆఖ్యానగేయాత్మక' అనుచోట స్పష్టత తక్కువ. ఇందులో పద్యప్రసక్తియె లేదు.

ఆచార్య శ్రీ దోణప్పగారు రచించిన' తెలుగు హరికథా సర్వస్వం'లోని నిర్వచన మిట్లున్నది. ....

'హృద్య పద్యగేయాత్మకమై అనవద్య వచన రచనా భాసురమై సంగీత నృత్య కలా సమ్మిశ్రితమై ఉపవ్యాఖ్యానాది బృంహితమై పండిత పామర జన రంజకమైన విశిష్ట కలారూపమే హరికథ'.**

ఇందు రచనా విధానము నిరూపితము. ప్రక్క వాద్యముల ప్రసక్తి నిరు వురును మరచిరి.

హరికథా రచనమున ఉపయోగించునవి పద్యములు, గేయములు, వచనముల వీనిలో పద్యవచనములను గూర్చి చెప్పవలసినది ఏమియు లేదు కాని గేయముల విషయమున వివరణము అవసరము.

హరికథా ప్రక్రియకు ఆద్యులుగా చెప్పబడుచున్న మహారాష్ట్రుల ప్రభావ మున తెలుగు హరికథలో కొన్ని క్రొత్తగేయరీతులు చోటుచేసుకొనెను. వానిలో 'తోహర' అనునది ముఖ్యము. బహుళ వ్యాప్తము.

దాసుగారు మంజరి, నర్తకి, మట్టు అను గేయరీతులను క్రొత్తగా ప్రవేశ

* నారాయణ దర్శనము, పుట. 49.

** తెలుగు హరికథా సర్వస్వం, పుట. 73 - 74.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పెట్టిరట. * మంజరి, నర్తకి అనువానిలో పల్లవి, అనుపల్లవి యుండక చరణములే యుండునట.

పైని చెప్పినవే కాక కర్ణాటక సంగీతసంప్రదాయ సిద్ధములగు కీర్తనలు కూడ హరికథలలో నుండును.

హరికథ పాఠ్యకావ్యముకాక గేయకావ్యమగుటచే పద్య గేయ వచన రచనల యందు ఆపాత మాధుర్యము ఆవశ్యకము. శబ్దాలంకారములు శ్రోతలను సులభముగా ఆకర్షింపగలుగును కావున వానిని ఈ ప్రక్రియ యందు కొంచెము అధికముగా ఉపయోగింపవచ్చును. నాటకీయత, రూపచిత్రణము హరికథారచనమున అత్యావశ్యకములు. అంతయు నేక పాత్రాభి నయముగా నుండును.

శాస్త్రిగారి హరికథలు ;

శాస్త్రిగారి తొలి రచనమే హరికథ. అది కుచేలోపాఖ్యానము. అది మాత్రమే ముద్రితము.

శ్రీ మహాభారతము (అరణ్య, విరాట)
శ్రీ జగద్గురు శంకరాచార్య జననము
శ్రీ బోధేంద్ర సరస్వతీ స్వామి చరిత్ర
శ్రీ సావిత్రీ చరిత్ర
శ్రీ కన్నప్ప చరిత్ర
శ్రీ బ్రహ్మానంద తీర్థ చరిత్ర

పై వానిలో శ్రీ జగద్గురు శంకరాచార్య జననము, కన్నప్ప చరిత్ర తప్ప తక్కినవి అసంపూర్ణములు.

పై కథలలో కుచేలోపాఖ్యానము, శ్రీ మహాభారతము సావిత్రీ చరిత్ర భాగవత భారతోద్ధృతములు కాగా తక్కిన వన్నియు మహానుభావుల చరిత్రములు. వానిలో బోధేంద్ర సరస్వతీ స్వామి చరిత్ర, బ్రహ్మానంద తీర్థ చరిత్ర ఆధునికములు. శాస్త్రిగారు ఆ స్వాముల వారలను స్వయముగా దర్శించి, భావించి ఆయా అనుభూతులతో వ్రాసిన హరికథలు. జీవిత చరిత్రలను హరికథలుగా మలచు ప్రక్రియకు శాస్త్రిగారు ప్రాణము పోసినారనవచ్చును.

—o—

* నారాయణ దర్శనము, పుటలు. 61 - 62,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కుచేలోపాఖ్యానము

కుచేలోపాఖ్యానముభాగవతమున ఎంత ప్రసిద్ధమో, తెలుగు హరికథా వాఙ్మయమున అంత సుప్రసిద్ధము. కుచేలుని కథ హరికథా రూపమున పదుల సంఖ్యను దాటియుండునేమో. నారాయణ దాసుగారికి పూర్వము నుండి ఈ కథ హరికథగా చెప్పబడుచున్నది. *దాసుగారు కుచేల కథను 'శ్రీహరికథామృతము' అను సంస్కృత హరికథలో తృతీయ బిందువున గ్రథించిరి. **అటు తరువాత పలెందరో కుచేల చరిత్రమును హరికథగా వ్రాసిరి.

శాస్త్రిగారి కుచేలోపాఖ్యానము సుమారు 1912 ప్రాంతమున విరచితము. వేటపాలెం వాస్తవ్యులు కాపూరి సీతారామయ్యగారు ముద్రాపయిత. 1912లో ముద్రితము.

పోతనగారి కుచేలోపాఖ్యానమునకు యథాతథముగా వ్రాసిన హరికథ ఏదియు కానిరాదు. యక్షగాన సమ్మితమగు హరికథా ప్రవచనమున నాటకీయత ఆవశ్యకమగుటచే తదనుగుణమైన మార్పులనెన్నింటినో ఆ యా కవులు చేసిరి. అట్టి మార్పులు ప్రకృత కృతి యందును కలవు.

పోతన కుచేలుని నివాస స్థానమును పేర్కొనలేదు. దాసుగారు కాశీనగర మని చెప్పిరి. శాస్త్రిగారు పోతన ననుసరించిరి. పోతన కుచేలుని పిల్లల సంఖ్యను చెప్పలేదు. దాసుగారు ఏకాదశ సంఖ్యా నిర్ణయము చేసిరి. *** ఇతర రచయితలు ఇరువదియేడని వ్రాసిరి. **** శాస్త్రిగారు పోతన ననుసరించిరి. పోతన కుచేలుని భార్యకు పేరు పెట్టలేదు. దాసుగారును అంతే. శాస్త్రిగారును, ఇతరులును 'సుశీల' యని నామకరణము చేసిరి. పోతన కుచేల పత్నిచే చేయించిన దారిద్ర్య వర్ణనను అందఱును యథాశక్తిని విస్తరించిరి.

---

*. నారాయణ దర్శనము, పుట. 40.

** అందే, పుట. 103.

*** నారాయణ దర్శనము, పుట. 103.

**** కుచేలోపాఖ్యానము (హరికథ), బి. బాలాజీదాసు, 1940, కుడుకూరి సుబ్బారావు అండ్ సన్, బెజవాడ,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పోతనగారి కుచేలుడు భార్యబోధ విని అటుకుల మూటతో ద్వారకకు కాలినడకన బయలుదేరెను. దాసుగారి కుచేలుని కొఱకు ద్వారక నుండి రథము వచ్చెను. శాస్త్రిగారి కుచేలుడు పై ఇరువురను సమన్వయించుచు "సంతోషమ్మను తైలబండిపై సాగె బథశ్రమ లేకన్"

పోతనగారి కుచేలుడు నిరాతంకముగా కృష్ణుని చేరెను. దాసుగారి కుచేలునకు ఆ సమస్యయేలేదు; శాస్త్రిగారి కుచేలుడు దారిలో ఒక నదిని దాటలేక కృష్ణుని ప్రార్థించి క్షణములో ద్వారకలో నిల్చెను. ద్వారమునొద్ద ద్వారపాలకులు అడ్డుకొని లోనికి పోనీయలేదు. వారిని బ్రతిమలాడుకొని కృష్ణుని దర్శించెను.

పోతనగారు, దాసుగారు, ఇతర కవులు కుచేలుడు ఇంటికివచ్చి శ్రీహరి ధ్యానముతో సుఖము లనుభవించి మోక్షము నొందినట్లు వ్రాయగా, శాస్త్రిగారు సంపదలు కలిగినప్పుడు వానిని ఎట్లు సద్వినియోగము చేయవలెనో, సంయమనము చూపవలెనో కుచేలుడు భార్యకు బోధించినట్లు వ్రాసిరి.

తోహరలు :

శాస్త్రిగారి కుచేలోపాఖ్యానమున పద్యములు, వచనములుకాక గేయరూపములుగా తోహరలు మాత్రమే ఉన్నవి. కీర్తనలులేకుండ కేవలము తోహరలతోనే హరికథ నడపుట విలక్షణ ఫక్కియే. కుచేలోపాఖ్యాన రచనా కాలమునకు వారి వయస్సు సుమారు పదునేడేండ్లు. అప్పటికి వారికి సంగీతమునందు ఆసక్తియేకాని కీర్తనలు రచింపగలిగిన శక్తి యలవడి యుండదు. అందుచే పల్లవి, అనుపల్లవి, రాగతాళములు, ధాతుమాతువులు మొదలగు సంగీత సంభారములతో నంతగా పని లేని తోహరలతో కీర్తనల స్థానమును పూర్తిచేసి యుందురు. సావిత్రీ చరిత్రమునందును అన్నియు తోహరలేయున్నవి.

ఇందలి తోహరలు రెండు పాదముల నుండి పదునాలు పాదముల వఱకున్నవి. ప్రాసనియమము అనుష్ఠితము. అంత్య ప్రాస నియమము నియతముగా పాటింపబడలేదు. ద్రుతకాలపు నడక నిరాఘాటముగా సాగినది. అన్నియును తోహరలే అయ్యును తత్తద్రసానుగుణములై శ్రోతృజనచ్ఛేతోహరములై యొప్పారుచున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

రసపోషణము :

కరుణాది రసములిందు కమనీయముగా పోషింపబడెను.

కరుణము :

గుజ్జన గూడులకును నోచమన్నట్లు
మాతరో ! యని పయింబడెడివారు
అన్నమో రామచంద్రాయటంచను దొప్ప
చేబూచి అల్లరి సేయువారు
సంకటైనను మాకు సరిగాను పెట్టవే
జనని ! యంచును చేయి జాచువారు
గంజినీరును మాకు గఱవయ్యెనే తల్లి
రో ! యంచు గేకలు వేయువారు
నింకను మారాము సేయుచు నింట బొర్లి
గింతలను బెట్టువారు "గాగీ" యటంచు
రోదనము సేయువారు నైరో దయాత్మ
ఎట్లు వేగింతు వారితో నెల్లబ్రదుకు

వ్యంగ్యోక్తులతో కూడిన సున్నితమగు హాస్యమును ఈ క్రింది పద్యమున చూడనగును.

"క్రాపింగు గలవారి గని వీరు సన్యాసు
లని భిక్షబెట్టకే వనజహాక్షి !
గంజాయి బుబ్బల గని వీరు వేదాంతు
లని చెంత చేరకే అమలహృదయ !
కాషాయ వస్త్రముల్ గట్టి నంతనే యతీ
శ్వరులంచు మ్రొక్కకే చంచలాక్షి !
పొడవైన జడలతో జడదారి ననిరాగ
నర్ఘ్య పాద్యము లీయ కబ్జవదన !
ఎపుడు కృష్ణాయటంచు చక్రీయటంచు
మాధవా యంచు మధుమథనయంచు
చిత్తమాహరి పదసరసీరుహముల
జేర్చువారల నెప్డు పూజించు మబల

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉపదేశము :

సత్య దయాధర్మాదులను, సత్ప్రవర్తనను, భక్తి వేదాంతములను సంగీత సాహిత్యములతో మేళవించి సరసముగా నుపదేశించుటకే హరికథా ప్రక్రియ యుద్దిష్టము. ఇతిహాస పురాణాదుల ఆంతర్యమును సామాన్యులకు కూడ అర్థమగునట్లు చేయుటకు హరికథలు ఎంతగానో ఉపయోగ్యములు. ఇతివృత్తములు అందఱకు తెలిసినవే యైనను వాని నాధారముగాగొని ధర్మప్రబోధమునకు వీలుకల్పించుకొనుటయే కవి ప్రతిభకు నిదర్శనము

శాస్త్రిగారి కుచేలోపాఖ్యానము లోభము, ధనగర్వము మొదలగు దుర్గుణములను ఖండించినది. భక్తి జ్ఞాన వైరాగ్యముల నగ్గించినది. కుచేలుడు ద్వారక నుండి తిరిగి వచ్చిన తరువాత పోతన కాని, తదితరులు కాని చేయని జ్ఞానబోధను భార్యకు చేయును. సంపదల నెట్లు సద్వినియోగము చేయవలయునో సవివరముగా బోధించును. డబ్బును కూటబెట్టుట ఎన్ని చింతలకు దారితీయునో ఇట్లు వర్ణితము.

గడ్డినైన భుజించి కాని రూకగ నెంచి
　గుట్టవోసెడి వేళ కొద్ది చింత
అరయ బ్రహ్మభేద్యమా రీతి నింటిలో
　బాతిపెట్టుట యందు ప్రబల చింత
ప్రాణాంతమైన-ప్రయాణమ్ము వచ్చునో
　నా వేళ గల్గు కొండంత చింత
తుదకీ శరీరమ్ము తొలగు కాలమున నిం
　తింతన రాని దురంత చింత

ఇంత యేటికి భువిగల్గు చింత లెల్ల
గాంతరో ! యీ ధనమ్మందు గాదె యుంట
అట్టి ధనమేల గాల్పనే యిట్టి విపిన
భూమి దిన గూడదే కంద మూలములను

కాసులు, రూకలు ద్వాపరముననున్నవా ? వానిని పాతిపెట్టి దాచిపెట్టెడివారా ? అను ప్రశ్నలకు అతీతముగా శ్రోతలకు మంచిని బోధించుటయే హరికథల పరమార్థము. సంపదల ప్రయోజనము కుచేలునిచే ఇట్లు సందిష్టము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చండాలు(డైన నాయండ నీ వనిరాగ
గుప్పెడన్నము బెట్టు కువల యాక్షి !
చలి చీమనైన వాకిలిగాచి యున్నచో
బోషించు చుండు మపూర్వ చరిత !
ఎవరైన నిను జూడ నే తెంచుచో వారి
సవినయోక్తుల పూజ సల్పుమబల !
మన మాదిరే కదా ! యని భేద మెన్నక
భూతదయా బుద్ధి బూను మతివ !
మంచిపనులను జేయ యత్నించి విమల
భావమున బాటుపడు వారి భక్తి సత్క
రించుమీ ! పుణ్యకథ లాలించుమీ ! వి
రించి సన్నుతు నెప్డుధ్యానించు మాత్మ

అలంకారములు :

శ్రవణ ప్రధానములగుటచే హరికథల యందు శబ్దాలంకారములు రాణిం చును. స్తోత్ర వర్ణనాదులందవి యధికముగా శోభించును. కృష్ణస్తుతి సందర్భమున ముక్తపదగ్రస్త మిట్లు నియుక్తము.

శ్రీ భార్గవీ ధరిత్రీ హృచ్చకోరాబ్జ
అబ్జాక్ష ముని మానసాబ్జ వాస
వాసవాది సురాళి వంద్య పాదద్వయా z
ద్వయ పాలితానేక భక్త నికర
కర ధృత శంఖ చక్ర ఘనాభహత పంక
పంకజాప్త కులోద్భవ ఖగవాహ
వాహమందర శైల వర గోపికాలోల
లోల బాల విచేష్ట కాలకాల

అన్యదేశ్యములు :

శ్రోతలకు ఆపాతముగా నవగతము కావలయు ననియో, హరిదాసులు చెప్పుచున్నప్పుడు చమత్కారముగా నుండుననియో, శాస్త్రిగారు ఈ హరికథలో కొన్ని ఆంగ్లపదములను ప్రయోగించిరి. వానిలో కొన్ని కవి ప్రౌఢోక్తులు కాగా మరికొన్ని కవినిబద్ధ వక్తృ ప్రయుక్తములు నున్నవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"సంతోషమ్మను" త్రైలు "బండిపై సాగె"
"అని ప్రశ్నింపుచు దాని" కానసరు" నప్పుడె చెప్పుచు"
"ఐడియా" లన్ని "తపమందు నలరుగాదె"
"సబ్బు" * చే తోమి స్వచ్ఛపు నీటముంచు"
"క్రాపింగు" గలవారిగని"

పై వానిలో చివరి రెండును పాత్రలు పలికిన పలుకులు.

కుచేలోపాఖ్యాన రచనా కాలము నాటికే సంస్కృతమునందు కూడ శాస్త్రి గారికి ప్రౌఢ సుందర రచనా పాటవ మేర్పడినట్లు ఇందలి ప్రార్థన శ్లోకములు చాటుచున్నవి. ఈ గణేశస్తుతి వీక్షింపుడు.

భజామి గజముఖ సుజాది నుతపద
మజస్ర మహా మఘవ్రజ ప్రణాశమ్
కరీంద్రరిపు భాస్సురాపగాత్మజ
మురస్థ కింశుక విరాజితం తం॥

కుచేలోపాఖ్యాన శ్రవణ ప్రయోజనము హరికథాంతమున ఇట్లు చెప్ప బడెను.

హరికిన్ భక్తులపై గలట్టి దయ నా పై భక్తులా చక్రిపై
గురి నుంపందగు పద్ధతిన్ బిదప నే కోటీశ్వరుండైన దా
గరువం బించుకలేక శౌరి పదముల్ కాంక్షింప మేలంచు ని
ద్ది రహిన్ బోధనసేయు నీతిరస మెంతే జర్చజేయన్ బుధుల్

పై పద్యమున ప్రథమ పాదమున యతిభంగము.

కుచేలురు కనకమయచేలురై నప్పుడు కూడ భక్తిని, భూతదయను వీడ రాదను సందేశమును ఈ కథ నుండి అందించుట ప్రయోజనాత్మకమగు నవీన దృక్పథము.

— ం —

* "సబ్బు" దేశ్యమని శబ్దరత్నాకరము పేర్కొనెను. అది ఆంగ్లపద మగు "సోప్" శబ్దభవమని తదనుబంధమున అనుబంధకర్త శ్రీ నిడుదవోలు వేంకటరావుగారు పేర్కొనిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కన్నప్ప కథ

ఇది 'బోయకన్నప్ప కథ'గా శాస్త్రిగారు పేర్కొనిరి. దీనిని 'హరికథ' యని కాక 'హరకథ, యని కథాంతమున గద్యలో వ్రాసిరి. ఇరువది పావుతావు పుటలతో లభించిన ఈ హరకథ అముద్రితము. చివర కొన్ని పుటల నటనట పురుగులు కొట్టివేసినవి.

ఈ హరకథ ధూర్జటితో శాస్త్రిగారు చేసిన జంట కయిత. ఇందలి పద్యములు అధిక భాగము ధూర్జటివే. కీర్తనలను శాస్త్రిగారు రచించిరి. శ్రీ కాళహస్తీశ్వర మాహాత్మ్యములోని తిన్నని కథను సంక్షిప్తపఱచి హరకథా రూపమిచ్చిరి. అట్లు సంక్షిప్తీకరించుటలోను ధూర్జటి భావములకు అనుగుణముగా కీర్తనలను రచించుటలోను శాస్త్రిగారు నిపుణత చూపిరి. ప్రారంభమున తిన్నని కథలోని పరమార్థమిట్లు చెప్పబడెను.

శ్రీ విద్యా విభవాన్వయాదులను బర్చింపంగ బోకేప్పుడున్
సేవాదక్షత నన్యమున్ మఱచి పూన్కిం జూపు నేకాంత భ
క్త్యావేశమ్మునకుం గరంగి సుజనేష్టావాప్తి చేకూర్చు కా
శీవిశ్వేశుడు కాళహస్తిపతి రక్షించున్ జగజ్జాలముల్.

తిన్నని గ్రామమగు 'ఉడుమూరు'ను ధూర్జటి ఏడెనిమిది పద్యములలో వర్ణించెను. శాస్త్రిగారు తొలుత నొక కీర్తనను రచించి, ధూర్జటి పద్యములలో నొకదానిని దానివెనుక నుట్టంకించిరి. ఆ కీర్తన ఉడుమూరి చెంచులలోని అద్వైత భావనను, భక్తిని పట్టి ఇచ్చుచున్నది. శ్రీమన్నారాయణుని చెంచుల చుట్టఱికము కూడ ఇందు చమత్కారముగా చోటు చేసికొనెను.

వసంత - ఆది

ప॥ ఉడుమూరు నెన్న నెవ్వడు నేర్చు
ఉడుపతిమౌళి నే నూరింప నేర్చు
నెమ్మిపింఛపు గోక నెఱికటి జుట్టి
కొమ్ముగ విల్లనగ్రోవి చేబట్టి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సమ్మతి లక్ష్మీనృసింహు పాటలు
సహచరులందిచ్చెడు పల్లవితో
కమ్మగ బొల్లరగ బాడు చెంచుల
ముక్తికాంతనేని వలపింతురటన్ ॥ ఉడు ॥

మార్పులు !

తిన్నడు వేటలాడునపుడు కాళహస్తీశ్వర మాహాత్మ్యములో చూపని వైరాగ్యభావమును, జ్ఞానమును ఈ కథలో చూపెను. ఆ కీర్తన శ్రవణీయము.

ముఖారి - జంపె

ప॥ ఈవేటయేలా? లోవేట యాడవలె
ఈవిశ్వమునను; దా వీరుడై నందుకు ॥ ఈ ॥

అ॥ మనసనెడి యొరలోన, మరుగు జెందిన జ్ఞాన
మనుకత్తి సద్బోధ యనుకేలదీసి,

మి॥ కనరను వ్యాఘ్రంబున్, కాంక్షను సూకరమున్
గర్వపు మనుబోతున్, ఖండింపగ వలెగా ॥ ఈ ॥

పాత్రల నాధారము చేసికొని సమయోచితముగా భక్తిజ్ఞాన వైరాగ్యములను బోధించుటయే కదా హరికథా ప్రయోజనము.

తిన్నడు ఒకనాడు వేటలో అలసి పొగడచెట్టు క్రింద నిద్రింపగా శివగురువు కలలో కనపడి శివునిగూర్చి చెప్పినట్లును తిన్నడు వెంటనే మేల్కని ఒక అడవి పందిని తఱుముచు పోయి శివలింగమును గాంచినట్లును ధూర్జటి వ్రాసెను. ఈ కథలో తిన్ననికి కలవచ్చిన కొంతకాలమునకు ఒక పందిని వేటాడుచు పోగా అది అతనిని శివలింగముదాక కొనిపోయి అదృశ్యమైనట్లును, తిన్నడా పందిని గురు భావముతో స్తుతించినట్లును వ్రాయబడెను.

కథాంతమున శాస్త్రిగారొనర్చిన కల్పనమొకటి మనోహరము. శివుడు తన నిసర్గవేషముతో తిన్ననికి ప్రత్యక్షముకాగా ఆతడు అంగీకరింపక 'మా వంశము నిల్చిన ఆ నీ రూపము చూపు'మని యడుగును. అప్పుడు శివుడు-

జడలెల్ల నెమలిపించపు త్రాటిచుట్టగా
బిసరుహాహిత రేఖ పీకెగాగ........

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చెంచువేషమును దాల్చి 'హరవిలాసము'ను చూపెను. అంతేకాక 'నేను భుజించిన కాని భుజించని నియమము బూనితి గానన్ నీవు భుజింపక భుజింపని నియమము బూనితి నింకన్'

అని భక్తుననుగ్రహించెను. ఇదియును అమూలకమే. వీని వలన అనన్య చింతతో సర్వసమర్పణము చేసిన భక్తుల కొఱకు భగవంతుడు సర్వమును సమర్పించునను సందేశము శ్రోతలకు మరింత శక్తిమంతముగా నందింపబడెను.

సంక్షేప విక్షేపములు :

శ్రీకాళహస్తి మాహాత్మ్యములోని భావములకు కొన్నిటికి శాస్త్రిగారు కీర్తనలలో రమ్యమగు సంక్షేపణములు, విస్తరణలు పొనర్చిరి.

తిన్నడు శివుని ఉడుమూరికి రమ్మని ప్రార్థించు ఘట్టమున ధూర్జటి వ్రాసిన ఏడు పద్యముల భావము ఒక్క నాలుగు చరణముల కీర్తనలో సంక్షేపింపబడెను. దాదాపుగా ఆతని భావములన్నియు స్పృశింపబడెను. సంక్షిప్తీకరణమునకీ కీర్తన చక్కని యుదాహరణము—

రావె నాదు పల్లెకు. బిరాన జాలమెందుకు,
దేవర నా ప్రాణలింగ. దేవదేవ భయవిభంగ, వృషతురంగ ॥రావె॥
రకరకాల పండ్లుపాలు, రంగుల వెలలేని రాలు
సికను ముడువ తగిన పూలు, చెంచెతలును వేనవేలు
మి॥ సుకములు గలవెన్నియొ సరసులు కమ్మని తేనియలును,
ఇక నన్నేమాత్రంబును నలయింపక తడవుండక ॥ రావె ॥
అడరు కలుగజేయు । నట్టడవి కొండలోయలోన,
జడియ కొంటి నిట్టులేల । సరసనిల్లు కట్టినావా,
మి॥ కడలను కనబడరై రొక, కొడుకైనను కొమ్మైనను
పొడసూపవు నీకట్టిన ముల్లె మూటలేవైనను ॥ రావె ॥

ఒకే పద్యమును విస్తరించి ధూర్జటి యూహలతకు మారాకులు హత్తించుటను ఈ క్రింది కీర్తనలో గమనింపవచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఈ లింగములో ప్రాణము
కాలము కడదాక నొడగట్టిన దూలం
బై లంకె నుండ జేసితి,
నేలా తుందుడుకు పల్లె కేగుడు మీరల్

(శ్రీకాళ. తృ. ఆ.ప. 80)

అను పద్యమునకు కీర్తన-

ప॥ రాను పొందు చెలికాండ్రా, రవ్వ సేయు టేడ యీడ

అ॥ ప॥ యీ నా యిచ్చిన గుర్తును, నిండు నాదు తలిదండ్రికి

చ॥ సూది అయస్కాంతపట్లు, ప్రోది తీగె వృక్షము బలె
నాధునిం బతివ్రత వలె, నాదు హృదయ మీ శివునిన్

మి॥ బాదై యున్నదిదేమో పట్టీ లాగిన రాదిది.
మీదై పలుకకు డింకన్, మీరలు పల్లెకు పొందు ॥రాను॥

ధూర్జటి 'ఒడగట్టిన దూలము' నాధారము చేసికొని మూడు ఉపమానములతో ఈ కీర్తన విస్తరిల్లినది. శివుడు తిన్ననికి ప్రత్యక్షమగు సన్నివేశమున వ్రాసిన-

'తోచెను శంకరుడూ, లింగముననూ
పూచిన మల్లియ పువుమెయి'

అనెడు పల్లవి అతిరమణీయము. అమౌలిక మధురోహ. ఇట్టి మనోహర మగు 'బోయె కన్నప్పకథ'ను రచించుటయేకాక శాస్త్రిగారు స్వయముగా నీ హరకథను రేపల్లె మొదలగు తావుల గానముచేసిరి.*

—o—

* ప్రముఖాముఖి. శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ శంకరాచార్య జననము

సాక్షాత్ శంకరస్వరూపుడని జగముచే కొనియాడబడిన జగద్గురు శంకరా చార్య చరిత్రము సుప్రసిద్ధము. ఈ చరిత్రమును అనేకులు అనేక భాషలలో ననేక ప్రక్రియలలో కీర్తించిరి. అద్వైతానంద నిష్ఠులును; అధ్యాత్మభావనా గరిష్ఠులును అగు శాస్త్రిగారు కూడ శ్రీ భగవత్పాదుల చరిత్రను యథాశక్తి వ్రాసి తమ కవితాశక్తి యుక్తులను సార్థకమొనర్చుకొనిరి.

శంకరుని చరితమును వ్రాయుటకు సామాన్యమగు కవితాశక్తిచాలదు. శ్రుతి శిరస్సీమంతచింతామణి యననగు స్వామివారి చరిత్రమును లిఖించుటకు కవిత్వ వేదాంతముల యందు సమానాధికార మున్నప్పుడే యది రక్తికట్టును. ఈ రహస్యము నెఱిగియే శాస్త్రిగారు కథారంభమున ఇట్లు చెప్పిరి....

గురుడు సపస్తలోకములకుం గలిదుర్మత ఖండనార్థమై
నరుడయి నట్టి శంకరుడు నమ్రత గొల్చెదు శిష్యకోటికా
దరమునవాడు సంసృతినిదాఘము నార్చు ఘనుండు దండి శం
కరగురు డట్టిడుం బొగడికంగొన శక్యమె నాకలంతికిన్

శంకరాచార్య జననము ఎరకు మాత్రమే కల ఈ హరికథ ఇరువది పావు తావు పుటలలో వ్రాయబడెను. సంస్కృతాంధ్రకీర్తనలు, గద్యపద్యములతో పాటు ఇందు కళికలు రచితములు. తోహరలుండుట సర్వసామాన్యము. నారాయణదాసు గారు మంజరి, నర్తకి అనువానిని క్రొత్తగా ప్రవేశపెట్టిరి- అవికాక కళికలను రచించుట క్రొత్తపుంతయే.

ఇందలి కీర్తనలు ఆహ్లాదకరములగు అంత్యానుప్రాసలతో స్వామివారి భజ గోవింద శ్లోకముల పక్కలో పసుగులు పెట్టినవి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తొలికీర్తన :

శంకరగురు చరితం - శుభ భరితం
శ్రుతిగోచర సంచారం - సుందరపద విహారం
పతిత జనోద్ధారం శ్రీ - బ్రహ్మపదామృతసారం
సకల జనైరపి పీతం - సాధుబృంద సంగీతం
ప్రకటిత గుణసంఘాతం - బ్రహ్మాండతలే ప్ర ఖ్యాతం
దుర్మతఖండన చండం - దూరీకృత యమదండం

ఇందలి కథ శంకర విజయాదులాధారముగా సాగిపోయినది. అగ్రహార, గృహస్థ, సతీవర్ణనలను శాస్త్రిగారు తమ సహజధోరణిలో ఆదర్శవంతముగా నడపిరి.

'ఎందుగనిన విద్యార్థులె - ఎచటగనిన కృతార్థులే
అందఱును ననిరుద్ధులె - అందఱును సిద్ధార్థులే

మొదలగు రమ్యమైన భావములతో నాయావర్ణనలు సాగెను. శంకరాచార్యుల పితామహుడు విద్యాధిరాజు, తండ్రి శివగురువుల చరితములు విస్తరింపబడెను. శివగురుడు వైరాగ్యభావసంపన్నుడై వివాహమును తిరస్కరింపగా తండ్రి బ్రతిమ లాడినట్లు చెప్పబడెను.

తరువాత శివగురువు వివాహము చేసికొనుట, వారికి సంతానము కలుగ పోవుట, శివుని ప్రార్థించుట, అల్పాయుష్కుడగు ననల్పాశయుని పుత్రునిగా కోరుట, శివగురుని భార్యగర్భము దాల్చుట వరుసగా జరిగిన కథ. ఆమె గర్భవతిగా నున్నప్పుడు ఆమెకు కలిగిని కోర్కులు కడు మనోహరముగా తీర్చబడినవి -

'చంద్రాస్య తనచుట్టు జటలు సెప్పుచు మౌని
చంద్రులుండగ గోరు సంతతంబు
పద్మాక్షి తనపద్మపాదంబు లందున
పండితుల్ శిష్యులై పడగగోరు
శస్త్ర హస్త సమస్త శాస్త్రసారంబు హ
స్తామలకంబుగా నందగోరు
శుభలక్ష్మి దుర్మతాసువులూడ్చి విజయల
క్ష్మికి సూత్రధారణ జేయగోరు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కలికి వైరాగ్యమే నొక్క పలుకుచుండు
మౌనముద్ర వహించు సమత్వమరయు'

పై పద్యము శంకరాచార్య శిష్యులగు పద్మపాద, హస్తామలకుల నామము లను సూచించుట చమత్కారము.

శంకర జననము జరుగగానే కలిగిన ప్రతిస్పందనము లిట్లు వర్ణితములు-

'కొండ బండలు కూడ కురిసె హర్షాశ్రువుల్
దహను దర్భలను ప్రదక్షిణించె
ద్వైతి చేనున్న పుస్తకము నేలంబడె
నుపనిషత్కన్యల కూర్పుగలిగె
శ్రీవ్యాస హృదయరాజీవంబు వికసించె
సూత్రభారతి నుతి పాత్రమయ్యె
నాస్తికసంఘంబునకు నయోమయమయ్యె
ప్రకృతివాదుల గుండె బ్రద్దలయ్యె'

ఇట్టి మహోదయ కారణమగు శంకర జననమును శాస్త్రిగారు హరికథగా రచించి **1943** లో శంకర జయంత్యుత్సవములలో కొల్లూరు గ్రామమున గానము చేసినట్లు నాటి కరపత్రము వలన తెలియుచున్నది.

—○—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

బ్రహ్మానంద తీర్థ చరిత్ర

బ్రహ్మణ్యుడు మేధాజిత సుబ్రహ్మణ్యుడు బహుళ తపస్సంపన్నుడునగు బ్రహ్మానంద తీర్థ స్వాములవారి పవిత్ర జీవిత చరిత్రమును శాస్త్రిగారు హరికథగా నిబంధించిరి. బహుప్రాంతముల సంచరించి గుంటూరుజిల్లా బాపట్లలో స్థిరనివాస మేర్పరచుకొనిన శ్రీ స్వాములవారు శాస్త్రిగారికి సమకాలికులే. స్వామివారి ఆధ్యాత్మిక ప్రతిభా ప్రభావములను స్వయముగా దర్శించి అనుగ్రహీతులై తదనుభూతి సర్వస్వముతో సజీవముగా మధురాతి మధురముగా రచించిన హరికథ ఇది.

స్వాములవారు సర్వసంగపరిత్యాగులయ్యును శాస్త్రసాహిత్య గోష్ఠులయందు మక్కువ వీడనివారగుటచే నాటి కవి పండిత శ్రేష్ఠులెందరో వారిని పరివేష్టించి యుండెడివారు. అట్టివారిలో సర్వశ్రీ అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు, కంభముపాటి సింగయ్యగారు, వేమూరి నరసింహశాస్త్రిగారు, మల్లాది హనుమచ్ఛాస్త్రిగారు, చల్లా పిచ్చయ్యశాస్త్రిగారు మొదలైనవారు ప్రముఖులు. శ్రీ స్వామివారు బాపట్లలో శంకర విద్యాలయము పేర నొక వేదశాస్త్ర పాఠశాలను, సంస్కృత గ్రంథాలయమును నెలకొల్పిరి. భక్తసులభులై అనేక మహిమలను చూపి బోధలొనర్చి బాపట్ల ప్రాంతమును జ్ఞానసాగరమున ముంచెత్తిరి.

అట్టి స్వామివారి చరిత్రపై శ్రోతలకు ఆసక్తియుండుట సహజము. స్వామివారి ఆశీస్సులను బడసిన శాస్త్రిగారు ఈ చరిత్రమును హరికథగా వ్రాయుట శ్రోతల అదృష్టము. మధురమైన కీర్తనలతో మంజుల శ్లోకములతో అనుభూతి మంధరములగు పద్యబంధములతో ఈ హరికథ బ్రహ్మానందతీర్థమై ఒప్పను.

సుమారు అరువదియైదు పావుఠావు పుటలలో లభించిన ఈ పెద్ద హరికథ అసంపూర్ణముగానే యున్నది. ప్రారంభకథాభాగమున్న పుటలు లేవు. చివర ముగింపును సూచించు మంగళాదికములును లేవు. లభించిన పుటలు కూడ పెళుసెక్కి విరిగిపోవుచున్నవి. కొన్ని తావుల అక్షరనష్టమును సంభవించినది. స్వామివారి కాశీయాత్రయే హరికథలోని చివరియంశము. అచ్చట—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చనె గాశికి చాతుర్మాస్యవ్రత
మని గురుయతిరాణ్మౌళి
తనతో వెడలెడు వారల నాగుచు
తగజెప్పచు బ్రతిమాలి

అను తోహరలో స్వాములవారు తనవెంట వచ్చెడివారిని నిరోధించినట్లు పేర్కొనబడుటచే స్వామివారు కాశిలో సిద్ధిపొందిరేమోయని ఊహింపవలసి యున్నది. దీనినిబట్టి స్వాములవారు సిద్ధిపొందిన తరువాతనే ఈ హరికథ ముగింపబడెనని చెప్పవచ్చును. దీని రచనాకాలము 1925 ప్రాంతము కావచ్చును.

కథ :

మహారాష్ట్ర దేశమున శ్రోత్రియ కుటుంబములు గల ఒక అగ్రహారమున విష్ణుభట్టు అనెడి వేదపండితుడు కలడు. ఆయనకు సుగుణవతి అనుకూలవతి అయిన ఇల్లాలున్నది. ఆ దంపతులు సంతానకాంక్షతో తీర్థయాత్రలు చేయగా ఈశ్వరుడు వారి గర్భమున పుత్రుడై జన్మించెను. తల్లిదండ్రు లానందముతో ఆ బాలునకు "గణపతి" అని నామకరణము చేసిరి. గణపతి చిన్నతనము నుండి మిక్కిలి చురుకైనవాడు. సుగుణగణవసతియైన ఆ గణపతికి గర్భాష్టమంబున ఉపనయనమాయెను. అతడొకనాడు తల్లియొద్దకుచేరి "అమ్మా! నాకేదో భయముగా నున్నది. ఈ భయము ఎట్లుపోవునని ఆమెను ప్రశ్నించెను. ఆమె దత్తభజన చేసినచో భయము పోవునని చెప్పెను. నాటినుండి ఆ బాలగణపతి పరమభక్తుడై దేవాలయములయందు, చత్వరములందు పరవశుడై సంకీర్తనము చేయసాగెను. ఇట్లుండగా ఒకసారి తల్లిదండ్రులు పిల్లలను విడచి ఏదియో వివాహమున కేగిరి. ప్లేగువ్యాధి సోకి గణపతి సోదరులందరును మరణింపగా అతడు గుండె నిబ్బరముతో వారందరికి సంస్కారమును సలిపి వైరాగ్యభావ ముదయింపగా దత్తేశ్వరుని దర్శింపవలెనన్న కోరికతో వెండి మొలత్రాటిని తాకట్టుపెట్టి నాలుగు రూపాయలను చేతపట్టుకొని "నరసోబావాడి" మార్గమును పట్టెను. అచట కృష్ణానదిని దర్శించి స్తుతించెను. అంతట "నృసింహవాడి"కి చేరి దత్తేశ్వరాలయములో దత్తప్రభువును దర్శించి స్తుతించెను. గణపతి తల్లిదండ్రులు ఒక్కగానొక్క కుమారునికై వెదకి వెదకి ఎటులో తెలిసికొని బ్రతిమాలి ఇంటికి తీసికొని వచ్చిరి. తల్లిదండ్రుల తృప్తికై అట్లింటికి వచ్చిన గణపతి మరల తపోనిష్ఠకై హిమాలయ పర్వతముల కేగెను. దారిలో గంగను దాటునపుడు సుంకమునకై పడవ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వారు నిర్బంధించుచుండగా మైలపడనున్న పంచాయతన సంపుటము నదిలో పడ వైచెను. అనేక దుర్గమారణ్యములు గడచి హిమాలయములకు చేరెను. అట కొంతకాలము నిశ్చలమైన తపము సాగించి సిద్ధుడై లోకోద్ధరణకై మరల వెను దిరిగి వచ్చుచుండగా మహారణ్యమధ్యమమున ఒక దొంగ అడ్డగించి తమ నాయకుని వద్దకు తీసుకొని పోయెను. గూఢచారి అను అనుమానముతో అతడు చంపుటకు ఆజ్ఞ ఇచ్చెను. కాని ఆ చంపెడు వానికి చేతులాడలేదు. కత్తి జారిపోయెను. జ్ఞానోదయమాయెను. మార్గవశమున గణపతి స్వగ్రామముచేరి తల్లికి ప్రదక్షిణ మొనర్చి అనుజ్ఞ ఇమ్మని ప్రార్థించెను. అమె కుమారుని గుర్తింపలేదు. గణపతి విషయము నెరిగించి అటనుండి బయలుదేరి నర్మదా నదియొడ్డున గల గరుడేశ్వరమున వాసుదేవ సరస్వతీ స్వామివారి ఆశ్రమమునకు చేరెను. ఆ స్వామి వారిని స్తుతించి కొంతకాలము శుశ్రూష చేయగా వారు గణపతికి దత్తాత్రేయ మంత్రోపదేశ మొనర్చిరి. తన్మంత్రానుష్ఠాన ప్రభావమున అతనివర్చస్సు ద్విగుణిత మయ్యెను. నీవు దర్శన మీయనిచో ప్రాణములను విడిచెదనని గణపతి ప్రార్థింపగా దత్తాత్రేయుడు ప్రత్యక్షమై ఆశీర్వదించెను. ఇట్లు కృతకృత్యుడైన శిష్యుం గని శ్రీవాసుదేవానంద సరస్వతీ స్వామి "గణపతీ! ఇక శృంగేరీ జగద్గురు నృసింహ భారతీ స్వామివారి సన్నిధిం జేరు" మని యాజ్ఞాపింప గుర్వనుజ్ఞ వడసి అతడు శృంగేరి చంద్రమౌళీశ్వరుని స్తుతించి జగద్గురువుల వాత్సల్యమునకు పాత్రుడాయెను. మత శిష్యుల మాత్సర్యమును వదలించుటకై అప్పటికి రామశబ్ద మైనను రాని గణపతిచే హస్తమస్తక సంయోగమున జగద్గురువులు భాష్యపాఠము చెప్పించిరి. అంతట జగద్గురువుల ఉపదేశబలమున గణపతికి అఖండ పాండిత్య మబ్బెను. స్వాములవారు సన్న్యాసమున కనుజ్ఞ ఇచ్చి ఆనందానంద తీర్థులను మహారాష్ట్రి సన్న్యాసిచే ఆశ్రమము నిప్పించిరి. బ్రహ్మానందతీర్థ నామము ననుగ్రహించిరి. సంప్రదాయ సిద్ధముగా భాష్యాదులను బోధించిరి. నిర్వికల్ప సమాధి కలుగు మార్గము నుపదేశించిరి. దానితో బ్రహ్మానందతీర్థులకు ఒడలు తెలియని స్థితి యేర్పడెను. అప్పుడు జగద్గురువులు చంద్రమౌళీశ్వరుని ప్రార్థించి శిష్యునకు స్మృతి తెప్పించిరి. కొంతకాలమునకు జగద్గురువులు సిద్ధిపొందిరి. వారి స్థానమున శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి పీఠాధిపతులు కాగా వారి యాజ్ఞ ననుసరించి బ్రహ్మానందతీర్థులు కొంతకాలము శంకరాచార్య జన్మస్థానమగు "కాలడి"లో నివసించిరి. అటనుండి దేశయాత్ర చేయుచు తిరుమలలో శ్రీ వెంకటేశ్వరుని సేవించి నెల్లూరునకుచేరి మహాయోగియైన నిత్యానందస్వామితో కొంతకాల మచట

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నివసించి భక్త బాహుళ్యము నాకర్షించిరి. వారిలో వేమూరి చిదంబర శాస్త్రిగారు ముఖ్యులు. ఒకసారి చిదంబరశాస్త్రిగారి పంచదశీ గ్రంథము అదృశ్యము కాగా బ్రహ్మానందులు కార్తవీర్యార్జున మంత్రమహిమచే అది యెచ్చట నున్నదో తెలియ చెప్పిరి. భక్తులు ప్రార్థింపగా వారితో కలసి భద్రాచల యాత్రకు బయలు దేరిరి. రాజమండ్రిలో క్షేత్రదర్శనమున కేగిన భక్తులు చెప్పిన వేళకు తిరిగి రాక పోవుటచే వ్యాఘ్రేశ్వర నివాసులు భాష్య ప్రవచనమునకు పిలువగా నచటికేగి కోనసీమ రామణీయకమును ప్రశంసించిరి. నెల్లూరు భక్తులు వెదకి కొనుచు రాగా వారితో కలసి భద్రాద్రికి బయలుదేరిరి. గోదావరి దాటుచుండగా చిదంబర శాస్త్రి గారి కుమారుని నీటిలోనికి విసరి తపతప కొట్టుకొనుచుండగా తన కర స్పర్శ ప్రభావమున మునుగక ఈదులాడుచు వచ్చుటను అందరకు చూపి జ్ఞానబోధ చేసిరి. భద్రాద్రిని దర్శించి తిరిగి నెల్లూరు చేరిరి. మరల దక్షిణదేశ యాత్రలు చేయనెంచి భక్తులు వేడగా అంగీకరించి కాళహస్తితో నారంభించి కన్యాకుమారి వరకు పోయి తిరిగి వచ్చిరి. కొంతకాలమునకు మరల కోనసీమను దర్శించు కోర్కెతో బయలుదేరి మార్గమధ్యమున సూర్యాస్తమయమగువేళకు బాపట్ల చేరిరి. ఇచ్చట నిలచెదమనగా వెంటనున్న జానకిరామయ్యయను శిష్యుడు స్వామీ! ఇది నాస్తిక స్థానము. ప్రక్కయూరికి బోదమనగా స్వాములవారు "అట్లయినచో ఇచ్చటనే నిలిచెద"మని భావపురమునకు బ్రహ్మానందయోగము పట్టించిరి. నిత్య నైవేద్యములు లేక పాడువడియున్న శివాలయమును శుద్ధిచేసి దాని ప్రాంగణమున దత్తాత్రేయ స్వామిని నెలకొల్పిరి. దానితో భావపురము (బాపట్ల) అపూర్వమగు దత్తక్షేత్రమయ్యెను. నాస్తికులు ఆస్తికులైరి. విమతులు స్వమత ప్రవిష్టులైరి. స్వాములవారు స్వయముగా కాశికేగి సోమేశ్వర లింగమును తెచ్చి ప్రతిష్ఠించిరి. వేదశాస్త్ర బోధనలకై "శంకర విద్యాలయము"ను స్థాపించిరి. సంస్కృత గ్రంథాలయమును నెలకొల్పిరి. పరమతఖండనమున పేరుగాంచిన నాటిమేటి పండితుడు శ్రీ మల్లాది హనుమచ్ఛాస్త్రి స్వామివారికి ముఖ్యశిష్యుడాయెను. అవధాన ప్రతిభాధురంధరుడు, వైయాకరణుడు సంస్కృతాంధ్ర కవియగు శ్రీ వేమూరి నరసింహ పండితుడు భాష్యపాఠమునకై స్వామి నాశ్రయించెను. కవి హృదయము నెఱిగి కావ్యనాటక పాఠములు చెప్ప మహాబోద్ధ, అవధానాశు కవిత్వ విశారదుడగు శ్రీ అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రియు స్వామివారితో భాష్యమును పఠించెను. అట్లే పాతూరి శివరామశాస్త్రి, కంభముపాటి సింగయ్య మొదలగు కవి పండితులు స్వాములవారికి శిష్యులైరి. శ్రీ చెఱువు సీతారామశాస్త్రి స్వామి

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆదేశానుసారము ప్రతి సంవత్సరము దత్తజయంతి చేయ నారంభించెను. భావ దేవుని తిరునాళ్ళకంటె ఘనముగా స్వామివారును బాపట్లలో దత్త'జయంతి' జరుప సాగిరి. ఒకసారి ఆ జయంత్యుత్సవములలో ఒక హరికథకుని దత్తచరిత్రము చెప్పమనగా నతడు చేతకాదనెను. వెంటనే స్వామివారతనికి రహస్యముగా తత్కథా విధానమునుపదేశింపగా సభ్యులెల్లరు నాశ్చర్యపడునట్లాతడు కథ చెప్పెను.

బ్రహ్మానంద తీర్థుల దివ్యమహిమ వర్ణనాతీతము. వారు పలికిన పలుకులు వరములు. మెట్టిన స్థలములు క్షేత్రములు. క్రూర జంతువులు సైతము వారిని చేరి సాధువులగును. ఒకసారి కందిరీగలు వారిని కుట్టవెరచి చెదరిపోయెనందురు. ఏతాదృఙ్మహిమోపేతులగు యతీశ్వరులు తమవెంట బయలుదేరుచున్న శిష్య వర్గమును నివారించి చాతుర్మాస్య దీక్షకై కాశికి పోయిరి. అక్కడే సిద్ధిపొందిరని తెలియుచున్నది.

భక్తిజ్ఞాన వైరాగ్యములు ;

మహాపురుష చరిత్రమగు నీ హరికథలో శాస్త్రిగారు కథానుకూలముగ భక్తిజ్ఞాన వైరాగ్యములను పరవశులై గుప్పించిరి. కథకు పరిపుష్టిని చేకూర్చిరి. కథాచ్ఛలమున శ్రోతలకు నధ్యాత్మ విద్యను పంచిపెట్టి హరికథా ప్రక్రియా పర మార్థమును నిరూపించిరి.

బాలగణపతి తల్లిప్రబోధముతో నామసంకీర్తనము సలిపిన తావున—

జంఝూటి - జంపె

జనులార! హరిభజన సలుపుడు సతంబు
జననమరణ క్లేశ మణచును నిజంబు

మి॥ పని తొలిపుట్టువులన్ మనము గొన్న మేళ్ళన్
మనుజుల మైతి మిటన్ మఱువ నధోగతియౌ

చ॥ మేకవలె నన్నిటను మేమే యనుచు నఱవ
వీక తోడేలు వలె దూకు దండధరుండు

మి॥ ఈ కీలక మెఱిగి యింద్రియముల గెలిచి
యేకాంతపు భక్తిన్ శ్రీకాంతుడలరన్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అను కీర్తనలో భక్తిని మరికొన్ని పద్యములలో పరిణత వేదాంతమును ఉపదేశించుట సహజమేనా యనిపించును కాని హరికథలలో నిట్టివి సహజమే. పై కీర్తనలో భక్తియే ముక్తిమార్గమని చెప్పబడెను. అప్పటి గణపతి స్థితి యట్టిది. కొంతకాలము గడచిన తరువాత సోదరవర్గము మరణించిన సన్నివేశమున—

సావేరి-ఆట

వైరాగ్య భాగ్యమే భాగ్యము భువి
పారమ్యమున కది యోగ్యము

సార బ్రహ్మానంద భాగ్యము వి
స్తార మానసిక సౌభాగ్యము

మి॥ పేరుకొను పేరూబె తీరున, జాటీ కూరుకొనంగ గూర్చెదు
ఘోరతర సంసార బాధను, దూరముగ దా బాఱ దోలును—

అని వైరాగ్య భాగ్యమును బహుధా ప్రశంసించి జ్ఞానసంపాదనకు బయలు దేరెను. ఆపై నంతయు జ్ఞానతేజో విహారమే. యోగనిష్ఠుడై జ్ఞానానంద మనుభవించు గణపతి రూపమిట్లు వర్ణితము—

చలనమ్ము మానిన జలజంతువుల తోడి
గంభీర పాథోధి గర్భమట్లు
నిద్దుర సుఖియించు నిఖిల జీవుల తోడి
రహిత శబ్దం బర్ధరాత్రమట్లు
నిర్గతావరణమౌ నెలపున నెలకొని
దీపించెడు నివాత దీపమట్లు
సెలయేళ్ళ నృత్యముల్ నిలిచిన యిరు కెలం
కుల నొప్పెసగు కులగోత్రమట్లు

ఊక లూడ్చిన పులుగులై ఇంద్రియమ్ము
లాత్మ వశత నెసంగ దా నమరి యుండె
సమ శిరః కాయుడై సుఖాసనము నందు
దీక్ష నాసాగ్ర సంలగ్న దృష్టి యగుచు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వర్ణనలు :

ఇందు ముఖ్యముగా పేర్కొనదగిన వర్ణనలు రెండున్నవి. ఒకటి మహారణ్యవర్ణనము రెండు హిమాలయవర్ణనము. మహారణ్య వర్ణనము మహావచనమున సాంద్రగహనముగా సాక్షాత్కరింపగా సంప్రదాయ గాథాపరిచితమగు హిమాలయ స్వరూపమొక సీసముగా రూపొందినది.

"కన్ను చర్మమయము దీని మహిమము కనుంగొనగలేదు. దేవభూములు" అని భౌతికనేత్రములకు హిమాలయ పర్వతమహిమము అంతు పట్టదని శాస్త్రిగారు పౌరాణికగాథలను నమ్మని వారికి గట్టిచురక నంటించిరి.

"కన్నుగానని వస్తుతత్త్వము కాంచనేర్పరులింగిరీజులు"

అని గురజాడవారు విశ్వసించినట్లే శాస్త్రిగారును తన అభిప్రాయమును ప్రకటించిరి. ఆ తరువాత అంతర్దృష్టికి గోచరించు హిమాలయ పర్వతమును ఇట్లు వర్ణించిరి.

పాడిగాపాడ మన్ పాడియా వగునాడు
చేపు గల్పించిన పూపలేగ
వరిముంటి కొనపంటి వరుని దా నొక యింటి
వానిగా చేసిన భాగ్యశాలి
చల్లనై తెల్లనై సత్త్వ సంపన్నమై
కలలుట్టి పడియెడు కాంతినెలవు
బ్రహ్మనిష్ఠులకు నిరాహారులకు దగు
మునికిపల్లెసగు మహోన్నతుండు
దేవ గంధర్వ కింనరాదికము సతము
ప్రాణపదముగా విహరించు పట్టుగొమ్మ
పద్మ సంభవునకు కూర్పు ప్రథమసృష్టి
కొండయే ఇది భువి గొప్ప యండగాని

హిమాలయము గోవత్సమగుట కన్యాదాతయై ఈశ్వరునకు పార్వతి నిచ్చుట మొదలగు కథలను చర్మమయమైన కన్ను చూడలేదు కదా!

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

స్తోత్రములు ।

ఇందు సంస్కృతాంధ్రములందు సాగిన దత్తాత్రేయ స్తవము, సంస్కృత మునందు సాగిన చంద్రమౌళీశ్వర స్తవము గమనింపదగినవి. 'దత్తావధూతప్రభూ' 'సేవే శృంగగిరీంద్రపీఠనిలయం శ్రీ చంద్రమౌళీశ్వరం' అనునవి వీని మకుట ములు. చంద్రమౌళీశ్వర స్తవము అష్టకము.

స్వామివారి యాత్రలను పురస్కరించుకొని శ్రీ వేంకటేశ్వర, కాళహస్తీ శ్వర, భద్రాద్రిరామచంద్ర దైవములను గూర్చి కీర్తనలు రచింపబడెను. అట్లే స్వామివారి శిష్యసంతతిని గూర్చి చెప్పుచు కొందరు కవి పండితుల ప్రతిభను శాస్త్రిగారిందు ప్రశంసించిరి. అవ్వారి సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని గూర్చి —

కవిభావంబులు గావ్య నాటకములన్ గౌశల్యమొప్పన్ గలా
ర్థవితానమ్మునకున్ వికాసముగ బోధింపంగనౌ బోద్ధధీ
రవి అవ్వారికులాబ్ధిచంద్రముడు సుబ్రహ్మణ్యుడున్
సవిశేషంబుగ స్వామివారికడ భాష్యంబుల్ పఠించెన్ ధృతిన్

భక్తిజ్ఞానవైరాగ్యసిద్ధుడై తన్నాశ్రయించిన వారిని భక్తిజ్ఞాన వైరాగ్యోపేతు లను గావించిన యతీశ్వరులవారి జీవితమును హరికథగా తీర్చిదిద్దిత మ పరిణతిని ప్రదర్శించిన చల్లావారు ధన్యజీవులు.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ బోధేంద్ర సరస్వతీ స్వామి చరిత్ర

'శ్రీబోధేంద్ర సరస్వతీస్వామి చరిత్ర' అను శీర్షికతో నొక అసంపూర్ణ హరికథ వ్రాతప్రతి లభించినది. ఇది పదమూడు పావుతావు పుటలలోనున్నది.

శ్రీబోధేంద్ర సరస్వతీస్వామి వారు నాడు గుంటూరు మండలమున ప్రసిద్ధులై యుండవచ్చును. సాధుజనానుయాయులగు శాస్త్రివరేణ్యులు శ్రీస్వామి వారిని దర్శించి, మహిమ నెఱిగి వారి జీవిత చరిత్రను హరికథగా వ్రాసి యుందురు.

శాస్త్రిగారు వ్రాసిన దానినిబట్టి శ్రీస్వామివారి స్వగ్రామము మంగళగిరి సమీపమున నున్న భక్తిసువర్ణమునకు నొఱిగల్ల న దగిన యొరగల్లను నూరు. వారి పూర్వాశ్రమ నామము లక్ష్మీనారాయణ. లక్ష్మీనారాయణగారి తండ్రి యనమండ్రి సీతాపతిగారు. పరమ సజ్జనులు. రామభక్తుడు. తల్లి మహాలక్ష్మి మహాసాధ్వి. ఆ దంపతులకు ప్రమోదూతనామ సంవత్సర వైశాఖ శుద్ధ సప్తమీ సోమవారమున లక్ష్మీనారాయణగారు జన్మించిరి. వారి బాల్యము మనోహరముగా నిట్లు వర్ణితము -

'మాతృగర్భమున నేమరని విజ్ఞానంబు
పుడమిపై బడియు వీడడు రవంత
పురిటింట బొత్తుల బొరలుచు గలమాయ
బొరలెఱుంగుచు నగు బురుడులేక
పరతత్త్వ మెఱుగనవారి పశుత్వమి
ట్లంచు నెల్లెడను బాడాడుచుండు
కలిలోని ప్రాణులాకలికయి పెదత్రోవ
నడతురిట్లిన తప్పటడుగు లిడును
జన్మశతకృత సుకృతప్రసాద గరిమ ....

భక్తియన్నను భక్తులన్నను గంగాప్రవాహము వలె పరుగులు పెట్టు శాస్త్రి గారి కవితాసరస్వతీ నిరాఘాటతను నిరూపించు ఈ హరికథ పూర్తియై యున్నచో నొక మహాభక్తుని జీవిత చరిత్ర సంపూర్ణముగా లోకమున కంది యుండెడిది.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సావిత్రీ చరిత్ర

భారత కథలలో సావిత్రీ చరిత్రము సుప్రసిద్ధము. పతివ్రతా శిరోమణియైన సావిత్రి కథ భక్తుల కింపు నింపును. అట్టి సావిత్రి కథను శాస్త్రిగారు హరికథగా రచించిరి. ఇది ఇరువది మూడు అరతావులలో అముద్రితముగా అసంపూర్ణముగా లభించినది. బహుశః నారాయణదాసుగారి సావిత్రీ చరిత్ర హరికథ వలన ఉత్తేజితులై శాస్త్రిగారు ఈ రచన గావించియుందురు. శైలి ప్రౌఢమై, వ్యాకరణశాస్త్రాభ్యాసమును ప్రదర్శించు ప్రౌఢ పద ప్రయోగములు గోచరించుచుండుట చేత ఈ సావిత్రీ చరిత్రమును శాస్త్రిగారు విద్యాభ్యాసము పూర్తియైన యౌవనప్రాయమున రచించిరని భావింపవచ్చును. అంతేకాక కుచేలోపాఖ్యానమునందువలె ఇందును గేయములుగా తోహరలు మాత్రమేరచింపబడుట పై యూహకు బలము నిచ్చుచున్నది. సత్యవంతుని ప్రాణములను గొనిపోవుటకు వచ్చిన యమధర్మరాజునకు సావిత్రి నమస్కరించు నంతవరకే వ్రాతప్రతి లభించినది.

కవితాసౌందర్యము :

ఈ హరికథలో శాస్త్రిగారు ప్రౌఢమగు ప్రాబంధిక శైలిని నిర్వహించిరి. విదుషాం పరితోషమున కెక్కువ ప్రాధాన్యము నిచ్చినట్లగపడును. గేయములు కూడ సుదీర్ఘ సమాస భాసురములు.

పరికింపుడు —

తోహర: కలడిట బలవద్రిపు శలభాంగాంగార కణాయితమూర్తి
జ్వలన షడానన మధ్యందిన భాస్వద్భాస్వద్విస్ఫూర్తి
రణధరణీ ద్విడ్ధనన ప్రోద్ధత ధనుష్మదగ్రణి సుగుణి
వినయ నతాగత యాచకజన పూరణ ఘనాఘనేంద్రమణి

శృంగార హాస్యకరుణ బీభత్సాది రసములను సమర్థముగా పోషించిరి. హాస్యమును, బీభత్సమును కథానుగుణమగునట్లు కల్పించుట విశేషము.

సావిత్రీ సత్యవంతులు అరణ్యములోనికేగి నపుడు బీభత్సరసోత్పాదియు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యమపురంబునకు ఉపమయై విలసిల్లునదియు నగు నొక బహుపాద (మట్టి) వృక్షమును దర్శించినట్లు కల్పించిరి. రాబోవు కథకు ఈ కల్పనము సూచకము.

సత్యవంతుడు మరణించు దినము వచ్చినదని చెప్పుచు – .

"కడుపార కన్నట్టి కన్నమ పాలింటి
అబ్ధి రేగిన బాడబాగ్ని కీల"

మొదలుగా తండ్రికి, మామకు, అత్తకు, భార్యకు ఆ దినము పిడుగు దెబ్బవలె, శతఘ్నధారవలె, ఉల్కాప్రపాతమువలె, జగత్ప్రళయమువలె వచ్చినదని కవి ఉల్లేఖించెను. మాతృగర్భశోకమును సూచించుటకు సముద్రములోని బడబాగ్నిని పోలికగా తెచ్చుట గొప్ప యూహ.

—:০:—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ మ హా భా ర త ము

"శ్రీమహాభారతము హరికథ" యను శీర్షికతో పుటలు క్రమానుబంధము లేని, పెన్సిలుతో వ్రాయబడిన తొమ్మిది అరఠావు పుటలు లభించినవి. వీనిలో కీర్తనలు తప్ప పద్య గద్యములు లేవు. ఆ కీర్తనలు కూడ ఒక పర్వమునకు చెందినవి కావు. ఒక్కొక్క పర్వమునకు కథానుసంధానము చేయుచున్న రెండు మూడు కీర్తనలు మాత్రమే కలవు. అట్లు ఆదిసభా అరణ్య విరాట పర్వముల వరకు వ్రాయబడి యుండెను. ఇట్లు అక్కడక్కడి కథను తెలియజేయు కీర్తనలను మాత్రమే వ్రాయుట చూడగా శాస్త్రిగారు స్వయముగా భారతమును హరికథగా గానము చేయుటకు ఉపయోగించుకొనదలచి ఈ కీర్తనలను వ్రాసికొని యుండిరని ఊహింపవచ్చును.

అరణ్య పర్వమున ఘోషయాత్రకు బోయిన దుర్యోధనుని గంధర్వులు బంధింపగా వానిని విడిపింపుమని ధర్మరాజు తన తమ్ములతో చెప్పిన సందర్భమున—

కేదార—రూపకము

ఎంతచెడ్డవాడైనను, ఏకవంశజాతుడతడు
వింతవారిచేజిక్కిన వెరవేమనమిటు చూచుట
అంతట గనమే పులుంగు, లైన నొకట చిక్కుబడ్డ
బంతి తీర్చి తీర్పవె ఈ బన్నము శక్తి కొలందిన్

చ॥ తన ధర్మము నెరవేర్చుట తగునుగాని పెర ధర్మము
తడవునంత ఫలమేమీ తానే చెడిపోవుగాని........

అని వ్రాసిన కీర్తనలో "తన ధర్మము నెఱవేర్చుట తగును గాని పెర ధర్మము తడవునంత ఫలమేమీ తానే చెడిపోవుగాని" అను వాక్యము అమూలకము. జ్ఞాతిజనుల సహజస్నేహమును శరణాగత రక్షణమును మాత్రమే ఎఱ్ఱనగారి ధర్మజుడు రక్షణ కారణములుగా పేర్కొనెను. శాస్త్రిగారా సన్నివేశమున సర్వజనోపయోగియగు ధర్మమును చొప్పించి శ్రోతృజనులను స్వధర్మాచరణోన్ముఖులను గావించిరి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విరాట పర్వమున సుదేష్ణ కీచకునికి హితబోధ చేయు సందర్భమున ఈ క్రింది కీర్తన రచింపబడెను.

కాఫీ—అది

నీరసాకార సైరంధ్రికోరదగునె తమ్ముడా !
దారినబడి వచ్చి ఇచట తలను దాచుకొన్నది

మి॥ వీటిడిమై ఎవియొ పలుపేరుల నోములు
నోముచు కూరుకు నన్నము లేకయు

చ॥ మాటనేర్చి మరులు పేర్చి నీటుగోటు కలిగి మిగుల
ఆటపాటలందును సయ్యాటలందు నారిలేరి
కొంచెలయిన నెఱజాణలు కోటులుండ వారలకొన
గోటికయిన నీడురాని ఈపాటి వరాచేటికిరా ?

తీరుగ పరికింపగ.........

పై కీర్తనలో తిక్కనగారి "నీరసాకార సైరంధ్రికోరదగునె" అను గీత పాదము యథాతథముగా పల్లవిగా చేయబడినది. సాహిత్యములో సంగీతమును గ్రహింపగలిగిన వారే ఇట్టి చమత్కారములు చేయగల్గుదురు. ఆ పల్లవిలోని రెండవ చరణము కూడ మూడు అక్షరములు ఎక్కువగా గీత పద్య పాదము. కీర్తనమంతయు అచ్చ తెనుగు పదములతో తిక్కనగారి పద్ధతిలో రచింబడుట చూడగా ఈ రచనము అలవోకగా జరిగినదికాక ప్రణాళికాబద్ధమే యనువిషయము స్పష్టమగును.

—:o:—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సప్తమము
వాగ్గేయోల్లాసము

ఏ భాషయందైనను గేయ సాహిత్యమునకే ప్రచారము మెండు. స్త్రీలు, పురుషులు, పిల్లలు, కార్మికులు, కర్షకులు వివిధ వృత్తుల వారు సమష్టిగా పాడుకొనెడి గేయములు అజ్ఞాతకర్తృకములు. ఇది మౌఖిక వాఙ్మయము. "పాట" లేక జానపద వాఙ్మయముగా పరిగణితము. జ్ఞాతకర్తృకములై వాగ్గేయకారులచే రచింపబడినవి గేయములు. వీనినే గేయము, పదము, కీర్తన, సంకీర్తన, కృతి అనియునందురు.

"గానము చేయబడునది కనుక గేయము. * "పాఠ్యే గేయేచ మధురం" అను వాల్మీకి వాక్కులోని గేయ శబ్దము పాటకు పర్యాయపదము కాకపోయినను తరువాతి కాలమున పర్యాయ పదమగుటకు ప్రేరకమైనదనవచ్చును.

"పదము" అనునది పాటకు పర్యాయపదముగా తెలుగులో నేర్పడినది. ఇది సాంకేతిక నామమే కాని వ్యుత్పత్తికి లొంగునది కాదు. ఈ "పదము" ను పదకవితా పితామహుడైన అన్నమాచార్యుడు సంకీర్తన లక్షణమున ఇట్లు నిర్వచించెను.

ఘనత మీరంగ జయదేవ కవివరేణ్యు
డందమైనట్టి గీతగోవింద మందు
అంచితాష్టపదులు పల్కె; నట్ల పదము
పరగు నెనిమిది పదములు పల్లవియును *

పల్లవి, ఎనిమిది పదములు, కలిగిన గేయమును "పదము"గా పై పద్యము నిర్వచించును. పద శబ్దము పాద శబ్దమునకు పర్యాయము. ఈ పాదములనే ఇప్పుడు చరణములనియు వ్యవహరించుట పరిపాటియైనది. "పదములు కలది"

* క్షేత్రయ్య పదములపై బాలాంత్రపు రజనీకాంతరావుగారి సాహిత్యోపన్యాసము ఆంధ్రసాహిత్య అకాడమీ ప్రచురణ, పుట. 55.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనునర్థమున "పదము" అను నామ మేర్పడి యుండును. పదమును నిర్వచించిన సంగీత శాస్త్రజ్ఞు లెవ్వరును దాని వ్యుత్పత్తి నూహింపలేదు.

"శృంగార రసమయమై రాగతాళ నిబద్ధమైన రచనకు "పదము" అను సంకేత నామము వాడుట సంగీత రసికుల సంప్రదాయమైనది. * అని శ్రీరాళ్ళ పల్లి అనంత కృష్ణ శర్మగారి నిర్వచనము.

పై నిర్వచనములో నియత పద సంఖ్యలేదు. శృంగార రసమయత్వము ఒక లక్షణముగా చెప్పబడినది.

"నాయికా నాయక లక్షణముకలిగి శృంగార రస ప్రధానమైనట్టి సంగీత రచలనలకు పదములని పేరు. ఇందు పల్లవి, అను పల్లవి చరణములను విభాగము గలిగియుండును. దీనిలోని సంగీతము యొక్క నడక నెమ్మదిగను ఆకర్షణీయ ముగా నుండును. సాహిత్యము పాండితీ ప్రతిభ కలిగి గంభీరమైన వేదాంతార్థ మిమిడియుండును. ** అని అరిపిరాల సత్యనారాయణమూర్తిగారి వివరణము.

పై నిర్వచనము కూడ రాళ్ళపల్లి వారి మార్గములోనే సాగినది. పదసంఖ్య లేదు. పాండితీ ప్రతిభ గలిగియుండుట, గంభీరమైన వేదాంతార్థ మిమిడియుండుట అను రెండు క్రొత్త అంశములు ఇందు క్తములు.

"పదము పల్లవి, అనుపల్లవి, చరణమైన ఉండవచ్చును పెక్కు చరణము లైన ఉండవచ్చును.........ఇందు సాహిత్యము సామాన్యమైన వాడుక భాషలో రచింపబడి యుండును." *** అని ఎన్. సి. పార్థసారథి, శ్రీమతి ద్వారకా పార్థసారథి గార్ల అభిప్రాయము.

పై నిర్వచనమున రసప్రసక్తి, పాద సంఖ్య లేవు. విశేష మేమనగా సాహిత్యము సామాన్యమైన వాడుక భాషలో రచింపబడియుండు ననుట. ఈ అంశము అరిపిరాల వారి నిర్వచనముతో విభేదించును.

పై సంగీత శాస్త్రజ్ఞుల పలుకులను పరిశీలించినచో "పద" పదనిర్వచన ములో ఏక వాక్యత గోచరింపదు. అన్నమయ్య చెప్పిన అష్టపద నియమము

---

* సాహిత్యోపన్యాసములు, ఆ. ప. ఆం. ప్ర. సా. అ. పుట. 12.

** సంగీత శబ్దార్థ చంద్రిక (1954) పుట. 225.

*** గాన కళాబోధిని (1965), బాల సరస్వతీ బుక్ డిపో కర్నూలు, పుట. 96

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అవ్యాప్తికి గురియైనది. అన్నమయ్య, క్షేత్రయ్య పదములలో కూడ ఈ నియమము నియతముకాదు. కొందరు చెప్పిన శృంగార రస నియమము కూడ ప్రాయికమే. "అదిగో అల్లదిగో శ్రీహరి వాసము" మొదలగు అన్నమయ్య రచనలో శృంగార స్పర్శ లేదు. సాహిత్య విషయమున వెలువడిన రెండు నిర్వచనములు పరస్పర విరుద్ధములు. పదములన్నియు వాడుకభాషలో రచింపబడి యుండుననుట సాహసము. కావున "పల్లవి, అను పల్లవి, చరణములతో నుండి తఱచుగా వ్యవహారభాషయందును, శృంగార రసమయముగాను రచింపబడు గేయము పదము" అని నిర్వచించినచో పదము పరిధి విస్తరించును. తత్పూర్వ నిర్వచనములన్నియు సమన్వితములగును.

కీర్తన శబ్దమునకు "కీర్త్యతే ఇతి కీర్తనమ్"అని వ్యుత్పత్తి. ఇది సంగీత శాస్త్ర సాంకేతిక పదము. "సంగీత మాధుర్యముబట్టి చేసిన విభాగములలో రెండవదియైన సంగీత రచనకు కీర్తనయని పేరు. ఇందులో సంగీతమున కంతగా ప్రాముఖ్యములేక భక్తి రస ప్రధానమైన యుండును." * అని సంగీత శబ్దార్థ చంద్రిక. దీని ననుసరించి త్యాగరాజు గేయములను కీర్తనలనరాదు. వానిలో సంగీతమునకు అత్యధిక ప్రాముఖ్యము కలదు. రామదాసు గేయములు మొదలైన వానిని మాత్రమే కీర్తనలవలెను.

"సంకీర్తన లక్షణము" అను పేర అన్నమాచార్యులు ఒక లక్షణ గ్రంథమును రచించెను. కాని సంకీర్తనయననేమో ఎవ్వరును నిర్వచింపలేదు. "భజన పాటల" వంటి వానిని సంకీర్తనలనుట వాడుకలో నున్నది.

కృతి శబ్దము పై పర్యాయ పదములలో విశిష్టము. "సాహిత్యము దేవతా స్తుతిగానైనను రాజపోషకుల స్తుతిగానైనను లేదేని వేదాంతముతో కూడుకొన్నదిగానైన నుండవచ్చును......చరణము ఒక్కటైనను ఉండవచ్చును లేక నాలుగైదు చరణములును ఉండవచ్చును. కృతికి చాలముఖ్యమైన అంగము "సంగతి" "సంగతి" లేనిది కృతి రాణించదు."** అని శ్రీ ఎన్. సి. పార్థసారధి శ్రీమతి ద్వారకా పార్థసారధి గారల నిర్వచనము. త్యాగరాజ రచనలు మొదలైనవి నిస్సందేహముగా కృతి శబ్ద వాచ్యములు. కావుననే విజ్ఞులైన సంగీత రసజ్ఞులు "త్యాగరాజకృతులు" అనుచుందురు.

---

* పుట. 93.

** గానకళా బోధిని, పుట. 88.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"వాగ్గేయ కారులు" అను సమాసములోని వాగ్గేయ శబ్దమునకు వ్యస్త ప్రయోగములేదు. "వాగ్గేయంకరోతి ఇతి వాగ్గేయకారః అన్నప్పుడు వాగ్గేయ శబ్దమునకు పాట అనియేకదా అర్థము. కావున వాగ్గేయమును గేయ సామాన్య వాచిగా గ్రహింపవచ్చును.

పై పర్యాయ పదములలో భక్తి సంగీతములకు ప్రాధాన్యముగల శాస్త్రిగారి వాగ్గేయములలో కీర్తనలు, కృతులు నుండుటచే సామాన్య వాచకముగా నీ విభాగ మును "వాగ్గేయోల్లాసము" అనుట సమంజసము.

శాస్త్రిగారి హరికథలలోను, ఇతర రచనలలోను నిబంధించిన గేయములను కాక ముక్తక ప్రాయములుగా నున్నవానిని మాత్రమే ఇందు పరిశీలించితిని. అన్నియును అముద్రితములే.

రామాయణ కీర్తనలు :

రామాయణములోని పాత్రలు రామజననాదుల వలన తమ ధన్యతను చాటు కొనుచున్నట్లు కొన్ని కృతులు రచితములు. కౌసల్య, దశరథుడు, విశ్వామిత్రుడు లక్ష్మణుడు, శివధనుస్సు, అహల్య, గుహుడు ఈ కృతులను పాడిరి.

రాముడు జన్మించగానే కౌసల్య ఇట్లనుకొనెను.

కన్నడ — జంపె

ప॥ నను గన్న తండ్రి యెనాళ్ళకిట నినుగంటి

అ॥ ఎనలేని నా నోములెల్ల నేడు ఫలించె

మి॥ తనువా శుచి యయ్యెన్
కనులా నిలుపొందెన్
మనమా ఘనమయ్యెన్
మహిమలు మహి నిండెన్

చ॥ పురమెల్ల వైకుంఠ పురమయ్యె సంప్రాన
పురుడు లేనిదియయ్యె పురిటిల్లు వెలుగుచే

మి॥ ధరగల తపములలో ధన్యత గంటినికన్
దరహాసమ్ము న్నెలపుము తగుచెక్కిట ముద్దిడ ॥నను॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లక్ష్మణుడు :

సురటి — రూపకము

ప॥ చాలవు వేనోళ్లైనను సన్నుతింప గురుమూర్తి

అ॥ గాలిపడగమైన బ్రతుకు కడు ధన్యంబయ్యె నేడు

మి॥ మాలిమి మైమెరాయ, తాలిమి తానై డాయ
మేలుగొనమ్మ్రల పంట మేలుకొంటి నీవెంట

చ॥ రెండు నాలుకలు గలిగి మెండుబుస్సలను అలిగి
అండజేరునంతనె రంధ్రాన్వేషణమున జెలగి

మి॥ బెండై అలజడి వడియెదు పృథ్వీభార నిమగ్నులు
నిండౌ సురటీహాయిని నెగడ నిన్ను నెనయగలరె

పై కృతిలో లక్ష్మణుని శేషాహిత్వము చమత్కారముగా వ్యక్తము.

ముక్తక కృతులు :

కథాసంబంధములేక వివిధ సందర్భములందు రచింపబడిన కృతులను ముక్తకకృతులనవచ్చును. వాగ్గేయకారుడు లోకసంచారము చేయునప్పుడు అచ్చటచ్చటి దైవతములు, నదులు, పర్వతములు మొదలగు వానిపై కృతులు కట్టి గానము చేయుచుండును. ఇవికాక ప్రబోధపరములో, వేదాంతబోధకములో అగు కృతులుకూడ పల్లవించుచుండును. శాస్త్రిగారు వివిధ విషయములపై రచించిన కృతులు వందల సంఖ్యలో నున్నవి.

ఇంటూరు శాస్త్రిగారి నివాసస్థలము. అచ్చటి దైవతములగు మూలస్థానేశ్వర రామచంద్రులను గూర్చి పెక్కు కృతులు కలవు.

బిలహరి

ప॥ ఆనందసాగరా ! అద్రిజామనోహరా!
ధ్యాన యోగ గమ్య చరాచరాంతర విహారా !

మి॥ శ్రీనాథా నిన్నెంతున్ సేవింతున్ పూజింతున్
రా నెనరున నన్ బ్రోవన్ రాజరాజపూజితపద

చ॥ ఎల్లజగము లేలువాడా, ఎల్లయు నీవైనవాడా
ఎల్లకల్లలణచువాడా, ఎల్లశ్రుతుల లోనివాడా

మి॥ చెల్లింపుము నీకీర్తిని, వల్లింతుము నీ కథలన్
చల్లగ మమ్మేలుకొనుమో, స్వామీ! ఇంటురి నిలయా !

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లే ఇంటూరి భ్రమరేశ్వరీదేవిపై "హారతిగైకొనుమా అమ్మ భవానీ" అను పల్లవితో దేవీ ప్రతిపత్తి మనోహరముగా పదిచరణముల పెద్ద కీర్తన విరచితము.* ఇందు శ్రీ చక్రవిలాసము, దేవీపారమ్యము వివృతములు.

ఈ విధమగు దేవతాస్తుతి కృతులను దేవపరములు, దేవీ పరములని విభాగించవచ్చును.

శంకర, రామ, భావనారాయణ (పొన్నూరు), వేణుగోపాల (హంసలదీవి), ఆంజనేయ (పొన్నూరు), పాండురంగ (చిలకలపూడి), దుర్గామల్లేశ్వర (విజయవాడ), కృష్ణ మొదలగునవి దేవపరములు.

పార్వతి (కొల్లూరు), రాజ్యలక్ష్మి (పొన్నూరు), శ్యామలాంబ (కైకలూరు),** కనకదుర్గ (విజయవాడ), మహాలక్ష్మి (చందలూరు), కామేశ్వరి, లలిత మొదలగునవి దేవీ పరములు.

పై ద్వివిధములగు కృతులు సంస్కృతాంధ్రభేదముచే చతుర్విధములగును.

శహన—జంపె

ప॥ శ్రీ భావనారాయణా భోగిరాట్శయన
ప్రాభవోపేత సంపత్పద్మదళనయన

చ॥ తుంగభద్రా తటోత్తుంగ గోపురనిలయ
శృంగార రాజ్యలక్ష్మీశ విశ్వేశనుత

చ॥ గూనిగోవిందు భక్తుని పెండ్లిసాక్ష్యము
పూనిబలగమ్ముతో పోవుచును నిలచితివి***

---

* శ్రీమతి చల్లా పార్వతమ్మగారు పాడగా సేకరించితిని.

** శ్రీ పాలపర్తి వేంకటసుబ్బారావుగారు పాడగా సేకరించితిని.

*** ఒక బ్రాహ్మణుడు తనకు ఆడుపిల్ల కలిగినచో గూనివాడగు తన మేనల్లునకిత్తునని వారణాసిలో ప్రమాణముచేసి తరువాత తన కుమార్తెనాతనికిచ్చుటకు తిరస్కరింపగా గూనిగోవిందుని అభ్యర్థనమేరకు సాక్షి భావనారాయణుడు, విశ్వేశ్వరుడు మొదలగువారు సాక్షులుగా బయలుదేరి బాపట్లవైపునకు పోవుచు పొన్నూరులో ఆగిరని పురాణ కథ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పొన్నూరు పురవాస భువనమంగళవేష
సన్నిలయ పాతూరి స్వామిగురు సంతోష *

పై కృతిలో గురుస్మృతి విశేషము.

కాంభోజి—జంపె

ప॥ కనకదుర్గే జగత్కల్యాణసర్గే

అ॥ కనకమణిమయ మకుట కలితోత్తమాంగే

చరణములు—

1. కృష్ణానదీ తీర గిరిశిఖర వాసే
కృష్ణావతార దర్శిత యోగహాసే

2. నవనవ శ్రీ శరన్నవరాత్ర పూజ్యే
నవరస స్ఫురణ గానశ్రవణరాజ్యే

3. రాజాధిరాజ వీర వరప్రదానే
రాజమండల కళార్రంజన నిదానే

4. విజయవాటీ విజయ విజయస్వరూపే
స్వజనావన విలాస సమ్మోదదీపే

పై కృతిలో దేవియే కృష్ణావతారము ధరించెనను మాట దేవీ వాఙ్మయ ప్రసిద్ధము.**

మానవ జీవిత పరమార్థమును, వేదాంతతత్త్వమును ఉపదేశించు కృతులతో భక్తాగ్రేసరులగు వాగ్గేయకారులు మానవులను ప్రబోధించుచుందురు. అట్టి కృతులను శాస్త్రివర్యుల సాహిత్యమున కూడ దర్శింపవచ్చును.

---

* శ్రీమతి పాతూరి నాగలక్ష్మమ్మగారి నుండి.

** "భోగే భవానీ, సమరేచ దుర్గా
క్రోధేచ కాళీ పురుషేచ విష్ణుః
"శ్రీకృష్ణః శ్యామలాదేవీ, శ్రీ రామోలలితాంబికా" (దేవ్యర్చనా సంప్రదాయ శ్లోకములు)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పూరి—ఆది

ప॥ కామదాసుడనగా మనదగదు

అ॥ రామదాసుడనగా మనదగు భువి

మి॥ ఏమిలేని కాపురంబునబడి, ఎముక నమలు కుక్క రీతి దనియుచు
దీమమున దగుల్కొనిన సమదఘన సామజంబు మాడ్కిని గీపెట్టుచు
॥కామ॥

చ॥ ఆయువు క్రింగెడి కాలమెఱిగి గో
మాయువు పోలెడు మనసు నెఱింగి
కాయము నియతా పాయము నెంచి
దాయమైన పెనుమాయను గెలిచి

మి॥ వాయురీతి నెల్లనిండి గగనము
చాయ దేనికంటకయ నిరతమును
వేయి సూర్యచంద్ర కాంతులెనయు
డాయలేని వెల్గను గనుగొన గా ॥కామ॥

పై కృతిలో "ఎముక నములు కుక్కరీతి దనియుచు" అనునది యుపని షత్కథితము. ఇది మానవుడు ఎట్లు బాధపడుచున్నాడో, దేనిని గెలువవలెనో, దేనిని కనుగొనవలెనో సోపానక్రమమున నిర్దేశించు గేయరాజము.

శంకరుడు నాదతనువు. సంగీతజ్ఞానమే మోక్షసాధనము. నాదోపాసనము ప్రణవనాదోపాసనమే యగునని త్యాగరాజాదుల నిర్ణయము. నాదబ్రహ్మానందాను భవమునకు సరివచ్చునదేదియు లేదని శాస్త్రిగారు వ్రాసిన ఈ క్రింది కృతి వారికి సంగీత సాహిత్యములు రెండు కన్నులని తెలియజెప్పును.

శ్రీరాగము—ఆది

ప॥ నాదబ్రహ్మానందాను భవమునకు సరియున్నదె హంసలదీవి ॥నా॥

అ॥ లేదులేదు ముజ్జగముల తెలియగ, లీలామానుష! వేణుగోపాల
॥నా॥

చ॥ ఆరోహణ మవరోహణ మెఱిగి
హాయిగూర్చ తగు స్థాయిని తెలిసి
ఆరితేరి గతి గమకమ్ముల సు
శ్రీరాగ స్వరూపము లమరిన ॥నా॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మి॥ కృష్ణాసాగర సంగమ హంసలదీవి పదము కీలక మెటిగి
కృష్ణా! గురురూపున నీవెదుటను, ఎసగి సదా బోధింపగ తెలిసెడు ॥నా॥

కలిలోని మానవులు అన్నగతప్రాణులు. ఆకలికి ఆగలేరు. అట్టి మానవుడు ఎంతటి అకృత్యమునైనను చేయును. సుకృత్యమునైనను విడచును. "బుభుక్షితః కిం నకరోతి పాపమ్" అని ఆర్యోక్తి. విశ్వరూపము ధరించిన ఈ 'ఆకలి'నేడు అభ్యుదయ కవుల కవితావస్తువైనది. భోజనప్రియులైన శాస్త్రిగారు ఏదియో సందర్భమున ఆకలిని గూర్చి చమత్కారముగా ఈ క్రింది కృతిని రచించి ఆధునికులైనారు.

బేహాగ్—ఏక

ప॥ నీకెంత చూపోపమీ ఆకలీ!

అ॥ ఏకాత పత్రముగ ఏలొ్కనుమీ కలి

చ॥ ఏకాంతమున జేరి, శ్రీకాంత దెదపొంగ
ఆ కీర్తనలు పాడునపుడడ్డగింతువు

చ॥ గడబిడ జేయింతు కనులెట్టగావింతు
గడియారమ్ముంజూపి గర్జింతు ఘర్జింతు

ఇట్లు పరమభక్తాగ్రేసరులై సంగీత రసానందసాగరులై భక్తివేదాంత సంబంధులగు బహుకృతులను రచించి వాగ్గేయకారులలో శాస్త్రిగారు తమ స్థానమును సుభద్రమొనర్చుకొని శారదాదేవి ఉభయ పార్శ్వముల స్తన్యమారగ్రోలిన ధన్యులైరి.

—౦—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అష్టమము

నాటకోల్లాసము

రూపకము లలితకళల సమాహార స్వరూపము. దుఃఖార్తులకు, శ్రమార్తులకు, శోకార్తులకు, తపస్వులకు అందఱకు విశ్రాంతి జనకమగు రూపకప్రక్రియకు సాహిత్యమున నున్నస్థానము విశిష్టము. ప్రాచ్యప్రపంచమున సంస్కృత రూపకములు, పాశ్చాత్యమున గ్రీకు నాటకములు అత్యంత ప్రాచీనములు. ఆంధ్ర భాష సుమారు పదునొకండవ శతాబ్దమున సాహిత్యరంగమున అడుగిడినను రూపక రచనలో వెనుకడుగుగా నుండెను. ఆంగ్లభాషా ప్రభావమేర్పడిన తరువాత గాని ఆంధ్రమున రూపకములు వెలువడలేదు.

1866 ప్రాంతములలో తొలితెలుగురూపకము శ్రీ కోరాడ రామచంద్ర శాస్త్రిగారి "మంజరీ మధుకరీయము" వెలువడెను.* ఆనాటి నుండి అనేక రూపకములు వెలువడినవి. దశరూపకములలోని వివిధ భేదములు, మోదాంతములు, విషాదాంతములు, పద్య, గద్య, మిశ్రములు ప్రాచ్య పాశ్చాత్య రూపకలక్షణ ప్రభావముతో నైకవిధరూపకములు వెలువడి ప్రదర్శింపబడుట నాటి యువ కవులకు ప్రోత్సాహకారణమయ్యెను. సత్యహరిశ్చంద్రాది సుప్రసిద్ధ నాటకములను రచించిన బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారితోడి స్నేహము, భారతనాటక కర్తలు తిరుపతి వేంకటకవులయందలి గురుభావ ప్రభావము శాస్త్రిగారిని నాటకకర్తగా నొనర్చియుండును.

దశరూపకములలో నాటకమొక భేదమయినను శాస్త్రిగారు వ్రాసినవన్నియును నాటకములుగా పేర్కొనబడుటచే ఈ ప్రకరణము "నాటకోల్లాసము"గా తీర్చబడినది.

---

* డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు, తెలుగునాటక వికాసము. (1967) పుట. 193.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శాస్త్రిగారు రచించిన నాటకములు మొత్తము నాలుగు. మూడు అముద్రితములు. ఒకటి అలభ్యము.

1. శ్రీ త్యాగరాయ చరిత్ర నాటకము.

2. చంద్రకాంతీయము.

3. జయప్రద.

పై మూడు అముద్రిత నాటకములు.

4. శ్రీరామకృష్ణ పరమహంస.

పై నాటకము గుంటూరు జిల్లా ప్రత్తిపాడులో ప్రదర్శితమని శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తిగారు చెప్పిరి.* నాటక ప్రతి అలబ్ధము.

నాలుగింటిలో రెండు మహాత్ముల చరిత్రలు. చంద్ర కాంతీయ, జయప్రద నాటకములు పౌరాణికములు. భక్తచరిత్రల యందు శాస్త్రివర్యులకుగల గౌరవము నాటకరచన యందును ప్రతిఫలించినది.

—o—

* ముఖాముఖి (10-7-1984)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ త్యాగరాయ చరిత్ర నాటకము

సంగీత సరస్వతీ పుంరూపుడు, పరమ భాగవతోత్తముడు అయిన త్యాగరాజు చరిత్రము నాలుగంకముల అసంపూర్ణ అముద్రిత నాటకముగా నుపలబ్ధము. ఇందు గద్యపద్యములేకాక త్యాగరాజ కృతులును పొందుపరుపబడినవి. ఇందలి పద్యము లధిక భాగము స్వీయ "త్యాగరాజు" కావ్యములోనివే.

కథను నాటకశిల్పమున కనుగుణముగా మలచిన తీరునుబట్టి కవి నాటక ప్రక్రియ యందును సిద్ధహస్తుడని నిరూపితమగును. ప్రథమాంకమున సీతారామ నారద సంభాషణలతో త్యాగయ్య జననము చెప్పబడెను. రాముడు త్యాగయ్యకు తారకమంత్ర ముపదేశించి స్వరార్ణవము నిచ్చిరమ్మని ఆదేశించును.

ద్వితీయాంకమున త్యాగరాజు ఆతని భార్య సంభాషణలలో పంచరత్న కీర్తనల వైశిష్ట్యము త్యాగయ్య ముఖమున చెప్పించిరి. నారదుడు బ్రాహ్మణ వేషమున వచ్చి త్యాగయ్యను పరీక్షించును. అతడు నారదుని గుర్తించును. నారదుడానందించి మంత్రోపదేశ మొనర్చెను.

తృతీయాంకమున తంజావూరు సంస్థానాధిపతి శరభోజి ఆతని మంత్రి సంభాషణలలో నాయకపరోక్షమున కథసాగిపోవును. శరభోజి త్యాగరాజును బలవంతముగా ఆస్థానమునకు రప్పింపనెంచును. అప్పుడాతనికి ఉదరశూల కలుగును. మంత్రి త్యాగయ్యఘనతను చెప్పుచు నారద మంత్రోపదేశానంతర కథనంతటిని రాజునకెఱింగించును. త్యాగయ్య తారకమంత్ర జపసిద్ధి నందుట, శ్రీరామచంద్రుడు ప్రత్యక్షమగుట, జ్యేష్ఠుడు రామపంచాయతనమును కావేరిలో పారవేయుట, త్యాగయ్య వానిని వెదకి తెచ్చుట మంత్రి మాటలలో నడచిపోవును. అదివిన్న రాజునకు కడుపు నొప్పి తగ్గును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

త్యాగయ్య తిరుపతియాత్ర, సుందరేశమొదలియారు కోరికపై శిష్యునిగూర్చి కృతులల్లుట, అరణ్యమున దొంగలు దోచుకొనబోవుట, వారికి జ్ఞానోదయమగుట చతుర్థాంకము సంచలి కథాంశములు.

నాటకలక్షణములు :

అంకములు కాక నాంది, ప్రస్తావన, అర్థోపక్షేపకములు, భరతవాక్యము అను అంశములు నాటకములందు సాధారణముగా గోచరించుచుండును. ఈ నాటకమున ప్రస్తావన, విష్కంభాదులు, భరతవాక్యము కనరావు. అసంపూర్ణమగుటచే భరతవాక్యముండి యుండునని భావింపవచ్చును. ప్రస్తావన లేకుండుట విశేషము.

నాటకము తెలుగైనను నాంది సంస్కృతమున రచింపబడెను.

నాదబ్రహ్మ స్వరూపాయ నారదావరమూర్తయే
స్వరరాగ సుధాబ్ధీందు త్యాగరాజాయతేనమః

పై శ్లోకము సుప్తిజ న్తం పదమ్ అను పద్ధతిననుసరించి ద్వాదశ పదాత్మక నాందియగును. "సుధాబ్ధీందు" అనుచోట మంగళ ప్రదమగు "ఇందు" శబ్ద ముప యుక్తము.

ప్రథమాంకము ప్రస్తావనాప్రాయము. సీతారాములు నటీసూత్రధారులై నాటక కథాదులను పరిచయముచేయుదురు.

తృతీయాంకము శుద్ధవిష్కంభసదృశము. శరభోజి మహారాజు అతని మంత్రుల సంభాషణ వలన రంగముపై చూపుటకు అసాధ్యములగు సన్నివేశము లన్నియు ప్రేక్షకులకు తెలియజేయబడినవి. అనేక దృశ్యములను చూపింపవలసిన శ్రమ వారి సంభాషణ వలన తప్పిపోయినది. కథనడచినది. ఇది కవిచూపిన రచనా శిల్పము.

పంచరత్నకీర్తనలు త్యాగరాజ గేయ మణిహారమున మేరు సమానములు. వాని వైశిష్ట్యము త్యాగరాజ ముఖమున చెప్పించి కవి నాటకరచనా ప్రయోజనము పరిపూర్ణమొనర్చెను.

"నిన్నేభజన సేయువాడ"నను కృతిలో పరబ్రహ్మ తన నిరాకారము సాకారలీలా విలాసముఖమున తెలియజేయుట ధ్వనింపజేసితిని. "జగదానంద కారక" యను కృతిలో శ్రీరామచంద్రుని విభూతి యోగము, విశ్వరూపము,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

భక్తశిష్టరక్షణము, దుష్టశిక్షణము మొదలైనవి నిజాత్మ శక్తివలననే ప్రకటించుచు పదునాల్గు భువనముల యానందమునకు తానే కారణమగుట వివరించితిని."

ఇట్లు భార్యకు త్యాగరాజునకు సంభాషణ కల్పించి పంచరత్న కీర్తనల ఆంతర్యము ప్రపంచించుట కథను నాటకానుగుణముగా మలచుటయే.

చతుర్థాంకమున దొంగల సంభాషణలో పాత్రోచితముగా గ్రామ్యభాష నుపయోగించుట మఱియొక విశేషము.

ప్రథమాంకమున సీతారాముల సంభాషణలో రాబోవు విషయమును బట్టి మనోహరా! ప్రణయినీ! దీనబంధూ! విశ్వరూపా! మున్నగు సంబోధనలను పరస్పర ముపయోగించుట చమత్కారము. చతుర్థాంకములో తిరుపతి మహాక్షేత్ర యాత్రా సాఫల్యము వేంకటేశ్వర వైభవము నాయకముఖమున చక్కగా చెప్పింపబడెను.

నాయకుడగు త్యాగరాజ మహాశయుని సంగీతశాస్త్ర వైదుష్యము, భక్తిజ్ఞాన వైరాగ్య సంపత్తి సువ్యక్తములు.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

జయప్రద నాటకము

ఇది జయప్రదాపురూరవుల చరిత్రము. పురూరవుడు షట్చక్రవర్తులలో నొకడు. పదునారు అరటావులలో పెన్సిలుతో వ్రాయబడిన ప్రతి లబ్ధము. తుదిమొదళ్ళు లేవు. అక్షరములు కానవచ్చుటలేదు.

నీచపాత్రలకు పాత్రోచితముగా గ్రామ్యభాష ఉపయుక్తము.

చదువుటకు కానవచ్చుచున్న పద్యములు కొన్నింటి నుదాహరింతును.

....వెన్నెల కలువకంటి
గలుపుకొని వచ్చుచున్నాడు కదలి వెడలి
జగములన్నిఁడ నమృతసేచనము నెఱప
నోపధీశుండు నిఖిల జీవోపయోగి

ముంగురులాస్య పద్మమున ముత్తములై నెఱిమీఱి ముద్దుగా
భృంగములట్లు క్రమ్ముకొన వింతగ వచ్చియురానిపల్కులన్
చెంగునబర్వులెత్తుచునుచేరి యొడిన్ దనువెల్ల బ్రాకుచున్
బొంగుచు చుంబనం బొసగుపుత్రుడు.... ....

పతివ్రతా శిరోమణియగు జయప్రదాదేవి చరిత్రము మంచి పౌరాణిక నాటకముగా ప్రసిద్ధి చెందినది. దురదృష్ట వశమున దృశ్యాదృశ్యమై అదృశ్య మగుచున్నది.

—౨—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

చంద్ర కాంతీయ నాటకము

ఇది ముప్పది పాపుటాపుపుటల అముద్రిత అసంపూర్ణ నాటకము. నాంది ప్రస్తావనలు, ప్రథమాంకమున కొంత భాగము నష్టము. చతుర్థాంకమున కొంత వరకు మాత్రమే వ్రాయబడెను. కథనుబట్టి ఇందలి నాయకుడు చంద్రకాంతుడనియు అతని తల్లి దండ్రులు చంద్రవదనా చంద్రచూడులనియు నాయిక పేరు రత్నమాలయనియు తెలియుచున్నది.

కథ :

చంద్రకాంతుడు చంద్రచూడమహారాజు కుమారుడు. పన్నెండురోజుల ప్రాయమువాడు. వాని జాతకదోషము పోవుటకై పండ్రెండేండ్ల బాలికకు వివాహము చేయవలసివచ్చెను. మంత్రికొడుకు సుబుద్ధియను యువకునొప్పించి చంద్రకాంతుడుగా పీటలపై కూర్చుండబెట్టి అక్కడ ఒక పెట్టెలో చంద్రకాంతు నుంచి దానిపై పుష్పవేహారమును వెయుంతురు. పెండ్లికూతురు రత్నమాల.భర్తకై ఎదురుచూచు రత్నమాల యొద్దకు సుబుద్ధి కాషాయవస్త్రధారియై పోవును. భర్త వైరాగ్యము పోగొట్టుటకై ఆమె అనేక ప్రయత్నములు చేయును. అతడు సత్యము చెప్పి చంద్రకాంతుడున్న పెట్టెనందించును. ఆమె చింతించి అది దైవాదేశమని భావించి బాలునిగైకొని అరణ్యమునకు పోవును. అచ్చట ఆశ్వనీ దేవతలు ఆమె పాతివ్రత్యమునకు మెచ్చి ఆకలిదప్పిక లేకుండునట్లు చంద్ర కాంతుని వ్రేలికొక యుంగరమును తొడిగిపోవుదురు. ఇంత వఱకు మాత్రమే నాటకముపలబ్ధము.

ఇది గద్యపద్య మిశ్రితమైన నాటకమయ్యును పద్యములె అధికము. కొన్ని చోట్ల సంభాషణలును పద్యములలోనే నడచినవి.

నవీనభావ సనాథములగు పద్యరత్నము లిందనేకము కలవు

ఆ మేడలాజాడలానీడలే కాని
యెఱుగదా పెఱవీటి సిరులపేటి
ఆ పోకలాయాకులా తీరికలెగాని
ఛవిజూచియెఱుగదా జలకణంబు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

లా పాటలాయాటలానాటికలె గాని
చెవిజేర్చియెఱుగదా సవతిపోరు
నా తిన్నెలాచిన్నెలావన్నెలే గాని
యెరుగదాయత్తవారింటి నడక
యెటుల బాలించెదో పట్టినింకమీద
ముగుదపూబోడి సుదతియంభోరుహాక్షి
పాలలోదేరు నిగ్గు మాపాలి యమృత
మప్పగించితిమప్ప మాయప్పదీర

ఆడువారి తెలివాల్చాపుల మహిమ ఈ క్రింది పద్యమున వర్ణితము.

కులిశప్రజ్వలితాగ్నిహోత్రమునకుం గూపెట్టి ఫాలాక్షుకా
లలయప్రక్రియకోహటించి విమతాలాపచ్ఛిదాహుంక్రియా
కులసౌదర్శన ధాటి కద్దుపనియే గూర్పంగ బూబోండ్ల మే
త్తైలివాల్చాపులపోకచాలునట తంత్రీ యంత్రమో మంత్రమో

ఇట్టి సుందరపద్యసుమ శోభితము నాటకశిల్ప మండితమునగు చంద్ర కాంతీయ నాటకము అసంపూర్ణముగ మిగులుట బాధాకరము.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నవమము
లక్షణోల్లాసము

'ప్రయోగశరణం వ్యాకరణమ్' అనుసూక్తి సంస్కృతాది ప్రాచీన భాషల కంటె, ఆంధ్రాది జీవద్భాషల కెక్కువగా నన్వయించును. తెలుగులో ప్రామాణిక కవుల ప్రయోగములన్నింటిని కూడ వ్యాకరణములు సాధించుటకు సమర్థములు కాకున్నవి. ఇందుచేతనే నేటికిని తెలుగు కవులు వ్యాకరణములకంటె పూర్వ మహాకవి ప్రయోగములను ప్రమాణములుగా గైకొనుచున్నారు. అట్టి ప్రామాణిక ప్రయోగముల నొకచోటికి చేర్చి కవులకుపకారము చేయనెంచి శాస్త్రిగారు 'ప్రౌఢ కవి ప్రయోగదర్పణము' అను నొక గ్రంథమునకు విషయసేకరణ మొనర్చిరి.

"భాషావిభాగదర్పణము" అను మఱియొక గ్రంథమున కూడ వ్రాసినట్లు రచనల పట్టిక వలన తెలియుచున్నదిగాని అది అలభ్యము.

రసజగద్విహారులగు కవులకు వ్యాకరణములపై మక్కువ మిక్కుటముండదు. అట్లే వైయాకరణులు రసవంతమగు రచనచేయుట అరుదని పెద్దల మాట. సంతతకవితా స్రష్టలగు శాస్త్రిగారు సంస్కృతాంధ్ర వ్యాకరణములను శ్రద్ధతో నభ్యసించి మహాకావ్యములను పఠించునపుడు వ్యాకరణదృష్టిని కూడ కలిగియుండుటను వారి ఈ కృషి తెలియజేయుచున్నది.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ప్రౌఢకవి ప్రయోగ దర్పణము

ఇందు నన్నయగారి ఆదిపర్వము నుండి సేకరించిన విశేష ప్రయోగములు సుమారు రెండు వందలు కలవు. వీనిలో చాలభాగము ప్రౌఢవ్యాకరణమునందు చూపబడినవే. బాలవ్యాకరణ సాధ్యములు కూడ కొన్ని కలవు. పైరెంటిచేతను సాధ్యములు కాని విశేషప్రయోగములు మరికొన్ని యుండుట గమనార్హము.

ఇట్టి ప్రయోగములను సేకరించి వానికి సూత్రవృత్తులు వ్రాయదలచిరో లేక వ్యాసరూపమున ప్రకటింపనెంచిరో తెలియదు. నిర్ణయించిన గ్రంథనామమును బట్టి వట్టి ప్రయోగములను ప్రకటింప నెంచిరని భావింపవచ్చును.

ప్రౌఢకవి ప్రయోగములనగా పూర్వము వ్యాకరణముల యందు చెప్పబడిన వైనను కాకపోయినను ప్రౌఢిమగల ప్రయోగములని భావింపవలయునే కాని పూర్వవ్యాకరణ పరిశిష్టములని తలపరాదు. శాస్త్రిగారుద్ధరించిన అగతిక ప్రయోగములను కొన్నింటిని పరిశీలింతము.

"గనినవారు దృష్టు గనిన ఫలంబెల్ల" (ఆది–సప్తమ–180)

దృష్టిశబ్దమునకు బహువచనము పరమగునపుడు 'ఇత్తునకు బహువచనంబు పరంబగునపుడుత్వబంగు' (బాల-తత్సమ-46) అను సూత్రముననుసరించి ఉత్వము మాత్రమే రావలసియున్నది. కాని ఆచ్ఛిక శబ్దములలోవలె పై ప్రయోగమున తత్సమ శబ్దమునకు ఉత్వలోపము చేయబడినది.

'బహువచనంబు పరంబగునపుడు డ, ల, ట, ర, ల యుత్వంబునకు లోపంబు బహుళంబుగానగు' (బాల–ఆచ్ఛిక–12) అను సూత్రవృత్తిలో 'తత్సమంబులం గోటి పిప్పలి శబ్దంబులకీ కార్యంబు చూపట్టెడు' అని చిన్నయసూరి రెండు శబ్దములను మాత్రము పేర్కొనెను. తత్పూరకముగానైనను ప్రౌఢవ్యాకర్త నన్నయప్రయోగమును సాధింపలేదు.

'వడిగలదు మనసు కంటెను గాడ్పు కంటె' (ఆది-1-114)

'కరుణగలుగు మమ్మకమలనేత్ర' (ఆది–అష్టమ-4)

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై రెండు ప్రయోగములందును 'కలుగు' ధాతువు ప్రత్యేకమైన అర్థమును బోధించుచున్నది. 'కూడు' అను నొక నర్థము నిచ్చి 'కరుణకలుగుమమ్మ' అను ప్రయోగమును శబ్దరత్నాకరమున బహుజనపల్లివారు చూపిరి కాని పై రెండు చోట్ల స్ఫురించుచున్నమతుబర్థము నాధారము చేసికొని కలుగు ధాతువైచిత్రిని సూత్రీకరింపవలసియున్నది.

'వినయమున ద్రోణురూపు మన్ననసొనర్చి' (ఆది-5-232)

ఇవి ద్వితీయాద్యేకవచనంబులు పరంబులగునపుడు నామంబులకుం గొన్నింటికిం బ్రాయికంబుగనగు' (బాల-ఆచ్ఛిక-28) అను సూత్రమున సూరి 'ప్రాయికంబుగ' అని యుపయోగించెనే కాని ఔపవిభక్తికములు రాని రూపమొక్కటియు చూపలేదు. ప్రౌఢ వ్యాకర్తయు దానిజోలికి పోలేదు. 'ఔపవిభక్తిక సంజ్ఞావర్ణాష్టింట్యా దయోభవంతీహ' (చింతామణి-సంధి-సూ.39) అను సూత్రవ్యాఖ్యలో అహోబలపతి ఔపవిభక్తికములు రాని రూపములను కొన్నిటిని స్వతంత్రముగా చూపెనేకాని మహాకవి ప్రయోగములను చూపలేదు. పైనన్నయగారి ప్రయోగము ఉదాహరణీయము.

ఇట్టీ ప్రౌఢకవి ప్రయోగదర్పణము సర్వమహాకవి ప్రయోగములను ప్రతిబింబించినచో కవులకు, వైయాకరణులకు మిక్కిలి ఉపయోగ్యమయ్యెడిది. ప్రకృతమీ ప్రయత్నము శాస్త్రిగారి సునిశిత పరిశీలనా దృష్టికి సాక్ష్యముగా మిగిలిన అసంపూర్ణ భాషాకృషి.

—o—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

దశమము

విమర్శోల్లాసము

సాహిత్యమున విమర్శన ప్రక్రియకు విశిష్టస్థానమున్నది. సాహిత్యములోని మంచి చెడులను తేల్చి చెప్పెడు న్యాయస్థానమదియే.

విమర్శకుడు సహృదయుడై కవి హృదయము నెఱిగి రాగద్వేషముల కతీతముగ కావ్యసౌందర్యమును ప్రకాశమాన మొనర్పవలెను. అదియే ఉత్తమ విమర్శ యనబడును.

ప్రాచ్యవిమర్శ ప్రతిపదార్థాద్యంగములతో వ్యాఖ్యానరూపమున నుండును. పాశ్చాత్యవిమర్శ కావ్యాంతర్యము నావిష్కరించు వ్యాసరూపమున నుండును.

శాస్త్రిగారి విమర్శరచనములు రెండు. గీతగోవింద రహస్యము సంపూర్ణము. శాకుంతల పాత్రప్రయోజనము అసంపూర్ణము. ఇది ప్రతి శ్లోకవచన వ్యాఖ్యలో ప్రాచ్యపద్ధతిని, కావ్య హృదయావిష్కరణములో పాశ్చాత్య పద్ధతిని పుణికి పుచ్చుకొన్నది.

అష్టపదుల ఆంతర శరీరాన్ని యీ విధంగా అక్షరరూపంలో మనకు ప్రత్యక్షం చేసిన శ్రీ శాస్త్రులుగారి పరిశోధన అభినందనీయం'* అని గీత గోవింద రహస్య సమీక్షకులు ప్రశంసించిన శాస్త్రిగారి పరిశోధన పాటవమును ఈ విమర్శోల్లాసమున వీక్షింతము.

·)(·

---

* ఆంధ్రపత్రిక. 12-1-1958.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

శ్రీ గీతగోవింద రహస్యము

జయదేవుని గీతగోవింద కావ్యరహస్యముల నావిష్కరించు ఈ విమర్శ గ్రంథము 1956లో శ్రీ రెడ్డిబత్తుల రామిరెడ్డిచే ముద్రితము. ఆయనయే కృతి భర్త.

గీతగోవిందము జగత్ప్రసిద్ధమగు కావ్యము. భక్తి శృంగారములు పడుగ పేకలుగా నేసిన పట్టుబట్ట యది. ఆకారమునకు చిన్నదయ్యును ఆకర్షణలో దానిని మించినది లేదు. భక్తులకు, వేదాంతులకు ఆ కావ్యములోని అంతస్తత్వము ఆవిష్కరించి చూపుటకే ఈ గ్రంథము రచింపబడినది.

'సామాన్య కావ్యదృష్టిలో గీతగోవిందం శృంగారకావ్యం. ఆత్మార్థజిజ్ఞాసువులకు శుద్ధతత్త్వనిరూపణ సుగమమౌతుంది దీనిలో. ఆ పరమార్థాన్ని కూలంకషంగా విమర్శించి వివరించారు శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారీ రచనలో. కనుకనే ఇది గీత గోవింద రహస్య మయింది' అని శ్రీ యామిజాల పద్మనాభస్వామి ఈ గ్రంథాన్ని సమీక్షించారు.*

జయదేవుడు శృంగారము, సంగీతము, నాట్యము మొదలగువాని నెన్నిటిని చూపినను కృష్ణైకతానాత్ముడు. ఆ విషయమును సానందముగా పరిశోధించు కొమ్మని పండితులనాయన కోరినాడు.** సుధీవిలాసులగు శాస్త్రిగారు జయదేవుని వేదాంతత్వమును లోతుగా పరిశోధించి గీతగోవిందమున దాగిన రహస్యములను ప్రకాశమానమొనర్చిరి.

"గీతగోవిందమున తత్త్వమున్నదని తద్జ్ఞులకు తెలియును కాని దాని నింతగా పైకి తెచ్చి చూపిన విమర్శ తెలుగుతో మరియొకటిలేదు. సంస్కృతాది భాషలలో కూడ నిట్లు ప్రత్యేకముగా తత్త్వావిష్కరణమునకై వెలువడిన గ్రంథము లేదని" జయదేవుని గీతగోవిందముపై విస్తృత పరిశోధనచేసిన డాక్టర్ వైద్యుల కృష్ణారావు గారనిరి.***

---

* ఆంధ్రపత్రిక 12-1-1958.

** 'సానందాః పరిశోధయంతు సుధియః శ్రీ గీత గోవిందతః' (శ్లో. 82.)

***ముఖాముఖి : 10-4-1986.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

'ఉత్తర హిందూస్థానమున వోథృ పండితులచే సంస్కృత భాషలో వ్రాయబడిన బహుభాష్యములను జూచి వాని యన్నిటి సారముగా గీత గోవింద రహస్యమను పేర కృతికి నిర్ణయించి క్రమముగా శ్లోకములను గేయములను మూలము వ్రాసి వెంటనే రహస్యమును వచనరూపమున ప్రకటించితిని.'

అని 'మున్నుడి'లో గ్రంథకర్త తన ప్రణాళికను ప్రకటించెను.

శ్లోకగేయములకు యథాసంఖ్యముగా రహస్యావిష్కారము.

అష్టపదులపైనున్న సాంకేతిక నామముల వివరణము.

అధరాద్యవయములకు, చుంబనాదిచేష్టలకు తాత్త్విక నామప్రకాశము.

అను మూడు పద్ధతులలో గీతగోవింద రహస్యము ప్రకాశితము.

మేఘైర్మేదురమంబరం వనభువశ్శ్యామా స్తమాలద్రుమైః
నక్తం భీరురయం త్వమేవ తదిమం రాధే! గృహం ప్రాపయ
ఇత్థం నంద నిదేశతశ్చలితయోః ప్రత్యధ్వకుంజద్రుమమ్
రాధామాధవయో ర్జయంతి యమునాకూలే రహః కేళయః

అను శ్లోకమునకు రహస్యప్రకాశము—

'ఆకాశమున మబ్బులు క్రమ్మెననగా జ్ఞానమణిని మాయపొరలావరించుట యనియు, వనభూములు కానుగు చెట్లచే నల్లనైనవి యనగా నింద్రియములు శబ్ద స్పర్శరూపరస గంధములను విషయములచే దూషితములయ్యెననియు, రాత్రియనగా దనలోనేయున్న పదార్థమును తానెఱుంగకుండుట యనియు, ఇతడు భీరువన నామరూపక్రియా రహితుడుడైన తాను క్రియాసహితుడగుట జీవదశజెంది కల్పిత సంసారము నుండి యెట్లు స్వస్థానము జేరుదునోయని నిర్వేదపడుటయనియు.... బయలుదేరిన రాధామాధవులు సర్వాంతర్యాములయిన ప్రకృతి పురుషులనియు.... రహఃకేళులుత్కర్ష జెందుచున్నవన....సమాధియందు హాయియుయ్యేలకు చేరువై యజపాగాయత్రీ సంజ్ఞితము, హంసమంత్రాత్మకమునై యూగు 'సోహం' ధ్వన్యాత్మక నిట్టూర్పులు, గురూపదిష్టమార్గమున గుర్తెఱుంగుట యనియు గీత గోవింద కావ్యాష్టపదీ రహస్యము.'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఇట్లు అన్నిశ్లోకములకు, అష్టపదులకు రహస్యార్థము ప్రకాశితము.

సాంకేతిక నామ వివరణము :

జయదేవుడు ప్రతి అష్టపదికి ఒక సాంకేతిక నామము నుంచెను. వాని అంతరార్థ మిందు వివృతము. "కాపి మధురిపుణా' అను నష్టపదికి 'హరిరమిత చంపకశేఖరము' అని సాంకేతిక నామము.

ఈ నామము వలన దూరమందున్నను సువాసనచే వాయువశమున సంపంగి పూవు దగ్గఱనున్నట్లు రెట్లు తెలియబడుచున్నదో యట్లే తాను దూరమందున్నను కృష్ణుడు భావనాబలమున ననుభవ బలమువలనను కృష్ణుడు తనకు కన్పించుటచే సుఖించుచున్న యనిర్దిష్ట స్త్రీయును కన్పించుచుండెనను గూఢార్థము ప్రకటమగు చున్నది.'

అని ఆ సాంకేతిక నామమునకు వివరణము.

తాత్త్వికనామప్రకాశము :

కావ్యమున కన్పించు అధరాద్యవయ నామ రహస్య మిట్లావిష్కృతము.

నిర్వేదము	—	అధరము
సద్విచారము	—	అధరామృతము
మనోలయము	—	ముఖము
సత్తు - చిత్తు	—	స్తనద్వయము
విజాతీయ జ్ఞప్తి	—	లజ్జ
సజాతీయ జ్ఞప్తి	—	ప్రణయము

ఇట్లే తదితరముల గూర్చియు చెప్పబడెను. "శృంగార రసావయములుగా పైకి కన్పించునవి రాధాకృష్ణులు ప్రకృతి పురుషులను శుద్ధాద్వైత తత్త్వరహస్య మును తెలియజేయు సాధనలుగా ఆధ్యాత్మికానుభవ గ్రంథ పరిశోధన వివరణ సహాయముచే ప్రకటించితిని" అని తమ యూహకాకరములను విమర్శకులు పేర్కొనిరి.

ఇట్లు తత్త్వావిష్కారమేకాక మరికొన్ని లౌకిక సందేహములకు కూడ సమాధానములు చెప్పబడెను. అష్టపది యనగా ఎనిమిది పదముల మాత్రమే

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

యుండవలయును. తొలిగేయములో పదునొకండు పదములున్నవి. ఇది నియమ భంగము కాదా అని సందేహము.

"పాతకపతనోచితముగా కవి గేయములందు ప్రతిపాదించిన నియమము కన్న సృష్టి స్థితి లయ కర్తయగు భగవానుని దుష్టశిక్షణ, శిష్టరక్షణాత్మక దశావతార వర్ణక్రమ నియమము బలవత్తరమని పరిహారము చెప్పుకొనదగును" అని సమాధానము.

పచ్చి శృంగార కావ్యమని విమర్శకులకు గురియగుచున్న గీతగోవిందము యొక్క ఆంతర్యమును ఆవిష్కరించిన ఈ గీతగోవింద రహస్యము అన్ని వర్గముల వారికి అవశ్య పఠనీయము. తెలుగువారికిది మహోపకారము. దీనిని ఇతర భాషలలోనికి కూడ అనువదించినచో అంతర్ముఖులగు రసజ్ఞులు గీతగోవింద తత్త్వము నెఱుగుటకు కరదీపికయై ప్రకాశించును.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అభిజ్ఞాన శాకుంతల పాత్ర ప్రయోజనము

శాస్త్రిగారి రచనలను తెలియజేయు కరపత్రమొకటి ముద్రితము. దానిలో పేర్కొనబడిన అముద్రిత రచనలలో అభిజ్ఞాన శాకుంతల పాత్ర ప్రయోజన మొకటి. లభించిన అముద్రిత రచనలను పరిశీలింపగా వానిలో శాకుంతలమును గూర్చి పెన్సిలుతో వ్రాయబడిన నాలుగు అరటావులు లభించినవి. పుట సంఖ్య అయిదు నుండి ఎనిమిది వరకు నుండుటచే మొదటి నాలుగు పుటలు నష్టము లైనట్లూహింపవచ్చును. లభించిన పుటలలో పంచమ, షష్ఠ, సప్తమాంకములు విమృష్టములగుటచే మొదటి నాలుగంకములను గూర్చి లభింపని నాలుగు పుటలలో చెప్పబడియుండును. మొత్తము మీద ఈ విమర్శ లఘుపరిధిలో జరిగినదే తప్ప విస్తృతమగు ప్రణాళిక కాదని చెప్పవచ్చును.

శాకుంతల నాటకము నందలి వివిధ పాత్రల, సన్నివేశముల వెనుకనున్న ఆంతర్యము వాని ప్రయోజనము గచ్ఛద్వ్యాఖ్యగా నిందు విమర్శింపబడినవి. కంచుకి, వైతాళికులు, పురోహితుడు, ప్రతీహారి మొదలగు చిన్న పాత్రలు కూడ శాస్త్రిగారి దృష్టిని దాటిపోలేదు. విమర్శ ఇట్లు సాగినది -

"కంచుకి ప్రవేశముచే శకుంతలా కణ్వ శిష్యాగమనము, తద్గౌరవము, దుష్యంతుని ధర్మ బద్ధమైన ప్రజా పరిపాలనము, కణ్వాశ్రమము హిమవద్గిరి సమీపము నందుండుట గోచరింప చేయబడినది"

"నేపథ్య వైతాళిక ప్రవేశము వలన ప్రభు ప్రజా పక్షపాతత్వము, అమార్గగాముల మార్గగాముల నొనర్చు ధర్మమూర్తి నాయకుడు తాన మార్గగామి యగుట న్యాయము కాదనుట తెలియచేయబడినది.

"పురోహిత ప్రవేశము వలన శకుంతలా రక్షణము........" (అక్షరముల దృశ్యములు)

ఒక పాత్రను గైకొని నాటకము మొదటి నుండి తుదివరకు తత్ప్రయోజనమును, ప్రాముఖ్యమును విమర్శించు సంప్రదాయమే పాశ్చాత్య ధోరణి అలవడిన తరువాత మనభాషలో గోచరించుచున్నది. శాస్త్రిగారు పై విధముగాకాక ఒకేపాత్ర వివిధాంకములలో ప్రత్యక్షమైనప్పుడెల్ల తత్ప్రయోజనమును అంక క్రమమున

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

విమర్శించిరి. ఈ పద్ధతి వలన నాటకములోని చిన్న పెద్ద పాత్రల నన్నింటిని స్పృశించుటకు వీలగును. ఇంతేకాక ఈ విమర్శను ప్రక్కన బెట్టుకొని నాటకమును చదువుటకు భాషాభిమానులకు విద్యార్థులకు ఎంతయో ప్రయోజనకరముగా నుండును. అప్పటికప్పుడు ఆ సన్నివేశములో విశేషములు తెలియుచుండును.

అభిజ్ఞాన శాకుంతలమున సర్వదమన పాత్ర మారీచాశ్రమమునందు కొలది సేపు మాత్రమే కన్పట్టును. ఆ బాలుడు ఋష్యాశ్రమములో పెరుగుటయందలి అంతర్య మిట్లావిష్కృతము.

"ముని జనాశ్రమమందు పుట్టి వారిచే సంస్కృతుడగుట పరిశుద్ధత్వము. మాతృభక్తి. పాపరాశుడగు తండ్రియందు ఉపేక్ష తెలియజేయబడినవి."

భవిష్యద్భారత చక్రవర్తియగు భరతునకు దుష్యంతుని దోషములు లేకుండ చేయుటకై కాళిదాసతనిని తల్లివలె ఋషివాటికలో పెంచి దోషరహితుని గావించెనను సూచన పై వ్యాఖ్యానములో నున్నది. ఈ విధముగా ప్రతి సన్నివేశము నందును కాళిదాస హృదయము నావిష్కరించు మార్గమున నీ విమర్శ సాగెను.

ఇట్లు ప్రాచీనవ్యాఖ్యాన పద్ధతికి, నవీన విమర్శనా విధానమునకు భిన్నమైన మూడవ మార్గమున సాగిన ఈ విమర్శ పరిపూర్ణముగా లభించి ముద్రింపబడినచో విమర్శశాఖకు మఱియొక చిఱుకొమ్మ మొలచినట్లయ్యెడిది.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఏకాదశము
వ్యక్తిత్వోల్లాసము

శ్రీ చల్లా పిచ్చయ శాస్త్రి జీవితమును, రచనలను సమగ్రముగా పరిశీలించి నిరూపింపదలచినది వారి బహుముఖీన వ్యక్తిత్వవైశిష్ట్యమే. తన్నిరూపణము వలన వారియొక్క, వారి సాహిత్య సృష్టియొక్క ప్రత్యేకత ఎట్టిదో నిగ్గు తేలును.

వ్యక్తిత్వము
సాహితీ వ్యక్తిత్వము
సామాజిక వ్యక్తిత్వము
ధార్మిక వ్యక్తిత్వము
ఆధ్యాత్మిక వ్యక్తిత్వము

అను వ్యక్తిత్వ పంచకమును సప్రమాణముగా, సమగ్రముగా ననుశీలించినచో శాస్త్రిగారి సంపూర్ణ తేజోరూపము రసజ్ఞుల కానంద సంధాయకము కాగలదు. సాహిత్యవ్రతులకు మార్గదర్శకమై నిలువగలదు. ఆ యా విశేషముల నన్నిటిని ఎక్కడి కక్కడ విడివిడిగా వివరించితిని. వాని నీ యుల్లాసములో క్రోడీకరించి సమీక్షింతును. వ్యక్తిత్వము కాక మిగిలిన నాలుగు సాహిత్యము నుండియే సమీక్షింపబడును.

—0—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వ్యక్తిత్వము

రూపసంపద ;

"ఆకార సదృశ ప్రజ్ఞః" అను కాళిదాసోక్తి చల్లా వారికి నన్వయించును.

శాస్త్రిగారు పసిమి చాయగల బక్కపలుచని మానిసి. పొట్టి పొడుగుకాని విగ్రహము. కోలమొగము. విశాల స్వచ్ఛనేత్రములు. నిడుపైన నుదురు. పెద్ద చెవులు. తీరైన ముక్కు. మొత్తము మీద నిర్మల సుందర రూపము.

ఆహార విహారములు :

ఎంత దూరమైనను శ్రమలేకుండ నడచుట, గసగసాలు నమలుట, సర్వ సుగంధద్రవ్య సమ్మిశ్రిత తాంబూల సేవనము వారి అలవాట్లు*.

నెమ్మదిగా, మితముగా, మృదువుగా భాషించు తీరు వారిది. వాక్పారుష్య మెన్నడును ఎఱుగరు.

"వారెప్పుడునూ శిరము వంచుకొనే నడుస్తూంటారు. "నాకీలోకంతో ఏమి సంబంధం" అనే నడక. అదొక మందగమనము. ఎవరైనా వారిని పలుకరించి నప్పుడు ఒక నిముషము వఱకు మాట్లాడరు. ఆ నిమిషములో గౌరవమైన హృద యలీనం జరుగుతుంది. అటు తర్వాత వారి నోట వచ్చు మొదటి పదమే అతి పవిత్రంగా మనలను వశ్యంజేస్తుంది. **

బ్రహ్మ ముహూర్తమున నిద్రలేచి తంబుబ శ్రుతిలో ప్రభాత సేవచేసి స్నానాద్యనుష్ఠానములు కావించి కవితా రచనకు గడంగుట వారి నిత్యకృత్యము. చేతివ్రాత ముత్తెపు సరులు పోహళించిన తీరున గుండ్రమగు నక్కరములతో సరళరేఖపై వ్రాసినట్లుండును.

భోజన ప్రియులు. హడావుడి పడక ప్రశాంతముగా భుజించెడివారు.

---

* ముఖాముఖి. శ్రీమతి పాలపర్తి పూర్ణాంబ (శాస్త్రిగారి చిన్న కొమార్తె)

** శ్రీ కస్తూరి సీతారామారావు, షష్టిపూర్తి సంచిక, పుట. 38.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఉత్తమ శిష్యులు :

గురువు లిద్దఱి మెప్పులను పొంది వారికి తలలోని నాల్కవలె మెలగి వాత్సల్య రసమును గ్రోలి "శాస్త్రివచ్చిన నాడే పాఠము" అనిపించుకొనిన ఉత్తమ శిష్యులు.

గురూత్తములు :

పాఠశాలలో, కళాశాలలో, ఇంటి యొద్ద ఎందఱో శిష్యులకు విద్య గఱపి తనంత వారిని చేసిరి. అట్టి వారిలో సర్వశ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి, పండితారాధ్యుల నాగేశ్వరరావు, చింతలపాటి నరసింహదీక్షిత శర్మ, ఓగేటి పరీక్షిత్‌శర్మ పాతూరి వేంకటరామశాస్త్రి మున్నగువారు ముఖ్యులు.

పౌరాణిక శేఖరులు ;

పలుతావులలో భారతాది గ్రంథములను శాస్త్రిగారు పురాణముగా చెప్పెడివారు.

"వారు పురాణం చెప్పే కాలంలో భగవద్విషయం వచ్చి నప్పుడు ఒక్క త్రుటిలో భగవత్ సాక్షాత్కారం కలిగించే విధంగా శ్రోతల మనస్సులను పవిత్ర స్థాయికి తీసుకొని వెళ్ళేవారు." *

ధర్మజ్ఞులు :

గృహస్థ మానవ ధర్మముల కనుగుణముగా అతిథి అభ్యాగతుల నాదరించుట, లేదనకుండ అన్నదానము చేయుట, పేదలయందు కరుణ కలిగి యథాశక్తి వారికి సహాయపడుట శాస్త్రిగారింట నిత్యకృత్యము. వైదిక ధర్మాచరణము వారి మార్గము.

కృతజ్ఞులు ;

చేసిన మేలు మఱువక గురువుల చరిత్రను కావ్యముగా వ్రాసిన కృతజ్ఞతామూర్తి.

భాగవత భక్తులు :

బ్రహ్మానంద తీర్థ స్వాములవారు, బోధానందేంద్ర సరస్వతి మున్నగు

* శ్రీ కస్తూరి సీతారామారావు, షష్టిపూర్తి సంచిక: పుట. 37.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

మహానుభావుల, పరమ భాగవతోత్తముల సాంగత్యము వారి జీవితమున మరొక విశేషము.

సంయమివ్రతులు :

దంత వేదాంతము కాక చదివిన దానిని అనుభవమునకు తెచ్చుకొని అరిషడ్వర్గము నదుపులోనుంచి, ఇంద్రియములను నిగ్రహించి ఋషిజీవనులని సర్వులచే కీర్తితులైరి.

ఉపాసకులు ;

శాస్త్రిగారి ఉపాస్య దైవము హనుమంతుడు. కామేశ్వరి, హేరంబుడు ఇష్ట దేవతలు.

చల్లని సుస్వభావమును చల్లని సత్యవచః ప్రసంగమున్
చల్లని దృగ్విలాసమును జల్లని సత్కవితా ప్రపంచమున్
చల్లని సత్ప్రవర్తనము చల్లని శాస్త్రసమాఖ్య కల్గుటన్
చల్లని వారు పేర్పడిరి చల్లని వారన చల్లవారనన్ *

—0—

* శ్రీ పాద కృష్ణమూర్తి శాస్త్రి, షష్టిపూర్తి సంచిక, పుట. 2

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సాహితీ వ్యక్తిత్వము

ప్రక్రియా వైవిధ్యము :

ప్రబంధము, కావ్యము, ఖండ కావ్యము, శతకము, వ్యాసము, హరికథ, నాటకము, జీవిత చరిత్ర, విమర్శ శాస్త్రిగారు పండించిన ప్రక్రియలు. ఇంతేకాక వాగ్గేయకారులై అనేక గేయములను రచించిరి.

వస్తు స్వీకరణము :

ఏ ప్రక్రియ చేపట్టినను కథావస్తువు భక్తి సంబంధియే. భగవచ్చరిత్రల కంటె భాగవత చరిత్రల యందే శాస్త్రిగారి కిష్టము మెండు. జయదేవుడు, రామదాసు, త్యాగరాజు, రామకృష్ణ పరమహంస, బ్రహ్మానందతీర్థులు, పౌరాణిక పతివ్రతలు మొదలగు వారి కథలే వారికి వస్తువులు.

ప్రఖ్యాతోత్పాద్యాది భేదముతో చూచినప్పుడు వస్తువు లధిక భాగము ప్రఖ్యాతములే. ఉద్యానము ఉత్పాద్యమనదగును.

కల్పనా శక్తి :

స్వతంత్ర కల్పనల వలన కవి సామర్థ్యము వ్యక్తమగును. శాస్త్రిగారు స్వీకరించిన వస్తువులు ప్రఖ్యాతములైనను అందు వారు కావించిన కల్పనలు మనోహరములు.

శ్రీమదమరావతీ క్షేత్ర మాహాత్మ్యమున పాణిగ్రహణ సన్నివేశ కల్పనము ఉద్యాన కథాకల్పనము, హేరంబ శతకమున శబ్ద ప్రపంచ కల్పనము, శుకరంభా సంవాద కల్పనము మున్నగు బహువిధ కల్పనలు శాస్త్రిగారి కల్పనా శక్తికి నిదర్శనములు.

వర్ణనా నైపుణ్యము :

"వర్ణనా నిపుణః కవిః" అని ఆలంకారిక నిర్ణయము. శాస్త్రిగారు తమ రచనలలో చాటువులలో నవీనములు, వైవిధ్య భరితములగు వర్ణనలను నిర్వహించుట ఆ యా తావులందు వివరింపబడినది. పిపీలికాది బ్రహ్మ పర్యంతము పర్వతములు, నదులు, అరణ్యములు, నగర జనపదములు, సూర్యోదయాద్ధి కాలవర్ణ

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

నలు, వసంతాది ఋతు వర్ణనలు, మానవ దైవత వర్ణనలు బహుముఖీనములై విరాజిల్లినవి. రామదాసు చరిత్రలోని గ్రీష్మర్తు వర్ణన ఆదిభట్ల నారాయణదాసు గారికి రోమాంచము కల్గించిన సన్నివేశము జీవితోల్లాసమున వర్ణితము.

రసపోషణము :

తొమ్మిది రసములకును శాస్త్రిగారి సాహిత్యమున స్థానమున్నది. అయినను వారికిష్టరసము శాంతము. ఒక్క మాయావిలాసము తప్ప మిగిలిన రచనలన్నియు శాంతరస ప్రధానములే. భక్తిని రసముగా నంగీకరించినచో వానిలో కొన్ని భక్తి రస ప్రధానములగును. తరువాత కరుణ, దాని తరువాత శృంగారము వారెక్కువగా పోషించిన రసములు గీతగోవిందానువాదమును శాంత రసోన్ముఖము చేయుట గమనార్హము.

పాత్ర చిత్రణము :

శాస్త్రిగారు చిత్రించిన వన్నియు భక్త పాత్రలగుటచే మహోన్నత వ్యక్తిత్వసంపద ఆబాల్యము ఎట్లభివృద్ధి చెందినదో పరిణామ క్రమమున చిత్రించుటయే కాక శాంతరసానుగుణముగా వానిని మలచిరి. అనగా భగవద్రతి మాత్రమే స్థాయిగా నుండెడి పాత్రలను శమస్థాయికములుగా తీర్చిరి. రామదాసు పాత్రణము నందిది స్పష్టము. రంభ, 'ఉపదేశము' నందలి దొంగ, 'హంసలదీవిప్రభావము' నందలి వెలయాలు మున్నగు పాత్రలును తమ ప్రవృత్తులను మార్చుకొని సజ్జను లగుచుందురు. దుష్టపాత్రలకు స్థానమేలేదు. ఏ పాత్రనైనను దాని నైజస్వభావము సువ్యక్తమగునట్లు చిత్రింతురు. 'ఉద్యానము' నందలి కవి, రాజ పాత్ర చిత్రణము లిందులకుదాహరణములు.

అలంకారప్రియత్వము :

శబ్దాలంకారములందు శాస్త్రిగారికి తగుమాత్రపు మక్కువ కలదు. పట్టుబట్టి సాగదీసినట్లుకాక అయత్నముగ నేర్పడు యమకానుప్రాసాదులను, అంత్యప్రాసలను, ఎత్తుగీతి చివరిపాదమున మధ్యాంత్య ప్రాసలను రమ్యముగా నుపయోగించిరి.

అర్థాలంకారములను కూడ అతిమాత్రముగా నుపయోగింపరు. అలంకారమే కావ్యాత్మయను ధోరణికాదు. ఆ సంగతిని రామదాసు చరిత్రమున భంగ్యంతరముగా.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అతడు తన దృష్టిసతి యట్టు లాత్మలక్ష్య
యగుట జనుచుండెగాక కక్ష్యాంతరముల
బ్రతి పదంబునగల యలంకృతులమీద
పర్వు నెడ బోగలదె శతాబ్దములకైన (తృతీయ. 62)

అను పద్యమున వ్యక్తము చేసిరి. ఎక్కువగా నుపయోగించిన అలంకారములలో రూపకమునకు ప్రాథమ్యము.

శ్లేష, వక్రోక్తి :

'శుకరంభాసంవాదము' తెలుగులో తొలి వక్రోక్తి కావ్యము. వక్రోక్తి శ్లేషవక్రోక్తి, కాకువక్రోక్తియని ద్వివిధము. పూర్వాలంకారికులు చెప్పిన శ్లేష భేదములుకాక మరికొన్ని కల్పింపదగునని ఆ కావ్యపరిశీలనమున తేలినది. అట్లే వక్రోక్తికి విశేషగౌరవము లభించినది.

శుకరంభాసంవాదము వలన అలంకార ప్రస్థానమున శాస్త్రిగారికి ప్రత్యేక స్థానము లభించును.

ఛందస్సు :

పట్టుదలగా అప్రసిద్ధవృత్తముల నుపయోగింపరు. రామదాసుచరిత్ర ఆశ్వాసాంతములందు మాత్రము సంప్రదాయము ననుసరించి విశేషవృత్తముల నుపయోగించిరి.

జాతులలో కందము, ఉత్సాహము స్వీకృతములు. ఉపజాతులగు ఆటవెలది, తేటగీతి సీసములకు వినియోగము బహుళము.

వివాదాస్పదపగు యతులను కూర్పరు. అఖండయతి నంగీకరింపరు. శకట సాధు రేఫల మైత్రి విషయమున తొలిదశలో లేని పట్టుదల ఉద్యానాది కావ్య రచనలలో కానవచ్చును. మరల తుది దశలో ఆ పట్టు సడలినది. ఈ అంశము వారి నిరంతర భాషా పరిశోధనలోని క్రమ పరిణతిని సూచించును.

ప్రాసలు సూటిగా నుండునేగాని అభేదములు, మైత్రులు కానరావు. క్లిష్ట ప్రాసములు కూడ 'సల్లేరుపైబండి' వలె నడచును.

క్వాచిత్కముగా యతి భంగములున్నవి కాని గణప్రాస భంగములు లేవు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పట్టుపట్టి గణయతిప్రాసలను వెదకుచు వ్రాసినది కాక ధారాపాత ధారాళకవిత్వమని యతిభంగములు సూచించును.

జాత్యుపజాతులలో ఛందస్సును సరిపెట్టుటయేకాక లయనుకూడ దృష్టిలో నుంచుకొనుట మరియొక విశేషము. సీస కందములందు శాస్త్రిగారికి మక్కువ. వాని ననేక లయలలో నడిపిరి. ముఖ్యముగా కథాత్మక వర్ణనాత్మక సీసములలో పూర్వ కవులు చేసిన విన్యాసముల పట్టు లనేకము గోచరించును.

వ్యాకరణము :

'ప్రమాదోధీమతామపి' యన్నట్లు ఒండు రెండు స్ఖాలిత్యములున్నను సంస్కృతాంధ్ర వ్యాకరణములందు శాస్త్రిగారికి సునిశిత పరిశీలన దృష్టితోకూడిన అభినివేశ మున్నదనుట స్పష్టము. దానిని వారు సాహిత్యపరముగా క్లిష్టత కొఱకు కాక స్పష్టత కొఱకే ఉపయోగించిరి. చమత్కారము కొఱకెడనెడ వ్యుత్పన్న శబ్దములను ప్రయోగించినను సమాస, కారక, వాక్య నిర్మాణాదుల యందు మాత్రము అక్లిష్టమార్గమున పయనించిరి. సాహిత్యవ్యాకరణములను స్నేహితులుగా నుంచిరి గాని యెవరికిని సేవకత్వమును కల్పింపలేదు. నిస్సందేహముగా వారి ప్రయోగములు ప్రామాణికములుగా నంగీకార్యములు.

అచ్చతెనుగు :

అచ్చ తెనుగు నుడుల వాడుక శాస్త్రిగారికి మిక్కిలి ఇష్టము. ఇంపైన అచ్చతెనుగు సమాసములు, పదములు, విరివిగా కానవచ్చును. 'ఉఱడు' 'కాలలు' 'దణి' 'చౌకాటము' మున్నగు పదముల నుపయోగించిన పూర్వకవుల సంఖ్య పరిమితము. ఏవం విధాచ్ఛిక పదప్రయోగము శాస్త్రిగారి సాహితీ వ్యక్తిత్వము నందలి ప్రత్యేకతలలో నొకటి. నన్నయతిక్కన మార్గములు రెండును వారికి రెండుకన్నులు. వారి యచ్చతెనుగు పద్యరచన లాయా కావ్యప్రసక్తిలో ప్రకటించితిని.

రీతి :

అతి మృదుల బంధయుత, యనాయత సమాస
దనరువై దర్భి, రూఢ బంధయును, ఖర స
మాసయగు గౌడి. యుభయాత్మ మహిమగలిగి
యలరు బాంచాలి, వీని లక్ష్యము లొనర్తు*

*. భట్టుమూర్తి, కావ్యాలంకార సంగ్రహము, ఆ. 2 ప. 81.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

పై లక్షణము ననుసరించి పరిశీలించినచో శాస్త్రిగారి రచనలలో మూడు రీతులకు నుదాహరణములు లభించునుగాని మొత్తముమీద నిర్ణయింప వలసినపుడు పాంచాలీరీతియే వారి కవితారీతి.

పాకము :

రీతి వలెనే పాకమును ద్రాక్షాకదళీ నారికేళ భేదమున త్రివిధము. శాస్త్రిగారి కవిత కదళీపాకము.

గుణము :

కవితకు గుణములత్యావశ్యకములని ఆలంకారికుల నిర్ణయము* అవి శ్లేషాది దశభేదములతో నున్నను ముఖ్యమైనవి మాధుర్యౌజః ప్రసాదములు మూడే** శాస్త్రిగారి కవితాగుణము ప్రసాదము.

ధ్వని :

కావ్యాత్మ ధ్వనియేయని సిద్ధాంతితము. ధ్వనిమంతమే ఉత్తమ కావ్యము. శాస్త్రిగారు తమ స్వతంత్ర రచనలన్నింటియందును శాంతరసమును ధ్వనిగా నొనర్చిరి. రామదాసుచరిత్రమున శాంతరస ధ్వని ఎట్లు పరిపోషితమో ఆసందర్భమున నిగదిత మొనర్చితిని.

చతుర్విధ కవిత్వములు :

ఆశు, విస్తర, మధుర, చిత్రకవిత్వములను చతుర్విధ కవిత్వములలో తొలిమూడింటియందును శాస్త్రిగారికి ప్రావీణ్యమున్నది.

అష్టావధానిగా, శతావధానిగా అనేకావధానములొనర్చి ఆశుకవితా ప్రదర్శన లొనర్చి అనర్గళమగు ఆశుకవితాభినివేశమును చూపిరి.

రామదాసు చరిత్రాది కావ్యములను రచించి విస్తరకవితా ప్రాభవమును వెలయించిరి. వాగ్గేయకారులై అనేక కీర్తనలను కూర్చి మధురకవితా స్రష్టలైరి.

అనువాద ప్రతిభ :

స్వతంత్రము అస్వతంత్రము స్వతంత్రాస్వతంత్రము అను మూడు

---

*. కావ్యశోభాయాః కర్తారోగుణాః, తదతిశయహేతవస్త్వలంకారాః పూర్వేనిత్యాః - వామనుడు.

**. మాధుర్యౌజః ప్రసాదాఖ్యాస్త్రయస్తేనపునర్దశ — మమ్మటుడు.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అనువాద మార్గములు అభిజ్ఞులచే నంగీకృతములు. పై మూడు విధములగు అనువాదములను శాస్త్రిగారు నిర్వహించిరి. హంసలదీవి ప్రభావము స్వతంత్రము. గీత గోవిందమస్వతంత్రము, చాణక్యనీతి దర్పణము స్వతంత్రాస్వతంత్రము.

శాస్త్రపరిచయము :

కవిత్వమునకు ఆవశ్యకములగు ఛందోవ్యాకరణాలంకారములు కాక జ్యోతిషము తర్కము మీమాంస మున్నగు శాస్త్రములతో శాస్త్రిగారికి గల పరిచయము దుర్గామల్లేశ్వర శతకమున కానవచ్చును. సంగీతాభినివేశము పూర్వోక్తమే.

మాండలికములు :

ఈ కవి గుంటూరు మండలమునకు చెందినవాడని తెలియజేయు మాండలిక పదములు కొన్ని శాస్త్రిగారి రచనలలో కానవచ్చును.

బిఱ్ఱు : 'బిగువు' అను నర్థమున గుంటూరు మండలము 'వారీ పదమును ఉపయోగింతురు.

మిఱ్ఱు : మిట్ట, ఎత్తు అను నర్థములలో నుపయోగింతురు, దీనికి తిక్కనగారి ప్రయోగము లనేకము.

బావి : 'బావి' కి'నూయి'కి గల భేదమును 'నుతజలపూరితమ్ములగు'(ఆది: 4: 84) అను పద్యములో నన్నయ సూచించెను. అట్టి భేదము లేక 'బావి'నే సామాన్యముగా నుపయోగించు నలవాటు గుంటూరు ప్రాంతీయులదే.

'దిగుడుబావులను, బావులను, చెఱువులను పూడ్పించువాడు' (చాణక్య నీతి దర్పణము) (పుట: 22)

తేప : 'తఱచుగ' అను నర్థమున 'తేప' కు గుంటూరు మండలమున వాడుక ఎక్కువ.

నాప : నిందార్థమున నుపయోగించు నీ పదము కూడ గుంటూరు మండలము వారిని పట్టి యిచ్చును.

ఇట్టివి మరికొన్ని గుర్తింపవచ్చును.

లేఖన దోషములు: పూర్వపండితుల పాండిత్యమునకు, లేఖనాభ్యాసమునకు సంబంధము నియతము కాదు. శాస్త్రిగారి లేఖములోని యొండురెండు వైచిత్రులను ప్రదర్శింతును.

---

1. మండలమనగా 'జిల్లా' మాత్రమే కాక ప్రస్తుతము చుట్టుప్రక్కల జిల్లాలో చేరిన ప్రాంతములు కూడ కావచ్చును.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

వాఙ్మయము : 'యరోఽనునాసికేఽనునాసికోవా'* అను పాణినీయ సూత్రము ననుసరించి అనునాసికసంధి వికల్పమగుటచే దిఙ్మండలము, దిగ్మండలము అని రెండు విధములుగా వ్రాయవచ్చును. రెండిటిని కలిపి 'దిఙ్గ్మండలము' అని వ్రాయుట శాస్త్రిగారి యలవాటు. ముద్రణములో కూడ కొన్నితావులనిది గోచరించును. వికల్పత్వమును గుర్తుంచుకొను ప్రయత్నములో నీ యలవాటు వచ్చియుండును. 'ప్రత్యయే భాషాయాం నిత్యం' అను వార్తికము ననుసరించి 'వాఙ్మయము' మువ్వగు తావుల ననునాసికాదేశము నిత్యముకాగా నట్టితావులలో కూడ వారి యలవాటు కానవచ్చును.

సాధురేఫద్విత్వము !

ద్విత్వ సందర్భములలో శకటరేఫమును వ్రాయుట శాస్త్రీయ సంప్రదాయము కాగా సాధురేఫ ద్విత్వలేఖనము సామాన్య జనలేఖనములో తఱచుగా కానవచ్చును. ఇట్టి లేఖనమును శాస్త్రిగారి వ్రాతప్రతులలో కొన్నిచోట్ల చూడవచ్చును.

అన్యదేశ్యములు :

రామదాసు చరిత్రమునందు మహమ్మదీయ ప్రభుత్వ సంబంధులగు ఉరుదు మొదలగు నన్యభాషాపదములును, కుచేలోపాఖ్యానమున ఆంగ్లపదములును గమనింపదగిన అన్యదేశ్యములు.

'త్రైలుబండి' అనుచోట ఆంధ్రాక్షరమగు శకటరేఫముపయుక్తము.

సంప్రదాయ మార్గగాములగు శాస్త్రిగారు ఎన్నడో భాషలో ప్రవేశించి, పూర్వకవులచే నుపయోగింపబడిన ఉరుదు మొదలగు నన్యదేశ్యములనే కాక ఆంగ్ల పదములను కూడ స్వీకరించుట భాషాపరమగు దృష్టివైశాల్యమును సూచించును.

లోకజ్ఞత :

వివిధ సందర్భములలో మానవుల మనస్తత్త్వములు, ప్రవర్తనలు ఎట్లుండునో విశ్లేషించి చూపగల వైవిధ్యము శాస్త్రిగారి పాత్రలయందు తక్కువ. లోకజ్ఞతానుశీలనమునకు వారి శతకముల యందవకాశమెక్కువ.

---

*. 8-4-45॥

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

కవితాహేతువులు :

ప్రతిభావ్యుత్పత్త్యభ్యాసములు కావ్యహేతువని ఆలంకారికుల అభిమతము* ప్రతిభావ్యుత్పత్తులలో ప్రతిభ గరీయసి. అక్షరములురాని నాటికే శాస్త్రిగారిలో ప్రతిభ యుద్బుద్ధము. ప్రౌఢ సుందరమగు వారి కవిత వ్యుత్పత్తిమంతము. ఏబదికి మించిన రచనలు నిరంతరాభ్యాస సాక్ష్యములు. తులనాత్మకముగా చూచినచో ప్రతిభాభ్యాసములు కించిదధికములు.

పూర్వకవ్యనుసరణము :

సంస్కృతాంధ్ర సాహిత్యముల నవలోడించినను శాస్త్రిగారు ఆంధ్ర సాహిత్యమున కవిత్రయము. శ్రీనాథుడు, పోతన, పెద్దన, తెనాలిరామకృష్ణులను గురుస్థానమున నిలుపుకొన్నట్లు తోచును. అందునను ప్రయోగముల విషయమున కవిత్రయమును; శ్రీనాథుని, దాటిరారు. ప్రయోగశుద్ధికి, కవితా సౌందర్యమునకు శ్రీనాథుని వారుపాసించిరి. తాదాత్మ్యము నొందిరి.

సమకాలికులలో శ్రీ ఆదిభట్ల నారాయణదాసు, తిరుపతి వేంకటకవులు శాస్త్రిగారికి ఆదర్శమూర్తులు. నారాయణదాసుగారి ప్రభావము అనల్పము. అచ్చ తెనుగు వలపు, హరికథారచనము దాసభక్తి ఫలితములు. అవధాన చాతుర్యము. ఆశుకవితా వైదుష్యము తిరుపతి వేంకటకవుల ప్రచోదనములు.

అనంతర కవ్యనుసార్యత :

పూర్వకవుల ప్రభావమును తాము స్వీకరించినట్లే శాస్త్రిగారు సమకాలికానంతర కవులపై తమ ప్రభావమును ప్రసరింపజేసిరి. గురువర్యులు అభినవ వాల్మీకి బ్రహ్మశ్రీ తాదేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారికి శిష్యుని కవిత్వమునందు పరమప్రీతియే కాక ప్రమాణబుద్ధియును కలదు. తమ రామాయణము నంతటిని వినివించిరి, అంతేకాక తన కుమారులు మహాకవి బ్రహ్మశ్రీ తాదేపల్లి రాఘవనారాయణ శాస్త్రిగారిని 'పిచ్చయ్యశాస్త్రి మెచ్చుకొనేటట్లు కవిత్వంవ్రాయి' అని ఆదేశించిరి. తండ్రిగారి ఆదేశము మేరకు కుమారుడు శాస్త్రిగారిని మెప్పించుటకు అనేక సంవత్సరములు పట్టెను.

---

*. శక్తిర్నిపుణతా లోకశాస్త్రకావ్యాద్యవేక్షణాత్
కావ్యజ్ఞ శిక్షయాభ్యాస ఇతిహేతుస్తదుద్భవే - మమ్మటుడు

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

తమ కవిత్వారంభదశలో శాస్త్రిగారి పద్యములనేకము కంఠస్థ మొనర్చి నట్లు తుమ్మల సీతారామమూర్తిగారు చెప్పిరి.*

'నేను శాకుంతలం అనువాదం చేసేటప్పుడు వ్రాసింది వ్రాసినట్లు మా అన్న గారికి (శాస్త్రిగారు) విన్పిస్తూ ఉండేవాణ్ణి. ఆయన తల ఊపితేనే పై ముక్క వ్రాసేవాణ్ణి* అని బ్రహ్మశ్రీ ముళ్ళపూడి నారాయణశాస్త్రిగారు చెప్పిరి.

ఇక శిష్యులై, ఆంతరంగికులైన సహజ కవి బ్రహ్మశ్రీ పాతూరి రాధా కృష్ణమూర్తి గారికి శాస్త్రిగారు ప్రత్యక్షదైవము. వారు గురువుగారికనేక కృతు లంకిత మిచ్చిరి.

పాఠశాల, కళాశాలలో శాస్త్రిగారి ప్రభావమున కవులైన వారి సంఖ్యీ యనల్పము.

ఆనందము - ఉపదేశము :

కావ్యప్రయోజనములగు నానందోపదేశములు రెండింటియందును సమ దృష్టియున్నను 'తథాపి భక్తిస్తరుణేందుశేఖరే' యన్నట్లు ఉపదేశ ప్రయోజనము మీదనే శాస్త్రిగారికి అభిమానము రవ్వంత యెక్కువ.

> రసనిష్యంది గంభీరభావ మురుధారాశుద్ధి నిర్దోషమున్
> రసికాస్వాద్య మనల్పకల్పనము సర్వగ్రాహ్య శబ్దార్థవా
> క్య సముద్భాసి భవత్కవిత్వ ముచితాకల్పంబు పిచ్చయ్య శా
> స్త్రీ! సువర్ణాక్షరలేఖ్యమై కవుల చారిత్రన్ వెలుంగున్ వదా**

---

* ముఖాముఖి : 4-5-1986.

* ముఖాముఖి : 5-6-1986.

** శ్రీ వేమూరి సీతారామశాస్త్రి, షష్టిపూర్తి సంచిక, పుట. 12.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

సామాజిక వ్యక్తిత్వము

వ్యక్తి సంఘజీవి కనుక సమాజమును గూర్చిన అవగాహన, ఆలోచన అందరికిని ఉండవలసినదే. తమభావములకు అక్షరాకృతి కల్గించు కవులకు ఇది మరింత ఆవశ్యకము. వారు సమాజపు నడల తీరుతెన్నులను సమీక్షించుచుందురు. అట్లు సమీక్షించుటయేకాక తమ అభిప్రాయమును నిర్భయముగా ప్రకటింప గల వారు 'నిజాయితీ' గల కవులు.

శాస్త్రిగారు జనుల నడివడికల పట్ల, కొన్ని సామాజిక సమస్యలపట్ల, తమ అభిప్రాయములను వెలిబుచ్చిరి. ఎంత అంతర్ముఖులైనను వారిది 'ఒడలు మర చిన శివము' కాదనుటకే ఈ శీర్షిక.

ప్రత్యక్ష ప్రమాణవాదము, వేశ్యావృత్తి, ధూమపానము, లంచగొండితనము, విధవాపునర్వివాహము, వరశుల్కము, జూదము కూటసాక్ష్యములు మున్నగువానిని శాస్త్రిగారు తమ శతకములలో నిరసించిరి. సమైక్యమనగా వర్ణరాహిత్యము కాద నిరి. ఆహారవిహారములు కలసి చేసినంతమాత్రమున నైకమత్యము రాదనిరి. "ఐకమత్యమన నీయాభేదముల్లేక తామొకటే బుద్ధిని నుంటగాక యిటులౌనో" అని ప్రశ్నించిరి.

పైవానిలో కొన్ని తత్కాలీన సమస్యలు. మరికొన్ని నేటికిని సమస్యలే. వానిని గూర్చి, వాని పరిష్కారములను గూర్చి ఎవరి అభిప్రాయములు వారి కున్నవి. మనము నిరసించిన వానిని మనతోపాటు నిరసించినవాడు పురోగమన వాదియని కానివాడు తిరోగమనవాదియని చెప్పుట దుస్సాహసము. జనుల మెప్పు కొఱకు చెప్పునదొకటి చేయునది మరొకటిగా జీవించు మేధావులనేకులున్నారు. అట్టివారిలో నొకరుకాక సమాజగమనమును గూర్చి తన దృక్పథమును నిర్ద్వంద్వ ముగా వ్యక్తీకరించిన శాస్త్రిగారి సామాజిక వ్యక్తిత్వము స్వతంత్రతా సముల్ల సితము.

'మెప్పువలచి పసిడికుప్ప వలచి కైత
కొగ్గ నొల్లడీ మహోదయుండు'*

---

* శ్రీ తుమ్మల సీతారామమూర్తి, షష్టిపూర్తి సంచిక, పుట. 8.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ధార్మిక వ్యక్తిత్వము

'ధర్మైకాయత్త చిత్తత్వం ధార్మికత్వ ముదీర్యతే' అని విద్యానాథుని నిర్వచనము.* ధర్మము త్రికాలాబాధ్యము. తద్రక్షణము మానవ కర్తవ్యము. 'ధర్మో రక్షతి రక్షితః' అని కదా ఆర్యోక్తి. ధర్మమునుపదేశించు కావ్యములకు కాలదోషము లేదు. ధార్మిక జీవనులైన శాస్త్రిగారు తమ సాహిత్యమున ధర్మోపదేశము నెట్లొనర్చిరో నమీక్షింతము.

ధర్మాచరణము వ్యష్టి సమష్టి రూపములలో నుండును. వ్యష్టిగా నెవరికి వారాచరించు చుండగా దీని ప్రభావము సంఘముపై ననివార్యముగా ప్రసరించును.

ధర్మార్జితంబు కానిది
శర్మంబెటులౌను? దాన జేకుచు బెట్టుల్
తార్మాణులేని సౌఖ్యము ?
నిర్మల భావమ్ము సత్య నిష్ఠయు జగతిన్

(హంసలదీవి ప్రభావము)

అని శాస్త్రిగారు ధర్మప్రాశస్త్యము నుగ్గడించిరి. ధర్మకామమే సమర్థనీయమనిరి. మన ధర్మములగు యజ్ఞాదుల నొనర్చినచో దేవతలు వర్షముల నిత్తురని సనాతన ధర్మమును చాటిరి. మాతా పితృ గురు దేవాతిథి గో సేవను ప్రబోధించిరి. ఏకపత్నీత్వమును, పాతివ్రత్యమును, సత్యభాషణమును మరెన్నియో సుస్థిర ధర్మములను తన రచనలలో నింపిరి. వారి సర్వరచనలు ధర్మధ్వని బంధురములే.

భగవదాశాసనమె ధర్మ మగునుగాని
మనకు దోచినదెల్ల ధర్మంబు గాదు
వివిధమును జంచలము నౌట వెడగుమనము
పెత్తనంబున కర్హత వెలయదెపుడు

(ఉపదేశము)

---

* ప్రతాపరుద్రీయమ్, నాయక ప్రకరణము శ్లో. 19.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అని ధర్మమును ప్రశ్నింపక, వక్రభాష్యములు చెప్పక ఆచరింపవలెనని నిర్దేశించిరి.

పాపమను నుప్పనీర్వోయ యావు చెడును
పుణ్యమును మంచినీర్వోయ బ్రోవుగాంచు
వెలయు ప్రాపులు నిలువనీడలు ఘటించు
ధర్మవృక్షంబు భువనమంతయును నిండి (ఉపదేశము)

అను పద్యమున ధర్మానుష్ఠానమే మానవజాతి మనుగడకు శరణ్యమని చాటి చెప్పిరి. ధార్మిక వ్యక్తిత్వము శాస్త్రిగారి సాహితీ శతపత్రమున మకరందము.

—:o:—

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధ్యాత్మిక వ్యక్తిత్వము

కవులు అంతర్ముఖులు, బహిర్ముఖులని రెండువిధములుగా నుందురు. అంతర్ముఖత్వ, బహిర్ముఖత్వ నిష్పత్తి భేదమునుబట్టి రెండు విధములు కూడ కానవచ్చును. పోతన క్రమముగా భాగవత రచన నాటికి పూర్తిగా నంతర్ముఖుడైనాడు. శ్రీనాథుడు ఎక్కువ బహిర్ముఖుడు. పూర్తిగా బహిర్ముఖులైనవారు పూర్వకవులలో లేరనవచ్చును. అట్లే కాలప్రభావము ననుసరించి నేడు సంపూర్ణాంతర్ముఖత్వము కల కవులుండుట అరుదే. శాస్త్రిగారు మనసా, వాచా, కర్మణా తొంబది శాతము అంతర్ముఖులు. మిగిలినభాగమును గార్హస్థ్యము, కవిత్వము ధర్మాచరణములకై బహిర్ముఖత్వముగా మార్చుకొనిరి.

అంతర్ముఖులైన కవుల ప్రధాన లక్షణము ఆధ్యాత్మికతత్త్వప్రబోధము. కవిత్వము వారికి కీర్తిసాధనము కాక మోక్షసాధనము. భగవద్భాగవత గాథలే వారి కావ్యవస్తువులు. శాంతమే రసరాజము. వారి నవరసములలో నా యా స్థాయి భావములతో పాటు భక్తిభావము మిశ్రితమై యుండును గాన శాంతరసస్ఫూహములగు భక్తకవుల నవరసములు లౌకిక కవుల నవరసములకంటె భిన్నములు. వాని గమ్యము బ్రహ్మానందము. వీని గమ్యము రసానందము. ఆధ్యాత్మిక నవరసములకు పోతన భాగవతము లక్ష్యగ్రంథము. జయదేవుని గీతగోవిందము దివ్య శృంగారమునకు ప్రత్యేకమ్ము. అందుచేతనే శాస్త్రిగారు ఆ కావ్యమును మక్కువతో ననుసరించిరి.

కలకాలము నీ పదములు
కొలిచెడు భాగ్యంబుకన్న గొండొక ఫలమీ
యిల గలదే తెలియర యల
తులు వారలనేమి చేసెదో హేరంబా!

అని శ్లేషవిబుధులతో భాషాపదములకు, భగవత్పదములకు నభేదము పాటించిరి. కవియొక్క ఆధ్యాత్మిక వ్యక్తిత్వమునకీ భావమే మూలకందము.

శాస్త్రిగారికి సర్వదైవములయందు సమదృష్టి.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

అరయ శివకేశవులకు సుంతైన లేదు
భేదబుద్ధి యటంచు రూపింపనగుచు
కృష్ణవేణియు గంగయు నేకవృత్తి
పావన మొనర్తురవని కృపారసమున

సకల ప్రాణకోటియందు భగవద్దర్శనమే —

ప్రణవగానంబు బాడును బంభరములు
కృష్ణ సంబుద్ధి నెఱపె బక్షివ్రజంబు
అంబ యనిపిల్చె ధేనువు లట్టులగుట
నామమాత్రము లయ్యెను నరకములును

ఆధునిక వస్తు నిర్మాణములందును వేదాంత విజ్ఞానార్థమే సునిశ్చితము.

ఉద్యత్పూర్ణ కృపారసంబు మదిలో నుప్పొంగి కృష్ణానదీ
హృద్యాకారము బూన గొండదిగి దుర్గేశ్రి వేగన్నలన్
విద్యారూపము జూపుచున్నటులు భావింపగ నయ్యెన్ సదా
విద్యుద్దీప సహస్రముల్ జయపురీ వీధీమహాస్తంభముల్

ఇట్లు శాస్త్రిగారి సాహితీ సర్వస్వములో వారి ఆధ్యాత్మిక వ్యక్తిత్వము ప్రకాశమానమగును. అంతర్ముఖ కవులలో వారికి సముచిత స్థానమును కల్పించును.

తత్కాలానుగుణ ప్రబంధగుణసంబంధః కవిః ప్రాయశః
మాన్యోఽప్యర్థ నిబంధనే నచతుర స్తత్రాప్యున్నయా దర్థితాం
నై ష్ఠోర్థీ న చ బంధవాన్ హరిహర శ్రీ వర్ణనా పూర్వక
శ్రేయోదాయక సత్ప్రబంధ కవితా సంబంధ సంపన్నిధిః**

అర్థమనర్థమంచు పరమార్థ మొసంగెడు రామపాద సే
వార్థము నంకితం బిడుదు నాత్మభవంబని భక్తి జేసి ని
స్వార్థత ధన్యుడైన మన బమ్మెర పోతనవంటి సత్కవిన్
సార్థకమంద జన్మ నుతి సల్పెద పిచ్చయ శాస్త్రి మద్గురున్*

* శాస్త్రిగారిని గూర్చి శ్రీ పాతూరి మధుసూదనరాయ శాస్త్రిగారు చెప్పినది. షష్టిపూర్తి సంచిక. పుట. 26.

** శ్రీ పాతూరి రాధాకృష్ణమూర్తి. షష్టిపూర్తి సంచిక, పుట. 16.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఫలశ్రుతి :

పై సమీక్ష వలన శ్రీ శాస్త్రి సహోదయులు కేవల కవి కారనియు ఆకృతి దాల్చిన మార్మిక ధార్మిక రస ధర్మోద్దీపిత కవితోద్యమమనియు సంభావింపనగును. వారిది కేవల సాహిత్యసృష్టికాదు. అది అత్యద్భుత సాహిత్య ప్రకాశము. ఈ ప్రకాశము అసత్యమును అతిగమించి సత్యమార్గమును ప్రదర్శించును. తమస్సును నిర్జించి రోచిస్సులను వెలార్చును. మృత్యువును జయించి అమృతత్వమును ప్రసాదించును.

వ్యక్తిత్వము పరిపూర్ణము. పరిశుద్ధము. ఆదర్శప్రాయము సర్వజన ప్రశంసితము.

సాహితీవ్యక్తిత్వము సర్వాంగీణ సముదాత్తము. వైవిధ్య విలసితము. ప్రామాణికము. శాంతరసైక నిర్మాణ ప్రత్యేకము.

సామాజిక వ్యక్తిత్వము వేదోపషనిదర్థనిర్ధారితము. సాంఘిక సంక్షేమ సంవర్ధకము.

ఆధ్యాత్మిక వ్యక్తిత్వము అద్వైతామృతవర్షి. అంతర్ముఖత్వ పవిత్రము. బ్రహ్మానంద తీర్థ సమవగాహితము.

అభినవ జయదేవ, సుకవి సార్వభౌమ, కవిసమ్రాట్ శతావధాని చల్లా పిచ్చయ్యశాస్త్రిగారి సాహితీ సముల్లాసము భారతీ హృదయోల్లాసము. సహృదయ రసోల్లాసము.

ధీర! సురభూసురమతిప్రవణ! సర్వసమ! దిగ్విదిత కీర్తిఘన! సర్వా
ధారా! పరివార జనతాహృదయ సౌధచర! ధర్మమయ! వేదమయవాచా!
సారసదళాభ సువిశాలనయనా! జలదసాంద్రరుచిదేహా! రసపారా
వార! కవిరాజనుత! భద్రగిరిరామ! గుణవన్మకుట! మంగళమహాశ్రీ!*

—o—

* రామదాసు చరిత్రము.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

ఆధార గ్రంథ పట్టిక

1. అథర్వణుడు — వికృతి వివేకము, వావిళ్ళ ప్రతి.
2. అప్పకవి — అప్పకవీయభావప్రకాశిక, త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్టణం.
3. అమరకోశము (లింగాభట్టీయము) — వావిళ్ళ ప్రతి.
4. అహోబలుడు — అహోబల పండితీయము.
5. కవిత్రయము — శ్రీమదాంధ్ర మహాభారతము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు.
6. కాళిదాసు — అభిజ్ఞాన శాకుంతలమ్, వావిళ్ళ ప్రతి.
7. కాళిదాసు — కుమారసంభవమ్, వావిళ్ళ ప్రతి, 1949.
8. కాళిదాసు — మేఘసందేశః, వావిళ్ళ ప్రతి.
9. కృష్ణమాచార్య ఎక్కిరాల — మంత్రజాలము, వరల్డ్ టీచర్ ట్రస్ట్ విశాఖపట్టణము.
10. కృష్ణారావు వైద్యుల — జయదేవుని గీతగోవిందము-అనువాదములు, నూజివీడు.
11. క్షేమేంద్రుడు — ఔచిత్య విచార చర్చ, చౌకంబా ప్రతి.
11. గోపాలకృష్ణారావు. కే — ఆంధ్రశతక సాహిత్య వికాసము, ఉస్మానియా విశ్వవిద్యాలయము. హైదరాబాదు.
13. గోపరాజు కొఱవి — సింహాసనద్వాత్రింశిక, వావిళ్ళ ప్రతి.
14. చంద్రమౌళిశాస్త్రి శిష్లా — హనుమద్విలాసము, పెదపాడు,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

15.	చాణక్యుడు	చాణక్యనీతిదర్పణము, ఆలపాటి వేంకటకృష్ణయ్య, గోవాడ.
16.	చిన్నయసూరి	బాలవ్యాకరణము.
17.	జయదేవుడు	చంద్రాలోకము, వావిళ్ళప్రతి.
18.	జయదేవుడు	గీతగోవిందము (సహృదయవ్యాఖ్య) వావిళ్ళప్రతి, 1918.
19.	జయదేవుడు	శ్రీ గీతగోవిందము, ప్రాచ్య లిఖిత పుస్తకభాండాగారము, హైదరాబాదు.
20.	జయదేవుడు	గీతగోవిందము (వ్యాఖ్యానత్రయ సహితము) ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రచురణ.
21.	దత్తానందస్వామి	శ్రీ రామకృష్ణపరమహంస జీవితము
22.	తిరుపతి వేంకట కవులు	లఘుకావ్యములు, షష్టిపూర్తి సన్మానసంఘము.
23.	తిరుపతి వేంకట కవులు	గుంటూరుసీమ(ద్వితీయభాగము)
24.	దండి	కావ్యాదర్శః, ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమీ ప్రతి.
23.	దక్షిణామూర్తి తూములూరి	శ్రీరామకథామృతము - సమగ్రసమీక్ష, పొన్నూరు.
26.	దీక్షితులు దీవి (సం)	అమరావతీ క్షేత్రము, దేవస్థానప్రచురణ; అమరావతి.
27.	దొణప్ప తూమాటి	తెలుగు హరికథా సర్వస్వము.
28.	ద్వాదశోపనిషత్తులు	వావిళ్ళప్రతి, 1921.
29.	ధూర్జటి	శ్రీకాళహస్తిమాహాత్మ్యము; ఎమెస్కో ప్రతి.
30.	నన్నయ	ఆంధ్రశబ్దచింతామణి,

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

31. నన్నెచోడుడు — కుమారసంభవము, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, హైదరాబాదు,

32. నరసింహాచార్యులు దీవి — కనకదుర్గాక్షేత్ర మాహాత్మ్యము, దేవస్థాన ప్రచురణ. విజయవాడ.

33. పరాశరసంహిత

34. పాణిని అష్టాధ్యాయి — చౌఖంబాప్రతి.

35. పార్థసారధి ఎన్. సి. శ్రీమతి ద్వారకా పార్ధసారధి — గానకళాబోధిని, సరస్వతీ బుక్ డిపో, కర్నూలు, 1965.

38. పోతన — శ్రీమదాంధ్ర మహాభాగవతము, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రతి.

38. బాలాజీదాసు బీ — కుచేలోపాఖ్యానము, కురుకూరి సుబ్బారావు అండు సన్, బెజవాడ 1940.

38. బృహత్‌స్తోత్రరత్నాకర: (ప్రథమభాగః) — ఎమ్. జి. సుబ్బరాయశాస్త్రి ప్రచురణ. మద్రాసు, 1922.

39. భగవద్గీత, — తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణ.

40. భట్టుమూర్తి — నరసభూపాలీయము, ఆంధ్రసారస్వత సమితి, హైదరాబాదు, 1935.

41. భట్టోజి దీక్షితులు — సిద్ధాంతకౌముది, చౌఖంబాప్రతి.

42. మమ్మటుడు, — కావ్యప్రకాశః, వావిళ్ళప్రతి.

43. మాఘమాహాత్మ్యము — వావిళ్ళప్రతి

44. యాజుషస్మార్త మంత్ర పాఠము (ద్వి.భా.) — చల్లా లక్ష్మీనరసింహశాస్త్రి, మచిలీపట్టణము, 1929.

45. రజనీ కాంతారావు బాలాంత్రపు — ఆంధ్రవాగ్గేయకార చరిత్ర. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజయవాడ, 1975.

46. రాధాకృష్ణమూర్తి పాతూరి — శ్రీశివానుభూతి, సజ్జావారిపాలెం. గుంటూరు జిల్లా.

47. రామకృష్ణ సోదర కవులు — శ్రీశైలక్షేత్రమహిమము, శ్రీరాజరాజేశ్వరీ అండ్ కో., నంద్యాల, 1930.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

48. రామమూర్తి పంతులు — బాలకవి శరణ్యము.

49. రామలింగేశ్వరరావు తుమ్మలపల్లి — శ్రీచక్రవిలసనము. త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్టణము, 1974.

50. రంగాచార్యులు చెలమచర్ల — ఆంధ్రశబ్దరత్నాకరము.

51. లక్ష్మీనారాయణ గుండవరపు — నారాయణ దర్శనము, గుంటూరు.

52. లక్ష్మీనరసింహం చిలకమర్తి — స్వీయచరిత్ర, ప్రజాశక్తి కార్యాలయం విజయవాడ, 1942.

53. లీలాశుకుడు — శ్రీకృష్ణకర్ణామృతము, వావిళ్ళప్రతి

54. విద్యానాథుడు — ప్రతాపరుద్రీయము, వావిళ్ళప్రతి.

55. వేంకటరాయశాస్త్రి వేదం — ఆంధ్రసాహిత్య దర్పణము, వేదం వేంకటరాయశాస్త్రి అండ్ బ్రదర్స్, మద్రాసు, 1935.

56. వేంకటాద్రి అప్పారావు మేకా — గీతగోవిందము, నూజివీడు

57. వేంకటావధాని దివాకర్ల — సాహిత్య సోపానములు, ఆంధ్ర సారస్వత సమితి, హైదరాబాదు.

58. శ్రీకృష్ణదేవరాయలు — ఆముక్తమాల్యద, ఎమెస్కో ప్రతి.

59. శ్రీనాథుడు — కాశీఖండము, వావిళ్ళప్రతి.

60. శ్రీనాథుడు — శృంగారనైషధము, ఎమెస్కో ప్రతి

61. శ్రీనాథుడు — హరవిలాసము, బాలసరస్వతీ ముద్రాక్షరశాల, కాకినాడ 1901.

62. శ్రీకృష్ణామాహాత్మ్యము — భ్రమరాంబామల్లేశ్వరగ్రంథాలయము విజయవాడ, పుస్తకసంఖ్య ట×290

62. శ్రీరామమూర్తి కొర్లపాటి — శ్రీనాథుడు, ఆంధ్రవిశ్వవిద్యాలయం

64. శ్రీరామ అప్పారావు పోణంగి — తెలుగునాటకవికాసము, హైదరాబాదు

65. సత్యనారాయణమూర్తి అరిపిరాల — సంగీత శబ్దార్థ చంద్రిక, 1954.

66. సత్యనారాయణమూర్తి కుందుర్తి — ప్రాచీనాంధ్రకవుల దేవీ ప్రతిపత్తి. విజయవాడ.

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

67. సత్యనారాయణశాస్త్రి చెలువు — శ్రీరామకథా౽ మృతకవి కుమార జీవితము శ్రీరామకథామృత గ్రంథ మాల, చందోలు.

68. సత్యనారాయణ విశ్వనాథ — శ్రీమద్రామాయణ కల్పవృక్షము, వి.ఎస్.ఎన్.అండ్ సన్స్, విజయవాడ

69. సర్వోపనిషత్సారసంగ్రహః — వావిళ్ళప్రతి, 1928.

70. సాహిత్యోపన్యాసములు [క్షేత్రయ్య పదములు] — ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ,

71. సింగరిదాసు — రామదాసు చరిత్రము, ఆర్. వేంక టేశ్వర అండ్ కంపెనీ, మద్రాసు, 1931.

72. సీతారామాచార్యులు బహుజనపల్లి — శబ్దరత్నాకరము.

73. సుబ్బన్న దీక్షితులు మధిర — కాశీమజిలీకథలు, రాజమండ్రి.

74. సుబ్రహ్మణ్యశాస్త్రి అవ్వారి — తెనుగు కావ్యాదర్శము.

75. సుబ్రహ్మణ్యశాస్త్రి శ్రీపాద — శ్రీ మహాభక్త విజయము, వావిళ్ళ, మద్రాసు, 1952.

పత్రికలు :

1955–65 దశకములోని ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి మొదలగునవి.

ఆంగ్ల గ్రంథములు :

1. W. H. HUDSON, An introduction to the study of Literature, Kalyani Publishers, New Delhi.
2. RANDOM Dictionary.

—o—

पुस्तकालय
पुस्तकालय
गुरुकुल कांगड़ी विश्वविद्यालय

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

"Forwarded free of cost, and with the compliments of the Department of Education, Govt. of India, New Delhi"

GURUKUL KANGRI LIBRARY
Acces on 16/1/90
Class on
Cat on
Tag etc.
Checked
Any Other

జయంతి తే సుకృతినో రససిద్ధాః కవీశ్వరాః
నాస్తి తేషాం యశఃకాయే జరామరణజం భయమ్

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar

Digitized by Arya Samaj Foundation Chennai and eGangotri



పాలపర్తి శ్యామలానందప్రసాద్
3-10-1957
భాషాప్రవీణ
ఎం. ఎ. (తెలుగు)
పి హెచ్. డి.

ఆంధ్రోపన్యాసకుడు
సయ్యద్ అప్పలస్వామి కళాశాల, విజయవాడ

శాంతి సూక్తమ్ (సంస్కృత ఖండకావ్యమ్)
ధర్మసూక్తమ్ (తెలుగు పద్యకావ్యం)
శతవిఘ్నేశ్వరీయము (శతకము)
కాశీసారము (అనువాదము)

'అవధాన కళాసరస్వతి'

CC-0. In Public Domain. Gurukul Kangri Collection, Haridwar